www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 16-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 | సంచిక (Issue) : 319 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి ఉ. 8.56 తదుపరి అష్టమి; నక్షత్రం: భరణి ఉ. 8.48 తదుపరి కృత్తిక; వర్జ్యం: రా.8.47-10.23, దుర్ముహూర్తం: ఉ.9.03-9.49, మ.12.53-1.39, అమృతఘడియలు: తె.6.23; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.46; సూర్యాస్తమయం: 6.14

తొలి రోజే మోతెక్కించారు

రోహిత్, జడేజా శతకాలు.. సర్ఫరాజ్ అర్ధసెంచరీ

» భారత్ తొలి ఇన్నింగ్స్ 326/5

» ఇంగ్లండ్‌తో మూడో టెస్టు



సర్ఫరాజ్ (62)



రోహిత్ శర్మ (131)

జడేజా (110 బ్యాటింగ్)

రాజ్‌కోట్: ఇంగ్లండ్‌తో మూడో టెస్టును భారత ఘనంగా ఆరంభించింది. తొలి రోజు ఆటలోనే పరుగుల వరద పారిస్తూ కెప్టెన్ రోహిత్ శర్మ (131), రవీంద్ర జడేజా (110 బ్యాటింగ్) శతకాలతో చెలరేగారు. ఇక సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అరంగేట్రం చేసిన సర్ఫరాజ్ ఖాన్ (62) ఒత్తిడిని అధిగమిస్తూ అంచనాలకు మించి రాణించాడు. వన్డే తరహా ఆటతీరుతో చకచకా అర్ధసెంచరీ చేసి జట్టు భారీ స్కోరుకు దోహదపడ్డాడు. ఫలితంగా ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 86 ఓవర్లలో 5 వికెట్లకు 326 పరుగులు చేసింది. క్రీజులో జడేజాతో పాటు కుల్దీప్ (1 బ్యాటింగ్) ఉన్నాడు. పేసర్ ఉడ్‌కు మూడు వికెట్లు దక్కాయి. రెండో రోజు జట్టు 450-500 స్కోరుకు చేరాలంటే జడేజా ఆటతీరు కీలకం కానుంది. అటు కొత్త బంతితో ఇంగ్లండ్ బౌలర్లు ఏమేరకు ప్రభావం చూపగలరో వేచిచూడాల్సిందే.

33/3 నుంచి..

ఫ్లాట్ వికెట్ కావడంతో టాస్ గెలిచిన భారత్ వెంటనే బ్యాటింగ్‌కు దిగింది. అయితే పిచ్‌పై ఉన్న తేమను సద్వినియోగం చేసుకుంటూ ఇంగ్లండ్ బౌలర్లు చెలరేగారు. పేసర్ ఉడ్ తన వరుస ఓవర్లలో జైస్వాల్ (10), గిల్ (0) వికెట్లను తీయడంతో జట్టు షాక్‌కు గురైంది. ఇక రజత్ (5)ను స్పిన్నర్ హార్ట్‌లీ అవుట్ చేయడంతో జట్టు స్కోరు తొమ్మిది ఓవర్లలో 33/3. మరో ఎండ్‌లో ఉడ్ బౌన్సర్లు సంధించినా తెలివిగా వదిలేస్తూ ఓపెనర్ రోహిత్ ఓపిగ్గా క్రీజులో నిలిచాడు. అయితే ఈ దశలో సర్ఫరాజ్‌కు బదులు ఐదో నెంబర్‌లో వెటరన్ జడేజాను పంపారు. ఈ వ్యూహం అద్భుతంగా ఫలించింది. ఈ ఇద్దరూ తమ అనుభవంతో బౌలర్లను ఎదుర్కొంటూ మరో వికెట్ కోల్పోకుండా చూశారు. ఈ క్రమంలో రోహిత్ అర్ధసెంచరీ పూర్తి చేసి 93/3 స్కోరుతో లంచ్ బ్రేక్‌కు వెళ్లారు.



ధ్రువ్ జురెల్

వికెట్ కోల్పోకుండా..

రెండో సెషన్‌లో రోహిత్, జడేజా ఇంగ్లండ్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చూపడంతో, ఒక్క వికెట్ కోల్పోకుండా జట్టుకు మరో 92 పరుగులు అదనంగా నమోదయ్యాయి. రెండో సెషన్ ముగిసేసరికి రోహిత్ 97 రన్స్ దగ్గర ఉండగా.. అటు జడేజా అర్ధసెంచరీ పూర్తి చేశాడు.

సర్ఫరాజ్ దూకుడు..

ఆఖరి సెషన్‌లో అరంగేట్ర హీరో సర్ఫరాజ్ ఆటే హైలైట్‌గా నిలిచింది. ముందుగా పది ఇన్నింగ్స్‌ల తర్వాత రోహిత్ తన శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అయితే అతడి కోసం లెగ్ సైడ్‌లో ఫీల్డర్లను మోహరించిన స్టోక్స్ కాసేపటికే ఫలితం సాధించాడు. ఉడ్ షార్ట్ బాల్‌ను రోహిత్ పుల్ షాట్ ఆడేందుకు చూసి స్టోక్స్‌కే క్యాచ్ ఇచ్చాడు. దీంతో నాలుగో వికెట్‌కు 204 పరుగుల రికార్డు భాగస్వామ్యం ముగిసింది. అనంతరం బరిలోకి దిగిన సర్ఫరాజ్ కసితో బ్యాటింగ్ సాగించాడు. ఐదో బంతికి సింగిల్‌తో తొలి పరుగును సాధించాక జెట్ వేగంతో దూసుకెళ్లాడు. తను క్రీజులోకి వచ్చిన సమయంలో జడేజా 85 రన్స్‌తో ఉన్నాడు. జడ్డూ మరో 14 రన్స్ చేసేలోగానే అతను 66 బంతుల్లోనే 62 పరుగులు సాధించడం విశేషం. ఈ జోరులో సర్ఫరాజ్ 48 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. కచ్చితంగా సెంచరీ చేసేలా కనిపించిన సర్ఫరాజ్ దురదృష్టవశాత్తు రనౌట్ కావాల్సి వచ్చింది. దీంతో ఐదో వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత బంతికే జడేజా శతకాన్ని పూర్తి చేయగా కాసేపటికే తొలి రోజు ఆట ముగిసింది.

క్యాప్ విసిరేసిన రోహిత్

సర్ఫరాజ్ రనౌట్ కెప్టెన్ రోహిత్ శర్మకు తీవ్ర అసహనాన్ని తెప్పించింది. జడ్డూ 99 పరుగుల వద్ద ఉన్నప్పుడు సింగిల్ కోసం కోసం పిలిచి తర్వాత ఆగిపోయాడు. అయితే అతడి సెంచరీ కోసం సర్ఫరాజ్ వేగంగా రన్ తీసేందుకు ముందుకు కదిలినా.. తిరిగి క్రీజులోకి చేరే క్రమంలో ఉడ్ డైరెక్ట్ త్రోకు బలయ్యాడు. ఇదంతా డ్రెస్సింగ్ రూమ్ నుంచి గమనిస్తున్న రోహిత్ పట్టరాని కోపంతో తన క్యాప్‌ను తీసి నేలకేసి కొట్టాడు.

1 టెస్టుల్లో ఎక్కువ సిక్సర్లు (80) బాదిన తొలి భారత కెప్టెన్‌గా రోహిత్. మొత్తంగా సెహ్వాగ్ (90) తర్వాత రెండో బ్యాటర్. అలాగే అతిపెద్ద వయస్సు (36 ఏళ్ల 291 రోజులు)లో టెస్టు సెంచరీ చేసిన విజయ్ హజారే (36 ఏళ్ల 278 రోజులు)ను అధిగమించాడు.

2 సర్ఫరాజ్ భారత్ తరపున టెస్టు అరంగేట్రంలో వేగంగా (48 బంతుల్లో) అర్ధసెంచరీ చేసిన రెండో బ్యాటర్‌గా హార్దిక్‌తో సంయుక్తంగా నిలిచాడు. యువరాజ్ (42 బంతుల్లో) టాప్‌లో ఉన్నాడు.

3 టెస్టుల్లో 3 వేల రన్స్ (3003) +200 వికెట్లు (280) సాధించిన మూడో భారత క్రికెటర్‌గా జడేజా. కపిల్ (5248+434), అశ్విన్ (3271+499) ముందున్నారు.

స్కోరుబోర్డు: **భారత్ తొలి ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) రూట్ (బి) ఉడ్ 10; రోహిత్ (సి) స్టోక్స్ (బి) ఉడ్ 131; గిల్ (సి) ఫోక్స్ (బి) ఉడ్ 0; పటీదార్ (సి) డకెట్ (బి) హార్ట్‌లీ 5; జడేజా (బ్యాటింగ్) 110; సర్ఫరాజ్ (రనౌట్-ఉడ్) 62; కుల్దీప్ (బ్యాటింగ్) 1; **ఎక్స్‌ట్రాలు:** 7; **మొత్తం:** 86 ఓవర్లలో 326/5; **వికెట్ల పతనం:** 1-22, 2-24, 3-33, 4-237, 5-314; **బౌలింగ్:** అండర్సన్ 19-5-51-0; ఉడ్ 17-2-69-3; హార్ట్‌లీ 23-3-81-1; రూట్ 13-1-68-0; రెహాన్ 14-0-53-0.

నాదే తప్పు..

సర్ఫరాజ్ ఖాన్ రనౌట్ విషయం తప్పంతా జడేజాదేనని అభిమానులు సోషల్ మీడియాలో తీవ్రంగా తప్పుపట్టారు. అటు జడ్డూ కూడా మ్యాచ్ ముగిశాక తన పొరపాటును అంగీకరిస్తూ ఇన్‌స్టాలో పశ్చాత్తాపం వ్యక్తం చేశాడు. 'అది నేను తప్పుగా తీసుకున్న నిర్ణయం. సర్ఫరాజ్ అలా అవుట్ కావడం బాధించింది. నీవు చాలా బాగా ఆడావు' అని కామెంట్ చేశాడు. మరోవైపు సర్ఫరాజ్ తన అవుట్‌ను తేలిగ్గానే తీసుకున్నాడు. ఆటలో ఇవన్నీ జరుగుతూనే ఉంటాయని, క్రీజులో జడ్డూ తనకు బాగా సహకరించి సూచనలిచ్చాడని గుర్తుచేశాడు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

దేశవాళీ క్రికెట్‌లో రికార్డు స్థాయిలో పరుగులు సాధిస్తూ భారత జట్టులో చోటు కోసం సర్ఫరాజ్ కన్నకలలు మూడో టెస్టు ద్వారా నెరవేరాయి. తనతోపాటు వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ కూడా అరంగేట్రం చేశాడు. దిగ్గజ స్పిన్నర్ కుంబ్లే చేతుల మీదుగా సర్ఫరాజ్ టెస్టు క్యాప్‌ను అందుకున్నాడు. సుదీర్ఘ విరామం తర్వాత తన కుమారుడికి దక్కిన ఈ అవకాశంతో సర్ఫరాజ్ తండ్రి కన్నీటిపర్యంతమయ్యాడు. కుమారుడిని ఆలింగనం చేసుకోవడంతో పాటు తనివి తీరా బ్లూ క్యాప్‌ను చూసి ముద్దాడాడు. అక్కడే ఉన్న సర్ఫరాజ్ భార్య రొమానా సైతం కంటతడి పెట్టుకుంది. ధ్రువ్‌కు మాజీ కీపర్ దినేశ్ కార్తీక్ క్యాప్‌ను అందించాడు.



నాన్నతో సర్ఫరాజ్

సర్ఫరాజ్ జెర్సీ కథ

సర్ఫరాజ్ అరంగేట్ర టెస్టులో 97 నెంబర్ జెర్సీతో బరిలోకి దిగాడు. అయితే ఈ సంఖ్య వెనుక ఓ స్టోరీ ఉంది. అతడి తండ్రి పేరు నౌషద్ ఖాన్. అలాగే ఆయన పేరులోని నౌ (హిందీలో 9), సాత్ (7) కలిపితే 97 నెంబర్‌ను స్ఫురించేలా ఉంటుంది. అందుకే తన క్రికెట్ కెరీర్ కోసం కోచ్‌గా మారి జీవితాన్నే త్యాగం చేసిన తండ్రికి గౌరవంగా ఆ సంఖ్యనే ఎప్పుడూ ధరిస్తుంటాడు. సర్ఫరాజ్ పుట్టిన ఏడాది కూడా 1997. మరోవైపు అండర్-19 వరల్డ్‌కప్‌లో తన సోదరుడు ముషీర్ ఖాన్ కూడా ఇదే నెంబర్‌తో ఆడడం విశేషం.

నాన్న కలను నెరవేర్చా..

'భారత జట్టుకు ఆడాలని నా తండ్రి కన్న కలలు ఫలించలేదు. ఆయన తరపున నేను జట్టుకు ఆడాలనుకుని చివరకు సాధించాను. మా సోదరుల కెరీర్ కోసం ఆయన ఎంతో కష్టపడ్డారు. చివరకు ఆయన ముందే నేను అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్నాను' - సర్ఫరాజ్

న్యూజిలాండ్ లక్ష్యం 267

హామిల్టన్: దక్షిణాఫ్రికా ఆటగాడు డేవిడ్ బెడింగమ్ (110) శతకంతో.. న్యూజిలాండ్‌తో రెండో టెస్ట్ ఆసక్తికరంగా సాగుతోంది. గురువారం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన సౌతాఫ్రికా 235 రన్స్‌వద్ద ఆలౌటైంది. 31 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి మొత్తం 267 పరుగుల లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందుంచింది. విలియమ్ ఒ రౌర్కీ 5 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో కివీస్ మూడో రోజు ఆట ఆఖరుకు 40/1 స్కోరు చేసింది. కివీస్ విజయానికి ఇంకా 227 పరుగుల దూరంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా 242 పరుగులు చేయగా.. కివీస్ 211 రన్స్‌కు ఆలౌటైంది.



లిఫ్టర్ సుకన్యకు సీఎం సన్మానం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్‌కు చెందిన వెయిట్ లిఫ్టర్ తేజావత్ సుకన్య బాయ్‌ను సీఎం రేవంత్ రెడ్డి సన్మానించారు. గురువారం బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వచ్చే నెలలో అమెరికాలో జరగనున్న ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌నకు ఎంపికైన సుకన్యను రేవంత్ సన్మానించారు.

చైనా చేతిలో భారత్ ఓటమి

» ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

షా ఆలమ్ (మలేసియా): డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి గైర్హాజరీలో.. ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టుకు చుక్కెదురైంది. గురువారం గ్రూప్-ఎలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-3తో చైనా చేతిలో ఓడింది. తొలుత సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్ గెలుపొందారు. కానీ, డబుల్స్‌లో ధ్రువ్ కపిల-అర్జున్ జంట, సూరజ్-పృథ్వీ జోడీ ఓడడంతో స్కోరు 2-2తో సమమైంది. అయితే నిర్ణాయక మ్యాచ్‌లో చిరాగ్ సేన్ పరాజయం పాలయ్యాడు. భారత్ ఇప్పటికే నాకౌట్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నందున డబుల్స్ జోడీ సాత్విక్-చిరాగ్, సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్‌కు విశ్రాంతినిచ్చారు.

రౌఫ్ సెంట్రల్ కాంట్రాక్ట్ రద్దు

లాహోర్: క్రమశిక్షణను ఉల్లంఘించి ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ నుంచి తప్పుకోవడంతో స్టార్‌ప్లేయర్ హారీస్ రౌఫ్ సెంట్రల్ కాంట్రాక్ట్‌ను పాకిస్థాన్‌క్రికెట్ బోర్డు రద్దు చేసింది. ఫిట్‌గా ఉన్నా కూడా ఆసీస్‌తో టెస్టులు ఆడేందుకు రౌఫ్ ఆసక్తి ప్రదర్శించలేదు. కానీ, అదే సమయంలో బిగ్‌బాష్ లీగ్‌లో కనిపించడంతో పీసీబీ కన్నెర్ర చేసింది.

రాహుల్ ద్రవిడే కోచ్

» బోర్డు కార్యదర్శి జైషా



న్యూఢిల్లీ: ఈ ఏడాది జూన్‌లో జరిగే టీ20 వరల్డ్‌కప్ వరకు భారత జట్టు కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ కొనసాగనున్నాడు. ఈ విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి జైషా ధ్రువీకరించాడు. గతేడాది వన్డే వరల్డ్‌కప్‌తోనే ద్రవిడ్ ఒప్పందం ముగిసిపోయింది. అయితే దక్షిణాఫ్రికా పర్యటన వరకు కొనసాగాలని బోర్డు కోరింది. ఆ తర్వాత వెంటనే ఇంగ్లండ్‌తో సిరీస్ ఆరంభం కాగా, చివరకు గురువారం అతడితో జైషా మాట్లాడాడు. అయితే ద్రవిడ్‌లాంటి సీనియర్ల కాంట్రాక్ట్‌పై తొందరెందుకు? టీ20 వరల్డ్‌కప్ వరకు అతనే ఉంటాడని జైషా బదులిచ్చాడు.

ఫోర్బ్స్ ఇండియా అండర్ 30 జాబితాలో

హైదరాబాద్ స్టార్టప్ నెక్స్ట్‌వేవ్

కంపెనీ వ్యవస్థాపకులు శశాంక్, అనుపమ్‌లకు చోటు



హైదరాబాద్: దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించే శక్తి కలిగిన స్టార్టప్స్, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ఫోర్బ్స్ ఇండియా 30 అండర్ 30 పేరుతో ఒక జాబితా రూపొందించింది. 2024 సంవత్సరానికి గాను రూపొందించిన ఈ జాబితాలో మొత్తం 19 కేటగిరీల నుంచి 38 మందిని ఎంపిక చేసింది. ఇందులో కంపెనీ వ్యవస్థాపకులు, సహ వ్యవస్థాపకులు, ఇతర కీలక పదవుల్లోని వారు కూడా ఉన్నారు. ఈ జాబితాలో ఉన్న వారంతా 30 ఏళ్ల లోపు వయసు కలిగినవారే. ఫోర్బ్స్ ఇండియా రూపొందించిన ఈ జాబితాలో హైదరాబాద్ ఎడ్‌టెక్ స్టార్టప్ కంపెనీ నెక్స్ట్‌వేవ్ వ్యవస్థాపకులు శశాంక్ రెడ్డి గుజ్జుల, అనుపమ్ పెదర్ల కూడా ఉన్నారు. వీరితో పాటు జెప్టో సహ వ్యవస్థాపకులు అదిత్ పాలిచా, కైవల్య వోహ్రా, ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ వైస్ ప్రెసిడెంట్ సీతాలక్ష్మీ నారాయణన్, రేజర్‌పే స్ట్రాటజీ హెడ్ విష్ణు ఆచార్య తదితరులు ఉన్నారు.

ఐటీ పరిశ్రమకు అవసరమైన అధునాతన నైపుణ్యాల్లో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చే 'నెక్స్ట్‌వేవ్' స్టార్టప్ సంస్థ ఒక్కటే హైదరాబాద్ నుంచి ఈ జాబితాలో చోటు సంపాదించింది. ఈ సంస్థను స్థాపించిన శశాంక్ రెడ్డి గుజ్జుల, అనుపమ్ పెదర్ల ఇద్దరూ తెలుగువారే కావడం మరో విశేషం. వీరిలో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన శశాంక్ రెడ్డి గుజ్జుల ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్, ఏలూరుకు చెందిన అనుపమ్ పెదర్ల ఐఐటీ ఖరగ్‌పూర్‌లో బీటెక్ పూర్తి చేశారు.

ఐటీలో అడ్వాన్స్‌డ్ కోర్సులు

నెక్స్ట్‌వేవ్ అందించే అధునాతన ఐటీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు దేశ, విదేశాల్లోని దాదాపు 1,700 ప్రముఖ కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్ పొందారు. వచ్చే రెండేళ్లలో 10,000 కంపెనీలకు చేరువై తమ ఆన్‌లైన్ కోర్సులు నేర్చుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నెక్స్ట్‌వేవ్ లక్ష్యంగా పెట్టుకుంది. 'ఇది మేము వ్యక్తిగతంగా సాధించిన గుర్తింపు కాదు. గొప్ప కలలు కని, వాటికోసం స్థిరంగా ప్రతిరోజు నేర్చుకుంటున్న నెక్స్ట్‌వేవ్ విద్యార్థులకు, ఎంతోమంది యువత చక్కటి ఉద్యోగాలు సాధించేలా నిరంతర కృషి చేస్తున్న నెక్స్ట్‌వేవ్ బృందానికి దక్కిన గుర్తింపు' అని కంపెనీ సహ వ్యవస్థాపకుడు, హెడ్ ఆఫ్ స్టూడెంట్స్ ఎక్స్‌పీరియన్స్ శశాంక్ రెడ్డి అన్నారు. 'ఫోర్బ్స్ నుంచి లభించిన ఈ గుర్తింపు వేల మంది యువత జీవితాల్లో నెక్స్ట్‌వేవ్ తీసుకువస్తున్న మార్పుకి నిదర్శనం' అని నెక్స్ట్‌వేవ్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అనుపమ్ పెదార్ల చెప్పారు.

ఎండ్యూర్‌ఎయిర్ సిస్టమ్స్‌కీ చోటు



డ్రోన్ల తయారీలో దూసుకుపోతున్న ఎండ్యూర్‌ఎయిర్ సిస్టమ్స్ స్టార్టప్ కంపెనీకి ఫోర్బ్స్ ఇండియా 30 అండర్ 30 జాబితాలో చోటు లభించింది. ఐఐటీ కాన్పూర్ ఇంక్యుబేటర్‌లో పురుడుపోసుకున్న ఈ స్టార్టప్ వ్యవస్థాపకుడు రామకృష్ణ మెండు గుంటూరుకు చెందిన తెలుగు వారే. ఈ స్టార్టప్‌కు ఏషియన్ పెయింట్స్ ప్రమోటర్లలో ఒకరైన జలజ్ దానీ రూ.13.5 కోట్లు సీడ్ క్యాపిటల్‌గా సమకూర్చారు. డీఆర్‌డీఓ, హెచ్‌ఏఎల్, యూపీ పోలీస్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌తో సహా అనేక ప్రఖ్యాత సంస్థలకు ఎండ్యూర్‌ఎయిర్ సిస్టమ్స్ తన సేవలు అందిస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే జెన్ టెక్నాలజీస్ కూడా ఈ సంస్థ సేవలు అందుకుంటోంది. పీఎల్ఐ పథకం కింద డ్రోన్లు, వాటి విడి భాగాలు తయారు చేసేందుకూ ఎండ్యూర్‌ఎయిర్ సిస్టమ్స్ సిద్ధమవుతోంది. ఇందుకోసం కేంద్ర పౌర విమానయాన శాఖ ఎండ్యూర్‌ఎయిర్ సిస్టమ్స్ ప్రతిపాదనను షార్ట్‌లిస్ట్ చేసింది.

బిజినెస్

మాంద్యం గుప్పిట్లో బ్రిటన్, జపాన్

» నాలుగో స్థానానికి పడిపోయిన జపాన్

లండన్/టోక్యో: జపాన్, బ్రిటన్ ఆర్థిక వ్యవస్థలు మాంద్యంలో చిక్కుకున్నాయి. 2023 సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ మైనస్ 0.1%, జపాన్ ఆర్థిక వ్యవస్థ మైనస్ 2.9% కుంగిపోయాయి. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలోనూ ఈ రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలు వరుసగా మైనస్ 0.4%, మైనస్ 0.3% వృద్ధి రేటు నమోదు చేశాయి. ఏ దేశ జీడీపీ అయినా వరుసగా రెండు త్రైమాసికాలు మైనస్ వృద్ధి రేటు నమోదు చేస్తే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో ఉన్నట్టుగా పరిగణిస్తారు. ఈ లెక్కన బ్రిటన్, జపాన్ ఆర్థిక వ్యవస్థలు ప్రస్తుతం మాంద్యంలో కూరుకుపోయాయి. మాంద్యం దెబ్బకు జపాన్ ఆర్థిక వ్యవస్థ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుంచి నాలుగో స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం తొలి 3 స్థానాల్లో అమెరికా, చైనా, జర్మనీ ఉన్నాయి.

మళ్లీ 72,000 ఎగువకు సెన్సెక్స్

ముంబై: మార్కెట్ ఇప్పటివరకు సాధించిన లాభాలను కన్సాలిడేట్ చేసుకుంటున్న తరుణంలో కొన్ని షేర్లకు లభించిన కొనుగోళ్ల మద్దతు కారణంగా మూడో రోజున కూడా ఈక్విటీ సూచీలు లాభాల్లో ముగిశాయి. మరోసారి సెన్సెక్స్ 72,000 పైన, నిఫ్టీ 22,000 ఎగువన ముగిశాయి. గురువారం సెన్సెక్స్ 227.55 పాయింట్ల లాభంతో 72,050.38 పాయింట్ల వద్ద ముగియగా నిఫ్టీ 70.70 పాయింట్ల లాభంతో 21,910.75 వద్ద క్లోజైంది. రోజంతా సూచీలు పాజిటివ్ మొగ్గుతో పరిమిత పరిధిలోనే ట్రేడయ్యాయి. మహీంద్రా అండ్ మహీంద్రా 6.51 శాతం లాభంతో సెన్సెక్స్ షేర్లలో అగ్రగామిగా నిలిచింది.

ఎన్ఎండీసీ 52 వారాల గరిష్ఠం: ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండీసీ షేరు గురువారం ఇంట్రాడేలో 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకింది. కంపెనీ ఆర్థిక ఫలితాలు ఇచ్చిన ఉత్తేజంలో ఈ షేరు బీఎస్ఈలో 4.86 శాతం వృద్ధితో రూ.246.95 వద్ద ముగియగా ఎన్ఎస్ఈలో 4.69 శాతం వృద్ధితో రూ.246.60 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేరు బీఎస్ఈలో రూ.252.65, ఎన్ఎస్ఈలో రూ.252.40ని తాకింది. ఈ రెండూ 52 వారాల గరిష్ఠ స్థాయిలే.

వచ్చే వారంలో జునిపర్ హోటల్స్ ఇష్యూ : హయత్ బ్రాండ్‌తో హోటళ్లను నిర్వహిస్తున్న జునిపర్ హోటల్స్ పబ్లిక్ ఇష్యూ వచ్చే బుధవారం (తేదీ 21) ప్రారంభమై శుక్రవారం (తేదీ 23) ముగియనుంది. ఈ షేరు ధర శ్రేణిని రూ.342-360గా ప్రకటించారు. ఇష్యూ ద్వారా రూ.1,800 కోట్లు సమీకరణ లక్ష్యంగా కంపెనీ పెట్టుకుంది. ఒక్కో ఇన్వెస్టర్ కనీసం 40 షేర్లకు బిడ్ చేయాల్సి ఉంటుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,070 ▼	56,900 ▼	76,000 ▲
ముంబై	61,508 ▼	56,341 ▼	70,203 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ		విజయవాడ	539
హైదరాబాద్	548	విశాఖపట్నం	555
16వ తేదీ		వరంగల్	550
చిత్తూరు	603		
గోదావరి	539	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	124	గోదావరి	129
వరంగల్	124	విజయవాడ	129
కరీంనగర్	124	గుంటూరు	129
మహబూబ్‌నగర్	124	ఒంగోలు	129
కర్నూలు	124	చిత్తూరు	130
విశాఖపట్నం	122		

విభోర్ స్టీల్ ఐపీఓ సూపర్ హిట్

» 299 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్

న్యూఢిల్లీ: గురువారం ముగిసిన విభోర్ స్టీల్ ట్యూబ్స్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) సూపర్ డూపర్ హిట్టయింది. కంపెనీ ఈ ఐపీఓ ద్వారా 35,92,445 షేర్లను అమ్మకానికి పెట్టగా ఇన్వెస్టర్ల నుంచి 107,36,25,300 షేర్లకు (298.86 రెట్లు) బిడ్స్ వచ్చాయి. దేశ ఐపీఓ చరిత్రలో అత్యధికంగా ఓవర్ సబ్‌స్క్రైబ్ అయిన ఐపీఓ ఇదేనని భావిస్తున్నారు. ఇష్యూ ద్వారా కంపెనీ రూ.72.17 కోట్లు సమీకరించాలని భావించగా.. 28 లక్షల మంది ఇన్వెస్టర్ల నుంచి రూ.16,211 కోట్ల విలువైన షేర్లకు బిడ్స్ వచ్చాయి. నాన్ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల (ఎన్ఐఐ)లకు కేటాయించిన షేర్లయితే 721.33 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యాయి. ఉద్యోగులకు కేటాయించిన షేర్లు 201.48 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యాయి. రిటైల్ మదుపరులకు కేటాయించిన షేర్లు 188.17 రెట్లు, క్యూఐబీలకు కేటాయించిన షేర్లు 178.73 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యాయి. రూ.141-151 ప్రైస్ బ్యాండ్‌లో కంపెనీ ఈ షేర్లు జారీ చేసింది. ప్రస్తుతం గ్రే మార్కెట్లో విభోర్ స్టీల్ ట్యూబ్స్ షేరు 80 శాతం ప్రీమియంతో ట్రేడవుతోంది.

ఎగుమతులు 3 నెలల గరిష్ఠం

జనవరిలో 3.14 లక్షల కోట్లుగా నమోదు



న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం జనవరిలో కాస్తంత పుంజుకుంది. రెడ్ సీ సంక్షోభం, ఇతరత్రా ప్రపంచ అస్థిరతల నేపథ్యంలో కూడా ఈ రంగం 3.12 శాతం వృద్ధితో 3,692 కోట్ల డాలర్ల (రూ.3.14 లక్షల కోట్లు) విలువ గల వస్తూత్పత్తులు ఎగుమతి చేయగలిగింది. దిగుమతులు కూడా 3 శాతం వృద్ధితో 5,441 కోట్లకు (రూ.4.62 లక్షల కోట్లు) చేరాయి. దీంతో వాణిజ్య లోటు 9 నెలల కనిష్ఠ స్థాయి 1,749 కోట్ల డాలర్లకు (రూ.1.49 లక్షల కోట్లు) తగ్గింది. గత ఏడాది ఏప్రిల్‌లో నమోదైన 1,524 కోట్ల డాలర్ల (రూ.1.30 లక్షల కోట్లు) తర్వాత వాణిజ్య లోటు ఇంత తక్కువగా ఉండడం ఇదే ప్రథమం. వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం జనవరిలో 30 రంగాల్లో 18 రంగాలు ఎగుమతుల్లో సానుకూల వృద్ధిని నమోదు చేశాయి. వాటిలో ఇనుప ఖనిజం, సుగంధ ద్రవ్యాలు, ఆయిల్ మీల్స్, నూనె గింజలు, కార్పెట్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, టీ, ఫార్మాస్యూటికల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, కాఫీ, ఇంజనీరింగ్ వస్తువులు, రసాయనాల రంగాలున్నాయి.

ముఖ్యాంశాలు...

- సేవల రంగం ఎగుమతులు గత ఏడాది జనవరిలో 2,800 కోట్ల డాలర్లుండగా ఈ జనవరిలో 328 కోట్ల డాలర్లకు పెరిగాయి. ఏప్రిల్-జనవరి నెలల మధ్య 10 నెలల కాలంలో ఈ రంగం ఎగుమతులు 26,750 కోట్ల డాలర్ల నుంచి 28,445 కోట్ల డాలర్లకు పెరిగాయి.
- 2014 నాటికి ప్రపంచ ఎగుమతుల్లో భారత్ వాటా 19,496 కోట్ల డాలర్ల విలువతో 8 శాతం ఉండగా 2022 నాటికి 26,109 కోట్ల డాలర్ల విలువతో 10.35 శాతానికి పెరిగింది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి నెలల మధ్య కాలంలో ఎగుమతులు 4.89 శాతం క్షీణతతో 35,392 కోట్ల డాలర్లకు తగ్గగా దిగుమతులు కూడా 6.71 శాతం క్షీణించి 56,112 కోట్ల డాలర్లకు తగ్గాయి. 10 నెలల వాణిజ్య లోటు 2072 కోట్ల డాలర్లుగా నమోదైంది.

బంగారం, క్రూడ్ దిగుమతుల్లో వృద్ధి

క్రూడాయిల్, బంగారం దిగుమతులు జనవరి నెలలో పెరిగాయి. బంగారం దిగుమతులు 174 శాతం వృద్ధితో 190 కోట్ల డాలర్లకు (రూ.16,150 కోట్లు) చేరగా క్రూడాయిల్ ఎగుమతులు 4.33 శాతం వృద్ధితో 1,656 కోట్ల డాలర్లుగా (రూ.1.41 లక్షల కోట్లు) నమోదయ్యాయి. అయితే ఏప్రిల్-జనవరి నెలల మధ్య కాలంలో బంగారం దిగుమతులు 301.7 శాతం పెరిగి 3,800 కోట్ల డాలర్లుగా (రూ.3.32 లక్షల కోట్లు) నమోదు కాగా క్రూడాయిల్ దిగుమతి మాత్రం 15.91 శాతం తగ్గి 14,675 కోట్ల డాలర్లకు (రూ.121.47 లక్షల కోట్లు) పరిమితమైంది.

- తెలంగాణలో క్యాంపస్ టు కార్పొరేట్ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని హిందుస్థాన్ కోకా-కోలా బెవరేజెస్ మరింతగా విస్తరించింది. ఇందుకోసం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), ఆహాన్ కన్సల్టింగ్‌తో భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో సుమారు 5,000 మంది డిప్లొమా విద్యార్థులకు నైపుణ్యాల శిక్షణను అందించనుంది.
- అంతర్జాతీయ లగ్జరీ హోమ్ ఫర్నిషింగ్ సంస్థ పాబ్లో.. హైదరాబాద్‌కు చెందిన లగ్జరీ ఇంటీరియర్ డిజైన్ స్టూడియో క్రిస్మ్ ను భారత్‌లో మాస్టర్ ఫ్రాంచైజీగా నియమించుకుంది. పాబ్లోతో చేతులు కలపటం ద్వారా అంతర్జాతీయంగా పేరొందిన విస్తృత శ్రేణి ఉత్పత్తులు వినియోగదారులకు అందుబాటులోకి వస్తాయని క్రిస్మ్ వ్యవస్థాపకుడు కిరణ్ కుమార్ తెలిపారు.

డేటా ఎక్స్‌క్లూజివిటీకి ఒప్పుకోం

ఈఎఫ్‌టీఏ డిమాండ్‌ను తోసిపుచ్చిన భారత్

న్యూఢిల్లీ: ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల్లో భాగంగా "డేటా ఎక్స్‌క్లూజివిటీ" నిబంధనలను చేర్చాలన్న యూరోపియన్ స్వేచ్ఛా వాణిజ్య సంఘం (ఈఎఫ్‌టీఏ) డిమాండ్‌ను భారత్ తిరస్కరించింది. దేశీయ ఔషధ పరిశ్రమ ప్రయోజనాలు పరిరక్షించడమే లక్ష్యంగా తాము ఈ చర్య తీసుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది. జెనరిక్ పరిశ్రమకు వ్యతిరేకమైన చర్యలేవీ తాము తీసుకునే ప్రసక్తి లేదని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ అన్నారు. డేటా ఎక్స్‌క్లూజివిటీ వల్ల ఇన్నోవేటర్ కంపెనీల సాంకేతిక డేటాకు రక్షణ కలుగుతుంది. ఫార్మా రంగంలో అయితే ఔషధ కంపెనీలు అత్యంత వ్యయప్రయాసల కోర్చి ప్రపంచ స్థాయిలో క్లినికల్ ట్రయల్స్ నిర్వహించడం ద్వారా భారీ డేటాను సృష్టిస్తాయి. దీనిపై "డేటా ఎక్స్‌క్లూజివిటీ" కల్పించడం వల్ల ఇన్నోవేటర్ కంపెనీలు, పోటీదారులు తక్కువ ధరలకు తయారు చేసిన ఉత్పత్తులపై లైసెన్సు పొందకుండా నిరోధించే ఆస్కారం ఉన్నందున దాన్ని భారత్ తిరస్కరించింది.

ఐసీఐసీఐ ప్రు ఇండియా ఆపర్చునిటీస్ ఫండ్‌తో మెరుగైన రిటర్నులు

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఇండియా ఆపర్చునిటీస్ ఫండ్ మదుపరులకు మంచి రిటర్నులు అందిస్తూ వస్తోంది. ఈ ఫండ్ ప్రారంభించిన ఐదేళ్లలోనే ఈ ఫండ్ మదుపరులకు మూడింతల లాభాన్ని అందించింది. 2019 జనవరి 15న ప్రారంభమైన ఈ ఫండ్‌లో ఏకమొత్తంగా రూ.లక్ష పెట్టుబడిగా పెట్టి ఉంటే ఈ ఏడాది జనవరి 15 నాటికి ఏటా 22.9 శాతం వృద్ధితో రూ.28 లక్షలకు చేరుకుంది. ఈ కాలంలో నిఫ్టీ 500 టీఆర్ఐ ఏటా 19 శాతం వృద్ధితో రూ.23 లక్షల రిటర్నులు మాత్రమే అందించింది. ఒకవేళ సిప్ రూపంలో నెలకు రూ.10,000 పెట్టుబడిగా పెట్టి ఉంటే మొత్తం రూ.6 లక్షల పెట్టుబడిపై రూ.12.58 లక్షల రిటర్నులు అందించింది. ఇన్వెస్టర్లకు దీర్ఘకాలంలో మంచి రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్‌ను తీర్చిదిద్దటమే ఇందుకు ప్రధాన కారణంగా ఉందని ఐసీఐసీఐ ప్రు వెల్లడించింది. వివిధ రంగాలతో పాటు మార్కెట్ క్యాపిటలైజేషన్ ఆధారంగా ఈ ఫండ్ ప్రధానంగా పెట్టుబడులు పెడుతూ వస్తుంది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆహారాన్ని ఫొటో తీస్తే..
కేలరీలు చెప్పేస్తుంది!
9

పోషకాలు.. చక్కెర శాతాన్నీ నిర్ధారించే యాప్

'న్యూట్రీ ఎయిడ్'ను ఆవిష్కరించిన ఎన్ఐఎన్

శుక్రవారం | 16-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 319 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్



ఎన్నికల బాండ్లపై తీర్పునిచ్చిన జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం

ఎలక్టోరల్ బాండ్ అంటే..

రాజకీయ పార్టీలకు విరాళాలు సమకూర్చే ఓ కొత్త వేదికగా ఎలక్టోరల్ బాండ్లను తొలిసారిగా 2017-18 కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో, భారతీయ పౌరులు/ దేశీయ కంపెనీలు రూ.వెయ్యి, 10 వేలు, లక్ష, 10 లక్షలు, కోటి రూపంలో బాండ్లను కొనుగోలు చేసి పార్టీలకు విరాళం ఇచ్చే పథకం 2018 నుంచి అమల్లోకి వచ్చింది. ఎలక్టోరల్ బాండ్‌ను ప్రామిసరీ నోటు తరహాలో జారీ చేస్తారు. దానిపై కొన్న వ్యక్తి, తీసుకునే వ్యక్తుల పేర్లు తదితర వివరాలేమీ ఉండవు. ఒకరు ఎన్ని బాండ్లనైనా కొనుగోలు చేయవచ్చు. తమకు లభించిన బాండ్లను ఆయా పార్టీలు 15 రోజుల్లోగా నగదుగా మార్చుకోవాలి. గడువులోగా నగదుగా మార్చుకోని బాండ్ల తాలూకు మొత్తాన్ని ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధికి జమ చేస్తారు.

16,000 కోట్లు

బాండ్ల ద్వారా పార్టీలకు వచ్చిన విరాళాల సొమ్మిది

సింహభాగం బీజేపీకే

గత ఆర్థిక సంవత్సరానికే ఆ పార్టీకి రూ.6,565 కోట్లు

దేశంలోనే సంపన్న పార్టీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ఎలక్టోరల్ బాండ్ల పథకం 2018లో ప్రారంభం కాగా, ఇప్పటి వరకూ వివిధ రాజకీయ పార్టీలకు బాండ్ల ద్వారా రూ.16,518.11 కోట్ల నిధులు లభించాయి. వీటిలో సింహభాగం బీజేపీకే దక్కాయి. గత ఆర్థిక సంవత్సరం వరకూ అన్ని పార్టీలకూ కలిపి రూ.12 వేల కోట్లు లభించగా, వీటిలో బీజేపీ వాటా రూ.6,565 కోట్లు. అంటే 55 శాతం. 2023-24 ఆర్థిక సంవత్సరం బాండ్ల వివరాలు పార్టీల వారీగా ఇంకా వెల్లడి కాలేదు. ఆయా పార్టీలు వార్షిక ఆడిట్ రిపోర్టులను ఎన్నికల సంఘానికి సమర్పించిన తర్వాతే ఈ వివరాలు తెలుస్తాయి. అయితే, అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) అంచనా ప్రకారం ప్రస్తుత ఆర్థిక

మిగతా 9వ పేజీలో...

ఎన్నికల బాండ్లు అప్రజాస్వామికమని
అప్పుడే చెప్పాం

కేంద్రం ఇకనైనా మోసపూరిత ఆలోచనలు మానుకోవాలి

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం: కాంగ్రెస్

లంచాలు, కమీషన్లకే ఎన్నికల బాండ్లు: రాహుల్‌గాంధీ

తీర్పును కొనియాడిన విపక్షాలు

ప్రధాని మోదీ నాయకత్వానికి ప్రత్యామ్నాయం లేదు

అందుకే ప్రతి అంశంపైనా విపక్షాల రాజకీయం: బీజేపీ
9

పారదర్శకత కోసమే..

దాతల భద్రత దృష్ట్యా పేర్లపై గోప్యత

బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్

కోర్టు తీర్పును గౌరవిస్తామని వ్యాఖ్య

మైదానంలోనే లేని కాంగ్రెస్ విమర్శించడమేంటని ఎద్దేవా

ఎలక్టోరల్ బాండ్లు రద్దు

సమాచారహక్కు చట్టానికి, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు వాటితో విఘాతం

బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధం.. అధికార పార్టీలు బెదిరింపులకు పాల్పడవచ్చు

క్విడ్‌ప్రోకోలో భాగంగా విరాళాలిచ్చి ప్రభుత్వ విధానాల్ని అనుకూలం చేసుకుంటున్నారు

సామాన్య జనం విరాళాలు.. కార్పొరేట్ విరాళాలూ ఒకటి కావు

పార్టీలకొచ్చే విరాళాల వివరాలు ఓటర్లకు తెలియాలి.. నిష్పక్షపాత ఎన్నికలకది అవసరం

2019 నుంచి నేటి వరకూ బాండ్ల వివరాలు బయటకు రావాలి

కొన్న వ్యక్తి, తీసుకున్న పార్టీ, బాండు విలువ వివరాల్ని ఎస్బీఐ మార్చి 6లోపు ఈసీకివ్వాలి

వాటిని మార్చి 13లోపు ఈసీ వెబ్‌సైట్‌లో ఉంచాలి.. నగదుగా మార్చని బాండ్లను

కొనుగోలుదారుల ఖాతాల్లో జమ చేయాలి.. సుప్రీంకోర్టు సంచలన తీర్పు

బాండ్లను కొన్న వారి వివరాలు బహిర్గతం అయితే రాజకీయ కలకలమే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ముంగిట సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని రాజ్యాంగ వ్యతిరేకమైనదిగా పేర్కొంటూ ఆ పథకాన్ని కొట్టివేసింది. రాజ్యాంగం కల్పించిన భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు, సమాచార హక్కు చట్టానికి ఎలక్టోరల్ బాండ్లు వ్యతిరేకమని పేర్కొంది. ఈ పథకం కింద ఇప్పటి వరకూ బాండ్లను కొనుగోలు చేసిన వారి పేర్లు, ఆ బాండ్ల విలువ, వాటిని స్వీకరించిన వారి వివరాలను వెల్లడించాలని స్పష్టం చేసింది. 2019 ఏప్రిల్ 12 నుంచి విక్రయించిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలను మార్చి 6లోపు ఎన్నికల సంఘాని(ఈసీ)కి సమర్పించాలని ఎస్బీఐని ఆదేశించింది. మార్చి 13లోపు ఆ వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచాలని ఈసీకి ఆదేశాలు జారీ చేసింది. నగదుగా మార్చని బాండ్లను కొనుగోలుదారుల ఖాతాల్లో తిరిగి జమ చేయాలని ఎస్బీఐకి స్పష్టం చేసింది. ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని రద్దు చేయాలని

మిగతా 9వ పేజీలో...



బైక్‌పై ఒకేసారి 126 గొర్రెలట!

కారు, బస్సు, అంబులెన్స్‌లోనూ తీసుకెళ్లారట!.. గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అక్రమాలు

జీవాలను కొనకుండానే కొన్నట్లు చూపిన వైనం

చనిపోయిన వారికీ పంపిణీ చేసినట్లు నమోదు

పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగమైనట్లు తెలిపిన కాగ్.. ఏడు జిల్లాల్లో పథకంపై విచారణ

253.93 కోట్ల వినియోగంపై అభ్యంతరం

నకిలీ రవాణా ఇన్వాయి‌స్‌లతో 68 కోట్లు స్వాహా

గొర్రెలకు నకిలీ ట్యాగ్‌లతో మరో 92 కోట్లు..

డబుల్ గోల్‌మాల్!

డబుల్ ఇళ్ల పథకం అమలులో అవకతవకలు

లబ్ధిదారుల ఎంపికలోనే రాష్ట్ర ప్రభుత్వం విఫలం

దారి మళ్లిన కేంద్ర నిధులు.. డిజైన్ మార్పుతో పెరిగిన ఖర్చు.. జీహెచ్ఎంసీపై అదనపు భారం

అనర్హులకూ ఆసరా!

మూడేళ్లలో 2.02 లక్షల మందికి పింఛన్లు

16% అనర్హులకు.. రూ.1175 కోట్ల చెల్లింపులు

2018-21 మధ్యలో రాష్ట్రంలో అక్రమాలు



గొర్రెల రవాణాకు ఉపయోగించిన నకిలీ వాహనాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై ఏదైనా జంతువునో, జీవాన్నో తరలించాల్సి వస్తే.. ఒక్క ప్రయాణంలో ఎన్నింటిని తీసుకెళ్లగలుగుతాం? ఒకటి, రెండు కన్నా ఎక్కువగా తీసుకెళ్లడం సాధ్యం కాదన్న విషయం అందిరికీ తెలిసిందే. కానీ, గత ప్రభుత్వం అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకంలో మాత్రం.. ఒక బైకుపై ఒకే ప్రయాణంలో ఏకంగా 126 గొర్రెలను తరలించారట! అవును.. గొర్రెల పంపిణీ పథకం అమలుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) జరిపిన పరిశీలనలో ఇది వెల్లడైంది. బైకుపైనే కాదు.. కారులో, బస్సులో, చివరికి అంబులెన్స్‌లో కూడా గొర్రెలను తరలించినట్లు రికార్డుల్లో చూపారు. గొర్రెలను కొనకుండానే కొన్నట్లు, తరలించకుండానే.. ఏదో ఒక వాహనం నెంబరు వేసి.. ఆ వాహనంలో తరలించినట్లు చూపించి రూ.కోట్లు స్వాహా చేసినట్లు కాగ్ నిగ్గు తేల్చింది. ఈ పథకం అమలుకు సంబంధించి ఏడు జిల్లాలు.. ఖమ్మం, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నల్లగొండ, సంగారెడ్డి, సూర్యాపేట, వరంగల్ జిల్లాల్లో కాగ్ విచారణ చేపట్టగా విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. నకిలీ ఇన్వాయిస్‌ల మీద

మిగతా 11వ పేజీలో...

రాష్ట్రం అప్పుల కుప్ప

ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి రుణాలు

2022 మార్చి నాటికే 4.33 లక్షల కోట్ల అప్పు

జీఎస్‌డీపీలో ఈ అప్పు వాటా 38 శాతం

కాళేశ్వరం కార్పొరేషన్‌పై రూ. 72,067 కోట్లు

పదేళ్లలో చెల్లించాల్సింది రూ. 2,52,048 కోట్లు

బడ్జెట్ అంచనాకు రాబడికి 48,657 కోట్ల తేడా

దళిత బంధుకు రూ. 3,442 కోట్ల అధిక వ్యయం

గత ప్రభుత్వ పనితీరును ఎండగట్టిన కాగ్
11

మూడో టీఎంసీ దండగ!

దానిపై రూ. 28 వేల కోట్ల నిరర్థక వ్యయం

కాళేశ్వరంలో భారీగా అనుచిత చెల్లింపులు
10

1.47 లక్షల కోట్లకు పెరగనున్న అంచనాలు

అప్పులపై వాయిదాలకే ఏటా 14,406 కోట్లు

ఒక టీఎంసీతో 17,668 ఎకరాలకు నీళ్లెలా?

కరెంట్ బిల్లులకే ఏటా రూ. 10,374 కోట్లు: కాగ్



సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో సీఎం రేవంత్ అభివాదం

రూ. 100 కోట్లతో గురుకులం!

20 ఎకరాల్లో నిర్మాణం.. నియోజకవర్గానికి ఒకటి చొప్పున..

నమూనాగా కొడంగల్‌లో ఇంటిగ్రేటెడ్ గురుకులం

3,650 రోజులు అధికారంలో ఉండి నియామక పత్రాలివ్వలేదే?

పదేళ్లలో కేసీఆర్ చేతికి రూ.17.50 లక్షల కోట్లు

గురుకులాల టీచర్ల నియామక పత్రాల పంపిణీలో సీఎం రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో అద్దెభవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు సొంత భవనాలు నిర్మిస్తాం. అన్ని వసతులను కల్పిస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థలను కలిపి.. నియోజకవర్గానికి ఒకటిగా ఇంటిగ్రేటెడ్ గురుకులంగా నిర్మిస్తాం. ఒక్కో ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని 20 ఎకరాల్లో.. రూ.100 కోట్లతో ఏర్పాటు చేస్తాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గురుకుల ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు గురువారం ఆయన ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో

మిగతా 12వ పేజీలో...

చదువుతోనే గౌరవం.. తండాల్లో స్కూళ్లను నిర్మిస్తాం

గిరిజన విద్యార్థులు సంత్ సేవాలాల్ మార్గంలో నడవాలి: సీఎం



మేడారం జాతరకు కేంద్రం మొండిచేయి

తెలంగాణ కుంభమేళాకు పైసా ఇవ్వని మోదీ సర్కార్

జాతీయ హోదా ప్రకటనపైనా దాటవేత ధోరణి

కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా కిషన్‌రెడ్డి ఉన్నప్పటికీ.. మహా జాతరకు కానరాని చేయూత
7

పాత అప్పులు చెల్లించడానికి
కొత్త అప్పులు

వాయిదాలు, వడ్డీల కోసం
రూ.68,585 కోట్ల రుణం

లక్షల కోట్ల బడ్జెటని గత సర్కార్ గొప్పలు

విద్యార్థుల ఫీజులూ చెల్లించలేదు

సామాజిక తెలంగాణే మా ప్రభుత్వ లక్ష్యం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతికి ప్రాధాన్యం.. గ్యారెంటీలు అమలు చేస్తాం

ఆ మేరకే బడ్జెట్‌లో కేటాయింపులు చేశాం

రాష్ట్ర మొత్తం అప్పు 7.11 లక్షల కోట్లు

బడ్జెట్‌పై చర్చలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సామాజిక తెలంగాణ నిర్మాణమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల అభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఆరు గ్యారెంటీలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, దానికి అనుగుణంగానే బడ్జెట్‌లో నిధులు కేటాయించామని చెప్పారు. గురువారం అసెంబ్లీలో

మిగతా 10వ పేజీలో...



ముంచుకొస్తున్న మంచు యుగం?

భూతాపం కారణంగా దెబ్బతింటున్న గల్ఫ్ స్ట్రీమ్ లయ

గ్రీన్‌లాండ్ వద్ద భారీగా మంచు కరిగి ఈ ప్రవాహంలోకి

ఆ ప్రవాహం ఆగితే అమెరికాలో, యూరప్, ఆసియాలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయే ముప్పు

కొన్ని దశాబ్దాల వ్యవధిలో 10 డిగ్రీల మేర తగ్గే ప్రమాదం

మరోసారి హెచ్చరించిన నెదర్లాండ్స్ శాస్త్రవేత్తలు
12

ఆపరేషన్ 'గులాబీ'!

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై కాంగ్రెస్ ఫోకస్

నేడు హస్తం గూటికి వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి
7

చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా అవకాశం


12

సింహం చంపేసింది!

జూలో ఎన్‌క్లోజర్‌లోకి దూకిన రాజస్థాన్ వాసి

దాడి చేసి లాక్కెళ్లిన సింహం.. శరీరం ఛిద్రం

మద్యం మత్తులోనా.. ఆత్మహత్యాయత్నమా?

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

గోప్యతకు చెల్లుచీటీ

ఆరేళ్ళుగా ఉన్న ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగానికి వ్యతిరేకం అంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం ప్రకటించింది. వ్యక్తులు, సంస్థలు రహస్యంగా, ఎంత మొత్తాన్ని అయినా రాజకీయ పార్టీలకు ఇవ్వగలిగే అవకాశం ఉన్న ఈ విధానం ప్రజల ప్రాథమిక హక్కులను అతిక్రమిస్తున్నదని సుప్రీంకోర్టు అభిప్రాయం. పథకాన్ని రద్దుపరచడంతో పాటు, ఇక బాండ్ల అమ్మకాన్ని నిలిపివేయాలని, 2019 నుంచి ఇప్పటివరకూ జారీ చేసిన బాండ్ల వివరాలు, అంటే, కొనుగోలు దారు–బాండు విలువతో కూడిన సమస్త సమాచారాన్ని ఎన్నికల సంఘానికి మార్చి 6వతేదీలోగా అందించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను కోర్టు ఆదేశించింది. ఎన్నికల సంఘం ఆ సమాచారాన్నంతా మార్చి 31వతేదీలోగా తన వెబ్‌సైట్‌లో ఉంచాలి. ఇంకా నగదుగా మార్చుకోని బాండ్లను రాజకీయపార్టీలు వెనక్కు ఇచ్చేయాల్సి ఉంటుంది. మొత్తంగా ఈ గొలుసుకట్టు చర్యల ద్వారా సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్ల విధానం నీతిబాహ్యమైనదీ, లోపభూయిష్టమైనదీ అని తేల్చిచెప్పింది. ఈ తీర్పును కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్వాగతిస్తూనే, కొత్త ఎత్తుగడలు, కుటిలయత్నాలు వద్దని మోదీ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. పారదర్శకతకు పాతరేస్తున్నదంటూ ఈ పథకాన్ని సుప్రీంకోర్టు రద్దుచేస్తే, రాజకీయ విరాళాలలో పారదర్శకతను పెంచేందుకే ఈ బాండ్లు తెచ్చామని బీజేపీ నాయకులు వెంటనే సమర్థింపు వ్యాఖ్యలు చేయడంతో, ఓ ఆర్డినెన్సు ద్వారా ఈ తీర్పును రద్దుపరచడానికి బీజేపీ ప్రయత్నిస్తుందన్న అనుమానం ఖర్గేకు కలిగి ఉండవచ్చు.

విపక్షాలు సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించాయి. ఎన్నికల బాండ్ల ద్వారా ఇప్పటివరకూ అధికార బీజేపీ ఒక్కదానికే దేశంలోని ముప్పై రాజకీయపక్షాల కంటే ఎక్కువ మొత్తం ముట్టిన నేపథ్యంలో, వాటికి ఆ మాత్రం అక్కసు ఉండకపోదు. అధికారపక్షానికి అధికారికంగా లంచం ఇవ్వడానికి ఈ విధానం దోహదపడుతున్నదని కాంగ్రెస్ ఆరోపిస్తున్న నేపథ్యంలో, ఈ పథకాన్నే కాక, దానికి పునాదులువేసిన ఐటీ, కంపెనీ చట్టాల్లో సవరణలను సైతం సుప్రీంకోర్టు కొట్టివేయడం దానికి ఉత్తేజాన్నిచ్చింది. ఇక, పిటిషనర్ల వాదనలతో కోర్టు చాలా అంశాల్లో ఏకీభావం ప్రకటించడం విశేషం. ప్రధానంగా బీజేపీకీ, ఆ తరువాత రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలకే ఎక్కువ మొత్తాలు వెడుతున్నందున అది క్విడ్ ప్రోకోకు అవకాశం ఇస్తున్నదని, ఈ విధానం అన్ని పార్టీలకూ సమన్యాయం చేయడం లేదన్న వాదన కోర్టుకు నచ్చింది. ఏ రాజకీయ పార్టీకి ఎవరు ఎంత విరాళం ఇచ్చారన్నది ప్రజలకు ఎలాగూ తెలియకపోగా, బ్యాంకునుంచి ఆ వివరాలు తెలుసుకోగలిగే అవకాశం అధికారంలో ఉన్నవారికి ఉండటం, విపక్షాలకు లేకపోవడం అక్రమం, ప్రమాదకరం అని కోర్టు గుర్తించింది. అధికారపార్టీకే అధిక విరాళాలు ఎందుకు అందుతున్నాయి, ఎన్నికల సంఘమే బాండ్ల నిధులన్నీ సేకరించి అన్ని పార్టీలకూ పంచవచ్చును కదా అని న్యాయస్థానం గతంలో ప్రశ్నించినప్పుడు, అప్పుడు అసలు విరాళాలే రావు అని సొలిసిటర్ జనరల్ ఓ మాటన్నారు. భూరి విరాళాలు ఎవరికి ఎందుకు అందుతాయో కోర్టుకు తెలియకపోదు.

ఏడు దశాబ్దాలుగా రాజకీయ విరాళాలకు సంబంధించి ఒక చక్కని, పారదర్శకమైన విధానాన్ని తయారుచేసుకోలేకపోయాం, దీనితో పాప ప్రక్షాళన సాధ్యం అంటూ నాలుగుకీలకమైన చట్టసవరణలతో, ఏమాత్రం జవాబుదారీతనం లేని ఈ బాండ్ల విధానాన్ని ప్రభుత్వం తెచ్చింది. దేశీయ కంపెనీలకు శక్తికి మించి విరాళాలు ఇవ్వగలిగే అవకాశంతో పాటు, విదేశీ కంపెనీలు సైతం గోప్యంగా నిధులు ధారపోసేందుకు వీలుకల్పించింది. బాండు కొన్నవారికీ, నగదుగా మార్చుకుంటున్న పార్టీకి మధ్య ప్రతీదశలోనూ గోప్యత వచ్చిచేరింది. ఎన్నికల సంఘానికి లెక్కలు అప్పచెప్పాల్సిన అవసరం రాజకీయపార్టీలకు లేకుండా పోయింది. ఆదిలో ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ఈసీ అనంతరం మారుమాట్లాడకుండా ఊరుకుంది.

ఈ బాండ్ల నిధులతోనే రాజకీయపార్టీలన్నీ బతికేస్తున్నాయని, ఎన్నికల యుద్ధం చేస్తున్నాయని ఎవరికీ భ్రమలు లేవు. కానీ, అప్పటివరకూ సాగుతున్న ఓ బల్లకిందవ్యవహారాన్ని సంపూర్ణంగా మార్చకుండా, మరోరూపంలో దానినే అధికారికం చేసిన ఈ విధానాన్ని ఇప్పుడు కోర్టు కాదన్నది. తాను ఇచ్చినది ఎంతో, అందుకున్న పార్టీ ఏమిటో ఎవరికీ తెలియకూడదని దాతలు కోరుతున్నంత మాత్రాన అదే విధానంగా మారకూడదు. ఏ రాజకీయపార్టీకి ఎవరు దాతలో ప్రజలకు తెలిస్తే, ఎవరికి ఓటువేయవచ్చునో ప్రజలు నిర్ణయించుకోవచ్చు.

‘మద్దతు ధర’: మోదీపై కాంగ్రెస్ అస్త్రం

మోదీ అజేయుడు అనే భావన అందరిలోనూ బలపడిపోతోంది. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ఆయన నేతృత్వంలోని బీజేపీ మరోమారు ఘనవిజయం సాధించనున్నదనే అభిప్రాయం దేశవ్యాప్తంగా వ్యక్తమవుతోంది. అయితే మోదీ అజేయశక్తిని గట్టిగా ప్రశ్నించగలిగే, సమర్థంగా ఎదుర్కోగలిగే అంశం ఒకటి ఎట్టకేలకు రంగంలోకి ప్రవేశించింది. మోదీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రయోగించిన అస్త్రమది– వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర. అవును ఉత్తరాది రైతులను మళ్లీ మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా ఆందోళనకు పురిగొల్పిన అంశమది. కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షాన నిలచింది. మోదీనా లేక కనీస మద్దతు ధరా? 2014 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు, ఆ మాటకొస్తే మన రిపబ్లిక్ భవిష్యత్తు ఈ ఒక్క ప్రశ్నపైనే ఆధారపడి ఉన్నది. తాము అధికారంలోకి వస్తే కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇది సరైన నిర్ణయం, సందేహం లేదు. అయితే అది మరింత ప్రభావవంతమయ్యేందుకు మరింత ముందుకు వెళ్లవలసి ఉన్నది.

రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర అంబికాపూర్ (ఛత్తీస్‌గఢ్‌లోని ఒక చిన్నపట్టణం)కు చేరిన సందర్భంగా అక్కడ జరిగిన ఒక బహిరంగ సభలో కాంగ్రెస్ నిర్ణయాన్ని ప్రపకటించారు. స్వామినాథన్ కమిషన్ సూత్రం ప్రకారం వ్యవసాయ ఉత్పత్తులకు ప్రకటించే కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పి)కి చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ ఆ సభలో ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రప్రథమంగా చేసిన కీలక ప్రకటన ఇది.

ఈ ప్రకటనకు కీలక ప్రాధాన్యమున్నదనే వాస్తవాన్ని ఏ రాజకీయ పరిశీలకుడూ నిరాకరించలేడు. కనీస మద్దతు ధర విషయమై తాను అధికారంలో ఉన్నప్పుడూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనుసరించిన వైఖరికి కాంగ్రెస్ తాజా నిర్ణయం భిన్నమైనది. నిజానికి కనీస మద్దతు ధర విషయమై కాంగ్రెస్ ప్రస్తుత విధానాన్ని 2022లో రాయపూర్ ప్లీనరీ తీర్మానం సూచనప్రాయంగా వ్యక్తం చేసింది. అయితే కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని చాలా కాలంగా రైతులు చేస్తున్న డిమాండ్‌ను నెరవేర్చడానికి కాంగ్రెస్ తిరుగులేని రీతిలో నిబద్ధమవడం ఇదే మొదటిసారి. అంతేకాదు, రైతుల ప్రాథమిక డిమాండ్ అయిన కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంలోని మూడు కీలక అంశాలకు ఒక ప్రధాన జాతీయ రాజకీయ పక్షం కట్టుబడడం ఇదే మొదటిసారి. కనుక కాంగ్రెస్ ప్రకటన రైతాంగ ఉద్యమ చరిత్రలో ఒక ప్రధాన మైలురాయిగా చెప్పవచ్చు.

రైతుల డిమాండ్‌లోని మూడు కీలక అంశాలు ఏమిటో వివరంగా చూద్దాం. (1) కనీస మద్దతు ధరను నిర్ణయించేందుకు ప్రస్తుతం అనుసరిస్తున్న పద్ధతిని ‘స్వామినాథన్ సూత్రం’కు అనుకూలంగా మార్చాలి. దీని ప్రకారం పంట సాగుకు అయిన సమగ్ర ఖర్చుల మొత్తానికి యాభై శాతాన్ని అదనంగా కలిపి ఎమ్ఎస్‌పిని నిర్ణయించాలి; (2) దీన్ని అధికారంలో ఉన్న ప్రభుత్వాల, వాటి అధికారుల ఇష్టాయిష్టాలకు వదిలివేయకుండా, ఆ కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించి తీరాలి; (3) కనీస మద్దతు ధరపై ఈ హక్కును రైతులు అందరికీ సమకూర్చాలి. కేవలం ఎమ్ఎస్‌పిని ప్రకటిస్తున్న 23 పంటలను సాగు చేస్తు రైతులకు మాత్రమే ఆ హక్కును పరిమితం చేయకూడదు.



స్వామినాథన్ కమిషన్ సూత్రం ప్రకారం వ్యవసాయ ఉత్పత్తులకు ప్రకటించే కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పి)కు చట్టబద్ధత కల్పించాలనేది రైతుల ప్రధాన డిమాండ్. దీనిని తాము నెరవేరుస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రప్రథమంగా చేసిన కీలక ప్రకటన ఇది. ఈ హామీతో మోదీ ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షం ఒక గట్టి సవాల్ విసిరింది.

రైతుల డిమాండ్‌ను నెరవేర్చేందుకు కాంగ్రెస్ తన నిబద్ధతను ప్రకటించేందుకు ఇంతకంటే సరైన సమయం, సందర్భం ఉండబోవు. రెండు సంవత్సరాలు మౌనంగా ఉన్న తరువాత రైతులు మళ్లీ ఆందోళనకు పూనుకున్నారు. ప్రధాన రైతు సంఘాలు రెండూ ఆందోళనకు పిలుపునిచ్చాయి. ఉద్యమ కార్యాచరణ విషయమై వివిధ రైతు సంఘాల మధ్య ఏకాభిప్రాయం లేనప్పటికీ కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలనే అంశం వాటి డిమాండ్లలో తొలిస్థానంలో ఉన్నది. కాంగ్రెస్ తనకు తాను ఈ శక్తిమంతమైన ఉద్యమానికి మద్దతునిచ్చింది.



▪ యోగేంద్ర యాదవ్

కాంగ్రెస్ మద్దతు 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేయగలుగుతుందా? మోదీ ప్రభావశీలత, అయోధ్యలో రామ మందిర నిర్మాణ మనంతరం దేశవ్యాప్తంగా ఆయనకు పెరిగిన ప్రజాదరణను కనీస మద్దతు ధర అంశం సమర్థంగా ఎదుర్కోగలదా? పూర్తిగా ఎదుర్కోలేదు. అయితే కొన్ని సంవత్సరాల క్రితం ఒక రాజకీయ కార్యకర్త నాకు ఇలా వివరించాడు: ‘చునావి ముద్ద అప్నే ఆప్ బంతా నహీ హై, బనాయ జాతా హై’ (ఎన్నికలను ప్రభావితం చేసే అంశం దానికదిసొంతంగా ఉద్భవించదు, దాన్ని సృష్టించాలి). ఒక సమస్యను ప్రభావశీల ఎన్నికల అంశంగా మార్చేందుకు కనీసం ఆరు షరతులను నెరవేర్చవలసి ఉన్నది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తానన్న కాంగ్రెస్ ప్రకటన నాలుగు షరతులను నెరవేర్చింది. మిగతా రెండు షరతులను నెరవేర్చే విషయమై ఆ పార్టీ కృషి చేయవలసి వున్నది.

రైతుల సమస్యకు ఒక పరిష్కారాన్ని కనుగొనవలసి ఉన్నది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించమనేది అందుకొక పరిష్కారం కాగలదు. ఇందుకు ఎన్నికైన ప్రభుత్వం బాధ్యత వహించవలసి ఉన్నది. ఈ లక్ష్య సాధనకు రైతులను సమీకరించవలసి ఉన్నది. సమస్యేమిటంటే రైతులలో అత్యధికులు ఇప్పటికీ కనీస మద్దతు ధర గురించి వినలేదు! మోదీ ప్రభుత్వం తీసుకు వచ్చిన మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు నిర్వహించిన చరిత్రాత్మక ఆందోళన కనీస మద్దతు ధరను సాధించలేదు. అయితే కనీస మద్దతు ధర అంశాన్ని ప్రతి రైతు కుటుంబానికి సుపరిచితం చేసింది. కేవలం పెద్ద రైతులకు మాత్రమే కాకుండా వ్యవసాయ కుటుంబాలు అన్నిటికీ కనీస మద్దతు ధర గురించి ఆ ఆందోళన తెలియజరిచింది. రైతులకు మాత్రమే కాకుండా ఇతర సామాజిక వర్గాలకు కూడ ఆ సమస్యను ఎరుక పరిచింది. ఎమ్ఎస్‌పిని పొందడమనేది ప్రతి రైతు హక్కు అనేది రైతు ఉద్యమాల కార్యకర్తలకు బాగా తెలుసు. ఆరెస్సెస్‌కు అనుబంధంగా ఉన్న కిసాన్ సంఘ్ నేతలతో సహా రైతు నాయకులు అందరి ఆలోచనలు మూడు పదాల చుట్టూ తిరుగుతున్నాయి. అవి: ఎమ్ఎస్‌పి, స్వామినాథన్, చట్టబద్ధత. కాంగ్రెస్ ప్రకటనకు ఈ మూడు మాటలే ప్రాతిపదిక.

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌ను మోదీ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఎమ్ఎస్‌పికి చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్‌కు ఆయన విశేష ప్రాచుర్యం కల్పించారు. రైతు ఉద్యమం ఈ విషయాన్ని విస్మరించబోదు. రైతుల చరిత్రాత్మక ఆందోళన ముగిసి రెండేళ్లు గడిచినప్పటికీ కనీస మద్దతు ధర విషయమై మోదీ ప్రభుత్వం సానుకూల నిర్ణయాన్ని తీసుకోలేదు.

ఎన్ఎస్‌పికి చట్టబద్ధత కల్పించే విషయమై కాంగ్రెస్ హామీ సరైన రాజకీయ సమయంలో ఇచ్చింది. సార్వత్రిక ఎన్నికలకు ఇంకా రెండు నెలల వ్యవధి మాత్రమే. ప్రభుత్వం ఈ విషయమై తన వైఖరిని మార్చుకునేందుకు సమయం మించిపోయింది. ఎన్నికల ప్రచార ఘట్టంలో ఈ ఓటర్లు ఈ అంశాన్ని తప్పకుండ గుర్తుంచుకుంటారు. కాంగ్రెస్ హామీని వారు విస్మరించబోరు. మీడియా సైతం రైతుల సమస్యలకు ప్రాధాన్యమివ్వడం అనివార్యమయింది. ‘కనీసమద్దతు ధర’ అంశం మళ్లీ పతాక శీర్షికల్లో ఉన్నది.

కాంగ్రెస్ ప్రకటన రైతు ఉద్యమ కార్యకర్తలకు కూడా ఇంకా చేరలేదు. ఇక సామాన్య రైతుల గురించి చెప్పేదే ముంది? ఢిల్లీ చలో సందర్భంగా పోలీసులతో రైతుల ఘర్షణకు ప్రధాన స్రవంతి మీడియా ప్రాధాన్యమిస్తోంది. అయితే కాంగ్రెస్ ప్రకటన గురించి ప్రస్తావించడం లేదు. మీడియా అలక్ష్యాన్ని అధిగమించి తన హామీ గురించి ప్రతి రైతుకూ తెలియజేసేందుకు కాంగ్రెస్ మరింత కృషి చేయవలసిన అవసరమున్నది.

సరే, మోదీ ప్రభుత్వం తనకు అనుకూలంగా ఉన్న ‘ఆర్థిక వేత్తల’ను కనీస మద్దతు ధరకు చట్టబద్ధత అంశానికి వ్యతిరేకంగా తప్పక మోహరిస్తుంది. ఎమ్ఎస్‌పికి చట్టబద్ధత కల్పించడం సాధ్యం కాదని మోదీ సర్కార్ ఇప్పటికే ప్రచారం చేస్తోంది. దానివల్ల ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతుందని పదేపదే చెప్తుతోంది. ఇది పచ్చి అబద్ధం. నేను, కిరణ్ విస్సా గతంలోనే ప్రభుత్వ వాదనను ఖండించాం, ఎమ్ఎస్‌పి గ్యారంటీని ఎలా అమలుపరచవచ్చో కవిత కురుగంటి సవివరంగా రాశారు.

కనీస మద్దతు ధరను కల్పించి తీరాలి. దీనివల్ల వ్యవసాయ ఉత్పత్తులు అన్నిటిని ప్రభుత్వం సేకరించవలసిన అవసరం లేదు. కనీస మద్దతు ధరను చట్టబద్ధంగా కల్పించేందుకు పెద్ద మొత్తాన్ని వినియోగించవలసి ఉన్న మాట నిజమే. అయితే ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతుందనడం శుద్ధ అబద్ధం. స్థూల దేశీయోత్పత్తిలో ఒక శాతాన్ని రైతులకు ఇవ్వలేరా? ఇది ఎంతో రాజకీయ ప్రాధాన్యమున్న విషయం. రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వడమనేది దేశ భవిష్యత్తులో మదుపు చేయడమే.

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించేందుకు రాజకీయ శ్రేణుల సమీకరణ, విశేష స్థాయిలో రాజకీయ ప్రచారం అవసరం ఎంతైనా ఉన్నది. సరిగ్గా ఈ విషయంలో కాంగ్రెస్‌కు ఒక ఇబ్బంది ఉన్నది. ఎందుకంటే ఆ పార్టీ చాలా కాలంగా రైతుల సమస్యల పరిష్కారానికి పని చేయడం లేదు. రైతు సంఘాలు తనను విశ్వసనీయమైన మిత్రుడుగా పరిగణించేందుకు కాంగ్రెస్ చాలా కృషి చేయవలసి ఉన్నది. అంతే కాకుండా ‘ఇండియా’ కూటమిలోని తన మిత్ర పక్షాల మద్దతును కూడా ఇందుకు పూర్తిగా పొందాలి. ఇదేమంత కష్టమైన విషయం కాదు. సమాజ్ వాది పార్టీ, రాష్ట్రీయ జనతా దళ్, ఎన్‌సిపి మొదలైనవి రైతు అనుకూల పక్షాలే. ‘ఇండియా’ కూటమిలోని మిత్రపక్షాలన్నిటినీ కలుపుకుని నిర్ణయాత్మక ఎన్నికల పోరాటానికి సంసిద్ధమవ్వాలి. మరి దీనివల్ల విజయం సిద్ధిస్తుందా? అన్నది అటుంచితే, ప్రజలకు సంబంధించిన ఒక ప్రధాన సమస్య ప్రాతిపదికన అధికార పక్షానికి గట్టిపోటీ నివ్వడం కచ్చితంగా సాధ్యమవుతుంది.

(వ్యాసకర్త ‘స్వరాజ్ ఇండియా’ అధ్యక్షుడు)

మనిషితనాన్ని ప్రేమించిన కథకుడు

‘తండ్రీ కొడుకుల మధ్య, భార్యాభర్తల మధ్య, సోదరుల మధ్య, ఆత్మీయుల మధ్య బాంధవ్యం అనురాగ బాంధవ్యంగానే కొనసాగాలి తప్ప ఆస్తి సంబంధం కాకూడదు. ఆస్తి సంకెళ్ళకు ఈ అనుబంధం చిక్కకూడదు. ప్రేమానుబంధాలను మించిన ఆస్తి ప్రపంచంలో మరేదీ లేదు. జీవితం కొత్త విలువలతో విశాలం కావాలి. సంకుచితపరిచే ఇరుకు సాంఘికాచారాల పెత్తనం సాగకూడదు. సదాశయాలను ప్రేమించి జీవించడంలో శాంతి, సంతోషాలున్నాయి’ అని త్రికరణశుద్ధిగా విశ్వసించిన కథా రచయిత శ్రీపతి. పూర్తిపేరు పుల్లట్ల చలపతిరావు. పుట్టింది శ్రీకాకుళం జిల్లా భైరిపురంలో. విద్యాభ్యాసం ఇచ్ఛాపురం, విశాఖపట్నం. ఉద్యోగం కొంతకాలం రాష్ట్ర రాజధానిలో, మరికొంత కాలం దేశ రాజధానిలో చేశారు. సృజన కార్యక్షేత్రాలు కూడా ఇవే. కథా ఇతివృత్తాలు మాత్రం దేశవ్యాప్తమైనవి. కథల సందేశం విశ్వజనీనం.

‘బెనారస్ కథలు’, ‘ఎల్లోరాలో’, ‘వాళ్ళు ముగ్గురు’, ‘సత్యజిత్‌రాయ్ ఎవరు?’, ‘మంచు పల్లకి – మరి తొమ్మిది’, ‘శ్రీపతి కథలు’... ఈ పుస్తకాల ద్వారా ఆధునిక తెలుగు సాహిత్యంలో విశిష్టమైన స్థానం సంపాదించుకున్న ప్రతిభావంతుడైన కథా రచనా శిల్పి శ్రీపతి. ఆయన గొప్ప కథా రచయిత మాత్రమే కాదు, నాలాంటి ఎందరో సాహితీవేత్తలను తయారు చేసిన ఒక సాహిత్యక్షేత్రం.

సముద్రం కనబడినా, సముద్రమనే మాట వినబడినా మైమరిచిపోయే సముద్ర హృదయుడి కథల నిండా ప్రకృతి ప్రీతి, అడవులూ, కొండలూ, నదీనదాలు, సూర్యోదయం, సూర్యాస్తమయం, చంద్రోదయం సముచితంగా కనబడుతుంటాయి. ‘ప్రకృతి శోభ ముందు ఏ ఐశ్వర్యమూ, సంపదా, ఏ పదవీ సరితూగదు. ఇంత సుందరమైన పురాతన ప్రకృతి మనకు అర్థంకాని రహస్యం. కొండలు మనం చిత్రాల్లో, ఛాయాచిత్రాల్లో నీలంగా ఉన్నట్లు చూస్తాం. కానీ కొన్నిచోట్ల కొండలు ముదురాకు పచ్చరంగులో ఉన్నట్లు కనబడతాయి. పర్వతారణ్యాలు ఒక అద్భుతం. హృదయానికీ, భౌగోళికమైన అందాలకీ మధ్య జన్మజన్మల అనుబంధం ఉన్నట్లు అన్పిస్తుంది.’... ఇదీ శ్రీపతిగారి భావుకత. సాధారణంగా కవి హృదయంలో ప్రతిఫలించే అనుభూతి – గాఢత కథా రచయితలో అడుగడుగునా కనబడుతూ పాఠకులను మంత్రముగ్ధలను చేస్తుంది.



గత అర్ధ శతాబ్ద కాలంగా గ్రామాల్లోనూ, నగరాల్లోనూ జరుగుతున్న పరిణామాలు, మానవ మనస్తత్వాలపై వాటి ప్రభావాల విశ్లేషణ శ్రీపతి కథల ముడి సరుకు. ఒకవైపు ఆధునికత శరవేగంగా జీవితాల్లోకి, కుటుంబాల్లోకి దూసుకు వస్తున్నా, మరోవైపు మనల్ని వదలకుండా పట్టుబిగిస్తున్న కులం, కట్టుబాట్లు, మూఢవిశ్వాసాలు, కట్టుకథల ప్రచారం, ద్వంద్వ విలువలు వంటివాటిని చక్కటి కథాకథనంతో, సహజ సిద్ధ వాడుక భాషలో కథలుగా రచించిన ఉత్తమ కథకుడు శ్రీపతి.

గత అర్ధ శతాబ్దకాలంగా గ్రామాల్లోనూ, నగరాల్లోనూ జరుగుతున్న పరిణామాలు, మానవ మనస్తత్వాలపై వాటి ప్రభావాల విశ్లేషణ శ్రీపతిగారి కథల ముడి సరుకు. ఒకవైపు ఆధునికత శరవేగంగా జీవితాల్లోకి, కుటుంబాల్లోకి దూసుకు వస్తున్నా, మరోవైపు మనల్ని వదలకుండా పట్టుబిగిస్తున్న కులం, కట్టుబాట్లు, మూఢ విశ్వాసాలు, కట్టుకథల ప్రచారం, ద్వంద్వ విలువలు వంటి వాటిని చక్కటి కథాకథనంతో, సహజసిద్ధ వాడుక భాషలో కథలుగా రచించిన ఉత్తమ కథకుడు శ్రీపతి. మనిషినీ, మనిషిలోని మనిషితనాన్ని ప్రేమించే ఉదాత్త లక్షణం ఆయన కథలకు జీవనాడి.

ఇక ఆయన వ్యక్తిత్వం విషయానికి వస్తే, ఒక తరాన్ని ప్రభావితం చేసిన ఉత్తమ ఉపాధ్యాయులు. శిష్యులపై అపారమైన ప్రేమను వర్షించిన సహృదయులు. 1969లో హైదరాబాద్ పాతనగరంలోని లాల్ దర్వాజాలో వెంకట్రావ్ స్మారకోన్నత పాఠశాలలో ఆంగ్ల భాషా ఉపాధ్యాయులుగా ఉద్యోగంలో చేరారు. తరగతి గదిలోకి రాగానే ‘మహాప్రస్థానం’లోని ఒక కవితా ఖండిక చదివి వినిపించేవారు. అయిదు నిమిషాలపాటు ఆనాటి దినపత్రిక హెడ్‌లైన్స్ చదివేవారు. ఆ తరువాత పాఠం బోధించేవారు. నేను అప్పుడు తొమ్మిదో తరగతి విద్యార్థిగా ఆ స్కూల్‌లోనే చదువుతున్నాను. ఆ రకంగా శ్రీపతిగారు నాకు ప్రత్యక్ష గురువు. నేనప్పుడు రాష్ట్రీయ స్వయం సేవక సంఘంలో చురుకైన కార్యకర్తను. బాలల దళానికి శిక్షకుడిని. మాష్టారు కమ్యూనిజం చెబుతున్నారని తరగతిలోనే ఒకసారి ఆయనతో వాదనకు దిగాను. ఆయన కోపగించుకోలేదు. ఓపికగా నా ప్రశ్నలన్నింటికీ సమాధానాలు చెప్పారు. ఆ తరువాతి రోజు స్కూల్ వేళలు పూర్తయ్యాక నా భుజం మీద చేయివేసి, మా ఇంటి కొస్తావా? అని అడిగారు. నేను సరేనని, నారాయణగుడాలోని ఆర్‌బీవీఆర్ రెడ్డి మహిళా కళాశాలకు ఎదురుగా ఉన్న సందులో ఆయనతోబాటు ఆయన గదికి వెళ్ళాను. గది తెరిచి ఉంది. జ్వాలాముఖి టీ కాస్తున్నాడు. నిఖిలేశ్వర్ బిస్కట్లు తింటున్నాడు. ఆర్టిస్ట్ చంద్ర తను రూపొందించిన సినిమా పోస్టర్‌ను మిత్రులకు చూపెట్టడానికి తెచ్చాడు. వాళ్ళంతా శ్రీపతి సార్ మిత్రులని తెలిసి ఆశ్చర్యపడ్డాను. అరగంటసేపు వాళ్ల కబుర్లు విని, ‘సరేసార్! వెళ్లొస్తా’నని లేచాను. ఆగు ఒక్క నిమిషం! అని తన బుక్‌షెల్ఫ్‌లోంచి మాక్సింగోర్కీ రాసిన ‘అమ్మ’ నవల తీసి నాకు ఇచ్చి, చదివి ఇమ్మన్నారాయన. ఇంటికెళ్లాక నవల చదవడం మొదలుపెట్టాను. నవల పూర్తిగా అర్థం కాలేదు కానీ మెదడంతా గందరగోళమయింది. అప్పటిదాకా నాకు తెలిసిన ‘జంబూద్వీపే భరతఖండే’కు ఆవల ఒక పెద్ద ప్రపంచముందని అర్థమయింది. వారం రోజుల్లో నవల చదివి శ్రీపతి గారికిచ్చాను. ఆయన ‘మహాప్రస్థానం’ చదవడానికిచ్చారు. ఆ తరువాత ‘రక్తాక్షరాలు’, ‘ఉక్కుపాదం’, ‘చెంఘీజ్‌ఖాన్’ నవలలు. క్రమంగా కథా సంపుటులు, కవితా సంకలనాలు ఇచ్చి నాతో చదివించారు. నా అభిప్రాయాల్లో మార్పు వచ్చింది. ఆరెస్సెస్ శాఖా కార్యక్రమాలకు వెళ్ళడం మానేశాను. పుస్తక పఠనంపై ఆసక్తి కలిగింది. చిన్నచిన్న కవితలు రాయడం మొదలుపెట్టాను. 1970లో నేను పదవతరగతి కొచ్చాను. శ్రీపతి గారే మాకు ఆంగ్ల ఉపాధ్యాయుడు. ఒకరోజు పాఠం చెబుతున్న ఆయన కంట్లో నోటుబుక్‌లో నేను రాసుకున్న కవిత ‘మానవత్వాన్ని రక్షించుకుందాం’ పడింది. ఆయన చదివారు. ఎవరు రాశారు? అని అడిగారు. ‘నేనే’ అని బదులిచ్చాను. ఆశ్చర్యపడ్డారు. ఫెయిర్ కాపీ రాసివ్వమన్నారు. రాసిచ్చాను. కరీంనగర్ నుండి ఆ రోజుల్లో వెలువడుతున్న ‘విద్యుల్లత’ మాసపత్రికకు ఆయనే పంపారు. అది ఏప్రిల్ నెల సంచికలో బహుమతి పొందిన కవితగా అచ్చయింది. అప్పటికే ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సందర్భంలో మా ‘విప్లవశంఖం’ గేయ వాహిని వెలువడింది. అవి ఉద్యమగీతాలు. అచ్చయిన నా మొదటి వచన కవిత శ్రీపతిగారి ప్రమేయంతోనే ప్రచురింపబడింది.

ఇలా ఎందరో విద్యార్థులు మార్క్సిజం భావజాలం పట్ల ఆకర్షితులు కావడానికి శ్రీపతి ఉత్ప్రేరకంగా పనిచేశారు. ఉపాధ్యాయ వృత్తిని వదిలేసిన తరువాత ఆకాశవాణి ఢిల్లీ కేంద్రం నుంచి జాతీయ వార్తలు చదివే న్యూస్ రీడర్‌గా కొంతకాలం పాటు పనిచేసి, అపారమైన మిత్ర సంపదను సంపాదించుకున్నారు. తరువాత హైదరాబాద్ నగరంలో స్థిరపడ్డారు. శ్రీపతిగారితో అర్ధ శతాబ్దానికిపైగా కొనసాగిన నా అనుబంధాన్ని గమనించిన గుంటూరు అభ్యుదయ రచయితల సంఘం మిత్రులు, ముఖ్యంగా పెనుగొండ లక్ష్మీనారాయణ నా చేత ‘శ్రీపతి కథలు’ సంపుటిని రూపొందింపజేశారు. శ్రీపతి దిగంబర, విప్లవ కవులకు సన్నిహితమిత్రులు, విరసం వ్యవస్థాపకుల్లో ఒకరు. ఒక ఆదర్శ ఉపాధ్యాయుడు, గొప్ప కథా రచయిత శ్రీపతి మరణం తెలుగు సాహిత్య రంగానికి తీరని నష్టం.

▪ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ

నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష...!

కేయూరాణి న భూషయంతి పురుషం హారా న చంద్రోజ్జ్వలాః... అని చెప్తూ... వాగ్భూషణం భూషణమ్.. అంటున్న ఈ శ్లోకం ఎక్కడో విన్నట్లు అనిపిస్తోంది కదూ! మూడు పదుల ఏండ్లకు లోపు ఉన్నవారికి పెద్దగా తెలియకపోవచ్చు కానీ, ఓ ముప్పై ఏండ్ల కిందటి తరానికి రేడియోలో వచ్చే ఈ శ్లోకం బాగా గుర్తే. “ఎన్ని సుగంధాలు పూసుకున్నా... చక్కని వాక్కు మించిన అలంకారం లేదు సుమా” అని దీని సారాంశం.

ఇప్పుడీ విషయం ఎందుకొచ్చిందంటే... మన రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకులు చెప్తున్న నీతుల వల్లనే. తెలంగాణ భాషకు ఇంపు, సొంపు దాని పలుకుబడుల ద్వారానే వస్తుంది. అంతే కాని తెచ్చిపెట్టుకున్న అలంకారాల వల్ల రానే రాదు. అందునా భాష వాడకంలో కూడా వ్యవసాయంలో ఉన్న వారి భాష ఉత్పత్తి భాష. అది జీవద్భాష. అందుకే కాళ్ల భూమిపై ఉన్న వారు సహజంగానే తమ జీవితానుభవ భాషను ఉపయోగిస్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాడిన ‘రండ’ అనే పదాన్ని మాజీ ముఖ్యమంత్రిని సంబోధిస్తూ అన్నారని బీఆర్ఎస్ నాయకులు ఎగిరెగిరిపడుతున్నారు. చాలా కాలం ప్రజాప్రతినిధులుగా ఉన్న మరి కొందరు నాయకులు చెప్పులు చూపించారు. ఇంకొక మాజీ ప్రతినిధి మరింతహీనమైన భాషతో తమ నాలుకకు నరం లేదని, చదువుకున్న సంస్కారం కూడా లేదని నిరూపించుకున్నారు. మూడేళ్ల క్రితం కేంద్ర మంత్రిని ఉద్దేశించి మాజీ ముఖ్యమంత్రి ఇదే మాటను వాడిన విషయం వారు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారు.



మాజీ ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఏమిటా మాటలు అంటూ దీర్ఘాలు తీస్తున్న అపర సంస్కారులు ఇప్పుడూ ఉన్నారు, సరిగ్గా మూడు నెలల క్రితం కూడా ఇక్కడే ఉన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రిని, అధికార పార్టీని దద్దమ్మలు, చవటలు అని మాట్లాడితే మాత్రం వారికి చెవులు వినపడవు, కళ్లు కన్పించవు. అంతేకాదు... సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఏం పీకడానికి మేడిగడ్డ సందర్శనకు వెళ్లావని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగసభలోనే వ్యాఖ్యానించారు. ఓ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ముఖ్యమంత్రి గురించి ఇట్లా మాట్లాడొచ్చునా? ఇది ఆయన సభ్యతకు తగునా? ఒకరి విషయంలో గౌరవాలు, మరొకరి విషయంలో అగౌరవాలు ఆమోదనీయమేనా? ఒకే రీతి న్యాయం ఉండదా? ఈ ప్రాథమిక విషయాన్ని ఎందుకు గుర్తించడం లేదు. ఆ సంస్కారులకు కేసీఆర్ ఏది మాట్లాడినా వినసొంపుగా ఉంటున్నది ఎందుకు...? తెలంగాణభాష, యాస కేసీఆర్‌కు మాత్రమే స్వంతం అనే అభిప్రాయం ఎందుకు ఉందో అర్థం కాదు. చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారి ప్రవచనాల్లో ఇలాంటివారికి సంబంధించి ఒక ఉదాహరణ ఉంది. వేలాది శస్త్రచికిత్సలు చేసిన ఒక వైద్యునికి ఒకసారి శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. వైద్యుడు ఆ నొప్పిని భరించలేకపోతూ ‘అయ్యో... నేను వేలాది ఆపరేషన్లు చేసానే, ఎన్నడూ ఇంత నొప్పిని ఎరుగకపోతిని’ అని వాపోయాడట. కేసీఆర్, ఆయన వందిమాగధులు చేస్తున్న వాదన కూడా అట్లనే ఉంది. కేసీఆర్ ఉద్యమ ముసుగులోనూ, ఆ తర్వాత కూడా నోరు పారేసుకుంటే ఈ భాషా సంస్కారులు మురిసిపోయిన సంగతి చూసినం. కేసీఆర్, ఆయన పరివారం ఎవ్వరినైనా ఏమైనా అనొచ్చు. కానీ వాళ్ళను ఎవ్వరూ ఏమీ అనకూడదు! ఈ తరహా పోకడ సరైందేనా?

తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు సీమాంధ్ర నాయకులనుద్దేశించి కేసీఆర్ మాట్లాడిన భాష గురించి తెలంగాణ ప్రజలు అప్పట్లో పెద్దగా పట్టించుకోలేదు. కేసీఆర్ ఏం మాట్లాడినా ఆ రోజున్న ఉద్యమ అవసరాల రీత్యా తెలంగాణ సమాజం ఆయన వెన్నంటి నిలబడింది. పదేళ్ల పాటు తెలంగాణను పాలించారు, మార్గదర్శినని చెప్పుకున్నారు, కానీ మాటల పోకడ మాత్రం మారలేదు. పుస్తక పఠనం మనిషిని సున్నితంగా మారుస్తుంది. అటువంటప్పుడు, 80 వేల పుస్తకాల మహా చదువరి ఎలా ఉండాలి? కానీ మాజీ సీఎం కేసీఆర్ మాటల తీరు అట్లా ఉందా? భాషను ఎప్పుడు ఎట్లా వాడాలో బాగా తెలిసిన ఆయన, తన స్థాయిని తగ్గించుకునేలా నల్లగొండ సభలో ‘పాలిచ్చే బర్రెను కాదని... దున్నపోతును తెచ్చుకున్నారు’ అని వ్యాఖ్యానించారు. ఇలా ప్రజలను తప్పుబట్టడం వారి స్థాయికి తగునా? రాజకీయ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడితే జనం మెచ్చరు. నోటికొచ్చిందల్లా మాట్లాడి... చెప్పులు చూపించి, ఛీంకరించి, గర్జించి, జనాలను భయపెట్టాలని చూస్తే అది సరికాదు. మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయిన వేదనతో అట్లా మాట్లాడారని సరిపెట్టుకునేందుకూ వీలు లేదు. రాజకీయాల్లో మంచి నిర్ణయాలే కాదు, మంచి వచనం కూడా ఉండాలి.

“భూషలు కావు మర్త్యులకు భూరి మయాంగద తార హారముల్...” అంటూ ఏనుగు లక్ష్మణ కవి మంచిగా మాట్లాడటమే మనిషికి అలంకారం అన్నాడు. దేవుడు నోరిచ్చాడు, మాట ఇచ్చాడు, ఆలోచన ఇచ్చాడు... కాస్త నాలుగు మంచి మాటలు మాట్లాడితే సరిపోయేది కదా అంటాడు. ఇక ఆలోచించుకోవాల్సిందే.. విజ్ఞులైన విపక్ష నాయకులే. తాము ఒకప్పుడు ఉండిన స్థానంలో నేడు మరొకరున్నరు. తాము కోరుకున్న గౌరవ మర్యాదలనే మరొకరు కోరుకుంటారని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

○ బోరెడ్డి అయోధ్యరెడ్డి
తెలంగాణ ముఖ్యమంత్రి సీపీఆర్ఓ

అంచనాలను మించిన చక్కని పాలన

కాంగ్రెస్ అంటే అంతర్గత కుమ్ములాటలు, మితిమీరిన ప్రజాస్వామ్యం, నిత్య అసంతృప్తుల కూటమి... వగైరా విమర్శలన్నింటినీ నేడు చెత్త బుట్టలో పడేయాల్సిందే! అంత చక్కగా ఉంది రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో సమన్వయం. వారి ఐకమత్యం ఇప్పుడు ప్రత్యర్థులకు కొరకరాని కొయ్య. అది తెలంగాణకు శ్రీరామ రక్ష. ఎవరి కర్తవ్యాన్ని వాళ్ల నిబద్ధతతో నిర్వర్తిస్తూ, అవతలి వాళ్ల పరిధుల్ని గౌరవిస్తూ, పరస్పరం సహకరించుకుంటూ బాధ్యతగా వ్యవహరిస్తున్నారు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు, ముఖ్యంగా ముఖ్యమంత్రి, ఆయన మంత్రి వర్యులు. దీనికి చక్కని ఉదాహరణ ఇటీవలి దావూస్ పర్యటన, అక్కడి నుంచి తెచ్చిన దాదాపు రూ.40వేల కోట్ల పెట్టుబడులే! ఈ భరోసా చాలు కదా– రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి ఢోకా ఉండదని, అభివృద్ధీ సంక్షేమం నిరాటంకంగా కొనసాగుతాయని నిశ్చింతగా ఉండడానికి! ఆరు గ్యారెంటీల్లో ఒకటైన స్త్రీలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని చిన్న అడ్డంకి కూడా లేకుండా చక్కగా అమలు చేస్తూ, మిగతా గ్యారంటీల సత్వర అమలు దిశగా ప్రభుత్వం తెలంగాణలో సుస్థిర సంక్షేమ ప్రగతి ప్రభుత్వం పట్ల అపార విశ్వాసాన్ని పెంపొందిస్తున్నారు.

ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, ముఖ్యమైన పోర్ట్‌ఫోలియోలతో భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు వంటి సీనియర్ నేతలు అధికార బాధ్యతలు చేపట్టే నాటికి తెలంగాణ అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్నది. ఆ విపత్కర పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని తప్పించి, సంక్షేమ హామీలను నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథం దిశగా నడిపించేందుకు కసరత్తు మొదలుపెట్టారు రేవంత్. అందులో భాగంగా అవినీతికి తావులేని అధికారగణం నియామకం మీద దృష్టి సారించారు. నిజాయితీపరులుగా పేరున్న అధికారులకు ముఖ్య బాధ్యతలను అప్పగించారు. కుదేలైన రాష్ట్ర ఆర్థిక రంగాన్ని ప్రక్షాళన చేయడానికి ఈ ఉన్నతాధికారుల సహకారం చాలా అవసరమని గ్రహించిన ముఖ్యమంత్రి ఈ దిశగా మొదటి అడుగువేశారు. వీరి ద్వారా గత ప్రభుత్వపు పొరపాట్లను బేరీజు వేసుకుంటూ, కొత్త తప్పులు దొర్లకుండా అప్రమత్తమవుతూ ఆర్థిక వ్యవస్థను మెరుగుదిద్దడానికి నడుం కట్టారు. అందులో భాగంగానే బకాయిల వసూలు, కొత్త ఆర్థిక వనరుల అన్వేషణ చర్యలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతున్న కొద్దీ ఒక్కొక్క హామీనీ అమల్లో పెడుతూ వస్తున్నారు ముఖ్యమంత్రి. అందులో భాగంగానే మొదట చిన్నకారు, సన్నకారు రైతులకు ‘రైతుబంధు’ అందజేయడం. ఈ కార్యాచరణతో ‘కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రైతు బంధు ఆగిపోతుంది, కరెంట్ ఉండదు’ వంటి ప్రచారాలను అసత్యాలుగా తేల్చుతున్నారు.

గత ప్రభుత్వం మాటిచ్చి తప్పిన హామీలకూ న్యాయం చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్తున్నారు. ముఖ్యంగా ఎన్నారై పాలసీ, ఎన్నారై సంక్షేమం విషయంలో గత ప్రభుత్వం ఉపన్యాసాలకే పరిమితమైంది. ఇప్పుడు రేవంత్ రెడ్డి ఆయా పాలసీలను నెరవేర్చేందుకు సిద్ధమయ్యారు. అంతేకాదు, ప్రవాసీ తెలంగాణీయుల చేత ఇక్కడ పెట్టుబడులు కూడా పెట్టించి వాళ్ల ద్వారా సొంత రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంచేలా చేస్తున్నారు.

ఎవరి కర్తవ్యాన్ని వాళ్లు నిబద్ధతతో నిర్వర్తిస్తూ, పరస్పరం సహకరించుకుంటూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలంతా ముందుకు సాగుతున్నారు. ఈ క్రెడిట్ పూర్తిగా ముఖ్యమంత్రిదే. పాలనలో పారదర్శకత, హామీల అమలులో చిత్తశుద్ధి రేపటి లోక్‌సభ ఎన్నికలకు ప్రచారం అక్కర్లేని అస్త్రాలు.



ప్రభుత్వం భర్తీ చేయగల ఉద్యోగాల పట్లా కార్యాచరణను వేగవంతం చేస్తున్నారు ముఖ్యమంత్రి. అందులో భాగంగానే ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మండలానికో గురుకుల పాఠశాల ఏర్పాటు మీద కసరత్తు మొదలుపెట్టారు. పాఠశాలలను పెంచితే ఉపాధ్యాయుల నియామకమూ జరుగుతుంది. ఇక, 18 జిల్లాల ఏర్పాటు పట్ల రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయ దృక్పథంతో, ధోరణితో ఉన్నది. ఇప్పుడున్న జిల్లాలకు అవసరమైన యంత్రాంగం, అధికార గణం లేదు. అశాస్త్రీయ విభజనతో పాలనా విషయంలో ఇటు అధికారులు, పాలనా సౌకర్యం విషయంలో అటు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. శాస్త్రీయ ఏకీకరణ ఈ రెండు సమస్యలను తీర్చే పరిష్కారంగా ఉందని అధికారులు, మేధావులు, ప్రజలు కూడా అభిప్రాయపడుతున్నారు. అందరూ ముఖ్యమంత్రి ఆలోచనను సమ్మతించడానికి కారణం ఆయన అవలంబిస్తున్న పారదర్శకతే. ప్రజాస్వామ్యానికి పారదర్శకతే ఆయువుపట్టు.

తెలంగాణ పోరులో అసువులు బాసిన అమరవీరుల స్మరణకు స్థూపాలు సరే, వారి కుటుంబాలకు ఆసరా కూడా కావాలి కదా! అందుకే అమర వీరుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి కల్పించే విషయంపై శ్రద్ధపెట్టారు రేవంత్ రెడ్డి. అంతేకాదు, ఉద్యమకారులకూ న్యాయం చేయాలనే ఆలోచన చేశారు. ఆరు గ్యారెంటీల దరఖాస్తు ఫారంలో ఉద్యమకారులకు ఇస్తామన్న 250 గజాల స్థలానికి ఒక కాలమ్ కేటాయించారు. ఆరు గ్యారెంటీలూ అచ్చంగా అర్హులకే చేరాలన్న లక్ష్యంతో ప్రజల వద్దకే ప్రభుత్వ యంత్రాంగం వచ్చి దరఖాస్తులను స్వీకరించింది. అత్యంత విజయవంతంగా సాగిన కార్యక్రమం ఇది. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ విషయంలో యువతకు ఇచ్చిన మాట మరువలేదు రేవంత్ రెడ్డి. అధికార బాధ్యతలు చేపట్టిన వెంటనే కమిషన్‌లోని అవకతవకలను సరిచేసేందుకు రంగంలోకి దిగారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారిని చైర్మన్ పదవికి నిర్ణయించారు. ఇతర కమిషన్స్, కార్పొరేషన్స్ పదవులను కూడా ప్రజాజీవితంలో ఉండి వచ్చిన వారికి ఇస్తే ప్రజల సమస్యలు, పాలనా బాధ్యతలు సరిగా తెలుస్తాయని వారికే ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు ముఖ్యమంత్రి. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ నేతలంతా ముందుకు సాగుతున్నారు. ఈ క్రెడిట్ పూర్తిగా ముఖ్యమంత్రిదే. ఈ సంయమనం, సమష్టి బాధ్యత ఎన్నికల సమయంలోనే మొదలైంది. అది ఇప్పటికీ కొనసాగుతున్నది. ఇవన్నీ కాంగ్రెస్‌కు కలిసొచ్చే విషయాలే, ప్రభుత్వాన్ని సుస్థిరపరచే అంశాలే. ఈ సానుకూలత, పారదర్శకత, హామీల అమలులో చిత్తశుద్ధి రేపటి లోక్‌సభ ఎన్నికలకు ప్రచారం అక్కర్లేని అస్త్రాలుగా మారుతాయి, కాంగ్రెస్ గెలుపును ఖాయం చేస్తాయి.

• డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు
మాజీ ప్రధాన సమాచార కమిషనర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్

కాలుష్య రహిత జాతర కలేనా?



వరంగల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడారం మహాజాతరపై కాలుష్యం పడగ విప్పుతోంది. లక్షలాది మంది భక్తులు వచ్చే మహాజాతరలో వాహన కాలుష్యంతో పాటు దుమ్ము, కట్టెల పొయ్యి పొగ భక్తులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. సాధారణంగా పీల్చుకునే గాలి కంటే జాతర సమయంలో 3నుంచి 5రెట్లు గాలి కలుషితం అవుతుందని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. 2020, 2022లో మేడారం జాతరలో గాలితోపాటు జంపన్నవాగు నీటిపై కాలుష్య నియంత్రణ మండలి వరంగల్ బృందం పరిశోధనలు చేస్తోంది. జంపన్నవాగులో నీరు ప్రవాహం ఉండటంతో పెద్దగా కలుషితం కావటం లేదు. కానీ, గాలిలో మాత్రం కాలుష్యం విపరీతంగా పెరిగి చిన్నపిల్లలు, వృద్ధులు, గుండె, అస్తమా రోగులకు ప్రమాదకరంగా మారనుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాలుష్యం పెరగకుండా ముందు జాగ్రత్తలపై ప్రభుత్వం దృష్టిసారిస్తేనే భక్తుల ఆరోగ్యానికి భరోసా ఉంటుంది.

కాలుష్యం కట్టడికి కానరాని చర్యలు

మేడారం మహాజాతరకు ఏటా కోటిన్నర మంది భక్తులు వస్తారని ప్రభుత్వం ప్రకటిస్తుంది. అలాగే ఐదారు రాష్ట్రాల నుంచి భక్తులు 8లక్షలకు పైగా ప్రవేటు వాహనాలను మేడారం తీసుకవస్తున్నారు. వీటితో పాటు ఈ ఏడాది ఆరువేల ఆర్టీసీ బస్సులు జాతరకు రానున్నాయి. ద్విచక్ర వాహనాలు వేలల్లో జాతర దారిపట్టనున్నాయి. జాతరకు పెద్దసంఖ్యలో వచ్చే వాహనాలతో పొగ కాలుష్యం జాతరను ముంచెత్తుతుంది. వాహనాల రాకపోకలతో విపరీతమైన దుమ్ము లేచి గాలిలో కలిసిపోతుంది. ఇదే గాలిని ప్రాణవాయువుగా పీల్చుకుని భక్తులు లేనిపోని రోగాలను తెచ్చుకుంటున్నారు. మేడారం జాతర ప్రాంగణం నుంచి నార్లాపూర్, చింతల్, హెలీప్యాడ్ ప్రాంతం, కన్నెపల్లి, ఊరట్టం, జంపన్నవాగు, తాడ్వాయి వెళ్లే దారి, ఆర్టీసీ బస్టాండ్ ఏరియాల్లో వాహనాల పార్కింగులతో భారీగా దుమ్ములేస్తుంటుంది. అలాగే జాతరకు వచ్చే భక్తులు కట్టెల పొయ్యి మీద వంటలు చేసుకుంటారు. ఈ కట్టెల పొయ్యితో వచ్చే పొగ క్యాన్సర్‌కు దారి తీసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- వాహనాల రద్దీ, జాతరలో వెలిగించే కట్టెల పొయ్యిలే ప్రధాన కారణం
- సాధారణ గాలికంటే 3 నుంచి 5 రెట్లు అధికంగా పొల్యూషన్
- చిన్నపిల్లలు, అస్థమా, గుండె వ్యాధి బాధితులకు తీవ్ర ఇబ్బందులు
- గ్యాస్, కమ్యూనిటీ కిచెన్లను ప్రోత్సహించాలని నిపుణుల సూచన

ముంచెత్తుతున్న కాలుష్యం

మేడారం జాతరలో కాలుష్యం సాధారణంగా ఉండే దానికంటే అధికంగా మూడు నుంచి ఐదు రెట్లు ఎక్కువగా ఉంటుంది. సాధారణం గా నేషనల్ యాం బి యంట్ ఎయిర్ క్వాలిటీ స్టాండర్డ్ (ఎన్‌ఏ ఏక్యూఎస్) ప్రకారం 10 పీఎం (10 మైక్రో మీటర్ల కంటే తక్కువ ఏరోడైనమిక్ వ్యాసం కలిగిన పర్టిక్యులేట్ మ్యాటర్) కంటే 3 నుంచి 5 రెట్లు ఎక్కువ గా ఉన్నట్లు కాలుష్య నియంత్రణ మండలి గుర్తించింది. 2020 మహాజాతర సందర్భంగా గాలి కాలుష్యంపై శాంపిల్స్ సేకరించారు. జాతరకు వారం ముందు, జాతర జరిగే నాలుగు రోజులు, జాతర ముగిసిన వారం రోజులకు ఈ శాంపిల్స్ సేకరించారు. గత జాతరలో గాలి నాణ్యత సూచిక (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్-ఏక్యూఐ) 50పీఎంలోపు ఉంటే లోపు ఎలాం టి ప్రమాదం ఉండదు. కానీ, 51 నుంచి 400ఏక్యూఐ ఉంటే సున్నితమైన వ్యక్తులు, చిన్న పిల్లలకు శ్వాస ఇబ్బందులు ఎదురవుతాయని, ఊపిరితిత్తులు, గుండె జబ్బులు, చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు పడతారని, దీర్ఘకాలం శ్వాసకోశ వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 401కంటే ఎక్కువ ఏక్యూఐ ఉంటే ఆరోగ్యవంతులు కూడా అనారోగ్యం పడే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని కాలుష్య నియంత్రణ అధికారులు పేర్కొంటున్నారు. 2020 జాతరలో గాలి నాణ్యత సూచిక 327 పీఎం నుంచి 408 వరకు నమోదైంది. సాధారణంగా కంటే 3 నుంచి 5రెట్లు అధికంగా గాలి కలుషితమైనట్లుగా అధికారులు గుర్తించారు. 2022 జాతరలో గాలి కాలుష్యంపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు శాంపిల్స్ తీయలేదని సమాచారం. ప్రస్తుతం మళ్లీ జాతరకు సంబంధించి శుక్రవారం నుంచి గాలి కాలుష్యంపై పరీక్షలు చేసేందుకు కాలుష్య నియంత్రణ మండలి సిద్ధమైంది. ప్రస్తుతం వాహనాల సంఖ్య భక్తుల సంఖ్య భారీగా పెరుగుతోంది. దీంతో ఈసారి మరింత గాలి కాలుష్యం పెరిగే అవకాశాలు ఉన్నట్లుగా పర్యావణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పొగ, దుమ్ముతో మేడారంలో గాలి కలుషితం

ప్రభుత్వం దృష్టి పెడితేనే..

ప్రభుత్వం మహాజాతరలో ప్లాస్టిక్‌పై ఎక్కువ ఫోకస్ చేస్తుంది. ప్రతీ జాతరకు ఫ్రీప్లాస్టిక్ జాతర అంటూ ప్రచారం చేయడం.. జాతర ప్రారంభం కాగానే పట్టించుకునే వారు ఉండరు. అయితే అత్యంత ప్రమాదకరమైన గాలి కాలుష్యంపై ఎవరూ దృష్టి పెట్టడం లేదు. ప్రధానంగా ఈ గాలి కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రజల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ప్రధానంగా వాహనాల రాకపోకల నేపథ్యంలో దుమ్ము లేవకుండా నిత్యం నీటిని రోడ్లపై చల్లుతూ ఉండాలని, అలాగే మురికి రోడ్లపై కంకర వేయటం, దుర్గంధం వెదజల్లకుండా చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే ఎక్కువ పొగను వెదజల్లే వాహనాలను జాతరకు రాకుండా కట్టడి చేయాలని, కట్టెల పొయ్యిపై వంటలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకోవాలని పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు. కట్టెల పొయ్యికి బదులుగా గ్యాస్‌ను వినియోగించేలా చూడాలని, అడవులను నరికివేయకుండా చూడాలని కోరుతున్నారు. అలాగే జాతర గద్దెలకు దూరంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని, ఆ పార్కింగ్ స్థలాలు కూడా విశాలంగా ఉండటంతో పాటు అందులో తారురోడ్లు లేదా సీసీ రోడ్లు వేసేలా చర్యలు తీసుకోవాలని, దీంతో దుమ్ము లేచే అవకాశాలు తగ్గుతాయని నిపుణులు సూచిస్తున్నారు.

గద్దెల సమీపంలోని హోటళ్లలో కట్టెల పొయ్యిల వాడకంపై నిషేధం విధించాలని, కిరోసిన్‌తో కూడా వంటల తయారీని నియంత్రించేటువంటి చర్యలతో కాలుష్య ప్రభావాన్ని తగ్గించవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కమ్యూనిటీ కిచెన్‌లను ప్రోత్సహించటంతో కూడా కొంతవరకు కాలుష్యాన్ని తగ్గించవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెడితేనే మహాజాతరలో కాలుష్యాన్ని తగ్గించి భక్తుల ఆరోగ్యాన్ని కాపాడినట్లు అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మొత్తానికి భక్తులకు తెలియకుండానే మేడారం మహాజాతరలో కాలుష్యం విషపూరితమై మానవ జీవనంపై ప్రభావం చూపిస్తుందని, కాలుష్యాన్ని కంట్రోల్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్లాస్టిక్‌ఫ్రీ జాతరగా నిర్వహించాలి

పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

వివరాలు 4లో..



జనం.. వనం బాట..

భక్తులతో కిక్కిరిసిన గద్దెల ప్రాంగణం

లక్షలాదిగా మేడారం తరలొస్తున్న భక్తులు

మహా జాతరకు సమయం సమీపిస్తోంది. బుధవారం జరిగిన మండమెలిగే పండుగతో జాతర సందడి రెట్టింపయ్యింది. ఇప్పటికే నెలరోజులుగా ముందస్తు మొక్కులు చెల్లించుకునేందుకు సమ్మక్క సారలమ్మ గద్దెల చెంతకు తరలొస్తుండగా.. ఆ రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. ఇప్పటివరకు 30లక్షలమంది అమ్మవార్లను దర్శించుకుని ఉంటారని, గురువారం లక్షమందికి పైగా వచ్చారని దేవాదాయశాఖ అధికారులు చెబుతున్నారు. జనం వనం బాట పడుతుండటంతో మేడారం ప్రాంతం సందడిగా మారుతోంది. ఓ వైపు భక్తులు ఏర్పాటు చేసుకుంటున్న తాత్కాలిక గుడారాలు, చిరు వ్యాపారుల అంగళ్లతో కళకళలాడుతోంది. మరోవైపు 21వతేదీ నుంచి నాలుగురోజులపాటు సాగే ఈ గిరిజన కుంభమేళాకు కోటి మందికిపైగా వస్తారని అంచనా వేస్తున్న అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కొలువుదీరిన మహాజాతర ఉత్సవ కమిటీ

- 15 మందితో ప్రమాణ స్వీకారం
- హాజరైన మంత్రి సీతక్క



సీతక్కతో ప్రమాణ స్వీకారం చేసిన మహాజాతర ఉత్సవ నూతన కమిటీ

మేడారం, ఫిబ్రవరి 15 : మహాజాతర ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం మేడారంలో గురువారం అట్టహాసంగా జరిగింది. పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతరను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికన ఉత్సవ కమిటీని నియమించింది. ఈనెల 12 నుంచి 25వరకు దీని కాలపరిమితిని నిర్ణయించింది. కమిటీ చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్, డైరెక్టర్లుగా 13 మందితోపాటు ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ప్రధాన పూజారి జగ్గారావును నియమించారు. మొత్తం 15మందితో జాతర ఉత్సవ కమిటీ కొలువుదీరింది. మంత్రి సీతక్క సమక్షంలో దేవాదాయశాఖ మేడారం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం ఈ కార్యవర్గానికి ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. భక్తులకు సకల సౌకర్యాలు రూపకల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 110 కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు. కోటి 50లక్షలకు పైగా భక్తజనం మహాజాతరకు తరలివచ్చి సమ్మక్క, సారలమ్మలను

మిగతా 4వ పేజీలో..

సంత్ సేవాలాల్ బోధనలను అనుసరించాలి..

- అదనపు కలెక్టర్ మహేందర్‌జీ
- గిరిజన భవన్‌లో ఘనంగా జయంత్యుత్సవాలు



భోగ్ బండారోలో సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న మహేందర్‌జీ, బంజారా నేతలు

వడ్డేపల్లి, ఫిబ్రవరి 15: బంజారాల ఆత్మబంధువు సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ బోధనలను భావితరాలకు అందించాలని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా హనుకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. జయంతి ఉత్సవాల్లో భాగంగా భోగ్ బండారో కార్యక్రమాన్ని భక్తి ప్రపత్తులతో బంజారా పూజారులు నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్‌డీవో రమేష్, డీటీడబ్ల్యూవో ప్రేమకళారెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్ సింగ్ మాట్లాడుతూ.. సంత్‌సేవాలాల్ మహరాజ్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బంజారా సంఘం రాష్ట్ర, జిల్లా నేతలు పోరిక ఉదయ్‌సింగ్, బానోత్ నవీన్‌నాయక్, ప్రొఫెసర్ వీరన్న నాయక్, బానోత్ జవహర్‌లాల్, వాంకుడోత్ వీరన్న, భూక్య సాంయ్య నాయక్, బాదావత్ రాజు, సమ్మయ్య రాథోడ్, పోరిక రాజ్‌కుమార్, యాకూబ్ నాయక్, రామెల్ నాయక్ తదితరులు పాల్గొని సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటం వద్ద నైవేద్యాన్ని సమర్పించి కొలిచారు.

నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియంలో..

గోర్ బంజారా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాదావత్ బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో సద్గురు సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమధవ్ కళా ప్రాంగణం వద్ద ఘనంగా నిర్వహించారు. తొలుత వేయిస్తంభాల దేవాలయం నుంచి పబ్లిక్‌గార్డెన్ వరకు బంజారా సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడే విధంగా బంజారా మహిళల సంప్రదాయ నృత్యాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్‌లో సద్గురు మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మామిండ్ల రాజు, దివ్యారాణి రాజు నాయక్, పర్వతగిరి జడ్పీటీసీ బానోత్ సింగ్‌లాల్, సీఐ కాశీరాం, బంజారా సంఘం నేతలు గుగులోత్ రవీందర్ నాయక్, వెంకట్, నర్సింహనాయక్, గుగులోత్ తిరుపతి, రవీందర్, బాలు నాయక్, సునిల్ నాయక్, మాలోత్ నాను నాయక్, భూక్య హాస్సేన్ పాల్గొన్నారు.

నేడు ఇంటర్ ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 15: ఇంటర్మీడియట్ విద్య అనేది విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకం. ఇంగ్లీష్ భాషపై పట్టు లేకపోవడంతో భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇలాంటి ఇబ్బంది తలెత్తకూడదనే ఉద్దేశంతోనే ఈ యేడు నుంచి ఇంటర్మీడియట్ బోర్డు విద్యార్థుల ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షను నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, వృక్షశాస్త్రాలతోపాటు ఒకేషనల్ విద్య అభ్యసించే విద్యార్థులకు మాత్రమే ప్రాక్టికల్స్ నిర్వహించే వారు. ఈ విద్యా యేడు ఈ నెల 16వ తేదీన ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహిస్తున్నారు. రాత పరీక్ష 80 మార్కుల కేటాయించగా, ప్రాక్టికల్ పరీక్షకు 20 మార్కులు కేటాయించనున్నారు. ఈ ప్రాక్టికల్ పరీక్షలో కనీసం 7 మార్కులు వస్తేనే ఉత్తీర్ణులు అవుతారు.

విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలి..

ఎ.గోపాల్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, హనుమకొండ

ఇంటర్మీడియేట్ స్థాయిలో ఇంగ్లీష్ భాషపై విద్యార్థులు పట్టు సాధించేందుకు ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంగ్లీషు ప్రాక్టికల్ పరీక్షను ప్రవేశపెట్టింది. ఈ పరీక్షకు ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంటుంది.

కన్నుమూసిన 'సామాజిక' కిరణం

- ప్రముఖ రచయిత, నల్లెల రాజయ్య మృతి
- హైదరాబాద్ ఆస్పత్రిలో గుండెపోటుతో తుది శ్వాస
- నివాళులర్పించిన పలువురు ప్రముఖులు
- శోకసంద్రమైన హనుమకొండలోని పద్మాక్షి కాలనీ



రాజయ్య భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, కాత్యాయని విద్మహే

సుబేదారి, ఫిబ్రవరి 15: ప్రముఖ సామాజిక వేత్త, వరంగల్ రచయితల సంఘం అధ్యక్షుడు, పౌరస్పందన వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లెల రాజయ్య(62) గురువారం ఉదయం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో గుండెపోటుతో మరణించారు. నల్లెల్ల రాజయ్య వారం కిందట మూత్ర సంబంధితవ్యాధితో హనుమకొండలోని ఆ ప్రయివేటు ఆస్పత్రిలో చేరారు. వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో నాలుగు రోజుల కిందట రాజయ్యను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ రాజయ్యకు చికిత్స అందిస్తున్న తరుణంలో గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో గుండెపోటు వచ్చింది. ఈ క్రమంలో ఆయణ మరణించినట్లు కిమ్స్ వైద్యులు ప్రకటించారు. గురువారం సాయంత్రం పద్మాక్షికాలనీలో ఉన్న శ్మశాన వాటికలో రాజయ్య అంత్యక్రియలు నిర్వహించారు. రాజయ్య అభిమానులు, కవులు, కళాకారులు, రచయితలు పెద్ద సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. రాజయ్యకు భార్య సుగుణ, కూతుర్లు వెన్నెల, కిరణ్మయి, కుమారుడు సూర్య ఉన్నారు. కుమారుడు సూర్య సాఫ్ట్‌వేర్‌గా పని చేస్తున్నాడు.

ఉద్యమ నేపథ్యం

రాజయ్య మొదటి నుంచి అభ్యుదయ వాది. మానవతావాది, హేతువాది. నిరుపేద ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేవాడు. ఓపెన్ కాస్టు సమస్యపై గద్దర్‌తో కలిసి పాదయాత్ర చేశాడు. నాలుగు దశాబ్దాల నుంచి ప్రజాజీవితంలో ఉన్నారు. వృత్తి రిత్యా టీచర్. రాజయ్య నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండేవాడు. రాజయ్య రామప్ప గుడి పరిరక్షణ కమిటీ కన్వీనర్‌గా ఉన్నారు. ఎంజీఎంలో ఉండే సమస్యలపై, పద్మాక్షికాలనీలో కాలనీ సమస్యలపై, సరిగమ పార్కు అన్యాక్రాంతమవుతుందనే అంశాలపై ఎంతో పోరాటం చేశారు. రాజయ్య ఇప్పటివరకు 25 పుస్తకాలు రాశాడు. కరోనా సమయంలో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశాడు. నిత్యం ప్రజలకు ఉన్న సమస్యలపై పోరాడుతూ ఉండేవాడు. ప్రభుత్వ భూముల పరిరక్షణ పేరుతో ఎన్నో కార్యక్రమాలు చేసి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూశాడు. రాజయ్యకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రచయితగా, కవిగా మంచి పేరు ఉంది.

పలువురి నివాళులు

రాజయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న పలువురు ప్రజా సంఘాల నాయకులు, మానవ హక్కుల వేదిక నాయకులు పద్మాక్షికాలనీలోని రాజయ్య నివాసం వద్దకు చేరుకుని రాజయ్య భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దివ్యాంగ హక్కుల గొంతుక, నిరుపేదల శ్వాస, ధ్యాస, ప్రజా కవి నల్లెల రాజయ్య మరణం తీరని లోటని పలువురు ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు.

విశ్రాంత ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, ప్రముఖ ప్రజా కవి వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, హేతువాది రమాదేవి, మానవహక్కుల వేదిక నాయకులు జీవన్ కుమార్, డాక్టర్ తిరుపతయ్య, పౌరస్పందన వేదిక జిల్లా అధ్యక్షులు కరేటి శంకర్‌రావు యాదవ్, దివ్యాంగుల ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు బిల్ల మహేందర్, అభినవ్, డాక్టర్ చంద్రబాను, అమరవీరుల కుటుంబాల ప్రధాన కార్యదర్శి భారతక్క, భారత్ బచావో రాష్ట్ర నాయకులు వెంగల్ రెడ్డి తదితరులు రాజయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎంఎస్‌ఎంఈలు చేస్తున్న కృషి అభినందనీయం

రాష్ట్ర పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వెంకటేశం



వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్న వెంకటేశం

కాళోజీ జంక్షన్, ఫిబ్రవరి 15: మైక్రో, స్మాల్, మీడియం, ఎంటర్‌ప్రైజెస్‌ల ప్రయోజనం కోసం వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలను నిర్వహించడంలో ఎంఎస్‌ఎంఈ చేస్తున్న కృషిని పరిశ్రమల శాఖ రాష్ట్ర జనరల్ మేనేజర్ జె.వెంకటేశం అభినందించారు. ఎంఎస్‌ఎంఈ భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖ హైదరాబాద్, హనుమకొండ జిల్లా పరిశ్రమల కేంద్రాల సహకారంతో హనుమకొండలోని హరిత హోటల్‌లో గురువారం నిర్వహించిన వెండర్ డెవలప్‌మెంట్ ప్రారంభ వేడుక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.

హనుమకొండ జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ హరిప్రసాద్, వరంగల్ జిల్లా జనరల్ మేనేజర్ నర్సింహమూర్తి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను వివరించారు. ఎంఎస్‌ఎంఈ ఉత్పత్తుల కోసం గ్లోబల్ ఆన్‌లైన్ మార్కెటింగ్‌ను సులభతరం చేయడం హర్షణీయమని హరిప్రసాద్ అన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కె.శివరామప్రసాద్ మాట్లాడుతూ.. ఎంఎస్‌ఎంఈల వ్యాపార వృద్ధి నైపుణ్యం పెంపుదల, మార్కెటింగ్ సౌకర్యాలు, సబ్సిడీ రుణాలను పొందడం కోసం ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. హనుమకొండ లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్వయం సహాయక బృందాల ద్వారా మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి ఎంఎస్‌ఎంఈలకు ప్రయోజనం చేకూర్చేందుకు రూపొందించిన వివిధ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఖాదీ గ్రామ పరిశ్రమల బోర్డు ప్రాంతీయ అధికారి అశోక్ తమ సంస్థ అందిస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమం శుక్రవారం కూడా కొనసాగుతుందని తెలిపారు.

కళ్ల ముందే కన్నతండ్రి కన్నుమూత

- దండేపల్లిలో బైక్‌ను ఢీకొన్న ఇసుక ట్రాక్టర్
- కూతురికి తప్పిన ప్రమాదం
- తండ్రిని చూసి విలవిల్లాడిన యువతి

వివరాలు 6లో..

తెలంగాణలో కేసీఆర్ కుటుంబమే లాభపడింది..

- కార్పొరేటర్ అభినవ్ భాస్కర్‌కు బీజేపీలో భవిష్యత్తు ఉంది
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్



ఎంపీ అరవింద్, అభినవ్ భాస్కర్‌ను గజమాలతో సన్మానిస్తున్న అభిమానులు

సుబేదారి, పిబ్రవరి 15: ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత తెలంగాణలో ఒక్క కేసీఆర్ కుటుంబమే అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరిన 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ జన్మదిన వేడుకల సందర్భంగా గురువారం మడికొండ నుంచి హనుమకొండ హంటర్‌రోడ్‌లోని కొడెం ఫంక్షన్‌హాల్ వరకు 100 కార్లు, 500 ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ తీశారు. అనంతరం కన్వెన్షన్ హాల్‌లో కార్పొరేటర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అరవింద్ మాట్లాడుతూ.. హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరం రెండో రాజధాని పేరుకే అని, ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. యువ కార్పొరేటర్ అభినవ్ భాస్కర్‌కు భవిష్యత్‌లో బీజేపీలో మంచి భవిష్యత్తు ఉందన్నారు. హనుమకొండలో బీజేపీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అభినవ్ భాస్కర్ కృషి చేయాలన్నారు. అనంతరం బంజారాల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, మాజీ మేయర్ రాజేశ్వర్ రావు, బీజేపీ నాయకులు గుండేటి విజయరామారావు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, పెసరు విజయ్ చందర్‌రెడ్డి, డాక్టర్ కాళీప్రసాద్, కార్పొరేటర్లు చాడ స్వాతి శ్రీనివాస్ రెడ్డి, శివకుమార్, రావుల కోమల కిషన్, పెద్ద సంఖ్యలో అభినవ్ భాస్కర్ అభిమానులు, బీజేపీ నాయకలు పాల్గొన్నారు.


జంపన్నవాగులో పుణ్యస్నానాలు

బారులు తీరిన భక్తులు.. రద్దీగా మారిన గద్దెలు

● మేడారంలో కొనసాగిన దర్శనాలు ● లక్షకు పైగా తరలివచ్చిన భక్తజనం

మేడారం, ఫిబ్రవరి 15: మేడారం సమ్మక్క, సారలమ్మలను భక్తులు గురువారం భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. తెలంగాణలోని నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా తరలివచ్చారు. వనదేవతల గద్దెలను నేరుగా దర్శించుకొని ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టల వద్ద తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం శివసత్తుల పూనకాలు, సమ్మక్క, సారలమ్మలకు జేజేలు పలుకుతూ డోలు వాయిద్యాల నడుమ తల్లుల గద్దెలకు చేరుకున్నారు. క్యూలైన్ల ద్వారా తల్లులను దర్శించుకున్నారు. నిలువెత్తు బంగారం(బెల్లం), పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారె సమర్పించారు. కొబ్బరికాయలను కొట్టి యాట మొక్కులను చెల్లించుకున్నారు. తమ కోరికలను తీర్చాలని వనదేతలను వేడుకున్నారు. మేడారం పరిసరాల్లోని వసతి షెడ్లలో, అటవీ ప్రాంతాల్లోని చెట్లకింద వంటలు చేసుకొని ఆనందంగా గడిపారు. భక్తులు గురువారం లక్షకు పైగా దర్శించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు.

ఇప్పటి వరకు 30 లక్షల మంది

మహాజాతర నేపథ్యంలో మేడారంలో భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటివరకు సుమారు 30 లక్షల మంది వనదేతలను దర్శించుకుని ఉంటారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. మహాజాతరకు సుమారు రెండు నెలల ముందుగానే భక్తులు మేడారం వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు.


జంపన్నవాగులో పుణ్యస్నానాలు


పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు




బంగారంతో వెళుతున్న మహిళలు

కొలువుదీరిన మహాజాతర ఉత్సవ కమిటీ

(3వ పేజీ తరువాయి)

దర్శించుకుంటారని అన్నారు. ఇప్పటికే 30లక్షలకు పైగా మంది భక్తులు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారని అన్నారు. ములుగు జిల్లా కోసం పోరాడిన ముంజాల భిక్షపతితో పాటుగా జాతర అభివృద్ధికి పాటుపడిన వారికే ఉత్సవ కమిటీలో స్థానం దక్కిందన్నారు. జాతర విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలను కోరారు.

ప్రమాణ స్వీకారం చేసిన వారు వీరే..

చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్, డైరెక్టర్ మిలుకూరి ఐలయ్య, కొండి గోపాల్, గంగెర్ల రాజారత్నం, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణ సింగ్, ముంజాల భిక్షపతి, సుంచు హైమావతి, చామర్తి కిశోర్, ఆలం శశిధర్, వద్దిరాజు రవిచంద్ర, అబ్బయ్య, అంకం కృష్ణస్వామి, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయి జగ్గారావు ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు.

ప్లాస్టిక్‌ఫ్రీ జాతరగా నిర్వహించాలి

పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క


మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 15 : మేడారం మహాజాతరను ప్లాస్టిక్ ఫ్రీగా నిర్వహించాలని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కోరారు. మేడారంలో ఆమె గురువారం పర్యటించారు. ముందుగా వనదేవతలను దర్శించుకొని చీరె, సారె సమర్పించారు. పారిశుధ్య నిర్వహణపై మేడారంలోని హరిత హోటల్ సమావేశ గదిలో కలెక్టర్ ఇలా త్రిపాఠి అధ్యక్షతన నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి పంచాయతీరాజ్ కమిషనర్ అనిత రామచంద్రన్‌తో కలిసి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జాతర సమయం దగ్గర పడుతున్న తరుణంలో భక్తుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోందన్నారు. అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ముఖ్యంగా భక్తులకు నిరంతరం తాగునీరు అందించాలని అన్నారు. జాతరలో, జాతర ముగిసిన అనంతరం కూడా ముమ్మరంగా పారిశుధ్య పనులు కొనసాగించాలన్నారు.

పంచాయతీరాజ్ కమిషనర్ అనితరామచంద్రన్ మాట్లాడుతూ.. జాతరలో నిర్వర్తించే అధికారులు చిత్తశుద్ధితో సమన్వయంతో భక్తులకు సేవలు అందించాలని అన్నారు. జాతరలో ముఖ్యంగా గద్దెల ప్రాంగణంలో బెల్లం, కొబ్బరికాయలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. పారిశుధ్య సిబ్బంది, యంత్రాల ద్వారా నిరంతరం విధులు నిర్వర్తించాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. వివిధ జిల్లాల నుంచి జాతర విధులకు వచ్చే అధికారులు తప్పనిసారిగా ఈనెల 19న సంబంధిత జోనల్ అధికారులకు రిపోర్ట్ చేయాలని అన్నారు. మహాజాతరలో పారిశుధ్య పనులు చేయడానికి 10సెక్టార్లు 60సబ్ సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. డీపీవో, డీఎల్‌పీవోల ఆధ్వర్యంలో పారిశుధ్య పనుల జరుగుతాయని అన్నారు. ఫీల్డ్‌లో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులకు కేటాయించిన జోన్లలో విధులు నిర్వర్తించాలని అన్నారు. ప్రతి జోన్‌కు ఎంపీవో స్థాయి అధికారిని కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శబరీశ్, డీపీవోలు, డీఎల్‌పీవోలు, వివిధ జోన్ అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన వైద్య సేవలు

హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్


మేడారంలోని ప్రధాన వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న రవీంద్ర నాయక్

మేడారం, ఫిబ్రవరి 15: మేడారం సమ్మక్క సారలమ్మల మహాజాతర సందర్భంగా అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ అన్నారు. వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యూకేషన్ శివప్రాసద్‌తో కలిసి జాతర పరిసరాల్లోని వైద్య శిబిరాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా భక్తులకు అందిస్తున్న సేవల గురించి డీఎంహెచ్‌వో అప్పయ్యను అడిగి తెలుసుకున్నారు. టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ప్రధాన తాత్కాలిక ఆస్పత్రిని సందర్శించారు. అక్కడ వైద్యం పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్యులతో మాట్లాడుతూ మహాజాతర సందర్భంగా భక్తులకు మెరుగైన వైద్యసేవలు అదించాలన్నారు. సరిపడా మందులను నిల్వ చేసుకోవాలన్నారు. అనంతరం సమ్మక్క సారలమ్మలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట డీసీహెచ్ జగదీశ్వర్, ఏటూరునాగారం సూపరింటెంట్ డాక్టర్ సురేష్, డాక్టర్ ప్రేమ్‌సింగ్, డాక్టర్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై నేడు సమీక్ష

హనుమకొండ అర్బన్: తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్ నగరంలో ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం వరంగల్ ఐఎంఏ హాలులో జరిగే ఈ సమీక్షా సమావేశానికి హనుమకొండ, వరంగల్ జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వివిధ ప్రోగ్రాం అధికారులు పాల్గొననున్నారు. జాతీయ కార్యక్రమాల అమలును సమీక్షించనున్నారు. డీహెచ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ రవీంద్రనాయక్ నగరంలో సమీక్షలో పాల్గొంటున్నారు. రెండు జిల్లాలకు చెందిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆహార నాణ్యత అధికారుల తనిఖీలు

మేడారం, ఫిబ్రవరి 15: మహాజాతర నేపథ్యంలో ఆహార నాణ్యత అధికారులు మేడారంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. వందల సంఖ్యలో వెలిసిన దుకాణాల్లోని ఆహార పదార్థాలను, తినుబండారాలను పరిశీలించారు. నాణ్యమైన ఆహారం భక్తులకు అందించాలని వ్యాపారులకు సూచించారు. కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాల ఫుడ్ సేఫ్టీ అధికారులు అమృత శ్రీ, బాపుజీ, కృష్ణమూర్తి, రోహిత్‌రెడ్డి, వాసూరాం, ఎన్.అనూష, ఆర్.అనూష, ప్రత్యూష మేడారం జాతరలో విడివిడిగా తనిఖీలు చేశారు. రకరకాల రంగులు కలిపిన పదార్థాలను పరిశీలించారు. బాగా మరిగిన నూనెలు సమారు 15 లీటర్ల వరకు పారబోశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆహార పదార్థాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నివేదన



భద్రాచలానికి వచ్చే మార్గంలో దుమ్ముగూడెం (దూమగూడెం) అనే ఊరు ఉంది. దాని అవతలి ఒడ్డున ఉన్న చిన్న గుట్ట సమీపంలోనే జటాయువుకు, రావణుడికి యుద్ధం జరిగినట్టు రామాయణంలో ఉంది. ఆ గుట్ట దగ్గరే జటాయువుకు శ్రీరాముడు అంత్య సంస్కారాలు చేశాడు.

పంచవటి మనదే!

అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ శ్రీరామ వనవాస మార్గం గురించి వివరించారు. ఆ వివరాలకు సంస్కృత రామాయణంలో వాల్మీకి రచించిన దానికీ తేడా ఉంది. అయోధ్య నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఉన్న భరద్వాజ ఆశ్రమానికి, మధ్యప్రదేశ్‌లోని చిత్రకూటానికి, మహారాష్ట్రలోని నాసిక్ దగ్గర ఉన్న పంచవటికి, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా లేపాక్షికి, కర్ణాటకలోని కిష్కింధకు, తమిళనాడులోని రామేశ్వరానికి, అక్కడి నుంచి శ్రీలంకకు శ్రీరాముడు పయనించాడనడం సరికాదేమో! ప్రధాని తన ప్రసంగంలో లేపాక్షి, నాసిక్‌లోని పంచవటుల గురించి ప్రస్తావించారే కానీ... దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచల రామాలయం సమీపంలోని పంచవటి గురించి కానీ, అసలు ఆ ఆలయం గురించి కానీ కనీసం ప్రస్తావించలేదు. ఇది తెలుగువారిని ఒకింత నిరాశకు గురిచేసిందనాలి. అయోధ్య నుంచి లంక దాకా శ్రీరాముడి ప్రస్థానం, తిరుగు ప్రయాణంలో అయోధ్యకు వస్తూ సీతకు రాముడు చూపించిన ప్రదేశాలు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు)గారి 'ఆంధ్ర వాల్మీకి రామాయణం' (మందరం) వ్యాఖ్యానంలో వివరంగా ఉన్నాయి.

అరణ్యాలకు బయలుదేరిన సీతారామలక్ష్మణులు తామసా నదీ తీరం, ఉత్తరకోసల దేశం, వేదశ్రుతి నది, గోమతీ నది, దక్షిణ కోసల దేశ సరిహద్దులు దాటి... గంగానదీ తీరంలోని శృంగబేరి పురాన్ని చేరారు. గుహుడి సాయంతో గంగను దాటి, గంగా యమున సంగమ స్థలిలోని భరద్వాజ ముని ఆశ్రమానికి వెళ్ళారు. యమునను దాటి, నీలవన మార్గంలో పయనించి, మందాకినీ సరయూ నది దగ్గరలో ఉన్న చిత్రకూటం చేరారు. అక్కడ వాల్మీకిని చూశారు. చిత్రకూటంలో లక్ష్మణుడు పర్ణశాల నిర్మించాడు. భరతుడు చిత్రకూటానికి వచ్చి, వెళ్ళాక... వారు అత్రి మహాముని ఆశ్రమానికీ, అనంతరం దండకారణ్యంలో ప్రవేశించి, విరాధుణ్ణి సంహరించి, శరభంగ మహర్షి ఆశ్రమానికీ, అటు నుంచి సుతీక్ష్ణాశ్రమానికీ, మాండకర్ణి ఆశ్రమానికీ ప్రయాణించారు. అగస్త్యుణ్ణి ఆయన ఆశ్రమంలో దర్శించుకున్నారు. పంచవటి అనే నివాస యోగ్యమైన స్థలం రెండు ఆమడల దూరంలో ఉందని అగస్త్యుడు సూచించాడు. అగస్త్యుడు చెప్పిన మార్గంలో వెళ్తూ, దారిలో ఒక మర్రి చెట్టు మీద ఉన్న జటాయువును రాముడు కలిశాడు. తరువాత సీతా లక్ష్మణ సమేతుడై పంచవటిని చేరుకున్నాడు. అక్కడ పర్ణశాల నిర్మించమని లక్ష్మణుడికి చెప్పాడు. లక్ష్మణుడు కుటీరాన్ని సిద్ధం చేశాడు. అవే ఇప్పటికీ భద్రాచలానికి 30 కిలోమీటర్ల దూరంలో ఎందరో భక్తులను ఆకర్షిస్తున్న పంచవటి, పర్ణశాలలు. భద్రాచలం సమీపంలో ఉన్నది పర్ణశాల కాదనీ, అది నాసిక్‌కు దగ్గరగా ఉందనీ చెప్పడం పూర్తిగా సత్యదూరం.

పంచవటి గోదావరీ తీరంలో ఉందనేది నిర్వివాదాంశం. అక్కడ గోదావరి ఉత్తరం నుంచి దక్షిణానికి పారుతూ ఉండాలి. ఎందుకంటే సీతాపహరణం తరువాత... సీతను రావణుడు తీసుకువెళ్ళినది దక్షిణ దిక్కుగానని మృగాలు, పక్షులు సూచించిన మేరకు... రామలక్ష్మణులు గోదావరీ తీరాన మొదట నైరుతి దిశగా వెళ్ళారు. తరువాత దక్షిణంగా వెళ్ళారు. గోదావరీ తీరంలో వారు జటాయువును చూశారంటే... గోదావరి నది జటాయువు పడిన స్థలం వరకూ... దక్షిణాభిముఖంగా పారుతూ ఉండాలి. జటాయువుకు గోదావరీ జలాలతో నివాపాలు (తిలోదకాలు) విడిచారు. అక్కడి నుంచి రామ లక్ష్మణులు తూర్పుగా వెళ్ళడానికి ఏరు అడ్డం వస్తుంది కాబట్టి... నైరుతి దిశగానే మూడు కోసుల దూరం పయనించారు. కొంత తూర్పుగా వెళ్తే కాని జటాయువు చెప్పిన దక్షిణ మార్గం కనిపించదు కాబట్టే... అక్కడి నుంచి మూడు కోసులు తూర్పుగా వెళ్ళారనుకోవాలి. అంటే అప్పుడు వారు.. ఇప్పటి భద్రాచలం దగ్గర, గోదావరి నదికి దక్షిణాన ఉన్నారు. అలా వచ్చారు కాబట్టి గోదావరి దాటవలసిన పని లేదు. ఆ కారణం వల్ల పంచవటి గోదావరి నదికి పడమటి తీరాన ఉందనే విషయం స్పష్టంగా అంగీకరించాలి. తూర్పున ఉన్నట్టయితే గోదావరి దాటే ఉండాలి. ఇప్పటి పర్ణశాలే యదార్థమయిన పంచవటి అయినా కావాలి. లేని పక్షంలో ఇప్పుడు అందరూ భావిస్తున్న పర్ణశాలకు ఎదురు ఒడ్డున, చక్కటి పంచవటి ఉండేదని మాత్రం నిర్ధారణగా చెప్పవచ్చు. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనీ, అక్కడి నుంచి దక్షిణంగా రామలక్ష్మణులు వెళ్ళారనీ చేసే వాదన రామాయణానికి విరుద్ధం. పంచవటి గోదావరీ నది పశ్చిమ తీరాన ఉందనడానికి స్థలం ఆధారంగా ఉంది. పర్ణశాలకు ఎదురుగా ఉన్న గుట్ట దగ్గర రావణాసురుడు తన రథాన్ని నిలిపాడని అంటారు. కారణం... సీతాదేవిని ఎత్తుకురాగానే రథం సిద్ధంగా ఉండాలి కాబట్టి. నదికి ఒక ఒడ్డున రథం, మరో ఒడ్డున సీత ఉంటే... సీతాపహరణం సాధ్యమయ్యేది కాదనుకోవాలి. కాబట్టి పడమటి దిక్కున ఉన్న పంచవటి దగ్గర సీతాపహరణం జరిగి ఉండాలి. అలాగే అక్కడికి సమీపంలోనే 'సీత గుట్టలు' అనే పెద్ద పర్వతం ఉంది. ఖరుడు యుద్ధానికి వచ్చినప్పుడు... రామలక్ష్మణులు అక్కడ ఉన్న కారణంగా ఆ గుట్టలకు ఆ పేరు వచ్చిందంటారు.

హంపీ... పంప ఒకటి కాదు...

ఇప్పటి హంపీయే అప్పటి పంప అనీ, అక్కడే పర్ణశాల ఉన్నదనీ అనడం కూడా సరికాదు. రామలక్ష్మణులు లంకకు వెళ్ళేటప్పుడు ఏ మార్గం నుంచి వెళ్ళినా, తిరిగి వచ్చేటప్పుడు... విమానంలో తక్కువ దూరంలో ప్రయాణించే విధంగా... లంక నుంచి సముద్రం దాటాక... రామేశ్వరం నుంచి అయోధ్యకు వెళ్ళారనేది అందరూ అంగీకరించినదే. అలాంటప్పుడు ఎడమ వైపు కిష్కింధ, కుడివైపున పంచవటి ఉండి ఉండాలి. ఆ మార్గానికీ నాసిక్‌కూ సంబంధమే లేదు. కాబట్టి పంచవటి... నాసిక్ కానే కాదు. కావడానికి వీల్లేదు. సీతారామలక్ష్మణులు చిత్రకూటం నుంచి దక్షిణంగా ఋక్షవంతానికి వచ్చి, పశ్చిమాభిముఖంగా నాసిక్‌ను చేరినట్టయితే... మార్గమధ్యంలో వింధ్య పర్వతాన్ని, నర్మద, తపతీ నదులను దాటి... విదర్భ మీదుగా ప్రయాణించవలసి ఉంటుంది. వాటిని వారు దాటినట్టయితే... వాల్మీకి తప్పకుండా రాసేవాడు. రామలక్ష్మణులు దక్షిణానికి వచ్చి, ఆ తరువాత ఆగ్నేయంగా కిష్కింధకు వచ్చారనడం రామాయణానికి ప్రత్యక్ష విరుద్ధమని చెప్పాలి. నిజానికి... వారు నైరుతి మూలగా, నైరుతిగా వెళ్ళి, కబంధుణ్ణి చంపి, పడమరగా వెళ్ళి, పంప (తుంగభద్ర) చేరి, పడమరలో ఉన్న శబరి గుహకు వెళ్ళారు. జటాయువు గుట్ట దగ్గర నుంచి నైరుతికి వస్తేనే కిష్కింధకు రాగలరు. అలాకాకుండా ఆగ్నేయ మూలగా వెళ్ళి ఉంటే... సముద్రతీరానికి చేరేవారే తప్ప కిష్కింధకు కాదు. ఆగ్నేయమూలగా వారు ప్రయాణించారని రామాయణంలో ఒక్క మాటయినా లేదు.

> పంచవటికి దగ్గరలోనే పద్మ సరస్సు ఉందని 'వాల్మీకి రామాయణం' చెబుతోంది. అలాంటి పెద్ద చెరువొకటి ఉండేదని అక్కడ ఉండే కోయలు చెబుతూ ఉంటారు. ఆ చెరువుకూ, గోదావరికీ మధ్య పంచవటి ఉంది.

సీతారామలక్ష్మణుల వనవాసం చివర్లో... సీతాపహరణం కోసం రావణుడు, మారీచుడు కలిసి దండకారణ్యంలోని రామచంద్రుడి ఆశ్రమానికి చేరుకున్నారని 'వాల్మీకి రామాయణం'లో ఉంది. పర్ణశాలకు ఉత్తరాన పర్వతాలు, తూర్పున గోదావరి, దక్షిణ, పడమర దిశల్లో అడవి ఉన్నాయి. రాముణ్ణి మారీచుడు పడమరగానే తీసుకువెళ్ళాడు. రావణుడు వెళ్ళాల్సింది దక్షిణ మార్గాన కాబట్టి... ఆ దోవలో రాముడు ఉండకూడదని మారీచుడు అలా చేశాడు. సీతను రావణుడు అపహరించుకుపోతున్నప్పుడు... పర్ణశాలకు మైలు దూరంలోని వృక్షం దగ్గర జటాయువు ఎదురయింది. రావణుడు, జటాయువు మధ్య యుద్ధం అయిదారు మైళ్ళ దూరంలోని దుమ్ముగూడెం దగ్గరున్న జటాయువు గుట్ట వరకూ సాగింది. రావణుడు సీతను ఎత్తుకొని, పర్ణశాల నుంచి బయలుదేరి, కిష్కింధ మీదుగా, పర్వతాలు, తటాకాలు దాటి, సముద్రాన్ని సమీపించి, లంకకు పోయాడనుకోవాలి. ఇవన్నీ పర్ణశాల ఎక్కడుందో తెలిపే అంశాలు.

సీతాన్వేషణలో భాగంగా రామలక్ష్మణులు క్రౌంచారణ్యం, మతంగవనం, పంపానది ఒడ్డున ఉన్న ఋశ్యమూక పర్వతం మీదుగా వెళ్ళారు. అప్పటివరకూ వారు దక్షిణ దిక్కుగానే ప్రయాణం చేశారు. శబరి ఆశ్రమానికి తూర్పు దిక్కులోనే పోవాలి కాబట్టి... వారు పడమరగా వెళ్ళి, తూర్పుకు తిరగాల్సి ఉంటుంది. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనే వారి వాదనకు ఇది పూర్తిగా వ్యతిరేకం. ఆ తరువాత వారు కిష్కింధ వెళ్ళారు. రావణుడితో యుద్ధానికి వెళ్ళేదాకా ప్రస్రవణ పర్వతం మీద ఉన్నారు. కిష్కింధకు ఆగ్నేయంగా ఉన్న లంకకు పోతూ మహేంద్ర పర్వతం ఎక్కారు. రావణ వధ అనంతరం సీతా సమేతంగా అయోధ్యకు పుష్పక విమానం మీద తిరుగు ప్రయాణం కావడం... వనవాసంలో భాగం. ఆ తిరుగు ప్రయాణంలో ఈ ప్రదేశాలన్నీ సీతకు రాముడు చూపించడం కొసమెరుపు.

(వాసుదాసు గారి 'ఆంధ్రవాల్మీకి రామాయణం' (మందరం) ఆధారంగా)

• వనం జ్వాలా నరసింహారావు

పర్వదినం



జగత్ చైతన్యకారకుడు

బ్రహ్మస్వరూపముదయే మధ్యాహ్నేతు మహేశ్వరః
సాయం సంధ్యే సదా విష్ణుం త్రయీమూర్తిర్దివాకరః

సూర్యుడు త్రిమూర్త్యాత్మకుడు. ముల్లోకాలలోని ప్రాణులతో... త్రికాలాలలో పూజలు అందుకుంటున్న ప్రత్యక్ష దైవం. ఆదిత్యుడు, దివాకరుడు, సూర్యనారాయణుడు... ఇలా ఆయనకు ఎన్నో నామాలు. ఈ చరాచర జగత్తుకు వెలుగును, తేజస్సును ఆయన ప్రసాదిస్తాడు. అదితి-కశ్యపులకు ఆయన జన్మించిన రోజైన మాఘ శుద్ధ సప్తమి... 'రథసప్తమి'గా ప్రసిద్ధిచెందింది. ఉత్తర దిశగా సూర్యుడి గమనం ఈ రోజే ఆరంభమవుతుందని 'మత్స్యపురాణం' చెబుతోంది. ముప్పై మూడు కోట్ల మంది దేవతలు ఉన్నారని మనం చెప్పుకొంటున్నా... మనకు నిత్యం దర్శనమిచ్చే దైవం ఆదిత్యుడే. ఈ సృష్టిలో పన్నెండుమంది ఆదిత్యులు ఉన్నారనీ, సమస్త జీవజాలానికీ, సృష్టివిధానానికీ వారే ఆధారభూతులనీ 'భవిష్యపురాణం' చెబుతోంది. నవగ్రహాలలో మనకు కనిపించే ఏడు గ్రహాలను వారంలోని ఏడు రోజులకు పేర్లుగా పూర్వ ఋషులు నిర్ణయించారు. ఆదిత్యుని పేరిట ఆదివారాన్ని స్థిరపరిచారు.

సూర్యుడు మానవుల మనుగడకు ఆధారభూతుడు. కాంతికి, శక్తికి, చైతన్యానికి కారకుడు. సమస్త జ్ఞాన, విజ్ఞానాలకు అధిపతి. ఆయనను కర్మసాక్షిగా, స్థితికారకుడిగా పురాణాలు, ఇతిహాసాలు అభివర్ణించాయి. సూర్యుడి శక్తివల్లనే భూమండలంతో సహా ఇతర గ్రహాలు సంచరిస్తున్నాయి. ఆయనాలు, ఋతువులు ఏర్పడడానికి సూర్యగమన శక్తే కారణం. యజ్ఞాగ్నిగా సౌర శక్తిని మన ఋషులు దర్శించారు. సూర్య, భూగ్రహాల మధ్య ఉన్న సంబంధాన్ని విజ్ఞానపరంగా విశ్లేషించి... జ్యోతిష శాస్త్రాన్ని నిర్మించారు. మాసాలు, పక్షాలు, తిథులను నిర్దేశించి పంచాంగ శాస్త్రాన్ని ఆవిష్కరించారు. గ్రహాలు, రాశుల సంచారాలు, కలయికలను పరిశీలించి... వాతావరణ విజ్ఞానం అందించారు. ఇంతటి మహోన్నతమైన విజ్ఞానానికి ఆధారం సూర్యభగవానుడే.

ఆధ్యాత్మికంగా పరిశీలిస్తే.. 'అఘము' అంటే పాపం... 'మా' అంటే తొలగించడం. మాఘ మాసంలో వచ్చే సూర్యజయంతి రోజున ఆయనను అర్చిస్తే పాపాలన్నీ తొలగిపోతాయనేది శాస్త్రవచనం. రథసప్తమి నాడు ఉత్తరాభిముఖంగా... రథంలో సూర్యుడు పయనిస్తాడు. ఆ రథానికి ఒకటే చక్రం. దానికి పన్నెండు ఆకులు. అవి పన్నెండు మాసాలకు సంకేతం. ఆ రథానికి ఒకటే అశ్వం. 'ఏకో అశ్వోవహతి సప్తనామా' అని చెప్పింది ఋగ్వేదం. ఆ రథంలో అధిష్ఠితుడైన సూర్యుని కాంతి ఏడు వర్ణాలుగా... కిరణాలుగా ప్రసరితమవుతుంది. వాటినే ఏడు అశ్వాలుగా పరిగణిస్తారు. ఈ విశ్వమంతా ఆ కిరణాల విలాసమే. అవి ఆరోగ్యప్రదాలని, సూర్యోదయవేళ ఆ లేత కిరణాలు శరీరంపై సోకితే... శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని, సూర్యనమస్కారాలతో దారుఢ్యం కలుగుతుందనీ ఆయుర్వేద, యోగ శాస్త్రాలు చెబుతున్నాయి. ఆదిత్యుని ద్వాదశనామాలు పఠిస్తూ, సూర్యుణ్ణి ప్రార్థనలు చేస్తే... ఆరోగ్య, ఆధ్యాత్మిక ప్రయోజనాలు చేకూరుతాయన్నది పెద్దల మాట.

• ఆయపిళ్ళ రాజపాప

వేడుక

వన వేలుపుల మహా జాతర

గిరిజనుల ఆరాధ్య దేవతలుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకొని, వారి కష్టాలు తీర్చే వేలుపులుగా వాసికెక్కారు సమ్మక్క, సారలమ్మ. ఆ వనదేవతలకు నిర్వహించే జాతర... తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందింది. అంతేకాదు... ఇది ఆసియాలో అతి పెద్ద గిరిజన జాతర. మన దేశంలో కుంభమేళా తరువాత అత్యధికంగా భక్తులు హాజరయ్యే వేడుక. ఈ మహా జాతరకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా గిరిజన, గిరిజనేతర భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతారు.

రెండేళ్ళకొకసారి తెలంగాణలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో... సమ్మక్క-సారక్క జాతరను జరుపుతారు. ఇది చారిత్రక ప్రాధాన్యం ఉన్న సంబరం. పదమూడో శతాబ్దంలో... నేటి జగిత్యాల మండల ప్రాంతంలోని పొలవాస లేదా పొలస ప్రాంతాన్ని గిరిజన దొర మేడరాజు పరిపాలించేవాడు. ఆయన తన కుమార్తె సమ్మక్కను మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్దరాజుకు ఇచ్చి వివాహం చేశాడు. ఆ దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం కలిగారు. రాజ్యవిస్తరణ కాంక్షతో... కాకతీయ ప్రభువైన మొదటి ప్రతాపరుద్రుడు పొలవాస మీద దండెత్తాడు. ఆ దాడిని తట్టుకోలేక మేడరాజు... మేడారంలో అజ్ఞాతవాసం గడిపాడు. మరోవైపు కాకతీయులకు సామంతుడైన పగిడిద్దరాజు కరువు కారణంగా కప్పం కట్టలేకపోయాడు. కప్పం కట్టకపోవడంతోపాటు మేడరాజుకు ఆశ్రయం ఇచ్చినందుకు ఆగ్రహించిన కాకతీయ ప్రభువు మేడారంపై మీద సైన్యంతో విరుచుకుపడ్డాడు. భీకరంగా జరిగిన యుద్ధంలో... మేడరాజు, పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, సారలమ్మ భర్త గోవిందరాజులు మరణించారు. ఈ వార్త విన్న జంపన్న సంపెగవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆవాగు 'జంపన్నవాగు'గా ప్రసిద్ధి చెందింది.

మరోవైపు కాకతీయ సైన్యాన్ని సమ్మక్క వీరోచితంగా ఎదుర్కొని పోరాడింది. అయితే ప్రత్యర్థుల బలం ఎక్కువ కావడంతో... చివరికి ఆమె గాయపడింది. రక్తధారలతో యుద్ధభూమి నుంచి చిలుకలగుట్ట వైపు వెళ్తూ... మార్గమధ్యంలో అదృశ్యమయింది. సమ్మక్క కోసం ఆమె అనుచరులు వెతుకుతూ వెళ్ళారు. వారికి ఆమె కనిపించలేదు కానీ... ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమ ఉన్న భరిణె దొరికింది. దాన్ని సమ్మక్కగా భావించి... రెండేళ్ళకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున... సమ్మక్క-సారక్క జాతర నిర్వహిస్తున్నారు. వంశపారంపర్యంగా గిరిజనులే పూజారులుగా ఉంటారు. తమ కోర్కెలు తీర్చాలని అమ్మవార్లకు భక్తులు మొక్కుకుంటూ బంగారాన్ని (బెల్లాన్ని) నైవేద్యంగా సమర్పించుకుంటారు. వారి వీరత్వాన్ని స్మరించుకుంటారు.

వందల ఏళ్ళ చరిత్ర కలిగిన ఈ జాతరను నలభై వరకూ చిలకలగుట్ట మీద గిరిజనులు మాత్రమే నిర్వహించేవారు. ఆ తరువాత అన్ని వర్గాల ప్రజలూ పాల్గొంటున్నారు. జనసందోహం ఏటేటా పెరుగుతూ ఉండడంతో జాతరను కొండ కింద నిర్వహించడం మొదలుపెట్టారు. అమ్మవార్లకు చిహ్నంగా గద్దెలు ఏర్పాటు చేశారు. అమ్మవార్లకు ప్రతిరూపాలైన కుంకుమ భరిణెలను జాతర సందర్భంగా గద్దెపైకి తీసుకువస్తారు. ఈ నాలుగు రోజుల జాతరలో తొలిరోజున కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెపైకి తెస్తారు. ఆ మరునాడు చిలకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెపైకి విచ్చేస్తుంది. మూడో రోజున భక్తులకు అమ్మవార్లు దర్శనమిస్తారు. చివరిరోజున అమ్మవార్లు తిరిగి వనప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది.

ఫిబ్రవరి 21 : కన్నెపల్లి నుంచి సారలమ్మను, పునుగొండ్ల నుంచి పగిడిద్దరాజును, కొండాయి నుంచి గోవిందరాజును గద్దెలపైకి తీసుకువస్తారు.
ఫిబ్రవరి 22: చిలుకల గుట్ట నుంచి కుంకుమభరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపైకి తెస్తారు.
ఫిబ్రవరి 23: భక్తులు మొక్కులను చెల్లించుకుంటారు.
ఫిబ్రవరి 24: గద్దెలపై భక్తులకు దర్శనమిచ్చిన సమ్మక్క, సారలమ్మ వన ప్రవేశం.
ఫిబ్రవరి 28: తిరుగువారం పండుగ.



• నూతి శివానందం

విశేషం

సేయ్ కృష్ణ - నవద్వీపే శ్రీ చైతన్య చంద్ర
సేయ్ బలరామ - సంగే శ్రీ నిత్యానంద

"శ్రీకృష్ణుడు నవద్వీపంలో శ్రీ చైతన్య మహాప్రభువుగా అవతరించగా, వారితో పాటు బలరాముడు నిత్యానంద ప్రభువుగా అవతరించాడ"ని 'చైతన్య చరితామృతం' గ్రంథం చెబుతోంది. పశ్చిమబెంగాల్‌లోని ఏకచక్రధామంలో... 1473లో మాఘ శుద్ధ త్రయోదశి రోజున... హడాయ్ పండిత్, పద్మావతి దంపతులకు శ్రీనిత్యానంద జన్మించారు. ఆ రోజున ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది హరేకృష్ణ భక్తులు శ్రీనిత్యానంద త్రయోదశి మహోత్సవాన్ని (ఈ ఏడాది ఫిబ్రవరి 22న) నిర్వహిస్తారు. శ్రీనిత్యానంద ప్రభువు ఆవిర్భావం గురించి 'వాయుపురాణం'లో బ్రహ్మదేవుడికి శ్రీకృష్ణుడు వివరిస్తూ "నా ప్రప్రథమ పరివ్యాప్త స్వరూపుడు, నాతో అభిన్నుడు అయిన బలరాముడు కూడా నిత్యానందునిగా నాతో పాటు భూలోకంలో అవతరించి... అవధూత శిఖామణిగా ప్రకాశిస్తాడు" అని తెలిపాడు.

> ఆది గురుతత్త్వ స్వరూపమైన శ్రీనిత్యానందుల కృప లేనిదే... శ్రీచైతన్యుల కృపకు ఎవరూ పాత్రులు కాలేరన్నది పూర్వాచార్యుల అభిప్రాయం.

త్రేతాయుగాన లక్ష్మణుడిగా శ్రీరామచంద్రుణ్ణి సేవించిన బలరాముడే... కలియుగ ధర్మమైన హరినామ సంకీర్తనా ఉద్యమంలో శ్రీచైతన్య మహాప్రభువుకు తోడ్పడేందుకు శ్రీనిత్యానంద రామునిగా అవతరించారు. అయితే మునుపటి అవతారాలకన్నా ఇది ఎంతో ప్రత్యేకమైనది. ఎందుకంటే... కృష్ణనామాన్ని గానం చేస్తూ, దాన్ని ప్రపంచమంతటా వ్యాపింపజేయడానికి ఒక విశుద్ధ భక్తుడిగా అవతరించడం దీని విశిష్టత. సామాజికంగా ఉన్నతులైనా ఆధ్యాత్మికంగా శోచనీయమైన స్థితిలో ఉన్నవారిని శ్రీ చైతన్యులు ఉద్ధరించి, కొన్నివేల మంది మాయావాద సన్న్యాసులకు విశుద్ధ భక్తిమార్గాన్ని చూపిస్తే... జగాయ్, మాదాయ్ లాంటి మ్లేచ్ఛులపైన సైతం శ్రీనిత్యానందులు కరుణ చూపి, వారిని ఉద్ధరించారు. ఈ ప్రయత్నంలో తన ప్రాణాలకే ప్రమాదం వాటిల్లినా... వెనుకంజ వేయలేదు. పతితులైనవారి మనస్సులను తన అపారమైన కృపతో, ఔదార్యంతో గెలిచి... వారిలో పరివర్తన తీసుకువచ్చారు. ఒక విధంగా శ్రీచైతన్య మహాప్రభువుకు కూడా సాధ్యం కానిది శ్రీనిత్యానంద ప్రభువు సాధించారు. అంతేకాదు... ఏకచక్రపురంలోని బంకిమరాయ మందిరంలో ఉన్న బంకిమరాయ విగ్రహంలో... శ్రీనిత్యానంద ప్రభువు ఐక్యమై, తన లీలలను చాలించారన్నది ఐతిహ్యం. ఆ విగ్రహానికి కుడివైపున జాహ్నవీదేవి, ఎడమవైపున రాధారాణి విగ్రహం దర్శనమిస్తాయి. పరమపవిత్రమైన నిత్యానంద త్రయోదశినాడు... ఆదిగురుతత్త్వమైన శ్రీనిత్యానందుల్ని ఆశ్రయించి అనుసరిద్దాం. శ్రీనిత్యానందుల కృప వల్ల 'హరేకృష్ణ' మంత్రాన్ని జపించేందుకు మరింత శక్తి మనకు లభిస్తుంది.





శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

ప్రథమో హనుమన్నామః ద్వితీయో భీమ ఏవచ
పూర్ణ ప్రజ్ఞ తృతీయస్తు భగవత్కార్య సాధకః

హనుమ, భీమ అవతారాల తరువాత వైష్ణవతత్త్వ యదార్థ రూపాన్ని పునఃప్రతిష్ఠించడానికి వాయుదేవుడు శ్రీమధ్వాచార్యులుగా అవతరించాడు. ఈ మూడు అవతారాలకు భేదం లేదని మనం గ్రహించాలి. పరమాత్మ, లక్ష్మీదేవి తరువాత సకల దేవతలలో ఉత్తముడు వాయుదేవుడు. అందుకే హరి సర్వోత్తముడైతే... వాయువు జీవోత్తముడు.



జ్ఞాన కార్యసాధకుడు

వేదప్రతిపాదితమైన వాయుదేవుడి మూడు అవతారాలను... శ్రీమధ్వాచార్యుల శిష్యుడైన శ్రీత్రివిక్రమ పండితాచార్యులు ప్రత్యక్షంగా దర్శించారు. ఒక రోజు మధ్వాచార్యులు ఎప్పటిమాదిరిగానే శ్రీకృష్ణునికి పూజ చేసి, నైవేద్య సమర్పణకు సిద్ధమైనప్పుడు... ఆయన శిష్యులు ద్వాదశ స్తోత్రాన్ని పఠించారు. స్తోత్ర పఠనం పూర్తయింది. నైవేద్య సమర్పణ ముగిసే సమయం వచ్చినా... మధ్వాచార్యులు చేసే ఘంటా నాదం ఎంతసేపైనా వినబడలేదు. 'ఎందుకింత ఆలస్యమవుతోంది? ఆచార్యులవారు ఏం చేస్తూ ఉంటారు?' అనే కుతూహలంతో త్రివిక్రమ పండితారాధ్యులు మూసి ఉన్న తలుపును కొద్దిగా జరిపి, సందులోంచీ చూశారు. హనుమ, భీమ, మాధ్వ రూపాలతో శ్రీకృష్ణునికి తన గురువు పూజ చేస్తూ ఉండడం గమనించి... ఆనందాశ్చర్యాలతో మైమరచిపోయారు. ఏ తపస్సు చేసినా లభ్యం కాని ఆ అద్భుత దృశ్యాన్ని దర్శించి... ఆనందబాష్పాలు రాల్చారు. అప్రయత్నంగానే... సహజమైన శ్రేష్ఠకావ్యశైలిలో శ్రీమధ్వాచార్యుల అవతారత్రయాన్ని, రామ, కృష్ణ, వ్యాసత్రయరూపాన్ని వర్ణిస్తూ 'శ్రీహరివాయుస్తుతి'ని జగత్తుకు అందజేశారు. అది విన్న మధ్వాచార్యులు ప్రసన్నులై... స్వయంగా 'నరసింహనఖస్తుతి'ని రచించి, 'శ్రీహరివాయుస్తుతి'ని పఠించే సజ్జనులకు పూర్ణఫలాన్ని అనుగ్రహించారు.

శ్రీమధ్వాచార్యులు బదరీ క్షేత్రానికి వెళ్ళి, నారాయణుణ్ణి దర్శించారు. తన మొదటి గ్రంథమైన 'గీతాభాష్యా'న్ని రచించి, బదరీనాథుడికి సమర్పించారు. అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధిస్తున్నప్పుడు... కపిధ్వజుడిగా, భీముడిగా పూర్వావతారాల్లో ఆయన యుద్ధభూమిలో ఉన్నారు. అందుకే పరమాత్ముడే మెచ్చే విధంగా భగవద్గీతకు భాష్యం రాసే భాగ్యం ఆయనకు లభించింది.

శ్రీమధ్వాచార్యుల వ్యక్తిత్వం, తాత్త్వికత ఆయన రచించిన 37 గ్రంథాలలో సంపూర్ణంగా ప్రకటితమైంది. ఈ సంఖ్యలో మూడును, ఏడును కలిపి 'దశం' (పది)గా పరిగణిస్తారు. 'దశమతి' అంటే పూర్ణప్రజ్ఞులు... శ్రీ మధ్వాచార్యులు. అలాగే 'మూడూ ఇంటూ ఏడు' అంటే 21 అనేది మరో సంఖ్య. ఆనాడు మధ్వాచార్యులు తత్త్వవాదంతో పరిశీలించి, ఖండించిన సిద్ధాంతాల సంఖ్య అది. ఆయన బ్రహ్మసూత్రభాష్యం ఇరవై రెండవది. ఋగ్వేదంలోని ప్రథమ మండలంలో ఉన్న నలభై సూక్తాలకూ వేదార్థాల్ని వివరిస్తూ వ్యాఖ్యానం రాసి, వేదంలోని ప్రతి శబ్దార్థమూ శ్రీమహావిష్ణువును ఉద్దేశించినదేని మధ్వాచార్యులు నిరూపించారు. వేద, ఉపనిషత్తులలోని పరమాత్ముని తత్త్వజ్ఞాన సందేశాన్ని ప్రపంచానికి అందజేశారు.

> ఉడుపిలోని అనంతేశ్వర ఆలయంలో తన శిష్యులకు పాఠాన్ని బోధిస్తూ... అదృశ్యులై, వేదవ్యాసుని బదరికాశ్రమానికి శ్రీమధ్వులు చేరుకున్న రోజు... మాఘ శుద్ధ నవమి. దానినే సద్భక్తులందరూ 'మధ్వనవమి'గా జరుపుకొంటారు. ఆ పుణ్యదినాన శ్రీమధ్వాచార్యుల మహిమలను, ఆయన మానవాళికి అందించిన తత్త్వవాదాన్నీ శక్తి కొద్దీ స్మరిస్తే... శ్రీహరి కరుణకు పాత్రులవుతాము.

• మధ్వ ప్రచార పరిషత్, 9440258841


సీపీకి పుష్పగుచ్ఛాలు అందిస్తున్న ఏసీపీలు

సీపీని కలిసిన నూతన ఏసీపీలు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 15: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇటీవల పోస్టింగ్‌లు పొందిన ఏసీపీలు గురువారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝాను కలిశారు. సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించారు. సీపీని కలిసిన వారిలో కాజీపేట, నర్సంపేట, జనగామ, వర్ధన్నపేట, మామునూరు ఏసీపీలు తిరుమల్, కిరణ్‌కుమార్, దామోదర్‌రెడ్డి, అంబటి నర్సయ్య, సతీష్‌బాబు ఉన్నారు. పోలీసు అధికారులు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని వారికి సీపీ సూచించారు.

ప్రమాదాల నివారణలో భాగస్వామ్యం కావాలి

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 15: రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, అప్పుడే పూర్తిస్థాయిలో రోడ్డు ప్రమాదాలను నివారించొచ్చని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ప్రజలకు సూచించారు. జనవరి 15 నుంచి నెలరోజుల పాటు కమిషనరేట్ పరిధిలో ఘనంగా నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు గురువారం ముగిశాయి. మాసోత్సవాల సందర్భంగా వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌ల పరిధిలో పోలీసు సిబ్బంది పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీ కమిషనరేట్ కార్యాలయంలో నుంచి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కమిషనరేట్ పరిధిలోని మూడు ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌ల అధికారులు ఆటో డ్రైవర్లకు, చిరువ్యాపారులకు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తరుచుగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ మాసోత్సవాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, వాహన పత్రాల పరిశీలన నిర్వహించడం వల్ల విజయవంతం చేయడం జరిగిందని సీపీ వెల్లడించారు.

బెల్టుషాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 15: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని గీసుగొండ మండలం అనంతారం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టుషాపుపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడులు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. అనంతారం గ్రామంలో మరిపూడి శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంట్లో రూ. 4వేల విలువ గల మద్యాన్ని పట్టుకున్నట్టు వెల్లడించారు. పట్టుకున్న మద్యాన్ని స్థానిక పోలీసులకు అప్పగించినట్టు వెల్లడించారు. అలాగే మామునూరు పోలీసుస్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో బెల్టు షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించారు. ఈ దాడులలో మాచెర్ల శ్రీధర్ అనే వ్యక్తి ఇంట్లో డంప్ చేసి విక్రయిస్తున్న రూ.4200 విలువగల మద్యాన్ని పట్టుకున్నట్టు వెల్లడించారు. అదేవిధంగా అదే తిమ్మాపూర్ గ్రామంలో మండల రమేష్ అనే వ్యక్తి ఇంట్లో నుంచి విక్రయిస్తున్న రూ. 8.300 విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యాన్ని మామునూరు పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేసినట్టు ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులు ఉన్నారు.

సైబర్ గాళ్ల మోసం

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 15: ఆన్‌లైన్‌లో హెర్బల్ లైఫ్ ప్రొడక్ట్ వచ్చిందని నమ్మించిన సైబర్ నేరస్తులు విశ్రాంత ఉద్యోగి నుంచి నగదు కాజేశారు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ లష్కర్‌బజార్‌కు చెందిన ఓ విశ్రాంత ఫారెస్ట్ ఉద్యోగికి ఈ నెల 6న తన సెల్‌ఫోన్‌కు హెర్బల్ లైఫ్ గురించి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి కొరియర్ పంపిస్తున్నామని నమ్మించాడు. కొరియర్‌లో వచ్చిన స్కాచ్ కార్డును స్కాన్ చేసి ఉచితంగా హెర్బల్ పౌడర్ ఉచితంగా పొందవచ్చని ఫోన్‌లో చెప్పారు. దీంతో సదరు ఉద్యోగి గుర్తు తెలియని వ్యక్తులు చెప్పినట్టు పార్సిల్ ప్యాకెట్‌ను తీసి స్కాన్ చేయడంతో తన బ్యాంకు నుంచి రూ.50 వేలు డ్రా చేసినట్టు మెస్సేజ్ వచ్చింది. మోసపోయినట్టు గుర్తించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

మద్యం మత్తులో పెట్రోల్ పోసి దాడి

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 15: మద్యం మత్తులో ఒకరిపై పెట్రోల్ పోసి నిప్పు అంటించిన ఘటనలో చందు అనే మేస్త్రీకి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో ఎంజీఎంకు తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరుకు చెందిన బాలాజీ, చందు అనే ఇద్దరు వ్యక్తులు కొంతకాలంగా యూనివర్సిటీ రోడ్‌లోని తులసీబార్ సమీపంలో నివాసం ఉంటూ మేస్త్రీ పనులు చేస్తున్నారు. గురువారం తులసీబార్ వద్ద ఆటోలో కూర్చుని మద్యం సేవించారు. ఈ క్రమంలో వారి మధ్య ఘర్షణ చోటుచేసుకుంటుంది. ఆటోలో ఉన్న పెట్రోల్‌ను బాలాజీ అనే వ్యక్తి చందుపై పోసి నిప్పంటించాడు. చందు అరుపులు విన్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించి 108లో ఎంజీఎంకు తరలించారు. తీవ్ర గాయాలతో చందు ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని కేయూ ఎస్ఐ సురేష్ ధ్రువీకరించారు. చందు చికిత్స పొందుతున్నాడని, వారి కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి విచారణ చేస్తామని ఎస్ఐ సురేష్ తెలిపారు.

నేటి సమ్మెలో బల్దియా పారిశుధ్య కార్మికులు

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 15: కార్మిక సంఘాలు శుక్రవారం దేశవ్యాప్తంగా చేపట్టే సమ్మెలో బల్దియా పారిశుధ్య కార్మికులు పాల్గొననున్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు సమ్మెలో పాల్గొన్న నున్నట్లు బల్దియా కార్మికసంఘాలు తెలిపాయి. ఈ క్రమంలో నగరంలో పారిశుధ్య సేవలు ఒక రోజు స్తంభించనున్నాయి. కార్మికుల సమ్మె నోటీసు ఇచ్చిన క్రమంలో మరోవైపు బల్దియా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు.

సమాజ శ్రేయస్సును కాంక్షించిన సేవాలాల్

కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్


సేవాలాల్ జయంతి సభలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 15: సమాజ శ్రేయస్సును కాంక్షించిన మహానీయుడు సేవాలాల్ మహారాజ్ ఆశయ సాధనకు పాటుపడాలని కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ పిలుపునిచ్చారు. గురువారం కేయూ ఆడిటోరియం గ్రౌండ్ ఎదుట సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని ఎస్సీ, ఎస్టీ సెల్ నేతృత్వంలో మహాబోగ్ భండార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ కర్ర సదాశివ్ అధ్యక్షతన జరిగిన సభలో వీసీ రమేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గొప్ప సంస్కర్త సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. మానవ నాగరికతకు మూలం బంజారాలని, వారు స్థిర జీవనానికి నాందిపలికి వ్యవసాయాన్ని పరిచయం చేశారని చెప్పారు. సేవాలాల్ ఆధ్యాత్మిక గురువుగా, స్ఫూర్తి ప్రదాతగా నేటి తరానికి ఆదర్శమని చెప్పారు. వర్సిటీలో అమ్మాయిలకు వసతి కల్పనలో ముందున్నామని, చర్చలతో సమస్యలను పరిష్కరించుకోవాలని చెప్పారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. విలువలు, నైతికత అంశాలు ప్రస్తుత సమాజానికి అవసరమన్నారు. వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.హన్మంతు మాట్లాడుతూ.. సేవాలాల్ అహింసా సిద్ధాంతాన్ని వివరించారు. ఆయన బోధనలను మరువకూడదని చెప్పారు.

ఈ కార్యక్రమంలో పురోహితులు రామచందర్‌నాయక్, ప్రొఫెసర్ జి.వీరన్ననాయక్, డాక్టర్ బి.దీపాజ్యోతి, డాక్టర్ ఎల్.రాజు, ఎల్.యాదగిరితో పాటు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందు భక్తి శ్రద్ధలతో నిర్వహించిన బోగ్ బండార్ పూజలను వీసీ ప్రొఫెసర్ రమేశ్ ప్రారంభించారు. సభలోని అందరికీ సంప్రదాయ ప్రసాద వితరణ చేశారు.

● హనుమకొండ అర్బన్: సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సంత్ సేవాలాల్ చిత్రపటానికి డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ ఒక్క బంజారా సామాజిక వర్గానికే కాకుండా అన్ని కులాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. ధూమపానం, మద్యపానం, మాంసాహారం, జంతుబలికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ వాణిశ్రీ, బి.చంద్రకళ, కె.యాదానాయక్, బి.దేవ్‌సింగ్, బి.కిషన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'నిట్'లో నేటినుంచి అథ్లెటిక్స్

కాజీపేట, ఫిబ్రవరి 15 : వరంగల్ నిట్‌లో శుక్రవారం నుంచి 18 వరకు అథ్లెటిక్స్, ఖోఖో, టోర్నమెంట్స్ నిర్వహించనున్నట్లు నిట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ దయానిధి తెలిపారు. దేశంలోని వివిధ నిట్‌ల నుంచి 796 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంతర్జాతీయ అథ్లెట్, అర్జున అవార్డు గ్రహీత జోసఫ్ జి. భాస్కర్ హాజరుకానున్నట్లు తెలిపారు.

బ్యాంకు సిబ్బందికి హెల్మెట్ల పంపిణీ


హెల్మెట్లతో యూనియన్ బ్యాంక్ సిబ్బంది

సుబేదారి, ఫిబ్రవరి 15: ములుగురోడ్‌లోని నాగార్జున హోండా షోరూమ్‌లో యూనియన్ బ్యాంక్ సిబ్బంది గురువారం ఒకేసారి 37 హోండా యాక్టీవా స్కూటర్‌లను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ సిబ్బందికి నాగార్జున హోండా షోరూమ్ ప్రతినిధులు 37 హెల్మెట్లు ఉచితంగా ఇచ్చారు. నాగార్జున హోండా షోరూమ్ ఎం.డి. అరుణ్ కుమార్, మేనేజర్ సిద్ధార్థ, ఏరియా ఇన్‌చార్జి అమిత్ , యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ పి.సత్యం, డిప్యూటీ రీజినల్ హెడ్ రంగయ్యానాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమన్వయంతో మేడారం జాతరను విజయవంతం చేయాలి

సీపీ అంబర్ కిశోర్ ఝా


అలంకార్ జంక్షన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ, అధికారులు

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 15: సమన్వయంతో మేడారం మహా జాతర విజయవంతం చేయాలని సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. మేడారం జాతర నేపథ్యంలో హనుమకొండ, వరంగల్‌లోని పలు ప్రాంతాలను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌తోపాటు అలంకార్ జంక్షన్, ములుగురోడ్, అలంకార్ జంక్షన్, పెద్దమ్మగడ్డ, ఆరెపల్లి, వరంగల్ బస్టాండ్ ప్రాంతాలను కలెక్టర్, సీపీ పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేడారం జాతరకు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరెపల్లి శివారులో మేడారం వెళ్లే భక్తులకు హాల్టింగ్ పాయింట్లను పరిశీలించినట్లు తెలిపారు. వరంగల్ బస్టాండ్ నుంచి కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి మేడారం వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్‌జీ, సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.ఎ.బారీ, ఆర్టీసీ ఆర్ఎం శ్రీలత, ఏసీపీలు భోజరాజు, దేవేందర్‌రెడ్డి, కిరణ్ కుమార్, బోనాల కిషన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్, సీతారెడ్డి, సుజాత, ఆర్అండ్‌బీ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

హిమ చిట్‌ఫండ్ వార్షికోత్సవం


కేక్ కట్ చేస్తున్న చిట్‌ఫండ్ మేనేజర్ బిల్లా గోపాల్ రెడ్డి హేమలత

సుబేదారి, ఫిబ్రవరి 15: హనుమకొండలోని హిమ చిట్ ఫండ్ 33వ వార్షికోత్సవం గురువారం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిమ చిట్‌ఫండ్ మేనేజర్ బిల్లా గోపాల్‌రెడ్డి హేమలత కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సంస్థ వ్యాపార ప్రయోజనాలకన్నా సభ్యుల ఆర్థిక అవసరాలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ చిట్ ఫండ్‌ను 33 యేళ్లుగా విజయవంతంగా నడిపిస్తున్నామన్నారు. ఈ వార్షికోత్సవ వేడుకలలో చిట్‌ఫండ్ మేనేజర్ హరికిషన్‌తో పాటు చంద్రమౌళి, జయంత్, శ్రీనివాస్, లలిత, రజిత, లీలా, మంజుల, రవి, సమ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు చైతన్య యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవం

నయీంనగర్, ఫిబ్రవరి 15 : చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవాన్ని ఈ నెల 17న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఛైర్మన్ డాక్టర్ సి.హెచ్.వి.పురుషోత్తంరెడ్డి తెలిపారు. హనుమకొండ కిషన్‌పురలోని చైతన్య యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఛైర్మన్ హాజరై వివరాలు వెల్లడించారు. స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మాజీ సెక్రటరీ ఎస్.చంద్రశేఖర్, గౌరవ అతిథులుగా మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎ.కళ్యాణ్ చక్రవర్తిలు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా చైతన్య యూనివర్సిటీ 24 సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు విశ్వవిద్యాలయంలో 88 మంది అధ్యాపకుల, 9 కో-సూపర్‌వైజర్స్ పర్యవేక్షణలో 544 మంది పరిశోధకులు పీహెచ్‌డీ పరిశోధనలు కొనసాగిస్తున్నారని, 45 మంది పరిశోధకులు పీహెచ్‌డీ పరిశోధనల సిద్ధాంత గ్రంథాలను సమర్పించగా 12 మంది పరిశోధకులు పీహెచ్‌డీ పట్టాలను పొందినట్లు ఆయన తెలిపారు. ఈ స్నాతకోత్సవంలో 756 మంది విద్యార్థులు తమ డిగ్రీలను పొందనున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ఈ.విక్రమ్‌రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్ సీ.హెచ్.సాత్వికారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.రవీందర్, ఓఎస్డీ డాక్టర్ కె.వీరవెంకటయ్య, డీన్ ప్రొఫెసర్ ఎం.సుందర్‌రామ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, పీఆర్‌వో గాదె రాంబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటాలి

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 15: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతీ ఇంటికి చేరవేస్తూ, రానున్న ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. గురువారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 48వ డివిజన్‌లో బస్తీ చలో అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి మోదీ తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేందుకే ఈకార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని 130, 131 పోలింగ్ బూత్‌లలో పర్యటిస్తూ మహిళలు, కుల పెద్దలకు కరపత్రాలు అందజేస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తులపై కేసు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 15: కులం పేరుతో దూషించిన ఇద్దరు వ్యక్తులపై హనుమకొండ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ నయీంనగర్‌కు చెందిన సోరుపాక మన్విత్ అనే వ్యక్తి అదే ప్రాంతంలో ఉండే మహిళను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరి మధ్య సఖ్యత లేకపోవడంతో కొంత కాలానికి గొడవలు తలెత్తాయి. ఇద్దరు అప్పగి నుంచి వేరుగా ఉంటున్నారు. విడాకుల కోసం కోర్టులో కూడా ఒకరిపై ఒకరు పిటీషన్ వేసుకున్నారు. ఈ క్రమంలో మహిళ కుటుంబ సభ్యులు అనుపమ, మంజుల గురువారం మన్విత్ ఇంటికి వెళ్లి కులం పేరుతో దూషించి విడాకులు ఇవ్వాలని, లేదంటే చంపేస్తామని బెదిరించారు. దీంతో ప్రాణభయం ఉందని తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

పెరోల్‌పై విడుదలైన వారిపై కేసు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 15: హైదరాబాద్ చర్లపెల్లి జైలు నుంచి పెరోల్‌పై బయటకు వచ్చిన ఇద్దరు పాత నేరస్తుల ఆచూకీ లేకపోవడంతో హెడ్‌వార్డర్ హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండలో జరిగిన ఓ ఘటనలో రాయపురకు చెందిన జోగు సురేష్, కుంట్ల శివ అనే ఇద్దరికి కోర్టు శిక్ష విధించింది. కొద్ది రోజుల కిందట వారు పెరోల్‌పై బయటకు వచ్చారు. తిరిగి గడువులోపు వెళ్లకపోవడంలో వారిని తీసుకురావాలని చర్లపెల్లి జైలు సిబ్బందిని ఆదేశించారు. కాగా, చర్లపెల్లి జైలు హెడ్ వార్డర్ టి.బాబుగౌడ్ గురువారం హనుమకొండకు వచ్చి ఇద్దరు ఖైదీల ఇళ్లకు వెళ్లి చూడగా వారు కనిపించలేదు. దీంతో హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేసి మిస్సింగ్ కేసు నమోదు చేయాలని తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

వరంగల్ ట్రాఫిక్ ఏసీపీగా సత్యనారాయణ

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 15: వరంగల్ ట్రాఫిక్ ఏసీపీగా టి.సత్యనారాయణను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ రవిగుప్త గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సత్యనారాయణ హైదరాబాద్ డీజీ అటాచ్‌లు ఉండగా వరంగల్ ట్రాఫిక్ ఏసీపీగా పోస్టింగ్ ఇచ్చారు. సత్యనారాయణ గతంలో హనుమకొండ ఇన్‌స్పెక్టర్‌గా వివిధ ప్రాం తాల్లో ఎస్ఐగా వరంగల్‌కు సుపరిచితుడు.

మేడారం బస్టాండ్ ఏర్పాట్ల పరిశీలన

కాజీపేట, ఫిబ్రవరి 15: మేడారం జాతర కోసం కాజీపేట రైల్వే స్టేడియంలోని బస్టాండ్ ఏర్పాట్లను గురువారం కలెక్టర్ సిక్తా పట్నాయక్, సీపీ అంబర్‌కిషోర్ ఝాలు పరిశీలించారు. బస్టాండ్ ఏర్పాట్లు, క్యూలైన్‌లు, బుకింగ్ కౌంటర్‌ల గురించి ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వీరి వెంట జిల్లా ఆర్టీసీ, పోలీస్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు


పుష్పగుచ్ఛం అందిస్తున్న హనుమకొండ ఎక్సైజ్ సీఐ దుర్గాభవాని

మనుమకొండ క్రైం, ఫిబ్రవరి 15: ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా భారీగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం వరంగల్ అర్బన్ జిల్లా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఐదుగురు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు బాధ్యతలు చేపట్టారు. హనుమకొండ సీఐగా దుర్గాభవాని, ఖిలావరంగల్ సీఐగా కె.రాజు, వరంగల్ అర్బన్ స్టేషన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎక్సైజ్ డీటీఎఫ్ సీఐ ఆనందరావుతో పాటు ఐఎంఎఫ్ఎల్ గుండ్లసింగారం డిపో ఇన్‌స్పెక్టర్ తిరుమల బాధ్యతలు చేపట్టారు. వీరు వరంగల్ అర్బన్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ కార్యాలయంలోని ఈఎస్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చాలు అందించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విధుల పట్ల క్రమశిక్షణతో మెదులుగా అక్రమ మద్యం, బెల్టుషాపులను నియంత్రించేందుకు అధికారులు అందరూ సమిష్టి కృషి చేయాలని నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు సూచించారు.

రేడియో కేంద్రంలో ఘనంగా కిసాన్ దివస్

ఆదర్శ రైతులకు ఘన సన్మానం


రైతులను సన్మానిస్తున్న అధికారులు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 15: వరంగల్ ఆకాశవాణి రైతు దిక్సూచి అని ప్రాంతీయ పరిశోధనా స్థానం సహ సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి అన్నారు. ఆకాశవాణి వరంగల్ రేడియో కేంద్రం ఆధ్వర్యంలో గురువారం కేయూ రోడ్డులోని ఆకాశవాణిలో జాతీయ కిసాన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఆకాశవాణి కార్యక్రమ నిర్వాహణాధికారి ఇల్లందుల రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమారెడ్డి హాజరై మాట్లాడారు. ఆకాశవాణి రేడియో కేంద్రాల ద్వారా ప్రసారమయ్యే కార్యక్రమాల ద్వారా చాలా మంది ప్రజలు అవగాహన పొంది మంచి పంట దిగుబడులు తీస్తున్నారని అన్నారు. శ్రవణ సాధనమైన రేడియో ద్వారా మనిషి శరీరంలో ఉత్సాహం వచ్చి మంచి ఆరోగ్యాన్ని పొందుతాడని అన్నారు.

కార్యక్రమ నిర్వాహకుడు ఇల్లందుల రవికుమార్ మాట్లాడుతూ.. 2004 నుంచి నుంచి రెండు దశాబ్దాలపాటు ఆకాశవాణిలో కిసాన్ దివస్ నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. అనంతరం రైతులు శాస్త్రవేత్తలను కలిసి పంటలపై వారి అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన 14మంది ఆదర్శ రైతులకు ఉత్తర రైతులుగా గుర్తించి ఘనంగా సన్మానించారు. కిసాన్‌వాణి వాఖ్యాతలు డాక్టర్ పి.ఎల్లయ్య, ఎ.సదానందం, ఎం.చిరంజీవి, పి.కుమార్, పంకజ్ మోహన్‌ను శాలువా, బోకేలు అందించి సత్కరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఉపసంచాలకుడు అవినాష్‌వర్మ, పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, పశువైద్య కళాశాల ఆచార్యులు సురేష్ రాథోడ్, ఆకాశవాణి ఇంజనీరింగ్ విభాగం అధిపతి వి.రాంరెడ్డి, సిబ్బంది అనిల్‌ప్రసాద్, నరేష్‌కుమార్, కుమారస్వామి, శివశంకర్, శ్రీనివాసచార్య, శ్రీనివాస్‌రాజు, ఉషశ్రీ, బాలరాజు, రామ్మూర్తి, విజయలక్ష్మి, రామ్మోహన్, చందు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 15: తెలంగాణ ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి రూ.10వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతోపాటు ఫోరం వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, కేయూ విద్యార్థి, ఉద్యమకారుల కన్వీనర్ డాక్టర్ చిర్ర రాజు మాట్లాడారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసి వారిని గుర్తించి గుర్తింపు కార్డులను జారీ చేయాలని అన్నారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వడంతో పాటు ఉద్యమకాలంలో పెట్టిన కేసులన్నింటినీ వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బాషబోయిన రవీందర్ యాదవ్, రాష్ట్ర, జిల్లా నాయకులు తోకల సత్యపాల్‌రెడ్డి, పబ్బు రాజేందర్, రహిమున్నీసా బేగం, పోతు జ్యోతిరెడ్డి, పద్మ, విజయలక్ష్మి, అనంతలక్ష్మి, సులోచన, సురేందర్ రెడ్డి, గౌస్ పాషా, చేరాలు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కళ్ల ముందే కన్నతండ్రి మరణం

● విలవిల్లాడిన కూతురు

● దండేపల్లిలో బైక్‌ను ఢీకొన్న ఇసుక ట్రాక్టర్


సంఘటన స్థలంలో మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఎల్కతుర్తి, ఫిబ్రవరి 15: కళ్ల ముందే కన్న తండ్రి తలపై నుంచి ట్రాక్టర్ వెళ్లడం, తల పగిలి విలవిలా కొట్టుకుంటూ ప్రాణాలు వదలడాన్ని చూసిన ఆ కూతురు ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. 'నాన్న లే..' అంటూ చేస్తున్న రోదనలు పలువురిని కంటతడిపెట్టించాయి. ద్విచక్ర వాహనంపై కూతురిని కళాశాలలో దింపడం కోసం తీసుకెళుతుండగా ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘటన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

దండేపల్లి గ్రామానికి చెందిన వర్దెల్లి పురుషోత్తమ్‌రావు (46) - శైలజా దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. పెద్ద కుమార్తె స్మరణ హసన్‌పర్తి శివారులోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్, రెండో కుమార్తె స్పందన అదే కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతున్నారు. ఇద్దరు కుమార్తెలను ప్రతీరోజు కళాశాలకు ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి తిరిగి తీసుకుని వస్తాడు. గురువారం చిన్న కూతురు స్పందనకు పరీక్షలు ఉండడంతో ఆమెను కళాశాలలో దింపడం కోసం ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్తున్నాడు. ఈ క్రమంలో కమలాపూర్ మండలం ఉప్పల్‌కు చెందిన ట్రాక్టర్ ఇసుక లోడ్‌తో బావుపేట వైపు వస్తోంది. వెనుక నుంచి ట్రాక్టర్ రాకను గమనించిన పురుషోత్తంరావు తన ద్విచక్ర వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపాడు. ద్విచక్ర వాహనాన్ని దాటే క్రమంలో ట్రాక్టర్ ముందు భాగం పురుషోత్తంరావుకు తగలడంతో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న కూతురు స్పందన పొలాల్లో పడిపోగా పురుషోత్తంరావు రోడ్డుపై పడ్డాడు. దీంతో ట్రాక్టర్ టైరు తలపై నుంచి వెళ్లడంతో హెల్మెట్ సైతం నుజ్జునుజ్జై తల పగిలి పురుషోత్తంరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో సంఘటన స్థలానికి చేరుకున్నారు. తండ్రి మృతదేహంపై కూతుళ్లు పడి రోదిస్తున్న రోదనలు మిన్నంటాయి. సంఘటన వద్దకు వచ్చిన గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు.

మూడు రాజ్యసభ సీట్లు ఏకగ్రీవమే..!

- అధికారికంగా ప్రకటించడం లాంఛనమే..!!
- మూడేసి సెట్లు సమర్పించిన రేణుకాచౌదరి, అనిల్‌కుమార్
- రెండు సెట్లు అందజేసిన వద్దిరాజు రవిచంద్ర





హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న మూడు రాజ్యసభ సీట్లు ఏకగ్రీవమేనని స్పష్టమవుతోంది. మూడు స్థానాలకు గాను కాంగ్రెస్ నుంచి కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, యూత్‌కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్.. బీఆర్ఎస్ నుంచి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర గురువారం అసెంబ్లీలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డికి నామినేషన్లను అందజేశారు. రేణుకాచౌదరి, అనిల్‌కుమార్ యాదవ్‌లు మూడు సెట్ల చొప్పున, వద్దిరాజు రవిచంద్ర రెండు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఒక్కో నామినేషన్ సెట్‌పై సదరు అభ్యర్థిని ప్రతిపాదిస్తూ పది మంది చొప్పున ఎమ్మెల్యేలు సంతకాలు చేశారు. ఈ లెక్కన రేణుకాచౌదరి, అనిల్‌కుమార్ నామినేషన్ సెట్లపై మొత్తం 60 మంది ఎమ్మెల్యేలు, వద్దిరాజు నామినేషన్‌పై 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంతకాలు చేశారు. నామినేషన్ల సందర్భంగా రేణుకాచౌదరి, అనిల్‌కుమార్ వెంట సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, రేణుకాచౌదరి భర్త శ్రీధర్ చౌదరి ఉన్నారు. అంతకు ముందే.. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వెంటరాగా.. వద్దిరాజు తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. మూడు రాజ్యసభ స్థానాలకు గాను.. మూడు నామినేషన్లే రావడంతో.. వారి ఎన్నిక ఏకగ్రీవమే కానుంది. అయితే.. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం స్క్రూటినీ జరుగుతుంది. ఉపసంహరణకు మంగళవారం సాయంత్రం వరకు గడువు ఉండగా.. అదే రోజు సాయంత్రం ముగ్గురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారు.

కొబ్బరి అభివృద్ధి ప్రాంతీయ బోర్డు ఏర్పాటు చేయండి

- కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. రాష్ట్రంలో 27 జిల్లాల్లో మొత్తం 2,233 ఎకరాలలో కొబ్బరి సాగవుతుండగా ఏడాదికి 94.92 లక్షల కాయల ఉత్పత్తి జరుగుతున్నట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,358 ఎకరాలలో, ఖమ్మం జిల్లాలో 586 ఎకరాలలో కొబ్బరి తోటలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నపుడు కొబ్బరి సాగు విస్తరణ, అభివృద్ధి కార్యకలాపాలను చూసేందుకు హైదరాబాద్‌లో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఉండేదని, రాష్ట్ర విభజన తర్వాత, ఆ కార్యాలయాన్ని ఏపీలోని కృష్ణా జిల్లా విజయవాడకు మార్చినట్లు తుమ్మల తెలిపారు. తెలంగాణలో కొబ్బరి సాగు విస్తరణకు అవసరమైన ప్రోత్సాహం, సాంకేతిక పరిజ్ఞానం, సలహాలు, ఆర్థిక సహాయం అందించడం, కొబ్బరి మార్కెటింగ్ పరిజ్ఞానం తదితర అంశాల్లో రైతులకు చేయూత అందించాల్సిన అవసరం ఉన్నందున, తెలంగాణలో ప్రత్యేకంగా కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటుచేస్తే రాష్ట్రంలో కొబ్బరి సాగు విస్తరణ, అభివృద్ధి వేగంగా జరుగుతుందని కేంద్రానికి రాసిన లేఖలో తుమ్మల వివరించారు.

మేడారానికి కేంద్రం మొండిచేయి

తెలంగాణ కుంభమేళాకు పైసా ఇవ్వని వైనం.. జాతీయ హోదా ప్రకటనపై దాటవేత ధోరణి

- ప్రత్యేక రైలు సర్వీసులనూ నడిపించని రైల్వే
- కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా కిషన్‌రెడ్డి.. ఉన్నా.. మహా జాతరకు కానరాని చేయూత


సమ్మక్క, సారలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

వరంగల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ.. తెలంగాణ కుంభమేళా.. ఐదారు రాష్ట్రాల నుంచి కోటిన్నర మందికి పైగా భక్తులు తరలివచ్చే మేడారం మహా జాతరపై కేంద్రం శీతకన్ను వేస్తోంది. గత రెండు జాతరలకు కాస్తో కూస్తో నిధులిచ్చిన సర్కారు.. ఈసారి అది కూడా ఇవ్వలేదు. మరోవైపు మేడారం మహా జాతరకు జాతీయ హోదాపై 2018 నుంచి కేంద్రం దాటవేస్తూనే ఉంది. వివిధ రాష్ట్రాల నుంచి ఈ వేడుకకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక రైళ్లను నడిపించే రైల్వే శాఖ ఈసారి ఆ ఊసే ఎత్తలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం మేడారం మహా జాతరపై చిన్నచూపు చూస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జాతీయ హోదాపై మౌనం..

ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే మేడారం మహా జాతరకు తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి జాతరకు రూ.110 కోట్లు కేటాయించింది. 2020 నాటి జాతర కోసం కేంద్ర ప్రభుత్వం రూ.6.10 కోట్లు, 2022లో రూ.2.50 కోట్లు విడుదల చేసింది. ప్రస్తుతం కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా మన రాష్ట్రానికి చెందిన బీజేపీ ముఖ్య నేత కిషన్‌రెడ్డి ఉన్నారు. అయినా మేడారం జాతరకు ఈ ఏడాది ఒక్కపైసా కూడా ఇవ్వకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 1996లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మేడారం మహా జాతరకు రాష్ట్ర పండుగగా గుర్తింపు ఇచ్చింది. దీంతో భక్తుల సంఖ్య భారీగా పెరగటంతో జాతరకు జాతీయ హోదా ఇవ్వాలనే డిమాండ్ 2002 నుంచి ఊపందుకుంది. 2018లో మేడారానికి జాతీయ హోదా ఇచ్చేందుకు అవసరమైన అన్ని రకాల డాక్యుమెంట్లను గిరిజన సంక్షేమ శాఖ కేంద్రానికి సమర్పించింది. కానీ, ఆ ఏడాది రావాల్సిన జాతీయ హోదా ప్రకటనపై కేంద్రం వెనక్కి తగ్గింది. అప్పటి నుంచి మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలని రాష్ట్ర సర్కారు డిమాండ్ చేస్తున్నా కేంద్రం మౌనం వహిస్తోంది. తమ పార్టీ అధికారంలోకి వస్తే మేడారం జాతరకు జాతీయ హోదా తెస్తామని ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతలు హామీ ఇచ్చారు. ప్రస్తుతం కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రం నుంచి కిషన్‌రెడ్డి పర్యాటక మంత్రిగా ఉన్నందున.. మేడారం జాతరకు జాతీయ హోదా తెచ్చేందుకు కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు.

జాతర రైళ్లు ఉన్నట్టా.. లేనట్టా..?

మేడారం జాతరకు తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు వస్తారు. వీరు మేడారం చేరుకునేందుకు కేంద్రం సరైన ఏర్పాట్లు చేయటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా రైళ్ల పొడిగింపుతో పాటు జాతరకు ప్రత్యేక రైళ్లను నడిపించాల్సి ఉంది. 2014 నుంచి 2022 వరకు ఐదు జాతరలకు రైల్వే శాఖ 16 ప్రత్యేక రైళ్లను నడిపింది. కాగజ్‌నగర్-కాజీపేట, వరంగల్-సికిందరాబాద్, ఖమ్మం-వరంగల్-కాగజ్‌నగర్ మధ్య ప్యాసింజర్ రైళ్లను అందుబాటులో ఉంచింది. అయితే ఈసారి రైల్వేశాఖ మేడారం జాతరకు ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్టుగా ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేవన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక తెలంగాణ జిల్లాలతో పాటు ఏపీ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతామని గతంలో కేంద్రం ఇచ్చిన హామీ నీటి మూటగానే మిగిలిపోయింది. ఇప్పటికైనా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ ఎంపీలు చొరవ తీసుకుని ప్రత్యేక రైళ్లను నడిపించేలా కేంద్రాన్ని ఒప్పించాలని భక్తులు కోరుతున్నారు.


మహాజాతర ఉత్సవ కమిటీ సభ్యులతో మంత్రి సీతక్క

ప్లాస్టిక్ రహితంగా మేడారం జాతర

- భక్తులు, అధికారులు సహకరించాలి: మంత్రి సీతక్క
- మేడారం ఉత్సవ కమిటీతో ప్రమాణం
- అమ్మలను దర్శించుకున్న చందా వంశీయులు

ములుగు, ఫిబ్రవరి 15: మేడారం మహాజాతరను ప్లాస్టిక్ రహితంగా జరుపుకుందామని, ఇందుకోసం భక్తులు, అధికారులు సహకరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్‌తో కలిసి గురువారం ఆమె మేడారంలో సెక్టోరియల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 21 నుంచి ప్రధాన జాతర జరుగుతుండగా ఇప్పటికే లక్షలాది మంది భక్తులు సమ్మక్క, సారలమ్మ దర్శనానికి వస్తున్నారని, పారిశుధ్యం, తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని సూచించారు. జాతర జరిగే ప్రదేశాన్ని 10 సెక్టార్లు, 60 సబ్ సెక్టార్లుగా విభజించామని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ఈనెల 19న అధికారులంతా జాతర విధుల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. జంపన్నవాగులో పుణ్యస్నానాల కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఎండలు ఎక్కువగా ఉన్నందున తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. కాగా అర్రెం లచ్చుపటేల్ చైర్మన్‌గా, 13 మంది డైరెక్టర్లు, ఒక ఎక్స్ అఫీషియో సభ్యుడితో కూడిన మేడారం ఉత్సవ కమిటీ కొలువుదీరింది. వారితో మంత్రి సీతక్క పదవీ ప్రమాణం చేయించారు. కాగా, వైద్యారోగ్య శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు మేడారం వనదేవతలను దర్శించుకున్నారు. భక్తులకు కల్పించే వైద్య సౌకర్యాలను సమీక్షించారు. వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయకుమార్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(అకడమిక్) డాక్టర్ శివరామకృష్ణ, డీఎంహెచ్‌వో అప్పయ్యలతో కలిసి తాత్కాలిక ఆస్పత్రి, మెడికల్ క్యాంపులను పరిశీలించారు.

లక్షకు పైగా తరలివచ్చిన భక్తులు

మేడారం సమ్మక్క, సారలమ్మలను భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. తెలంగాణలోని నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా తరలివచ్చారు. వనదేవతల గద్దెలను నేరుగా దర్శించుకొని ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. గురువారం మేడారం సమ్మక్క, సారలమ్మలను లక్ష మందికి పైగా భక్తులు దర్శించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. సమ్మక్క పుట్టినిల్లయిన బయ్యక్కపేట చందా వంశీయులు తమ ఇంటి ఆడబిడ్డకు మొక్కులు చెల్లించారు. ప్రధాన పూజారి చందా పరమయ్య-లక్ష్మి దంపతులు ఒడిబియ్యం, పట్టుచీరను సమర్పించారు. సంప్రదాయం ప్రకారం మహాజాతరకు ముందు సమ్మక్కకు చందా వంశీయులు తొలిమొక్కు చెల్లించేందుకు మేడారంకు రాగా దేవాదాయ శాఖ అధికారులు వారికి ఘనస్వాగతం పలికారు. సమ్మక్క, సారలమ్మలకు పసుపు కుంకుమలు, చీర, కుడుకలు, బెల్లంతో కూడిన సారెను చందా వంశీయులు సమర్పించారు.


అగ్రహారంలో నేత కార్మికుడి విగ్రహానికి పూల మాల వేస్తున్న సంజయ్

బీఆర్ఎస్ మునిగిపోయే నావ

- మెడ మీద తలకాయ ఉన్నవారెవరూ
- ఆ పార్టీతో పొత్తు పెట్టుకోరు: బండి సంజయ్

సిరిసిల్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మునిగిపోయే నావ అని, మెడకాయ మీద తలకాయ ఉన్న వారెవరూ ఆ పార్టీతో పొత్తు పెట్టుకోరని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం వద్ద బండి సంజయ్ తాను చేపట్టిన ప్రజాహిత తొలిదశ యాత్రను ముగించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుడి విగ్రహానికి పూల మాల వేసి సంఘీభావం ప్రకటించారు. అనంతరం బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా బీజేపీ 400 సీట్లు గెలుచుకుంటుందని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవాల్సిన కర్మ తమకు లేదని అన్నారు. మోదీ హవాను తట్టుకోలేక బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి బీజేపీని దెబ్బ తీసేందుకు విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని బహిష్కరించిన కాంగ్రెస్‌ను దేశ ప్రజలు వెలివేయబోతున్నారని అన్నారు. కొందరు బీఆర్ఎస్ సీనియర్ నేతలు బీజేపీలో చేరబోతున్నారని తెలుసుకున్న కేసీఆర్ పొత్తు పేరుతో నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు డ్రామాలాడుతూ ప్రజలను దారి మళ్లిస్తున్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్షల కోట్ల ప్రజా ధనాన్ని వృధా చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను వెంటనే అరెస్టు చేయాలని, ఆయన కుటుంబ ఆస్తులను జప్తు చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

26 మంది డీఎస్పీల బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో డీఎస్పీల బదిలీలు కొనసాగుతున్నాయి. మూడో విడత బదిలీల్లో భాగంగా రాష్ట్రంలో 26 మంది డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ రవిగుప్తా గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో నాలుగు రోజులుగా పోలీస్ శాఖలో బదిలీలు కొనసాగుతున్నాయి. ఐపీఎస్ మొదలుకొని నాన్‌కేడర్ ఎస్పీలు, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలతో పాటు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల వరకు బదిలీలు జరిగాయి. కోడ్ పరిధిలోకి వచ్చే అధికారులు, సిబ్బంది అందరిని బదిలీ చేసినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. అయితే సాధారణ బదిలీల్లో భాగంగా అవసరం మేరకు త్వరలో మరికొంత మంది డీఎస్పీలు, ఇతరుల బదిలీలు జరిగే అవకాశం ఉందన్నారు.

ఒక్క భూకేటాయింపు రద్దు కోసం ప్రత్యేక చట్టమా?

- ఐఎంజీ కేసులో వాదనలు

ఐఎంజీ అకాడమీస్ భారత్‌కు చేసిన భూకేటాయింపుల రద్దు అంశంపై హైకోర్టులో గురువారం వాదనలు కొనసాగాయి. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఆ సంస్థ తరఫున న్యాయవాది వెంకటరమణ వాదిస్తూ.. 2003లో క్రీడా సౌకర్యాల అభివృద్ధికి ప్రభుత్వం హైదరాబాద్ సమీపంలో 850 ఎకరాలను ఐఎంజీ భారత్‌కు కేటాయించిందని తెలిపారు. తర్వాత ఏర్పడిన ప్రభుత్వం ఎంవోయూ, భూకేటాయింపు రద్దు కోసం ఏకంగా చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. కేవలం ఒక్కరిని ఉద్దేశించి తీసుకొచ్చిన చట్టం చెల్లదని పేర్కొన్నారు. తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా పడింది.

బండ్లగూడ మున్సిపల్ ఛైర్‌పర్సన్ అవిశ్వాసంపై స్టే

బండ్లగూడ మున్సిపల్ ఛైర్‌పర్సన్ బుర్ర మహేందర్ గౌడ్‌పై మున్సిపల్ సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై హైకోర్టు గురువారం స్టే విధించింది. నిబంధనలకు విరుద్ధంగా కలెక్టర్ సమావేశ తేదీని నిర్ణయించారని పిటిషనర్ పేర్కొన్నారు. వాదనలు విన్న జస్టిస్ టి. వినోద్‌కుమార్, ధర్మాసనం.. రంగారెడ్డి కలెక్టర్, ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది.

ఆపరేషన్ 'గులాబీ'!

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై కాంగ్రెస్ ఫోకస్.. నేడు హస్తం గూటికి వికారాబాద్ జడ్పీ ఛైర్‌పర్సన్

- చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా సునీతారెడ్డి!



హైదరాబాద్/రంగారెడ్డి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలకు ముందు అధికార కాంగ్రెస్ పార్టీ చేరికలను ముమ్మరం చేసింది. బీఆర్ఎస్‌కు మంచి పట్టున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై ఫోకస్ పెట్టింది. ప్రధాన ప్రతిపక్షమైన గులాబీ పార్టీని కోలుకోలేని దెబ్బ తీసేందుకు వ్యూహరచన మొదలు పెట్టింది. ఇందులో భాగంగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబానికి గాలం వేసింది. మహేందర్‌రెడ్డితోపాటు ఆయన సతీమణి, వికారాబాద్ జడ్పీ ఛైర్‌పర్సన్ సునీతారెడ్డి ఇటీవలే సీఎం రేవత్‌రెడ్డిని కలిసిన విషయం తెలిసిందే. సునీతారెడ్డికి చేవెళ్ల ఎంపీ టికెట్ ఇస్తామని హామీ ఇవ్వడంతో వారి కుటుంబం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైంది. తెలంగాణ పునర్‌నిర్మాణంలో భాగస్వాములయ్యేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సునీతారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో జడ్పీ ఛైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి, వారి కుమారుడు రినీష్‌రెడ్డిలు తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఉమ్మడి జిల్లాలోని బీఆర్ఎస్‌కు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు సునీతారెడ్డితో కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని మహేందర్‌రెడ్డి నివాసం నుంచి గాంధీభవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉంటే సునీతారెడ్డి వరుసగా మూడోసారి జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. రెండుసార్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా పనిచేయగా, ప్రస్తుతం వికారాబాద్ జడ్పీ ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఈ కారణంగానే ఆమెకు చేవెళ్ల ఎంపీ సీటు ఇచ్చేందుకు కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లు సమాచారం. కాగా వీరితోపాటు జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఆయన సతీమణి, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఒకరు నేడు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది.

నిజామాబాద్‌లో బీఆర్ఎస్‌కు షాక్

బోధన్ రూరల్, ఫిబ్రవరి 15: నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. నిజామాబాద్ జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ రజిత యాదవ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం హైదరాబాద్‌లో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆమెకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


మునిసిపల్ కార్యాలయం ఎదుట విజయకేతనం చూపుతున్న కౌన్సిలర్లు

'నందికొండ' ఛైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- ఛైర్‌పర్సన్ పదవి కాంగ్రెస్‌కు, వైస్‌ఛైర్మన్ పదవి బీఆర్ఎస్‌కు ఇచ్చేలా నిర్ణయం

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 15: రాష్ట్రంలోనే ప్రత్యేకంగా ఏర్పడిన నందికొండ (నాగార్జునసాగర్) మునిసిపాలిటీ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. ఈ రెండు పదవులకు బీఆర్ఎస్ ప్రతినిధులు ప్రాతినిధ్యం వహించారు. తాజాగా ఛైర్‌పర్సన్ పదవిని కాంగ్రెస్‌కు, వైస్‌ఛైర్మన్ పదవిని బీఆర్ఎస్‌కు ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారు. కనీసం గ్రామ పంచాయతీ కూడా కాని నాగార్జునసాగర్‌ను గత ప్రభుత్వం 2018 ఆగస్టులో నాగార్జునసాగర్‌లో ఉన్న హిల్‌కాలనీ, పైలాన్ కాలనీలను కలిపి 12 వార్డులతో నందికొండ మునిసిపాలిటీగా ఏర్పాటు చేసింది. 2020 జనవరి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్9, కాంగ్రెస్ 3వార్డులు గెలుచుకోగా ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్‌గా బీఆర్ఎస్‌కు చెందిన కర్ణ అనూష, మంద రఘువీర్ బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్ల తర్వాత రెండో వార్డు కౌన్సిలర్ సత్తెమ్మ (కాంగ్రెస్) గుండెపోటుతో మృతి చెందగా ప్రస్తుతం 11మంది కౌన్సిలర్లున్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరగా కాంగ్రెస్ బలం నాలుగుకు చేరింది. ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్ మినహా మిగతా బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచారు. కాగా ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, వార్డుల్లో సమస్యలను తీర్చడానికి కౌన్సిలర్లకు సహకరించడం లేదని 2022లో తొమ్మిది మంది వార్డు సభ్యులు జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు అందజేశారు. నాలుగేళ్ల తర్వాత అవిశ్వాసం చేపట్టేలా హైకోర్టు స్టే ఇవ్వడంతో 2023లో కలెక్టర్‌కు మరోసారి అవిశ్వాసం నోటీసు అందజేశారు. రెండోసారి ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లు కోర్టు నుంచి స్టే తీసుకువచ్చారు. మూడోసారి అవిశ్వాసం కోరుతూ ఈ ఏడాది జనవరి 29న కలెక్టర్‌కు దరఖాస్తు చేశారు. దీంతో కలెక్టర్ మిర్యాలగూడ ఆర్డీవో చెన్నయ్యను ప్రిసైడింగ్ అధికారిగా నియమించి ఈ నెల 15న అవిశ్వాసానికి సంబంధించిన సమావేశం చేపట్టాలని ఆదేశించారు. దీంతో నందికొండ మునిసిపాలిటీలో గురువారం అవిశ్వాస తీర్మానంపై సమావేశం జరగ్గా 11మంది కౌన్సిలర్లలో నలుగురు కాంగ్రెస్, ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు హాజరై అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు. దీంతో అవిశ్వాసం నెగ్గింది. ఛైర్‌పర్సన్ పదవిని కాంగ్రెస్‌కు, వైస్‌ఛైర్మన్ పదవిని బీఆర్ఎస్‌కు ఇచ్చేందుకు 9మంది కౌన్సిలర్లు నిర్ణయించారు. 15 రోజుల్లో ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహిస్తామని ఆర్డీవో తెలిపారు.

వికారాబాద్ పోలీసులకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ నోటీసు

వికారాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ పోలీసులకు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ నోటీసు జారీ చేసింది. ఈ నెల 2న వికారాబాద్‌లో జరిగిన బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశంలో ముందు వరుసలో కూర్చున్న తన పట్ల కొందరు పార్టీ నాయకులు అమర్యాదగా ప్రవర్తించారని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు భూమోళ్ల కృష్ణయ్య రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నాయకులు తనను దర్భాషలాడుతూ దూషించారని, వేదిక మీద నుంచి తనను కిందకు నెట్టేశారని పేర్కొన్నారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తన ఆత్మగౌరవానికి భంగం కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనపట్ల అమర్యాదగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వికారాబాద్ పోలీస్ స్టేషన్, డీఎస్పీ, ఎస్పీలకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు తమకు అందిన ఫిర్యాదుపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని కమిషన్ నోటీసులో పేర్కొంది. పోలీసులు తీసుకున్న చర్యలపై నివేదికను 30 రోజుల్లో కమిషన్‌కు అందజేయాలని వికారాబాద్ ఎస్పీని ఆదేశించింది.

మాతృభాషాభివృద్ధికి మంత్రిత్వ శాఖ ఉండాలి

- తెలుగు వర్సిటీ వీసీ కిషన్‌రావు
- నిఘంటు నిర్మాణాలకు వర్సిటీలు కృషి చేయాలి
- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్
- ఓయూలో తెలుగు సాహిత్య మహాసభ ప్రారంభం


జ్యోతి వెలిగిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాస్, తదితరులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మాతృ భాషాభివృద్ధికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు సూచన చేశారు. తెలుగు అకాడమీ, అధికార భాషా సంఘం, సాహిత్య అకాడమీ, తెలుగు వర్సిటీ వంటి భాషాభివృద్ధికి తోడ్పడే సంస్థలన్నింటినీ ఏకం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో గురువారం ప్రారంభమైన తెలుగు సాహిత్య మహా సభలో ఆయన మాట్లాడారు. ఓయూ తెలుగు విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు జరిగే ఈ మహాసభను ప్రముఖ కవి ప్రొఫెసర్ ఎన్ గోపి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సదస్సు ప్రత్యేక సంచికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల ద్వారా విద్యార్థుల ఆలోచనలు విస్తృతమవడంతో పాటు పరిశోధక విద్యార్థులకు ప్రేరణ లభిస్తుందని పేర్కొన్నారు. ఇటీవల కాలం జరుగుతున్న పరిశోధనల్లో సమాచారం ఉంటుంది కానీ, జ్ఞానం కొరవడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ తెలుగు బోధకుడిని మించిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు, తెలుగు పాఠ్యాంశానికి మించిన వ్యక్తిత్వ వికాస పాఠం మరొకటి ఉండదన్నారు. పాఠ్యాంశాలు, బోధనా పద్ధతులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేసేలా ఉండాలని ఆకాంక్షించారు. ఉస్మానియా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి. రవీందర్ మాట్లాడుతూ పీహెచ్‌డీలంటే ఎత్తిపోతల పథకాలయ్యాయని విచారం వ్యక్తం చేశారు. 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు సంప్రదాయ తెలుగు మీద కన్నా ఆధునిక తెలుగు మీద మరింత శ్రద్ధ పెట్టాలని సూచించారు. యూనివర్సిటీలు నిఘంటువు నిర్మాణానికి కృషి చేయాలన్నారు. సైన్స్ కాంగ్రెస్, హిస్టరీ కాంగ్రెస్ స్థాయిలో తెలుగు లిటరరీ కాంగ్రెస్ కూడా కొత్త ఆలోచనలను ప్రోత్సహిస్తూ సాహిత్య రంగానికి మార్గనిర్దేశం చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం వరకు సాగే ఈ సదస్సులో ఏపీ, తెలంగాణకు చెందిన 150 మందికిపైగా కవులు, రచయితలు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శుక్రవారం • 16 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com



పోరాట ఘట్టాలు ప్రత్యేకాకర్షణగా

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. ఏప్రిల్ 5న విడుదల కానుంది. 'దేవర'గా ఎన్టీఆర్ యాక్షన్ ఓ రేంజ్‌లో ఉండబోతోందని సమాచారం. కొరటాల శివ సరికొత్త తరహాలో యాక్షన్ సీక్వెన్స్ ప్లాన్ చేశారట. హాలీవుడ్ స్టంట్ మాస్టర్ కేన్నీ బేట్స్ నేతృత్వంలో తెరకెక్కిన పోరాట ఘట్టాలు సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలువనున్నాయి. సముద్రంలో నీటి అడుగున తెరకెక్కిన ఫైట్స్ సంభ్రమాశ్చర్యాలకు గురిచేసేలా ఉండబోతున్నాయని తెలుస్తోంది. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. యువ సుధ ఆర్ట్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బేనర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు.

అందాల రాశికి అందలం

అందం, అభినయం కలగలిసిన ముద్దుగుమ్మగా ప్రేక్షకలోకాన్ని ఆకట్టుకున్నారు టాలీవుడ్ కథానాయిక రష్మిక మందన్న. ఇప్పుడు ఆమె మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నారు. ఫోర్బ్స్ ఇండియా 30 అండర్ 30 జాబితాలో రష్మిక చోటు దక్కించుకున్నారు. 30 ఏళ్లలోపు వయసు ఉన్న 30 మంది ప్రతిభావంతుల జాబితాలో రష్మిక అగ్రస్థానం దక్కించుకున్నారు. సోషల్ మీడియా ద్వారా రష్మిక ఈ విషయాన్ని అభిమానులతో పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఆమె ప్రస్తుతం అల్లు అర్జున్ సరసన 'పుష్ప 2' చిత్రంలో నటిస్తున్నారు. అలాగే 'రెయిన్ బో' 'ది గర్ల్‌ఫ్రెండ్' అనే హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రాలు సెట్స్‌పై ఉన్నాయి.



బెర్లిన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు బన్నీ



'పుష్ప' చిత్రంతో ఉత్తమ నటుడిగా జాతీయ పురస్కారాన్ని అందుకొని సత్తా చాటారు అల్లు అర్జున్. ఇప్పుడు ఆయన మరో అరుదైన గౌరవాన్ని పొందారు. ప్రతిష్ఠాత్మక బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతీయ సినిమా తరఫున ప్రాతినిథ్యం వహించే అవకాశం అల్లు అర్జున్‌కు దక్కింది. 74వ బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొనాల్సిందిగా ఆయనకు ఆహ్వానం అందింది. దీంతో గురువారం బన్నీ జర్మనీ వెళ్లారు. 'పుష్ప' సినిమాను ఈ చిత్రోత్సవాల్లో ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప 2' చిత్రంలో నటిస్తున్నారు. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించింది.

జీ2లో ఓజీ విలన్



బాలీవుడ్‌లో రొమాంటిక్ హీరోగా తనదైన ముద్ర వేసిన ఇమ్రాన్ హష్మీ కొన్నాళ్లుగా రూట్ మార్చి స్టైలిష్ విలన్ పాత్రలతో మెప్పిస్తున్నారు. సుజీత్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'ఓజీ' చిత్రంలో ఇమ్రాన్ హష్మీ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా మరో టాలీవుడ్ చిత్రంలో ఆయన విలన్‌గా కనిపించనున్నారు. అడివిశేష్ కథానాయకుడిగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'గూఢచారి 2' (జీ2)లో ఆయన విలన్‌గా నటించనున్నారు. ఈ విషయాన్ని గురువారం అడివిశేష్ ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. 'గూఢచారి ప్రపంచంలోకి గొప్ప నటుడికి స్వాగతం' అంటూ ఇమ్రాన్ హష్మీ ఫొటోను అడివిశేష్ షేర్ చేయగా వైరల్ అయింది. 'గూఢచారి 2'లో భాగమవుతున్నందుకు ఆనందంగా ఉందని ఇమ్రాన్ పేర్కొన్నారు.

రాజధాని ఫైల్స్‌కు తాత్కాలిక బ్రేక్

- రికార్డులు పరిశీలించాలి.. వాటిని మా ముందు ఉంచండి
- సీబీఎఫ్‌సీ, రివైజింగ్ కమిటీ అధికారులకు హైకోర్టు ఆదేశం
- విచారణ నేటికి వాయిదా



రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్టు హైకోర్టు గురువారం ప్రకటించింది. నిబంధనల ప్రకారం తగిన కారణాలు పేర్కొని సినిమా విడుదలకు రివైజ్ కమిటీ సర్టిఫికెట్ ఇచ్చిందా.. లేదా అనేది పరిశీలించాల్సి ఉందని అభిప్రాయపడింది. సినిమాకు సంబంధించి ఎగ్జామినింగ్ కమిటీ, రివైజింగ్ కమిటీల వద్ద ఉన్న రికార్డులను ఈ నెల 16లోగా కోర్టు పరిశీలనకు ఉంచాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ), రివైజింగ్ కమిటీ ప్రిసైడింగ్ ఆఫీసర్‌ను ఆదేశించింది. సినిమా విడుదలైతే పూడ్చుకోలేని నష్టం జరుగుతుందన్న పిటిషనర్ వాదనను పరిగణలోకి తీసుకొని సినిమా ప్రదర్శనపై శుక్రవారం వరకు స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. రికార్డులు కోర్టు ముందు ఉంచేందుకు వీలుగా విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య గురువారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. ఏపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠను దిగజార్చేలా రాజధాని ఫైల్స్ సినిమాను తీశారని, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ధ్రువపత్రాన్ని రద్దు చేయాలని కోరతూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం విచారణ జరిపిన న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీకి నిర్ణయాన్ని వాయిదా వేసింది. గురువారం సినిమా ప్రదర్శనను నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

థియేటర్లలో ప్రదర్శన నిలుపుదల

రాజధాని అమరావతి రైతుల ఉద్యమ నేపథ్యంలో తెరకెక్కిన 'రాజధాని ఫైల్స్' చిత్రానికి బ్రేకులు పడ్డాయి. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ చిత్ర ప్రదర్శనను నిలుపుదల చేయాలని రెవెన్యూ అధికారులు థియేటర్ యాజమానులను ఆదేశించారు. గురువారం రిలీజైన ఈ చిత్రాన్ని ఉమ్మడి కృష్ణాలో 26 థియేటర్లతో పాటు కొన్ని మల్టీప్లెక్స్‌ల్లోనూ విడుదల చేశారు. ఉదయం ఆట మొదలయ్యే సరికి రెవెన్యూ అధికారులు థియేటర్లకు వచ్చి.. ప్రదర్శనలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు వెళ్లే సరికి కొన్ని థియేటర్లలో ప్రదర్శనలు మొదలయ్యాయి. ఆయా థియేటర్లలో మాత్రం మేనేజర్లు కోర్టు తీర్పు కాపీని ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఆ ఉత్తర్వులను టికెట్ కౌంటర్ల వద్ద అతికించారు. మ్యాట్నీ నుంచి పూర్తిగా నిలుపుదల చేయాలని ఆదేశించారు. ట్రెండ్‌సెట్‌లో ప్రదర్శనను మధ్యలోనే ఆపేయడంతో ప్రేక్షకులు ఆందోళనకు దిగారు. అధికారులు వారికి కోర్టు ఆదేశాలను చూపించడంతో ఆందోళన విరమించారు. కాగా, ఏలూరులోని విజయలక్ష్మి థియేటర్ (వి మాక్స్)లో ఈ సినిమా గురువారం 11 గంటలకు ప్రారంభం కాగా రెవెన్యూ, పోలీసు అధికారులు వచ్చి ప్రేక్షకులను పంపించి వేశారు.

అమరావతి (ఆంధ్రజ్యోతి)

హర్షను హీరోగా ఆదరించండి


చిరంజీవి

సుందరం మాస్టర్ చిత్రం ట్రైలర్ చాలా బావుంది. హర్ష కోసమే ఈ పాత్ర పుట్టినట్లుంది. తన ప్రతిభను నమ్ముకొని హర్ష ఓ స్థాయికి వచ్చాడు. ఇప్పుడు హీరోగా ఎదిగాడు. హాస్యంతో పాటు ఆకట్టుకునే భావోద్వేగాలు ఉన్న సినిమా ఇది. ఇలాంటి వినూత్న ప్రయోగాలను ప్రేక్షకులు ఆదరించాలి. 'సుందరం మాస్టర్' చిత్రానికి పెద్ద విజయాన్ని అందించాలి' అని చిరంజీవి ప్రేక్షకులను కోరారు. హర్ష చెముడు, దివ్యశ్రీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సుందరం



మాస్టర్'. హీరో రవితేజ, సుధీర్ కుమార్ సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 23న విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రస్తుతం అమెరికా విహార యాత్రలో ఉన్న చిరంజీవి ఆన్‌లైన్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హర్ష మాట్లాడుతూ "సుందరం మాస్టర్' చిత్రం చాలా కొత్త పాయింట్‌తో రాబోతోంది. మనలో ఒకడిగా ఈ చిత్రంలో కనిపిస్తాను. అందరినీ ఆలోచింపజేసే చిత్రమిది. కామెడీతో పాటు అద్భుతమైన డ్రామా ఉంది' అన్నారు. మైనా అనే అద్భుతమైన పాత్రను సృజించి, నటిగా నాకు అవకాశం ఇచ్చినందుకు మా దర్శకుడికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని దివ్యశ్రీ పాద చెప్పారు. దర్శకుడు కల్యాణ్ సంతోష్ మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం చాలా పరిశోధన చేశాను. నా జీవితంలో తారసపడిన కొందరు వ్యక్తుల స్ఫూర్తితో కథ రాసుకున్నాను. ఈ సినిమాకు డబ్బు కంటే సమయాన్ని ఎక్కువ పెట్టుబడిగా పెట్టాం' అని తెలిపారు. సుధీర్ కుమార్ మాట్లాడుతూ 'ఈ చిత్ర నిర్మాణంలో రవితేజ సహకారం మరువలేనిది. సినిమా అద్భుతంగా వచ్చింది' అని చెప్పారు. కొత్తగా ఉండాలని బాబా సెహగల్ గారితో ఈ చిత్రంలో ఓ పాట పాడించామని సంగీత దర్శకుడు శ్రీ చరణ్ పాకాల తెలిపారు.

పాన్ ఇండియా ఎంటర్టైనర్ ప్రారంభం



తమిళ హీరో శివకార్తికేయన్ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా ఎంటర్టైనర్ షూటింగ్ బుధవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతోన్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో కన్నడ నటి రుక్మిణి వసంత్ కథానాయిక. శ్రీలక్ష్మి మూవీస్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఇందులో శివ కార్తికేయన్‌ను మురుగదాస్ సరికొత్తగా చూపించబోతున్నారు. గురువారం నుంచే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని చిత్రబృందం పేర్కొంది. అనిరుధ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సుదీప్ ఎలామన్.

భైరవకోన బావుందంటున్నారు

సందీప్ కిషన్



"ఊరుపేరు భైరవకోన' చిత్రానికి వంద ప్రీమియర్ షోలు పడ్డాయి. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. 'సినిమా హిట్. చాలా బావుంది' అంటున్నారు. నా నటనను మెచ్చుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది" అని సందీప్ కిషన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా వీఐ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఊరుపేరు భైరవకోన'. కావ్యథాపర్, వర్ష బొల్లమ్మ కథానాయికలు. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మించారు. ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్‌మీట్ నిర్వహించింది. సందీప్ కిషన్ మాట్లాడుతూ 'పిల్లలు, పెద్దలు కలసి చూసేలా ఒక ఫాంటసీ రొమాంటిక్ ఎంటర్టైనర్‌ను తీశాం. కుటుంబ ప్రేక్షకులంతా చూసే సినిమా ఇది. ప్రేక్షకుల స్పందన కోసం ఎదురుచూస్తున్నాం' అన్నారు. అనిల్ సుంకర మాట్లాడుతూ "ఊరుపేరు భైరవకోన' ప్రీమియర్స్‌కు ఇలాంటి స్పందన వస్తుందని ముందే ఊహించాం. టీం అంతా చాలా కష్టపడ్డారు. ప్రీమియర్స్ ఈ రేంజ్‌లో సక్సెస్ అవ్వడం, సినిమా అద్భుతంగా ఉందని ప్రేక్షకులు చెప్పడం సినిమా విజయంపై నమ్మకాన్ని పెంచింది' అని చెప్పారు. వీఐ ఆనంద్ మాట్లాడుతూ 'ప్రీమియర్ షోస్ అన్నీ హౌస్ ఫుల్ అయ్యాయి. ప్రేక్షకులను మెప్పించినందుకు ఆనందంగా ఉంద'న్నారు. రాజేశ్ దండా మాట్లాడుతూ 'రెండున్నరేళ్లు కష్టపడి ఈ సినిమా చేశాం. కంటెంట్‌ను నమ్మి వంద ప్రీమియర్ షోస్ వేశాం. రూ. కోటి పైన వసూళ్లు రావడం ఈ సినిమా క్రేజ్‌కు నిదర్శనం' అని పేర్కొన్నారు. ఇది నా కెరీర్‌లో ప్రత్యేక చిత్రమని కావ్యథాపర్ తెలిపారు. ప్రేక్షకుల స్పందన అద్భుతంగా ఉంది, ప్రతిసీన్‌ను అమితంగా ఆస్వాదిస్తున్నారు అని వర్ష బొల్లమ్మ చెప్పారు. 'ఊరు పేరు భైరవ కోన' సినిమా విడుదలపై స్టే ఇవ్వాలని దాఖలైన పిటిషన్‌లో స్టే ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది.

సమంత టేక్ 20



అగ్రకథానాయికగా కెరీర్ జోరు మీదున్న సమయంలో మయోసైటిస్ వ్యాధి బారినపడి సినిమాలకు దూరమయ్యారు సమంత. ప్రస్తుతం దాన్నుంచి కోలుకుంటున్నారు. త్వరలోనే సినిమా షూటింగ్స్‌లో పాల్గొనున్నట్లు ఇటీవలే ప్రకటించారు. మయోసైటిస్ వల్ల తను ఎదుర్కొన్న ఇబ్బందులు, దాన్ని అధిగమించేందుకు అనుసరించిన పద్ధతులపై అభిమానులకు అవగాహన కల్పించేందుకు సమంత సిద్ధమవుతున్నారు. దానికి సంబంధించిన పాడ్‌కాస్ట్‌ను 'టేక్ 20' పేరుతో ఈనెల 19న విడుదల చేయబోతున్నారు. గురువారం ప్రోమోను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా షేర్‌చేశారు. 'టేక్ 20 అనే పాడ్‌కాస్ట్‌ను ప్రారంభించాను. ఇందులో ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను మాత్రమే మీతో పంచుకుంటాను. మన జీవితాలను మరింత మెరుగ్గా మార్చుకుందాం. మీరూ మాతో జాయిన్ అవ్వండి' అని సమంత నెటిజన్లను కోరారు.

పద్మవ్యూహంలో ప్రేమకథ



ప్రవీణ్ రాజ్‌కుమార్ హీరోగా శశికాటిక్కో, ఆషురెడ్డి కీలకపాత్రల్లో నటిస్తున్న చిత్రానికి టైటిల్ ఖరారైంది. సంజయ్‌రెడ్డి బంగారపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'పద్మవ్యూహంలో చక్రధారి' అనే టైటిల్‌ను చిత్రబృందం నిర్ణయించింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రవీణ్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరి జీవితంలో తొలి ప్రేమ ఉంటుంది. అందులో కొందరు సఫలం అయితే మరికొందరు విఫలమవుతారు. అలా తన తొలిప్రేమ జ్ఞాపకాల నుంచి బయటపడి జీవితంలో ముందుకు సాగడానికి ఓ వ్యక్తి అనుభవించిన సంఘర్షణ నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంద'న్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'పద్మవ్యూహంలో చక్రధారి' మంచి కంటెంట్‌తో తీసిన సినిమా. రాయలసీమ అనగానే పగ, ప్రతీకారాలు మాత్రమే అనేలా ప్రచారంలో ఉంది. కానీ మా చిత్రంలో ఈ ప్రాంతంలో ఉన్న స్వచ్ఛమైన ప్రేమని చూపించబోతున్నాం' అన్నారు. ఆషురెడ్డి మాట్లాడుతూ 'ఇందులో నా పాత్ర పేరు పద్మ. విభిన్నంగా ఉంటుంద'న్నారు. ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య. సినిమాటోగ్రఫీ: జీ అమర్

సంపూ మార్క్‌తో బంగారు గుడ్డు

సంపూర్ణేష్ బాబు కథానాయకుడిగా గోపీనాథ్ నారాయణ మూర్తి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రానికి 'బంగారు గుడ్డు' అనే టైటిల్ ఖరారైంది. కేఎం ఇలంచెజియన్, ఎం కోటేశ్వరరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. సంపూర్ణేష్ బాబు కామెడీతో ఆద్యంతం వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది అని ఈ సందర్భంగా నిర్మాతలు పేర్కొన్నారు. రోలోశంకర్, వరదరాజ్, దువ్వాసి మోహన్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: షమీర్ టాండన్. సినిమాటోగ్రఫీ: అఖిల్ శశిధరన్. ఎడిటర్: మార్టిన్ టైటస్ ఎ



ఆహారాన్ని ఫొటో తీస్తే కేలరీలు చెప్పేస్తుంది!

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మనం తినే ఆహారంలో ఎన్ని కేలరీలున్నాయి? పోషకాలెన్ని? చక్కెర శాతం ఎంత? వంటి విషయాలను తెలుసుకోవాలంటే.. ఆ ఆహారాన్ని ఒక్కసారి క్లిక్‌మనిపిస్తే చాలు.. 'న్యూట్రీ ఎయిడ్' అనే యాప్ ద్వారా అన్నీ వెంటనే తెలిసిపోతాయి. వీటిని గుర్తించే ఈ యాప్‌ను జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆరోగ్యవంతమైన, పోషక విలువలు నిండిన ఆహారాన్ని ఎంపిక చేసుకునేందుకు ఈ యాప్ తోడ్పడుతుంది. మన ఆహారపు అలవాట్లలో పెనుమార్పులకు నాంది పలికే ఈ యాప్‌ను ఎన్ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.హేమలత, జర్మనీకి చెందిన ఆగస్‌బర్గ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మార్కస్ కెక్ గురువారం తార్నాకలోని ఎన్ఐఎన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు. జర్మనీ సహకారంతో రెండేళ్లపాటు శ్రమించిన ఎన్ఐఎన్ శాస్త్రవేత్తల బృందం.. ఏ ఆహారం తీసుకుంటే మంచిదో వివరించే ఇతర సాధారణ యాప్‌లకు భిన్నంగా వినూత్నమైన, సమగ్రమైన యాప్‌ను అభివృద్ధి చేసింది. మన ఆహారపు అలవాట్లలో మంచి చెడులను గుర్తించడంతోపాటు మంచి ఆహారపు అలవాట్లు పెంపొందించుకునేందుకు కూడా ఈ యాప్ శాస్త్రీయమైన సూచనలు చేస్తుంది. మనం తీసుకునే ఆహారాన్ని ఈ యాప్‌తో స్కాన్ చేస్తే.. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ సహకారంతో ఆ ఆహారంలోని పోషక విలువలను ఇది క్షణాల్లో చెప్పేస్తుంది. ఇందుకోసం ఈ యాప్‌లో ప్రత్యేక టూల్‌ను పొందుపరిచారు. మనం తీసుకునే ఆహారంలో ఎలాంటి సూక్ష్మ, స్థూల పోషకాలు ఉన్నాయో, ఆ ఆహారం వల్ల ఎంత పరిమాణంలో కర్బన ఉద్గారాలు ఉత్పన్నమవుతున్నాయనే వివరాలను కూడా ఈ యాప్ అందిస్తుంది. హైదరాబాద్‌కు చెందిన 720 మంది ఆహారపు అలవాట్ల ఆధారంగా మొదట పైలట్ ప్రాజెక్టుగా దీనిని చేపట్టారు. ఆ తరువాత రెండో దశలో ప్రజలందరి ఆహారపు అలవాట్లు, ఎలాంటి పోషకాహారం తీసుకోవాలనే వివరాలతో సమగ్ర యాప్‌ను అభివృద్ధి చేశారు. ఎన్ఐఎన్, జర్మనీకి చెందిన ఆగస్‌బర్గ్ విశ్వవిద్యాలయంతోపాటు చండీగఢ్‌కు చెందిన స్టార్టప్ కాల్‌ట్రే వెల్‌నెస్ సొల్యూషన్స్ సంస్థలు ఈ యాప్ అభివృద్ధిలో పాలుపంచుకున్నాయి. మనం ఎలాంటి ఆహారం తింటున్నామో తెలుసుకుని, అందుకు అనుగుణంగా శారీరక శ్రమ చేస్తూ, ఆరోగ్యంగా ఉండటంతో పాటు పర్యావరణ హితమైన ఆహారాన్ని ఎంపిక చేసుకునేందుకు న్యూట్రీ ఎయిడ్ యాప్ తోడ్పడుతుందని ఎన్ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ హేమలత అన్నారు. దేశంలో వివిధ ప్రాంతాల వారీగా ఉన్న ఆహారపు అలవాట్ల ఆధారంగా వాటన్నింటి వివరాలను యాప్‌లో పొందుపరచడం సవాల్‌తో కూడుకున్నదని, అయినా ఈ యాప్‌లో సుమారు 5వేల వరకు పొందుపరిచామని చెప్పారు. ఆవిష్కరణ కార్యక్రమంలో ఎన్ఐఎన్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంజీ సుబ్బారావు, కాల్‌ట్రే సీఈవో వినీత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



న్యూట్రీ ఎయిడ్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ హేమలత, ప్రొఫెసర్ మార్కస్ కెక్ తదితరులు

లోకం తీరు



భారత్-ఖతార్ సంబంధాలు మరింత బలోపేతం

- ఖతార్ పాలకుడితో భారత ప్రధాని మోదీ భేటీ
- నేవీ మాజీ అధికారులను విడుదల చేసినందుకు కృతజ్ఞతలు



షేక్ తమిమ్ బిన్‌తో మోదీ

దోహా, ఫిబ్రవరి 15: భారత్-ఖతార్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత దృఢపడుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భూగోళానికి ప్రయోజనం చేకూర్చేలా భవిష్యత్తు రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని చూస్తున్నామని ఆయన తెలిపారు. గురువారం దోహాలో ఖతార్ పాలకుడు షేక్ తమిమ్ బిన్ హమాద్ అల్-థానీతో మోదీ సమావేశమయ్యారు. జైలు శిక్ష పడిన ఎనిమిది మంది భారత నేవీ మాజీ అధికారులను ఖతార్ ఇటీవల విడుదల చేసిన నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. వీరిని విడుదల చేసినందుకు ఖతార్ పాలకుడికి మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఖతార్ ఎమిర్‌తో తన భేటీ అద్భుతంగా జరిగిందని, తమ సమావేశం సందర్భంగా వివిధ రంగాల్లో సహకారం గురించి చర్చించినట్టు మోదీ పేర్కొన్నారు. భారత్-ఖతార్ మధ్య వివిధ రంగాల్లో సహకారాన్ని మరింత పెంచేందుకు మార్గాలపై చర్చించామని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన పేర్కొన్నారు.

నా హృదయం ఎప్పుడూ మీతోనే!

- రాయ్‌బరేలీ ప్రజలకు సోనియా భావోద్వేగ సందేశం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ప్రత్యక్ష ఎన్నికలకు స్వస్తి పలికి.. రాజస్థాన్ నుంచి రాజ్యసభకు నామినేషన్ వేసిన కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ (77).. ఇంత కాలం తాను ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చిన యూపీలోని రాయ్‌బరేలీ లోక్‌సభ నియోజకవర్గ ప్రజలకు గురువారం భావోద్వేగ సందేశం పంపారు. వచ్చే ఎన్నికల నుంచి తాను ఇక్కడ పోటీచేయనని ధ్రువీకరించారు. ఇవాళ తానీ స్థితిలో ఉన్నానంటే వారి వల్లేనని.. వారు లేనిదే తాను లేనని గర్వంగా చెబుతానని పేర్కొన్నారు. 'నాపై మీకున్న విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి నా శాయశక్తులా కృషిచేశాను. ఇప్పుడు అనారోగ్యం, వయోభారం కారణంగా వచ్చే ఎన్నికల్లో నేను పోటీచేయను. ఈ నిర్ణయంతో ఇక మీకు ప్రత్యక్షంగా సేవ చేసే అవకాశం నాకు ఉండదు. అయితే నా హృదయం, ఆత్మ ఎప్పుడూ మీతోనే. గతంలో మాదిరిగానే నాకు, నా కుటుంబానికి అండగా ఉంటారని నాకు తెలుసు' అని హిందీ సందేశంలో తెలిపారు. తద్వారా అక్కడ తన కుటుంబం నుంచి బహుశా ప్రియాంకాగాంధీ వాద్రా పోటీచేస్తారన్న సంకేతాలు ఇచ్చారు. 2004 నుంచి వరుసగా నాలుగు ఎన్నికల్లో సోనియా ఇక్కడ నుంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే.

రేపే జీఎస్ఎల్వీ-ఎఫ్14 ప్రయోగం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 15: పీఎస్ఎల్వీ-సీ58 విజయంతో ఈ ఏడాదిని ఘనంగా ఆరంభించిన ఇస్రో.. మరో ప్రతిష్ఠాత్మక ప్రయోగానికి సిద్ధమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి ఈ నెల 17న జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ ప్రయోగం చేపట్టనుంది. ఈ రాకెట్ ద్వారా కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేసే 2,275 కిలోల బరువైన ఇన్‌శాట్-3డీ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనుంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ సెంటర్ నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్14 నింగిలోకి దూసుకెళ్లనుంది. శుక్రవారం మధ్యాహ్నం 2.05 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమై 27.30 గంటల పాటు కొనసాగుతుంది.

వైద్య మండలిలో నమోదు కోసం నకిలీ పత్రాలు

- తెలంగాణ మహిళ అరెస్టు

చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్ర వైద్య మండలిలో తన పేరు నమోదు చేసుకునేందుకు నకిలీ పత్రాలు సమర్పించిన తెలంగాణకు చెందిన మహిళను నగర పోలీసులు అరెస్టు చేశారు. గురువారం వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే.. హైదరాబాద్‌కు చెందిన ఆయిషా తస్వీర్ (40) చెన్నై గిండిలో ఉన్న డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేసినట్టుగా ధ్రువపత్రాలు తీసుకుని తమిళనాడు స్టేట్ మెడికల్ కౌన్సిల్‌లో తన పేరును రిజిస్టర్ చేయించుకునేందుకు స్థానిక అరుంబాక్కంలోని కార్యాలయానికి బుధవారం వెళ్లారు. ఆమె సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ కామరాజ్ పరిశీలించగా అవి నకిలీవని తేలింది. దీంతో ఆయన పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు కౌన్సిల్ కార్యాలయంలో తస్వీర్‌ను అదుపులోకి తీసుకుని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

క్యాన్సర్‌కు రష్యా టీకాలు

- కీలక దశలో పరిశోధనలు: పుతిన్

మాస్కో, ఫిబ్రవరి 15: రష్యా శాస్త్రవేత్తలు క్యాన్సర్ టీకాలు తయారు చేస్తున్నారని ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ కీలక ప్రకటన చేశారు. క్యాన్సర్ టీకాలు, వ్యాధి నిరోధక శక్తి పెంచే టీకాల తయారీకి సంబంధించి తమ శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయోగాలు కీలక దశలో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఆయా టీకాలను అతి త్వరలోనే రోగులకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. అయితే, ఏయే క్యాన్సర్లను ఈ టీకా నయం చేస్తుందనే విషయంతోపాటు టీకాకు సంబంధించిన మరే ఇతర వివరాలను పుతిన్ వెల్లడించలేదు.

'బైక్ ట్యాక్సీ'లు కాంట్రాక్టు క్యారేజీలే

- వాటిని కిరాయికి తిప్పవచ్చు: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: బైక్ ట్యాక్సీలకున్న చట్టబద్ధతపై కేంద్ర రోడ్డు రవాణా శాఖ స్పష్టత ఇచ్చింది. అవి మోటారు వాహనాల చట్టం-1988 ప్రకారం 'కాంట్రాక్టు క్యారేజీ' అన్న నిర్వచనం పరిధిలోకి వస్తాయని తెలిపింది. వాటిని కిరాయికి తిప్పి ప్రయాణికులను ఎక్కించుకోవచ్చని పేర్కొంది. మోటారు సైకిళ్లు.. కాంట్రాక్టు క్యారేజీలు, రవాణా వాహనాలు అన్న నిర్వచనం పరిధిలోకి రావంటూ కొన్ని రాష్ట్రాలు అభ్యంతరం చెబుతున్నాయి. వాటిని బైక్ ట్యాక్సీలుగా నడుపుకోవడానికి పర్మిట్లు ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలోనే కేంద్రం వివరణ ఇచ్చింది. వీటిని నిరభ్యంతరంగా కాంట్రాక్టు క్యారేజీలుగా నడపవచ్చని తెలిపింది. అందువల్ల నిబంధనల మేరకు పర్మిట్లు ఇవ్వాలని పేర్కొంది. మోటారు వాహనాల చట్టం సెక్షన్ 2(28) ప్రకారం నాలుగు చక్రాల కన్నా తక్కువ ఉండి, ఇంజిన్ సామర్థ్యం 25 సీసీకి మించిన వాహనాలను కాంట్రాక్టు క్యారేజీలుగా నడుపుకోవచ్చని తెలిపింది.

'ఉపా'పై 8 పిటిషన్ల ఉపసంహరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ దాఖలైన ఎనిమిది పిటిషన్లను ఉపసంహరించుకునేందుకు గురువారం సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. బెయిల్ మంజూరు, కేసుల కొట్టివేత కోసం తగిన న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు చెప్పడంతో జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌ల ధర్మాసనం అందుకు అంగీకరించింది. ఈ అంశంపై బుధవారం విచారణ జరిపిన ఇదే ధర్మాసనం..'ఉపా' కారణంగా బాధితులైన పిటిషనర్ల వ్యాజ్యాలనే పరిశీలిస్తామని తెలిపింది. ఇతరుల తరఫున వేసిన పిటిషన్లను, ప్రజాప్రయోజనం తరహా వ్యాజ్యాలను విచారించబోమని పేర్కొంది. అందువల్ల కేసులు కొనసాగించాలా, వద్దా అన్నదానిపై గురువారం ఏ విషయం చెప్పాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులను ఆదేశించింది. దాంతో కేసులను కొట్టివేయాలని కోరుతూ తొలుత సంబంధిత హైకోర్టులను ఆశ్రయిస్తామని న్యాయవాదులు తెలిపారు.

ఎలక్టోరల్ బాండ్లు రద్దు

(మొదటి పేజీ తరువాయి)



పేర్కొంటూ కాంగ్రెస్ నేత జయ ఠాకూర్, సీపీఎం, అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) అనే స్వచ్ఛందసంస్థ దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు గత ఏడాది అక్టోబరులో విచారణ ప్రారంభించింది. దానిపై తాజాగా గురువారం ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ చంద్రచూడ్ సారథ్యంలో జస్టిస్‌లు సంజీవ్ ఖన్నా, బీఆర్ గవాయ్, జేబీ పార్థీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు చెప్పింది. 232 పేజీలతో కూడిన రెండు వేర్వేరు తీర్పులను ధర్మాసనం వెలువరించింది. అయితే, ఇవి రెండూ ఏకాభిప్రాయంతో ఉన్నవే.

ప్రజల హక్కులకు భంగకరం

తీర్పు సందర్భంగా ధర్మాసనం.. ఎలక్టోరల్ బాండ్ల పథకం ఏ విధంగా ప్రజల హక్కులకు భంగకరమైనదో వివరించింది. అధికారంలో ఉన్న పార్టీలు తమకు నిధులు అందించాలంటూ వ్యక్తులను, సంస్థలను బెదిరించే అవకాశం ఉందని స్పష్టం చేసింది. 'అజ్ఞాతవ్యక్తుల విరాళాలకు అవకాశం కల్పించే ఎలక్టోరల్‌బాండ్ల పథకం, దానిలోని నిబంధనలు.. ఓటరుకున్న సమాచార హక్కుకు భంగం కలిగించటమేగాక రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) కల్పించే భావవ్యక్తీకరణ స్వేచ్ఛను ఉల్లంఘిస్తున్నాయి' అని ధర్మాసనం తేల్చి చెప్పింది. తమకు వచ్చిన, రానున్న విరాళాల గురించి ఈసీకి సీల్డ్‌కవర్‌లో రాజకీయపార్టీలు వివరాలు సమర్పించాలంటూ 2019 ఏప్రిల్ 12న సుప్రీంకోర్టు వెలువరించిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం తాజాగా ప్రస్తావించింది. 'ఈ ఉత్తర్వులు వెలువడిన నాటి నుంచి నేటి వరకూ బాండ్ల ద్వారా విరాళాలు తీసుకున్న రాజకీయపార్టీల వివరాలను ఎస్‌బీఐ ఈసీకి సమర్పించాలి. ప్రతీ ఎలక్టోరల్ బాండ్‌కు సంబంధించి.. ఆ బాండ్‌ను కొన్నది ఎవరు? దాని విలువ ఎంత? దానిని ఏ పార్టీ ఏ తేదీన నగదుగా మార్చుకుంది? అన్న పూర్తి వివరాలను ఎస్‌బీఐ ఈసీకి మార్చి 6వ తేదీలోపు ఇవ్వాలి. మార్చి 13లోపు ఆ వివరాలను ఈసీ తన వెబ్‌సైట్‌లో బహిరంగపరచాలి. నిర్ణీత 15 రోజుల్లోపు నగదుగా మార్చుకోని బాండ్లను ఆయా పార్టీలు లేదా వాటిని కొన్నవారు బ్యాంకుకు తిరిగి ఇచ్చివేయాలి. బ్యాంకు ఆ మొత్తాన్ని కొనుగోలుదారు ఖాతాలో జమ చేయాలి' అని ధర్మాసనం ఆదేశించింది. ఎన్నికల బాండ్ల పథకాన్ని తీసుకొచ్చేందుకు ఆదాయపన్ను చట్టానికి, ప్రజాప్రాతినిధ్య చట్టానికి, కంపెనీల చట్టానికి చేసిన సవరణలు చెల్లవని పేర్కొంది.

నలుగురి తరఫున సీజేఐ తీర్పు

స్వయంగా తన తరఫునేగాక జస్టిస్‌లు గవాయ్, పార్థీవాలా, మిశ్రాల తరఫునా సీజేఐ చంద్రచూడ్ 152 పేజీల తీర్పు రాశారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజకీయ విరాళాల్లో నల్లధనాన్ని అరికట్టి పారదర్శకతను తీసుకురావచ్చన్న ప్రభుత్వ వాదనను సీజేఐ వ్యతిరేకించారు. 'నల్లధనాన్ని అరికట్టటానికి ఎలక్టోరల్ బాండ్లు ఒక్కటే మార్గం కాదు. మరిన్ని మెరుగైన ప్రత్యామ్నాయాలున్నాయి. సమాచార హక్కుపై ఇవి ఎలక్టోరల్ బాండ్ల కన్నా తక్కువ ప్రభావమే చూపుతాయి' అని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు విరాళాలు రెండు రకాలుగా ఉంటాయని, ఒకటి, ఆ పార్టీకి మద్దతివ్వటం కోసం, రెండు, విరాళమిచ్చి ప్రతిగా తాను ప్రయోజనం పొందటం (క్విడ్ కో ప్రో) అని పేర్కొన్నారు. 'దేశంలో రాజకీయ సమానత్వానికి రాజ్యాంగం గ్యారెంటీ ఇస్తోంది. రాజకీయ సమానత్వంలో, రాజకీయ ప్రక్రియను ప్రభావితం చేసే అవకాశం పౌరులందరికీ సమానంగా ఉంటుంది. రాజ్యాంగ రక్షణలున్నప్పటికీ మన దేశంలో రాజకీయ అసమానత్వం కొనసాగుతోంది. దీనికి గల కారణాల్లో ఆర్థిక అసమానత్వం ఒకటి. డబ్బుకు, రాజకీయాలకు మధ్య ఉన్న సన్నిహిత సంబంధం మనకు తెలిసిందే. అయితే, డబ్బు ప్రభావం ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయటానికే పరిమితం కావటం లేదు.. అది ప్రభుత్వ విధానాలనూ ప్రభావితం చేస్తోంది. ఓ సంపన్నుడు రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చి, ఆ తర్వాత తన ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు (క్విడ్ ప్రో కోకు) అనుకూల పరిస్థితులు నెలకొని ఉన్నాయి. అంటే ప్రభుత్వ విధానాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవటం లేదా ఓ లైసెన్సును పొందటమో కావచ్చు. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కూడా పార్టీలకు విరాళాలు ఇస్తుంటారు. సంకీర్ణ ప్రభుత్వం వంటి సమయాల్లో ఇవి మరింత ఎక్కువగా ఉంటాయి. కాబట్టే ఏయే రాజకీయపార్టీలకు ఎన్ని నిధులు లభిస్తున్నాయన్న సమాచారం ఓటర్లకు తెలియాల్సిన అవసరం ఉంది. ఓటరు తన ఓటు హక్కును సమర్థవంతంగా వినియోగించుకోవటానికి ఇది అవసరం' అని సీజేఐ స్పష్టం చేశారు. దేశంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం కొనసాగటానికి ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం అత్యంత కీలకమన్నారు. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించటానికి రాజ్యాంగం కూడా సమున్నత ప్రాధాన్యం ఇచ్చిందని గుర్తు చేశారు.

పేర్లు బయటకొస్తే కలకలమే!

అజ్ఞాతంగా ఉంటూనే రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చే అవకాశం ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వ్యక్తులకు, సంస్థలకు లభించింది. ఒక రకంగా ఇది బాండ్లు కల్పించిన హామీ వంటిది. ఆ భరోసాతోనే వ్యక్తులు, సంస్థలు విరాళాలు ఇస్తూ వచ్చారు. ఇప్పుడు సుప్రీంకోర్టు వారి పేర్లను బయటపెట్టాల్సిందేనని తీర్పు చెప్పటంతో వారి పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. ఎందుకంటే, ఒక రాజకీయ పార్టీకి సన్నిహితంగా బయటకు ఉన్నప్పటికీ అంతర్గతంగా వేరే పార్టీకి విరాళం ఇచ్చిన వాళ్లు ఉండవచ్చు. తమ పేరు బయటపడితే వారికి ఇబ్బందే. ఈ నేపథ్యంలో, బాండ్ల కొనుగోలుదార్ల పేర్లను బయటపెట్టాలన్న అంశాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేయవచ్చన్న అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి.

మద్దతు కోసం ఇచ్చే విరాళాలు వేరు

ఎన్నికల కోసమో, విధానాలను ప్రభావితం చేయటం కోసమో మాత్రమే కాదు.. నిజమైన ప్రజాస్వామ్య భాగస్వామ్యం కోసం కూడా డబ్బు అవసరమేనని జస్టిస్ చంద్రచూడ్ తన తీర్పులో పేర్కొన్నారు. 'ఒక విద్యార్థి, ఒక దినసరి కూలీ, ఒక కళాకారుడు, ఒక ఉపాధ్యాయుడు రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలు వేరు. ఆయా పార్టీలకు తమ మద్దతు ప్రకటించటానికి ఇచ్చే విరాళాలు ఇవి. వీటికి రాజ్యాంగపరమైన రక్షణ ఉంటుంది. చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం లేని పార్టీలకు కూడా విరాళాలు లభిస్తుంటాయి. క్విడ్ ప్రో కో లావాదేవీల రూపంలో జరిపే విరాళాలు రాజకీయంగా మద్దతు ప్రకటించేవి కావు' అని తెలిపారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా విడిగా 74 పేజీల తీర్పును వెలువరించారు. సీజేఐ తీర్పుతో ఇది ఏకీభవించినప్పటికీ భిన్నమైన కారణాలను పేర్కొన్నారు. కాగా, పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ప్రశాంత్ భూషణ్, విజయ్ హన్సారియా, సంజయ్ హెగ్డే వాదనలు వినిపించారు. ఎన్నికల బాండ్ల వివరాలను రహస్యంగా ఉంచడం వల్ల పారదర్శకత ఉండదని, ఓటర్ల సమాచారహక్కుకు భంగం కలుగుతుందని,షెల్ కంపెనీల ద్వారా నిధులు స్వీకరించేందుకు అవకాశం కలుగుతుందని, జవాబుదారీ విధానం, నిజాయితీ దెబ్బతింటాయని వారు వాదనలు వినిపించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున వాదించిన అటార్నీ జనరల్ వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. తాము చట్టబద్ధమైన నిధులనే బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా ప్రోత్సహిస్తున్నామని, నిధులు ఇచ్చిన వారిపై రాజకీయ కక్ష సాధింపు ఉండకూడదనే ఉద్దేశంతోనే వారి వివరాలను రహస్యంగా ఉంచామని వాదించారు.

బాండ్లు అప్రజాస్వామికమని అప్పుడే చెప్పాం

కేంద్రం మోసపూరిత ఆలోచనలు మానుకోవాలి.. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం: కాంగ్రెస్

- లంచాలు, కమీషన్లకే బాండ్లు: రాహుల్
- సుప్రీం తీర్పును కొనియాడిన విపక్షాలు
- ప్రతి అంశంపైనా విపక్షాల రాజకీయం: బీజేపీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు తీసుకొచ్చిన ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలన తీర్పును విపక్ష పార్టీలు స్వాగతించాయి. సుప్రీం తీర్పుపై కాంగ్రెస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. అత్యున్నత న్యాయస్థానం నిర్ణయాన్ని స్వాగతించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. కేంద్ర ప్రభుత్వం భవిష్యత్తులోనైనా ఇలాంటి మోసపూరిత ఆలోచనలను అమలు చేయడం మానుకోవాలని సూచించారు. ఎన్నికల బాండ్ల పథకం అప్రజాస్వామికమని, దాన్ని అమల్లోకి తెచ్చినప్పుడే కాంగ్రెస్ స్పష్టం చేసిందని ట్విటర్‌లో ఆయన పేర్కొన్నారు. సుప్రీం తీర్పుపై రాహుల్ గాంధీ స్పందిస్తూ.. మోదీ అవినీతి విధానాలకు మరో రుజువు ప్రజల ముందు ఉంచినట్లయిందన్నారు. మోదీ సర్కారు లంచాలు, కమీషన్లు తీసుకోవడానికి ఎన్నికల బాండ్లను ఓ మాధ్యమంగా మార్చుకుందని ధ్వజమెత్తారు. నోట్ల కంటే ఓట్లకే శక్తి ఎక్కువనే వాస్తవాన్ని ఈ తీర్పు బలపర్చిందని, దీన్ని తాము స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. సుప్రీం తీర్పును సీపీఎం కొనియాడింది. ఎన్నికల బాండ్ల పథకం అధికార పార్టీకి ఉపయోగపడేందుకే రూపొందించారని ఆరోపించింది. ఎన్సీపీ(శరద్‌పవార్), శివసేన(ఉద్ధవ్), ఆప్ కూడా సుప్రీం తీర్పును స్వాగతించాయి. పారదర్శకతను సాధించడంలో ఈ తీర్పు కీలక అడుగు అని పేర్కొన్నాయి.

ప్రజాస్వామ్యానికి గొప్ప ఊరట: ఖురేషీ

సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధాన కమిషనర్ ఎస్‌వై ఖురేషీ స్వాగతించారు. ఈ తీర్పును ప్రజాస్వామ్యానికి లభించిన గొప్ప ఊరటగా అభివర్ణించారు. కాగా, సుప్రీంకోర్టు ఇచ్చే ప్రతి తీర్పును గౌరవించాలని బీజేపీ పేర్కొంది. ప్రధాని మోదీకి ప్రత్యామ్నాయం లేదని, అందుకే ప్రతిపక్షాలు మాత్రం ఎన్నికల బాండ్లపై ఇచ్చిన తీర్పును రాజకీయం చేస్తున్నాయని విమర్శించింది. పార్టీలకు అందే విరాళాలు, మొత్తం ఎన్నికల ప్రక్రియలో మరింత పారదర్శకత ఉండాలన్న ఉద్దేశంతోనే కేంద్రం ఈ బాండ్లను తీసుకొచ్చిందని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ చెప్పారు. కోర్టు తీర్పును గౌరవిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం మారినప్పుడు తమకు వేధింపులు ఉండకూడదన్న ఉద్దేశంతో విరాళాలు ఇచ్చేవారు తమ పేర్లను వెల్లడించ కూడదని చెబుతుంటారని, ఇది సహజమేనని అన్నారు. కాంగ్రెస్ వాళ్లను ప్రజలు మైదానం నుంచి బయటకు పంపించి వేశారని, వాళ్లు విమర్శలు చేయడమేంటని ఎద్దేవా చేశారు.

రద్దు వెనక నేపథ్యం

2017 సెప్టెంబరు 14: ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని వ్యతిరేకిస్తూ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. దీనిపై సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసు ఇచ్చింది.

2018 జనవరి 2: ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని కేంద్రం నోటిఫై చేసింది.

2022 నవంబరు 7: ఒక ఏడాదిలో బాండ్లను విక్రయించే రోజుల సంఖ్యను 70 నుంచి 85 రోజులకు కేంద్రం పెంచింది. అయితే, ఆ ఏడాదిలో ఎక్కడైనా అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంటుందని నిబంధన పెట్టింది.

2023 అక్టోబరు 16: బాండ్లకు వ్యతిరేకంగా దాఖలైన అన్ని పిటిషన్లను ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి బదిలీ చేసిన సుప్రీంకోర్టు. అదే నెల 31 నుంచి విచారణ ప్రారంభం.

2023 నవంబరు 2: తీర్పు రిజర్వు చేసిన సుప్రీంకోర్టు.

2024 ఫిబ్రవరి 15: బాండ్ల పథకాన్ని రద్దు చేస్తూ తీర్పు.

ఆ సవరణలే.. బాండ్స్‌కు శాపమా?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: దేశంలోని రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చేందుకు ఉపకరించే పథకం.. ఎలక్టోరల్ బాండ్స్‌ను రద్దు చేయడానికి సుప్రీంకోర్టు అనేక కారణాలను స్పష్టం చేసినా కేంద్ర ప్రభుత్వం 2017లో ఆర్థిక చట్టానికి, కంపెనీల చట్టానికి చేసిన సవరణలే పలువురు పిటిషన్లు వేయడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. రాజకీయ పార్టీలు విరాళాలను స్వీకరించేందుకు ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 దోహదపడుతుంది. అయితే రూ.20 వేల కంటే ఎక్కువ విరాళాలు ఇచ్చిన వారి పేర్లను వెల్లడించాలని ఆ చట్టం స్పష్టం చేస్తోంది. 2017 ఫిబ్రవరిలో లోక్‌సభ బడ్జెట్ సందర్భంగా అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఈ పథకాన్ని ప్రకటించారు. ఇకపై రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలు ఎలక్టోరల్ బాండ్ రూపంలోనే ఉండాలి అని ఆయన లోక్‌సభలో స్పష్టం చేశారు. రూ.20 వేల కంటే ఎక్కువ మొత్తంలో విరాళాలిచ్చే వారి పేర్లను ప్రకటించాలనే అంశాన్ని తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం విదేశీ విరాళాల నియంత్రణ చట్టం-2010, ప్రజాప్రాతినిధ్య చట్టం-1951, ఆదాయపన్ను చట్టం-1961, కంపెనీల చట్టం-2013, ఆర్థిక చట్టంల్లో పలు సెక్షన్లను సవరించింది. కంపెనీల చట్టం-2013 సెక్షన్ 182 సవరణ ద్వారా రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే కంపెనీల పేర్లను ప్రకటించాలనే నిబంధనను తొలగించింది. ఇది కేవలం కంపెనీలకే వర్తిస్తుంది. పౌరులకు కాదు. అంటే.. విరాళాలిచ్చే కంపెనీల పేర్లను గోప్యంగా పెడతారు. రూ.20 వేల కంటే ఎక్కువ విరాళాలిచ్చిన పౌరుల పేర్లను మాత్రం ప్రకటిస్తారు. అంతేకాదు.. కంపెనీలు తమ లాభాల్లో 7.5% కంటే ఎక్కువ మొత్తంలో విరాళాలివ్వకూడదనే నిబంధనను కూడా సవరించింది. కంపెనీల విచక్షణ మేరకు ఎంతైనా విరాళాలు ఇవ్వొచ్చని స్పష్టం చేసింది.

రూ.16,000 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరంలో దాదాపు 4,500 కోట్లకుపైగా బాండ్ల విక్రయం జరిగింది. ఎలక్టోరల్ బాండ్ల రంగప్రవేశం తర్వాత బీజేపీ దేశంలో అత్యంత సంపన్నపార్టీగా మారింది. 2022-23లో ఆ పార్టీ ఆదాయం రూ.2,360 కోట్లు కాగా దాంట్లో రూ.1300 కోట్లు బాండ్ల ద్వారా వచ్చినదే. ఇదే ఏడాది కాంగ్రెస్ రూ.452 కోట్ల ఆదాయాన్ని అర్జించగా, దాంట్లో బాండ్ల వాటా రూ.171 కోట్లు.

బాండ్ల ద్వారా పార్టీలకు విరాళాలు (రూ.కోట్లలో)

పార్టీ	2017-18	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
బీజేపీ	210	1,450	2,555	22	1,033	1,294
కాంగ్రెస్	5	383	317	10	236	171
తృణమూల్	0	97	100	42	528	325
ఎన్సీపీ	0	29	20	0	14	-
బీఆర్ఎస్	0	141	89	0	153	529

(2022-23లో బాండ్ల ద్వారా డీఎంకేకు రూ.185 కోట్లు, బీజేడీకి రూ.152 కోట్లు, టీడీపీకి రూ.34 కోట్లు సమకూరాయి)

రైతు నాయకులతో మూడో దఫా చర్చలు

- పాల్గొన్న ముగ్గురు కేంద్ర మంత్రులు, పంజాబ్ ముఖ్యమంత్రి

చండీగఢ్, ఫిబ్రవరి 15: పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండు చేస్తూ ఢిల్లీ శివారుల్లో ఒకవైపు అన్నదాతలు ఆందోళన కొనసాగుతుండగా మరోవైపు చండీగఢ్‌లో గురువారం ముగ్గురు కేంద్రమంత్రులు రైతు నాయకులతో చర్చలు జరిపారు. ఆందోళన మొదలయిన తరువాత ఇవి మూడో దఫా చర్చలు కావడం విశేషం. ఇక్కడి మహాత్మా గాంధీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి అర్జున్ ముండా, వాణిజ్య-పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్‌లు రైతు నాయకులతో చర్చలు జరిపారు. ఈ చర్చల్లో పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్‌కు పాల్గొన్నారు. గురువారం అర్ధరాత్రి వరకు చర్చలు కొనసాగాయి. కేంద్ర మంత్రులతో చర్చలు జరిగేవరకు తాము ఢిల్లీ నగరంలోకి ప్రవేశించకుండా వేచి చూస్తామని గతంలోనే రైతు నాయకులు ప్రకటించడం గమనార్హం.



రాజ్‌పురాలో రైలు పట్టాలపై బైఠాయించిన రైతులు

మూడో రోజూ రైతన్న ఆందోళన

- సింఘూ, టిక్రీ సరిహద్దులు మూసివేత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో చలో ఢిల్లీకి పిలుపునిచ్చిన రైతుల ఆందోళనలు మూడోరోజు గురువారం కొనసాగాయి. ఢిల్లీ, హరియాణా మధ్య రెండు కీలక సరిహద్దు పాయింట్లను పోలీసులు మూసివేశారు. హరియాణా నుంచి ఢిల్లీలోకి ప్రవేశించే టిక్రీ, సింఘూ సరిహద్దులను మూసివేయడంతో యూపీలోని ఘాజీపూర్ సరిహద్దు మీదుగా భద్రతా సిబ్బంది పర్యవేక్షణలో రాకపోకలకు అనుమతించారు. శంభు సరిహద్దు వద్ద నిరసన తెలుపుతున్న రైతులను హరియాణా పోలీసులు అడ్డుకున్నప్పటికీ ఢిల్లీలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. పార్లమెంట్, ఇతర సున్నిత ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. టిక్రీ, సింఘూ సరిహద్దుల వద్ద ఢిల్లీ పోలీసులు అనేక అంచెల్లో బారికేడ్లు, సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేశారు. పంజాబ్ రైతులను కట్టడి చేయడానికి ఇప్పటికే పెద్దసంఖ్యలో టియర్ గ్యాస్ షెల్స్ నిల్వ చేశామని, అయినప్పటికీ గ్వాలియర్‌లోని టేకన్‌పూర్‌లో ఉన్న బీఎస్ఎఫ్‌కు చెందిన టియర్ స్మోక్ యూనిట్ నుంచి మరో 30వేలకు పైగా బాష్పవాయు గోళాల కోసం ఆర్డర్ పెట్టామని ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. గురువారం చండీగఢ్‌లో ముగ్గురు కేంద్రమంత్రులతో సమావేశమైన తర్వాత తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తామని రైతు నేతలు పేర్కొన్నారు. 'చలో ఢిల్లీ' నిరసనకారులపై హరియాణా పోలీసుల చర్యలను నిరసిస్తూ పంజాబ్‌లో 4 గంటల రైల్ రోకోకు భారతీయ కిసాన్ యూనియన్ (ఏక్తా ఉగ్రహాన్), బీకేయూ దకుంద(ధనేర్) పిలుపునిచ్చాయి. చాలాచోట్ల రైతులు రైలు పట్టాలపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఢిల్లీ-అమృత్‌సర్ మార్గంలో పలు రైళ్లను గురువారం దారి మళ్లించారు.

మూడో టీఎంసీ దండగ!

దానిపై 28 వేల కోట్ల నిరర్థక ఖర్చు .. కాళేశ్వరంలో భారీగా అనుచిత చెల్లింపులు

- ఒక టీఎంసీతో 17,668 ఎకరాలకు నీళ్లా?
- కరెంట్ బిల్లులకే ఏటా రూ.10,374 కోట్లు
- ఎకరం సాగుకు రూ.46,364 పెట్టాలి
- 2019లోనే దెబ్బతిన్న 3 బ్యారేజీలు
- డిజైన్లలో లోపాలే ఈ పరిస్థితికి కారణం
- గత ప్రభుత్వాన్ని తీవ్రంగా తప్పుబట్టిన కాగ్



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు మీద భారీ ఎత్తున వృథా ఖర్చు పెట్టారని కాగ్ అభ్యంతరం పెట్టింది. 28 వేల కోట్లకు పైగా ఖర్చు పెడుతున్న మూడో టీఎంసీ అసలు అవసరం లేదని తేల్చింది. కొన్ని ప్యాకేజీల విషయంలో అనుచిత చెల్లింపులు కూడా జరిగాయని నిర్ధారించింది. డిజైన్ల లోపం వల్ల కూడా వందల కోట్ల రూపాయల నష్టం జరిగిందని అంచనా వేసింది. 2021-22 సంవత్సరానికి సంబంధించిన నివేదికను విడుదల చేసిన కాగ్ ప్రాజెక్టు విషయంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన తీరును తీవ్రంగా అభిశంసించింది. సమగ్ర పరిశోధనలు, సర్వేలు చేపట్టకుండానే డీపీఆర్ తయారు చేశారని, డీపీఆర్‌కు ఆమోదం పొందిన తర్వాత కూడా అడ్డగోలుగా మార్పులు చేశారని ఆక్షేపించింది. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.1,47,427 కోట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేసింది. 2 టీఎంసీల ప్రాజెక్టును రూ.81,911 కోట్ల అంచనాతో మొదలెట్టి ఒకేసారి కాకుండా విడివిడిగా పరిపాలన అనుమతులు ఇచ్చారని ప్రస్తావించింది. 2022 మార్చి దాకా రూ.1,10,248 కోట్ల విలువైన పనులకు 73 దఫాలుగా పరిపాలన పరమైన అనుమతులు ఇచ్చారని ప్రస్తావించింది. నిధులను ఎక్కడి నుంచి సమకూర్చారన్న విషయంపై ఎక్కడా ఉత్తర్వులు లేవని ప్రస్తావించింది. కాళేశ్వరంపై కాగ్ ఆడిట్ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం గురువారం శాసనసభలో ప్రవేశపెట్టింది. ప్రాజెక్టులో లోపాలపై కాగ్ పలు సంచలన విషయాలు వెల్లడించింది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ఉమ్మడి రాష్ట్రంలో రూ.38,500 కోట్ల వ్యయంతో చేపట్టగా 2016 మార్చి నాటికి దీనిపై రూ.11,642.85 కోట్లు ఖర్చు పెట్టారని ప్రస్తావించింది. ఆ తర్వాత రీ ఇంజనీరింగ్ పేరుతో కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని తెరమీదికి తెచ్చారని గుర్తు చేసింది. రూ.81,911 కోట్ల అంచనాతో 18.26 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించడం లక్ష్యమని ప్రస్తావించింది. లిఫ్టుల పంపింగ్ సామర్థ్యం అనవసరంగా పెంచారని కాగ్ తప్పుపట్టింది. అసలే అవసరం లేకున్నా అదనంగా మరో టీఎంసీలు తరలించే సమాంతర పథకాన్ని రూ.28,151 కోట్లతో చేపట్టారని గుర్తు చేసింది. దీనివల్ల ప్రాజెక్టు అంచనాలు భారీగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఏటా కాళేశ్వరం కరెంట్ బిల్లులకు రూ.10,374 కోట్లు అవుతుందని, నిర్వహణ భారం రూ.272 కోట్లు కలిపితే ఎకరా పంటను పండించటానికి నీళ్లకు అయ్యే ఖర్చు రూ.46 వేలని కాగ్ అంచనా వేసింది. దీన్ని ఏ మాత్రం లాభదాయకం కాని ప్రాజెక్టుగా అభివర్ణించింది. ప్రాజెక్టు కింద రూపాయిని వెచ్చిస్తే వచ్చే ఆదాయం కేవలం 52 పైసలని లెక్కకట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 1.83 లక్షల ఎకరాలకు పైపుల ద్వారా సాగునీటిని అందించే కార్యక్రమాన్ని చేపట్టారని, ఇందుకు రూ.2248 కోట్లు ఖర్చు చేశారని కాగ్ ప్రస్తావించింది. పైపుల జీవితం కాలం 30 ఏళ్లు మాత్రమేనని, ఓపెన్ కాలువలు వందేళ్లు ఉంటాయని చెప్పింది. పైపులకు, కాలువలకు మధ్య ఖర్చు ఎకరానికి 5000 అదనంగా అవుతుందని అంచనా వేసింది. అన్నిరకాల నిరర్థక ఖర్చు, అనుచిత చెల్లింపుల విలువ రూ.46 వేల కోట్లు ఉంటుందని అంచనా.

ప్రయోజనమే లేని ప్రెషర్ మెయిన్

కాళేశ్వరం ప్రాజెక్టులో ప్యాకేజీ 1 నుంచి 4 దాకా సొరంగం పనులకు బదులుగా ప్రెషర్ మెయిన్‌ల పనులు చేపట్టడం వల్ల భారీగా నష్టం జరిగిందని కాగ్ గుర్తించింది. కాంక్రీట్ లైనింగ్ జీవిత కాలం వందేళ్లు కాగా... ప్రెషర్ మెయిన్ పైపుల జీవితకాలం 30 ఏళ్లు మాత్రమేనని ప్రస్తావించింది. కిలోమీటర్ సొరంగం తవ్వడానికి రూ.91 కోట్లు మాత్రమే అవుతుండగా ప్రెషర్‌మెయిన్‌తో రూ.251 కోట్ల దాకా పెట్టించారని తెలిపింది. ఈ తేడా వల్ల రూ.3726.91 కోట్ల అదనపు భారం పడిందని తెలిపింది.

ఎస్‌ఆర్‌ఎస్పీ పునరుజ్జీవం మరో దండగ

శ్రీరాంసాగర్ రిజర్వాయర్‌కు 60 రోజుల్లో 60 టీఎంసీలు ఎత్తిపోసే పథకాన్ని రూ.2000 కోట్లతో అనవసరంగా చేపట్టారని కాగ్ తప్పుపట్టింది. రివర్స్ పంపింగ్ విధానం వల్ల ఏటా కరెంట్ బిల్లుల కింద రూ.141.52 కోట్లు అవుతుందని పేర్కొంది. దీన్ని చేపట్టడానికి ప్రభుత్వం ఇచ్చిన సమర్థనలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయని తప్పుపట్టింది. మల్లన్నసాగర్ పనిని నాలుగు ప్యాకేజీలుగా విడగొట్టి, నలుగురు కాంట్రాక్టర్లకు పనులు కట్టబెట్టారని, ఇందులో రూ.63.05 కోట్లతో చేపట్టిన ఫీడర్ ఛానల్ అంతా తిరిగి మల్లన్నసాగర్‌లో మునుగుతోందని ప్రస్తావించింది.

ఆదరాబాదరా అప్పగింత

నిర్మాణం కోసం తీసుకున్న రూ.87,449 కోట్ల అప్పులకు వడ్డీ చెల్లింపులే రూ.54,174 కోట్లు అవుతాయని కాగ్ అంచనా వేసింది. మొత్తం ఖర్చు రూ.1,41,544 కోట్లకు చేరుతుందని తెలిపింది. కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) ప్రాజెక్టు డీపీఆర్ ఆమోదించడానికి ముందే రూ.25,050 కోట్ల విలువ చేసే 17 పనులను ప్రభుత్వం తొందరపాటుతో అప్పగించిందని ఆక్షేపించింది. డీపీఆర్‌ను కేవలం కాగితంపై లాంఛనప్రాయంగా పరిగణించిందని వ్యాఖ్యానించింది. రూ.87,449 కోట్ల రుణాలను తీసుకొనేంత ఆదాయ వనరులు కాళేశ్వరం కార్పొరేషన్‌కు లేదని, చెల్లింపులకు రాష్ట్ర ప్రభుత్వం మీద ఆధారపడక తప్పదని చెప్పింది. ఇకనైనా ఇలాంటి అప్పులు తీసుకోవడం మానాలని చెప్పింది.

ఏటా ప్రాజెక్టుకు రూ.25,109 కోట్లు

2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి కాళేశ్వరం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.25,109 కోట్లు సిద్ధం చేసుకోవాలని చెప్పింది. ప్రాజెక్టులో 56 పనులకుగాను 12 మాత్రమే పూర్తయ్యాయని, 34 పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపింది. తీసుకున్న అప్పులను వడ్డీల చెల్లింపులకు మళ్లించడంతో వడ్డీల మీద వడ్డీలు అవుతున్నాయని చెప్పింది. నిర్మాణ సమయంలో చెల్లించే వడ్డీయే రూ.19,556 కోట్లు అని కాగ్ గుర్తించింది. ప్రాణహిత- చేవెళ్లలో రంగారెడ్డి జిల్లాకు 1.97 లక్షల ఎకరాలకు నీరు అందించాల్సి ఉండగా రీ ఇంజనీరింగ్ తర్వాత రంగారెడ్డి జిల్లాలో 1.97 లక్షల ఎకరాల్లోని రైతులకు నీళ్లివ్వకుండా చేశారని కాగ్ గుర్తుచేసింది. ఈ ఆయకట్టును ఎందుకు తొలగించారో వివరణ ఇవ్వలేదని పేర్కొంది. ఒక్క టీఎంసీతో ప్రాణహిత-చేవెళ్లలో 10 వేల ఎకరాలకు నీళ్లు ఇస్తామని ప్రతిపాదించగా... కాళేశ్వరంలో మాత్రం ఏకంగా 17,668 ఎకరాలకు నీళ్లు అందించనున్నట్లు చూపించడంపై కాగ్ విస్మయం వ్యక్తం చేసింది.

రూపాయికి వచ్చేది 52 పైసలే

రూపాయి ఖర్చుకు రూ.1.52 ఆదాయం వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జల వనరుల సంఘానికి నివేదించి అనుమతి తెచ్చుకుంది. కాగ్ మాత్రం 52 పైసలు మాత్రమే ఆదాయం వస్తుందని తేల్చింది. వార్షిక వ్యయాన్ని తక్కువగా, ఏటా వచ్చే ప్రయోజనాల విలువను ఎక్కువగా చూపించారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆక్షేపించింది. వ్యవసాయానికి సాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరా, తాగునీరుతో పాటు చేపల పెంపకం ఇతరత్రా మార్గాల ద్వారా ఏటా రూ.21,682.34 కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం చూపించగా... రాబడి రూ.14,709 కోట్లకు మించి రాదని కాగ్ కట్టింది.

భూకంప జోన్‌లో మల్లన్నసాగర్

భూకంప జోన్‌లోనే 50 టీఎంసీలతో మల్లన్నసాగర్ నిర్మాణం చేపట్టారని కాగ్ తేల్చింది. ఈ ప్రాంతంలో లోతుల్లో నిటారుగా ఉన్న పగుళ్ల(డీప్ సీటెడ్ వెర్టికల్ ఫాల్ట్) ఉన్నట్లు గుర్తు చేసింది. భూకంప సంబంధిత లోతైన అధ్యయనాలేవీ చేయకుండానే రూ.6126.80 కోట్లతో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారని ఆక్షేపించింది. ఎన్‌జీఆర్‌ఐ నివేదిక రావడానికి ముందే పనులు అప్పగించారని ఆక్షేపించింది. 1983 జూన్‌లో మేడ్చల్‌లో 4.9 తీవ్రతతో భూకంపం సంభవించిందని కాగ్ గుర్తించింది. 20 కిలోమీటర్ల దూరంలోనే మల్లన్నసాగర్ ఉందని గుర్తించింది. మల్లన్నసాగర్‌లో పూర్తిస్థాయి నీటి నిల్వ చేయడానికి ముందు భూకంప అధ్యయనం చేయాలని సిఫారసు చేసింది.

పంపుల్లో రూ.7,872 కోట్ల అనుచిత లబ్ధి

పంపులు, మోటార్లు, అనుబంధ పరికరాల కోసం మార్కెట్ ధరలను అంచనా వేయకుండానే రూ.17,653 కోట్లుగా ఖరారు చేశారని కాగ్ తప్పుబట్టింది. మోటార్లకు సంబంధించి రూ.5188 కోట్ల మేర అనుచిత లబ్ధి చేకూరిందని తప్పుపట్టింది. పరికరాల కోసం రూ.7,212 కోట్లు కేటాయించగా బీహెచ్‌ఈఎల్ అందించలేని సేవలకు సంబంధించి ఇతర ఖర్చులు తీసేసినా రూ.2,685 కోట్ల మేర అనుచిత లబ్ధి కలిగిందని కాగ్ అంచనా వేసింది. రెండూ కలిపి రూ.7,872 కోట్ల అనుచిత లబ్ధి చేకూరిందని అభిప్రాయపడింది. ప్రాణహిత -చేవెళ్ల ప్రాజెక్టును రీ ఇంజనీరింగ్ చేసి, కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టడంతో ప్రాణహితలో చేపట్టిన పనులు నిర్థకంగా మారాయని, దీని వల్ల రూ.768 కోట్ల నష్టం జరిగిందని కాగ్ గుర్తించింది.

ఏడు లింకులుగా...

కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని ఏడు లింకులుగా విభజించగా... రూ.82,252.75 కోట్ల ఒప్పంద విలువతో 56 పనులను కాంట్రాక్టర్లకు కట్టబెట్టారు. పనుల్లో సవరణ అంచనాలతో దీని నిర్మాణ అంచనా వ్యయం 2022 మార్చి నాటికే రూ.1,02,267.99 కోట్లకు చేరిందని కాగ్ గుర్తించింది. డీపీఆర్‌ను ఆమోదించే సమయంలో రూ.81,911.01 కోట్లు కాగా... 2024 జూన్ నాటికీ రూ.1,47,427.41 కోట్లకు చేరుతుందని లెక్కకట్టింది. డిజైన్లు తేల్చకుండా భూసేకరణ పూర్తి చేయకుండా పనులు అప్పగించడం వల్ల ఏటా అంచనా వ్యయాలు పెరుగుతున్నాయని ప్రస్తావించింది. తక్షణమే భూసేకరణ మీద దృష్టి పెట్టాలని సూచించింది.

2019 డ్యామేజీ ఖర్చు ప్రభుత్వానిదే

2019 జూన్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీ ప్రారంభం కాగా... సరిగ్గా ఆర్నెల్లకు 2019 నవంబరులో మేడిగడ్డ గేట్లను దించగా... ఆర్‌సీసీ వేసిన కోటు, సీసీ కర్టెన్ గోడలలో కొంతభాగం, దిగువభాగంలో నిర్మించిన కాంక్రీట్ బ్లాకులు కొట్టుకుపోయాయని కాగ్ తెలిపింది. సుందిళ్ల బ్యారేజీ దిగువ భాగంలో సిమెంట్ కాంక్రీట్ బ్లాకులు, అప్రాన్‌లు దెబ్బ తిన్నాయని చెప్పింది. డిజైన్, డ్రాయింగ్ లోపాలే కారణమని తేల్చింది. నిర్మాణ సంస్థలు సాగునీటి శాఖ ఇంజనీర్ల పర్యవేక్షణలోనే పనులు జరిగాయని, నాణ్యత ధ్రువీకరణ(క్వాలిటీ కంట్రోల్) సర్టిఫికెట్ కూడా ఇచ్చారని చెప్పినప్పటికీ ఆ వివరాలు తమకు ఇవ్వలేదని కాగ్ చెప్పింది. బ్యారేజీ ప్రారంభించడానికి ముందు కాంక్రీట్ బ్లాకులు, లాంఛింగ్ అప్రాన్‌ల తనిఖీ జరగలేదని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికను కాగ్ ఉటంకించింది. మూడు బ్యారేజీల ఫ్లెక్సిబుల్ అప్రాన్‌లు దెబ్బతిన్నట్లు నిర్మాణ సంస్థలు గుర్తించాయని, ఈ పనులకు రూ.476 కోట్లు అవుతాయని అంచనాలు పంపించినా ప్రభుత్వం మంజూరు చేయలేదని కాగ్ గుర్తు చేసింది. లోపభూయిష్టమైన డిజైన్ల కారణంగా బ్యారేజీల పునరుద్ధరణ ఖర్చును ప్రభుత్వమే భరించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేసింది.

రాష్ట్ర నికర ఆదాయంలో..

11 శాతం స్థానిక సంస్థలకు

- ఆర్థిక సంఘం సిఫారసులతో ప్రభుత్వం నిర్ణయం
- చెక్ పవర్ పరిమితికి పెంపునకూ ఆమోదం

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఏటా రాష్ట్రానికి వచ్చే నికర ఆదాయంలో 11 శాతాన్ని స్థానిక సంస్థలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మొత్తంలో 61 శాతం పంచాయతీరాజ్‌కు, 39 శాతం పట్టణ సంస్థలకు కేటాయించనుంది. తెలంగాణ రాష్ట్ర తొలి ఆర్థిక సంఘం చేసిన ప్రతిపాదనల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఆర్థిక సంఘం 37 సిఫారసులతో తొలి నివేదికను ప్రభుత్వానికి అందజేయగా.. వాటిలో చాలా అంశాలకు ఈ నెల 4న జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. కొన్నింటిని మాత్రం తిరస్కరించింది. కొత్తగా ఏర్పాటు చేసిన జడ్పీ, ఎంపీపీ, గ్రామపంచాయతీ, పట్టణ స్థానిక సంస్థల్లో రానున్న మూడేళ్లలో భవనాల నిర్మాణాలు చేపట్టాలని సూచించగా ప్రభుత్వం ఆమోదించింది. కేంద్ర ఆర్థిక సంఘం ద్వారా విడుదలయ్యే గ్రాంట్లను నేరుగా పంచాయతీల ఖాతాల్లో జమ చేయడం ఇప్పటికే అమల్లో ఉన్నందున.. దానిని యథావిధిగా కొనసాగించాలని ఆర్థిక సంఘం సూచించింది. స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే గ్రాంట్ నిర్వహణకు సంబంధించిన విధివిధానాలను పంచాయతీరాజ్, పురపాలక శాఖల హెచ్‌వోడీలు సొంత గైడ్‌లైన్స్ ప్రకారం నిర్వహించుకోవాలని సూచించింది. జడ్పీ, ఎంపీపీ, గ్రామ పంచాయతీలలో చెక్ పవర్ పరిమితిని పెంచుతూ సిఫారసు చేసింది. వీటన్నింటికీ మంత్రివర్గం ఆమోదం తెలిసింది. దీనిని ప్రభుత్వం గురువారం శాసనసభలో ప్రవేశపెట్టింది.

పదేళ్లలో 6,400 ప్రభుత్వ పాఠశాలల మూసివేత

- శాసనమండలిలో మంత్రి కోమటిరెడ్డి వెల్లడి



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గడిచిన పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం డీఎస్సీ వేయకపోవడంతో రాష్ట్రంలో 6,400 ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. 70 వేల మంది ఉపాధ్యాయులు రిటైర్ అయినా పట్టించుకోకపోవడంతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి ఈ యేడు రూ.21 వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. శాసనమండలిలో గురువారం అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ తన అయిదేళ్ల ఎమ్మెల్సీగా అనుభవాన్ని గుర్తు చేస్తూ ప్రజాస్వామ్యంగా సభ నిర్వహించడం ఇప్పుడే చూస్తున్నానని, స్కూళ్లలో కనీస సిబ్బంది లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందిస్తూ రోజుకు వేలాది మంది ప్రజలు తమ బాధలు చెప్పుకునేందుకు తరలివస్తున్నారని, తన చాంబర్‌కు వెళ్లడానికి ప్రయత్నిస్తే అర్జీదారులే వందలాది మంది ఉంటున్నారని చెప్పారు. గడిచిన పదేళ్లలో గత ప్రభుత్వం ప్రజలను పట్టించుకోకపోవడంతో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రజలు తమవద్దకు తరలివస్తున్నారని, దీంతో చాంబర్‌లు, ప్రజాభవన్ రద్దీగా మారాయని తెలిపారు.

పన్నుల వాటా నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి: అక్బరుద్దీన్



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటా నిధుల కోసం ఒత్తిడి పెంచేందుకు అఖిల పక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని మజ్లిస్‌పక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. పన్నుల్లో రాష్ట్రాలకు దక్కాల్సిన వాటా చెల్లింపుల్లో దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని ఆరోపించారు. గురువారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చలో అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. బీజేపీపాలిత రాష్ట్రాలకు 8 నుంచి 16 శాతానికి పైగా నిధులు విడుదల చేస్తున్న కేంద్రం దక్షిణాది రాష్ట్రాలకు 4 నుంచి 2శాతానికి పరిమితమవుతోందన్నారు. కేంద్ర నిధుల వాటా విడుదలలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని చెప్పారు.

పదేళ్ల పోలీసుల బకాయిలు ఇవ్వాలి: కూనంనేని



పోలీసులకు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయి అలవెన్స్‌లను విడుదల చేయాలని సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీస్ నియామకాల్లో హోంగార్డులకు ప్రాధాన్యం కల్పించాలని, హోంగార్డు కుటుంబాలకు సామాజిక రక్షణ కల్పించాలని కోరారు. 58 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ మాదిరి నెలనెలా ఆర్థికసాయం అందించే పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని అన్ని ఆస్పత్రుల్లో అమలు చేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

హామీల అమలుకే కేటాయింపులు లేవు: ఏలేటి

కాంగ్రెస్ ఇచ్చిన పలు హామీల అమలుకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులులేవని, కనీసం ఆరు గ్యారంటీల అమలుపై స్పష్టతలేదని బీజేపీ శాసన సభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలుకే సుమారు రూ.53వేల కోట్లు అవసరముంటుందన్నారు. రూ.59 వేల కోట్ల లోటునెలా భర్తీ చేస్తారనేదానిపై స్పష్టతలేదని చెప్పారు. గతంలో బీఆర్ఎస్ పెట్టిన బడ్జెట్‌లాగే కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్ ఉందని విమర్శించారు.

అసెంబ్లీకి రాని వారిని ఈసీ బహిష్కరించాలి

రాష్ట్ర ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ తప్పు పట్టారు. అలా అసెంబ్లీకి హాజరుకాని వారిని ఎన్నికల సంఘం బహిష్కరించాలని కోరారు. రేవంత్ రెడ్డి సీఎం కావడంతో ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో కూర్చునేందుకు కేసీఆర్‌కు ముఖం చెల్లడం లేదని అన్నారు. కేసీఆర్ అహంకారం వల్లే ఓటమి పాలయ్యారని, ఇప్పటికీ ఆయన అదే తీరు ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎలక్టోరల్ బాండ్లలో ఏపీ వాటా 529 కోట్లు

- అధికార వైసీపీ ఖాతాలో 382 కోట్లు.. టీడీపీకి 146 కోట్లు

అమరావతి-ఆంధ్రజ్యోతి : ఎలక్టోరల్ బాండ్ల విధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలోని రెండు ప్రధాన రాజకీయ పార్టీలకు ఇప్పటి వరకు 529.04 కోట్ల రూపాయలు బాండ్ల రూపంలో వచ్చాయి. ఇందులో సింహభాగం అధికార వైసీపీదే వాటా. వైసీపీకి 2017-18 నుంచి 2022-23 వరకు రూ.382.44 కోట్లు బాండ్ల రూపంలో వచ్చాయి. ప్రతిపక్ష టీడీపీకి 146.60 కోట్ల రూపాయలు వచ్చాయి. 2023-24 సంవత్సరం లెక్కలు వెలుగుచూడాల్సి ఉంది. సుప్రీం కోర్టు తాజా ఆదేశాల మేరకు ఇటు వైసీపీ, అటు టీడీపీకి బాండ్ల రూపంలో వచ్చిన నిధులు ఎవరిచ్చారు? ఎక్కడి నుంచి వచ్చాయో? ఎస్‌బీఐ కేంద్ర ఎన్నికల కమిషన్‌కు లెక్కలు చెప్పాల్సి ఉంది. 2019 నుంచి ఇచ్చిన బాండ్ల వివరాలను వెంటనే ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. పార్టీలకు ఏయే కంపెనీలు ఏ మేరకు బాండ్ల రూపంలో విరాళాలు ఇచ్చాయన్న విషయాలు త్వరలో బయటకు రానున్నాయి. ఇది రాజకీయ పార్టీలను, విరాళాలు ఇచ్చిన వారిని ముఖ్యంగా అధికార పార్టీని ఆందోళనకు గురి చేస్తోంది. ఈ బాండ్లు నిర్వహిస్తున్న ఎస్‌బీఐ.. పార్టీలకు ఇచ్చిన వ్యక్తులు, సంస్థల వివరాలను కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సవివరంగా వెల్లడించాల్సి ఉంది. రాజకీయ పార్టీలు కూడా అదే పనిచేయాల్సి ఉంటుంది.

'ఆరు నెలలలోపు ఎన్నికల' నిబంధన ఎత్తివేత

- పంచాయతీరాజ్ నిబంధనల్లో మార్పులు చేసిన సర్కారు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ నిబంధనల్లో తాజాగా సవరణలు చేసింది. జిల్లా, మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, సభ్యుల, కో- ఆప్షన్ల ఉప ఎన్నికలపై పలు సవరణలు చేసింది. ఇప్పటి వరకు ఈ పదవులు ఖాళీ అయితే 6 నెలల్లోపు ఎన్నికలు నిర్వహించి భర్తీ చేయాలన్న నిబంధన ఉండేది. తాజా సవరణల్లో ఆ నిబంధనలను తొలగించినట్లు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. ఇందుకుగాను జీవో నెం 11ను విడుదల చేశారు. ఈ మేరకు నోటిఫికేషన్ ఇవ్వటంతో పాటు గెజిట్‌లో చేరుస్తున్నట్లు తెలిపారు. జిల్లా, మండల పరిషత్‌లలో ఖాళీ అయిన పదవులకు గత ప్రభుత్వం ఉప ఎన్నికలకు అనుమతి ఇవ్వకపోవడంతో రాష్ట్రంలో దాదాపు 6వేలకు పైగా స్థానిక సంస్థలు ప్రజాప్రతినిధుల ఖాళీలు భర్తీ కాలేదు.





విధ్వంసం కాదు.. పలు రంగాల్లో అభివృద్ధి

- బీఆర్ఎస్ పాలనపై విమర్శలు సరికాదు
- పక్షపాతం లేకుండా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలి: ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి
- మేం ఉద్యోగ పరీక్షలు జరిపితే మీరు క్రెడిట్ కొట్టేస్తున్నారు: కడియం శ్రీహరి

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందంటూ రాష్ట్ర ప్రభుత్వం పదే పదే విమర్శలు చేయడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ తమ పాలనలో అనేక రంగాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలకు ఒక్కో దానికి ఎంత కేటాయించారో చెప్పాలన్నారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని, అదే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న చోట కూడా పక్షపాతం చూపకుండా ఇళ్లను మంజూరు చేయాలన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, అంబేద్కర్ అభయ హస్తం పేరిట దళిత కుటుంబాలకు రూ.12 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైందని ప్రశ్నించారు. తాము నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించిన వాటికి నియామక పత్రాలిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం క్రెడిట్ కొట్టేస్తుందని ఎద్దేవా చేశారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ ప్రతిపక్షంగా కాకుండా ఫ్రస్టేషన్ పక్షంగా తయారైందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. దళిత సీఎంను చేస్తానని, లేదంటే తల తీసుకుంటానని హామీ ఇచ్చిన కేసీఆర్.. అధికారం దక్కగానే ఆ మాటను విస్మరించారని ఆయన తల ఎక్కడ పెట్టుకున్నారని ప్రశ్నించారు. నల్గొండలో ప్రజలు బీఆర్ఎస్‌ను ఛీదరించుకున్నారని, స్థానికంగా ప్రజలు రారనే భయంతోనే హైదరాబాద్ తదితర జిల్లాల నుంచి జనాన్ని ఇటీవలి సభకు తరలించారని విమర్శించారు. బీఆర్ఎస్ శ్రేణులు మస్తీలో కారు నడపడం వల్ల.. ఒక ఎమ్మెల్యే కారు ప్రమాదానికి గురయిందని.. హోంగార్డు చనిపోతే కనీసం పరామర్శ కూడా చేయలేదన్నారు. దీంతో సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి.. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో వాగ్వాదానికి దిగారు. సీఎం రేవంత్‌కు తమ వల్ల ముప్పులేదని.. సొంత పార్టీలోని కొందరి వల్లే ముప్పు ఉంటుంది జాగ్రత్త అని కడియం శ్రీహరి హెచ్చరించారు.

పాత అప్పులు చెల్లించడానికి కొత్త అప్పులు

(మొదటిపేజీ తరువాయి)



ఓటాన్ అకౌంట్‌పై చర్చ సందర్భంగా ఆరు గ్యారంటీల అమలుకు జరిపిన కేటాయింపులు, ఆయా విభాగాలకు ప్రభుత్వ బకాయిల చెల్లింపు, పథకాల అమలుకు అంచనా వ్యయం వంటి అంశాలపై వివిధ పార్టీల శాసనసభ్యులు కడియం శ్రీహరి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, అక్బరుద్దీన్ ఒవైసీ, కూనంనేని సాంబశివరావు అడిగిన ప్రశ్నలకు భట్టివిక్రమార్క సమాధానం ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.7,740 కోట్లు కేటాయించామని, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు నిర్మించి ఇస్తామని భట్టివిక్రమార్క అన్నారు. రైతు భరోసా, గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్‌తోపాటు అన్ని హామీలకూ నిధులు కేటాయించామన్నారు. గత ప్రభుత్వ హయాంలో.. హామీల అమలుకు బడ్జెట్ ఉందా? లేదా? అనే అంచనా లేకపోవడంతో ఇబ్బంది జరిగిందని, ఇప్పుడు అలా కాకుండా వాస్తవ బడ్జెట్‌ను రూపొందించామని తెలిపారు. గత పదేళ్లలో ఆదాయం ఉన్నా లేకున్నా.. ఏటా 20 శాతం బడ్జెట్ పెంచుతూ వచ్చారని తప్పుబట్టారు. ధనిక రాష్ట్రంలో రూ.లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టామంటూ గొప్పలు చెప్పుకొన్నారని, కానీ.. 2018 నుంచి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదని విమర్శించారు. బడ్జెట్‌లో బీసీల కోసం కేటాయింపులు చేసి.. వారికి రుణాలు మాత్రం ఇవ్వలేదన్నారు. గతేడాది దళితబంధుకు రూ.17,700 కోట్లు పెట్టి.. ఒక్క పైసా విడుదల చేయలేదని తెలిపారు. గతంలో రూ.49 వేల కోట్లు కేంద్ర పథకాల నిధులు చూపించారని, తాము మాత్రం వాస్తవికంగా రూ.21 వేల కోట్లు మాత్రమే చూపించామని తెలిపారు. బీసీ సబ్ ప్లాన్‌ను అమలు చేస్తామని, దళితుల కోసం అంబేద్కర్ అభయహస్తం అమలుకు విధి విధానాల రూపకల్పన చేస్తున్నామని అన్నారు.

పాత అప్పులు చెల్లించడానికే కొత్త అప్పులు..

రాష్ట్రంపై రూ.7.11 లక్షల కోట్ల అప్పుల భారం ఉందని, ఇప్పటివరకు చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికే మళ్లీ అప్పులు చేయాల్సి వస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ ఏడాది కచ్చితంగా కట్టాల్సిన అప్పు, వడ్డీ లెక్కిస్తే.. మొత్తం రూ.64,414 కోట్లు ఉందని, దానిని చెల్లించడానికి రూ.68,585 కోట్లు తీసుకుంటామని చెప్పారు. అప్పులు కట్టగా మిగిలేది రూ.4 వేల కోట్లు మాత్రమేనన్నారు. అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజనం కార్మికులు, సెకండ్ ఏఎన్ఎంలకు ప్రతి నెలా జీతం వచ్చేలా చూస్తామని, స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలను ప్రవేశపెట్టి అందజేస్తామని అన్నారు. స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌ను పదేళ్లుగా వేయలేదని, తమ ప్రభుత్వం రాగానే అప్రూవ్ చేయడంతోపాటు వారి ప్రతిపాదనల్నీ బడ్జెట్‌లో పెట్టామని తెలిపారు. గత పదేళ్లుగా గ్రూప్-1 ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఎదురుచూశారని, కానీ.. ఒక్కటి కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి అదనపు సిబ్బందిని కేటాయించిందని తెలిపారు. ఇప్పటికే రూ.40 కోట్లు మంజూరు చేయడంతోపాటు గ్రూప్-1లో 503 పోస్టులకు అదనంగా 64 పోస్టులు మంజూరు చేశామని వెల్లడించారు. సింగరేణిలో కారుణ్య నియామకాలు, నర్సింగ్ పోస్టుల భర్తీతోపాటు పోలీస్ ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. ఇప్పటికే పీఆర్సీ ఏర్పాటు చేశామని ఆ నివేదిక మేరకు ఉద్యోగుల వేతనాల పెంపుపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

కేసీఆర్‌ను వ్యతిరేకించి వస్తే హరీశ్‌కు మద్దతు!

- బీఆర్ఎస్‌లో ఉంటే ఎల్పీ లీడర్ కూడా కాలేరు: మంత్రి వెంకట్‌రెడ్డి
- బీఆర్ఎస్ బతకాలంటే హరీశ్‌రావు అధ్యక్షుడు కావాలి: రాజగోపాల్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుకు.. కోమటిరెడ్డి సోదరులు ఆఫర్‌ల మీద ఆఫర్‌లు ఇస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీని చీల్చి 26 మంది ఎమ్మెల్యేలను తీసుకుని వస్తే దేవాదాయశాఖ మంత్రి పదవి ఇస్తామంటూ హరీశ్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇటీవల ఆఫర్ చేసిన సంగతి తెలిసిందే. కేసీఆర్‌ను వ్యతిరేకించి వస్తే హరీశ్‌రావుకు తాము మద్దతుగా నిలుస్తామంటూ తాజాగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ లాబీల్లో మీడియాతో వెంకట్‌రెడ్డి చిట్‌చాట్‌గా మాట్లాడారు. హరీశ్‌రావు.. సీఎం అయ్యే ప్లాన్‌లో ఉన్నట్లున్నారని, ఆయన వ్యాఖ్యలు కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచేలాగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆయన బీఆర్ఎస్‌లోనే ఉంటే సీఎం కాదు కదా.. బీఆర్ఎస్ ఎల్పీ లీడర్ కూడా కాలేరని, కేసీఆర్‌ను వ్యతిరేకించి వస్తే ఆయనకు తాము మద్దతుగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. 20 మంది ఎమ్మెల్యేలతో హరీశ్‌రావు.. ఆ పార్టీకి లీడర్ కావాలని సూచించారు. బీఆర్ఎస్ త్వరలోనే నాలుగు ముక్కలుగా చీలిపోతుందని, కేసీఆర్, కవిత, హరీశ్‌రావు, కేటీఆర్‌ల పేర్ల మీద విడిపోయి.. నాలుగు పార్టీలు అవుతుందని జోస్యం చెప్పారు. మరో 20 ఏళ్ల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. భువనగిరి లోక్‌సభ టిక్కెట్టు బీసీకి ఇస్తే గెలిపించే బాధ్యత తనదేనని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే.. ఎంఐఎం పార్టీ వారితోనే ఉంటుందని, ప్రస్తుతం ఆ పార్టీ తమతోనే ఉందని, ఎంఐఎంతో కలిపి తమకు 72 సీట్లు ఉన్నాయని చెప్పారు. అవినీతి మచ్చ లేని బీఆర్ఎస్ నేతలను మాత్రమే కాంగ్రెస్‌లోకి తీసుకుంటామని, డబ్బున్న నేతలు వస్తే ఎలా వాడుకోవాలో తమకు తెలుసని పేర్కొన్నారు. బీఆర్ఎస్ బతకాలంటే ఆ పార్టీకి హరీశ్‌రావు అధ్యక్షుడు కావాలని అభిప్రాయపడ్డారు. కే



నీలం మధురాజ్‌ను కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దీపామున్షీదాస్


కాంగ్రెస్‌లో చేరిన నీలం మధు, ఇందిరా శోభన్

పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ నేత నీలం మధు తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపామున్షీదాస్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 2023 ఎన్నికల్లో పటాన్‌చెరు టిక్కెట్టు నీలం మధుకు ఇచ్చి చివరి నిమిషంలో క్యాన్సిల్ చేయడంతో ఆయన బీఎస్పీ అభ్యర్థిగా బరిలో దిగారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తిరిగి కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మాజీ నేత ఇందిరాశోభన్ కూడా తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. దీపామున్షీదాస్ సమక్షంలో ఆమె కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

రాష్ట్రం అప్పుల కుప్ప

ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి రుణాలు.. 2022 మార్చి నాటికే రూ.4.33 లక్షల కోట్ల అప్పు

- జీఎస్‌డీపీలో ఈ అప్పు వాటా 38 శాతం
- దళిత బంధుకు రూ.3,442 కోట్ల అధిక వ్యయం
- రుణ మాఫీ, డబుల్ ఇళ్లకు కేటాయించినా డబ్బుల్లేవు
- ఎంబీసీ కార్పొరేషన్ 500 కోట్లలో పైసా ఖర్చు కాలేదు
- గత ప్రభుత్వ పనితీరును ఎండగట్టిన కాగ్
- అసెంబ్లీలో 2021-22 సంవత్సరపు నివేదిక సమర్పణ



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అప్పుల కుప్పగా మారిందని 'కాగ్' ఆక్షేపించింది. బడ్జెట్ అప్పులు, బడ్జెట్ వెలుపల కార్పొరేషన్లకు గ్యారెంటీ ఇచ్చిన అప్పులు కలిపి ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని మించిపోయాయని వెల్లడించింది. గ్యారెంటీ అప్పుల విషయంలో పారదర్శకత లోపించిందని, చివరికి వీటిని ప్రభుత్వమే చెల్లించాల్సి వస్తుందని స్పష్టం చేసింది. కార్పొరేషన్లకు ఎలాంటి ఆదాయం లేకపోయినా వాటి ద్వారా అప్పులు తీసుకుని, రాష్ట్ర ప్రభుత్వమే వాయిదాలు చెల్లించాల్సిన పరిస్థితిని తప్పుబట్టింది. 2019 నవంబరు లోపు ఇలాంటి అప్పుల నుంచి బయటపడాలని 15వ ఆర్థిక సంఘం చెప్పినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని గుర్తు చేసింది. రెవెన్యూ లోటు పెరిగిపోయిందని, కొన్ని ప్రభుత్వ పథకాలకు కేటాయించిన మేర నిధులను ఖర్చు పెట్టలేదని కాగ్ చెప్పింది. వడ్డీల భారం పెరిగిపోయిందని, బడ్జెట్ అంచనాలు, వాస్తవ వ్యయాల మధ్య అంతరం భారీగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేసింది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) రూపొందించిన నివేదికలను గురువారం రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశ పెట్టింది.

ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని దాటిన అప్పు

రాష్ట్ర ప్రభుత్వ అప్పులు 'ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ(ఎఫ్ఆర్‌బీఎం)' చట్టం పరిమితిని దాటిపోయాయని 'కాగ్' వెల్లడించింది. రాష్ట్ర సొంత రుణాలు రూ.3,14,663 కోట్లు ఉంటే, కార్పొరేషన్లకు హామీ ఇచ్చిన రుణాలు రూ.1,18,955 కోట్లు కలిపి మొత్తం రాష్ట్ర ప్రభుత్వ అప్పులు రూ.4,33,618 కోట్లకు చేరుకున్నాయని చెప్పింది. స్థూల రాష్ట్ర ఉత్పత్తి రూ.11,48,115 కోట్లలో అప్పులవాటా 37.77 శాతమని ప్రస్తావించింది. ఇది ఎఫ్ఆర్‌బీఎం విధించిన 25 శాతం పరిమితిని అతిక్రమించడమేనని స్పష్టం చేసింది. 15వ ఆర్థిక సంఘం ఇచ్చిన 29.30 శాతం వెసులుబాటు కన్నా కూడా ఇది చాలా ఎక్కువని చెప్పింది. బడ్జెటేతర రుణాల వల్లే పరిస్థితి ఇలా అదుపు తప్పిందని వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ నుంచి సేకరించిన రుణాల్లో 74 శాతాన్ని మాత్రమే మూలధన వ్యయం కింద ఖర్చు పెట్టిందని వెల్లడించింది. 2018-19 నుంచి మూడేళ్లుగా మూలధన వ్యయం కన్నా మార్కెట్ రుణాలే ఎక్కువగా ఉన్నాయని కాగ్ గుర్తించింది. ద్రవ్య లోటులో మార్కెట్ నుంచి తీసుకున్న రుణాల ద్వారానే 79 శాతం వరకు భర్తీ అయిందని గుర్తించింది.

గ్రాంట్లలో విపరీత అంచనాలు

పన్నేతర రాబడులు, సహాయక గ్రాంట్లను అధికంగా అంచనా వేశారని అవేవీ ఖర్చు కాలేదని కాగ్ గుర్తించింది. బడ్జెట్ అంచనాలకు మించి రూ.2,63,092 కోట్లు ఖర్చయినట్లు చెబుతున్నా చేబదుళ్లను పక్కనబెడితే వాస్తవంగా అయిన ఖర్చు రూ.1,95,818 కోట్లేనని తెలిపింది. ఇది బడ్జెట్ అంచనాల్లో 77 శాతమేనని వెల్లడించింది.

ఇవి అధిక వ్యయాలు

సేవా పింఛన్ల కింద రూ.5046 కోట్లు, దళిత బంధు కింద రూ.3,442 కోట్లు, కుటుంబ పింఛన్ల కింద రూ.1,929 కోట్లు, రాష్ట్ర అభివృద్ధి రుణాల వడ్డీ కింద రూ.1,785 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం చేసిన అధిక వ్యయాలుగా కాగ్ తప్పు పట్టింది.

కేటాయింపుల కంటే తక్కువ ఖర్చు

కొన్ని పథకాలకు నిధులు లేని కారణంగా బడ్జెట్ కేటాయింపుల కంటే తక్కువ వ్యయం చేసినట్లు కాగ్ గుర్తించింది. రైతు రుణ మాఫీ(రూ.4,462 కోట్లు), గ్రామీణ పేదలకు రెండు గదుల ఇళ్ల నిర్మాణం(రూ.4,270 కోట్లు), పట్టణ పేదలకు రెండు గదుల ఇళ్ల నిర్మాణం(రూ.4,035 కోట్లు), సంక్షేమ అభివృద్ధి కార్యకలాపాల ప్రత్యేక అభివృద్ధి నిధి(రూ.3,898 కోట్లు) చొప్పున నిధులు తగ్గడంతో ఖర్చు పెట్టలేక పోయినట్లు తెలిపింది. ఎంబీసీ సంస్థకు కేటాయించిన రూ.500 కోట్లలో పైసా ఖర్చు కాలేదని గుర్తించింది.

పదేళ్లలో 2,52,048 కోట్లు చెల్లించాలి

2023-24 సంవత్సరం నుంచి 2032-33 నాటికి పదేళ్లలో కాళేశ్వరం అప్పులు రూ.2,31,782 కోట్లను చెల్లించాలని కాగ్ చెప్పింది. ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాలకు మరో రూ.20,266 కోట్లను చెల్లించాలని తెలిపింది. 2017-18లో రూ.10,836 కోట్లుగా ఉన్న వడ్డీ భారం 2021-22 నాటికి రెట్టింపు అయ్యిందని వెల్లడించింది.

విద్యా వైద్యం ఖర్చు తగ్గింది

ఉద్యోగుల పదవీ విరమణ వయసును పెంచడంతో జీతాల భారం పెరిగిందని కాగ్ వెల్లడించింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే విద్యా, వైద్య రంగాలపై ప్రభుత్వ వ్యయం గత కొన్నేళ్లుగా తక్కువగా ఉంటోందని గుర్తించింది. విపత్తు నివారణ నిధికి ప్రభుత్వం నిధులను జమ చేయడం లేదని ఆక్షేపించింది.

కాళేశ్వరం కార్పొరేషన్ అప్పు రూ.72,067 కోట్లు

2022 మార్చి నాటికి కాళేశ్వరం ప్రాజెక్టు మీద రూ.86,788 కోట్లను వ్యయం చేయగా.. అందులో కార్పొరేషన్ ద్వారా తీసుకున్న రుణం సంబంధిత నిధులే రూ.55,808 కోట్లు అని వివరించింది. 2021-22లో కార్పొరేషన్‌కు అసలు, వడ్డీ చెల్లింపుల కోసం ప్రభుత్వం రూ.1,422 కోట్లను రుణ రూపంలో, పెట్టుబడుల రూపంలో మరో రూ.3,072 కోట్లను అందజేసిందని తెలిపింది. దీనిని బట్టి కార్పొరేషన్ రుణాలను చెల్లించే పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనన్న విషయం రూఢీ అవుతుందని పేర్కొంది. 14 ఏళ్లలో కాళేశ్వరం కార్పొరేషన్ పేరుతో ప్రభుత్వమే రూ.1,41,544 కోట్లను చెల్లించాల్సి ఉంటుందని చెప్పింది. ఇవి కాక నీళ్లు పోయడానికి విద్యుత్తు చార్జీల కింద ఏడాదికి రూ.10,375 కోట్ల చొప్పున 12 ఏళ్లలో రూ.1,24,495 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసింది.

బైక్‌పై ఒకేసారి.. 126 గొర్రెలట!

(మొదటిపేజీ తరువాయి)

చెల్లింపులు, కొన్న గొర్రెలనే మళ్లీ మళ్లీ కొనడం, అనేక గొర్రెలకు నకిలీ ట్యాగులు ఇవ్వడం, క్షేత్రస్థాయిలో అసలు గొర్రెలే కనిపించకపోవడంతోపాటు గొర్రెల రవాణాకు ఉపయోగించిన వాహనాలన్నీ నకిలీవేనని వెల్లడైంది. దీంతో రూ.3,385 కోట్లు ఖర్చు పెట్టిన ఈ పథకంలో ఆశించిన ఫలితం కంటే అక్రమాలే అధికంగా ఉన్నాయని కాగ్ పేర్కొంది. ఒక సాధికార సంస్థ ద్వారా ఈ అక్రమాలపై విచారణ చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. తీవ్రమైన అవకతవకలకు పాల్పడిన అధికారులను బాధ్యులను చేసి వారిపై క్రిమినల్ కేసులను పెట్టాలని, మోసపూరితంగా దుర్వినియోగానికి పాల్పడిన నిధులను రికవరీ చేయాలని సూచించింది.

రూ.3,385.32 కోట్ల రాయితీ వ్యయంతో అమలు..

గ్రామాల్లో సంప్రదాయంగా గొర్రెలను పెంచుకుంటూ జీవనం సాగించే కుటుంబాలకు స్థిరమైన జీవనాధారం కల్పించడం కోసం గత ప్రభుత్వం గొర్రెల పెంపకం అభివృద్ధి పథకాన్ని అమలు చేసిన విషయం తెలిసిందే. గ్రామీణ ఆర్థికాన్ని బలోపేతం చేయడం, రాష్ట్రంలో మాంసం ఉత్పత్తిని పెంచడం, పెంపకందారుల జీవన ప్రమాణాలు పెంచాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. 2017 ఏప్రిల్‌లో ప్రారంభమైన ఈ పథకం కింద ఒక్కో లబ్ధిదారునికి 20 గొర్రెలను, ఒక పొట్టేలును కలిపి ఒక యూనిట్‌గా అందజేస్తారు. ఒక యూనిట్ విలువ రూ.1.25 లక్షలు.. (ఒక గొర్రె రూ.5200, ఒక పొట్టేలు రూ.7000, రవాణా కోసం రూ.6300, బీమా రూ.3830, దాణా రూ.3445, నీళ్ల తొట్టెకు రూ.425 చొప్పున ధరలు నిర్ణయించారు.) అందులో 75 శాతం అంటే రూ.93,750 రాయితీ ఇస్తారు. 25 శాతంగా రూ.31250 లబ్ధిదారుని వాటాగా ఉంటుంది. ఈ పథకం కింద 2017-18, 2018-19 సంవత్సరాల్లో రెండేళ్ల వ్యవధిలో రూ.5 వేల కోట్ల వ్యయంతో 4 లక్షల గొర్రెల యూనిట్లు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ).. రాష్ట్ర గొర్రెలు- మేకల సమాఖ్యకు అందించే రూ.3 వేల కోట్ల రుణాలు, రూ.1000 కోట్ల గ్రాంట్, లబ్ధిదారుల వాటాగా వచ్చే రూ.1000 కోట్లు నిధులతో ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. గొర్రెలు-మేకల సమాఖ్య అందించిన వివరాల ప్రకారం.. 2021 డిసెంబరు నాటికి రాష్ట్ర వ్యాప్తంగా రూ.3,385.32 కోట్ల రాయితీ వ్యయంతో 3.88 లక్షల మంది లబ్ధిదారులకు అంతే సంఖ్యలో గొర్రెల యూనిట్లను సరఫరా చేసింది.



కొనుగోలు నుంచి తరలింపు దాకా అక్రమాలే..

గొర్రెలను కొనుగోలు చేసినట్లు చూపించడం దగ్గర్నుంచి లబ్ధిదారుని ఇంటికి తరలింపు దాకా అత్యధిక శాతం బోగస్సేనని కాగ్ గుర్తించింది. సంగారెడ్డి జిల్లాలో ఒక ప్రయాణంలో 126 గొర్రెల (ఆరు యూనిట్లు) రవాణా కోసం ఏపీ12బీ6985 అనే వాహనాన్ని వినియోగించినట్లు చూపారు. అయితే కాగ్ విచారణలో ఈ వాహనం 'ద్విచక్ర వాహనం'గా గుర్తించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 168 గొర్రెలను(8 యూనిట్లు) టీఎస్08 యూబీ5323 అనే వాహనంలో తరలించినట్లు దస్త్రాల్లో పేర్కొన్నారు. వాస్తవానికి ఆ వాహనం టాటా ఇండికా కారు అని తేలింది. ఖమ్మం జిల్లాలో 84 గొర్రెలను(4 యూనిట్లు) ఏపీ 16డబ్ల్యూ7585 అనే నంబరు ఉన్న వాహనంలో తరలించినట్లు నమోదు చేశారు. ఇది ఒక అంబులెన్స్ నంబరు కావడం గమనార్హం. ఇక నల్లగొండ జిల్లాలో ఒక ప్రయాణంలో 126 గొర్రెలను(ఆరు యూనిట్లు) ఏపీ29 టీబీ9231 అనే నంబరుగల వాహనంలో తరలించినట్లు చూపారు. ఇది ఒక ఆటో అని కాగ్ అధికారులు గుర్తించారు. 336 ఇన్వాయిస్‌లలో పేర్కొన్న వాహనాలు ప్రయాణీకుల వాహనాలు అని తేలింది. వీటిలో ద్విచక్ర వాహనాలు 53, ఆటోలు 219, కార్లు 35, బస్సులు 27, అంబులెన్సులు 2 ఉన్నాయి. 262 ఇన్వాయిస్‌లలో గొర్రెల రవాణాకు ఉపయోగించినట్లు చూపిన వాహనాల రిజిస్ట్రేషన్ సంఖ్యలు వాహన పోర్టల్‌లో గానీ, రాష్ట్ర రవాణా శాఖ సమాచారంలో గానీ లేవని కాగ్ నివేదికలో పేర్కొన్నారు. నకిలీ ఇన్వాయిస్ వాహనాలకు చెల్లింపులు జరిగాయని గుర్తించారు. ఖమ్మం జిల్లాలో ఒకే ఇన్వాయిస్ సంఖ్య మీద ఉన్న 20 ఇన్వాయిస్‌లపై (78యూనిట్ల గొర్రెల రవాణాకు) రవాణా రాయితీ కింద రూ.0.66 లక్షలు, గొర్రెల మీద రూ.64.94 లక్షలు చెల్లించినట్లు తేలింది. ఇదే ఖమ్మం జిల్లాలో 37 ఉదంతాల్లో పెన్నుతో అంకెలు మార్చి ఇన్వాయిస్ సంఖ్య 10 ఉంటే.. దానిని 10327 అని, 10328 అని మార్చి అక్రమాలకు పాల్పడినట్లు కాగ్ పేర్కొంది. 69 ఉదంతాల్లో ఇన్వాయిస్ సంఖ్యలను పెన్నుతో మార్చి రవాణా చార్జీల కింద రూ.12.57 లక్షల రాయితీ, గొర్రెల మీద రూ.4.22 కోట్ల నిధులు దారిమళ్లించినట్లు తేల్చారు. నల్లగొండ జిల్లాలోనూ 1,172 ఉదంతాల్లో నకిలీ ఇన్వాయిస్‌లకు చెల్లింపులు జరిగినట్లు గుర్తించారు. ఇందులో రవాణా కోసం రూ.1.30 కోట్ల రాయితీ, గొర్రెల మీద రూ.57.23 కోట్ల రాయితీ కొట్టేశారు. ఖమ్మం జిల్లాలో క్రమ సంఖ్యలేవీ లేని నకిలీ ఇన్వాయిస్‌లతో రవాణా ఖర్చుల కింద రూ.11.25 లక్షలు, గొర్రెల మీద రూ.4.58 కోట్లు నిధుల దుర్వినియోగం జరిగింది. నకిలీ ఇన్వాయిస్‌లతో రవాణా చేయకుండానే చేసినట్లు చూపారని కాగ్ పేర్కొంది.

2 రోజుల్లో 74 వేల కిలోమీటర్ల ప్రయాణం!

ఒకే వాహనాన్ని ఒకే రోజు రెండు భిన్న ప్రాంతాల నుంచి గొర్రెల తరలింపునకు ఉపయోగించినట్లు చూపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రిత్విక్ లాజిస్టిక్స్ సంస్థ నుంచి టీఎస్ 08యూఈ5465 అనే వాహనంలో 2018 ఆగస్టు 4న ఏపీలోని శ్రీకాకుళం జిల్లా చల్లవానిపేట నుంచి తెలంగాణలోని మక్తల్ మండలం కర్ని ప్రాంతంలో 2018 ఆగస్టు 5న ఏడు యూనిట్ల గొర్రెలను దించినట్లు నమోదు చేశారు. 927 కిలోమీటర్లు ప్రయాణించినట్లు చూపారు. ఇదే వాహనం 2018 ఆగస్టు 4నే ఏపీలోని కడప జిల్లా పోరుమామిళ్ల నుంచి 2018 ఆగస్టు 5న మహబూబ్‌నగర్ జిల్లా రామచంద్రాపూర్‌కి 8 యూనిట్ల గొర్రెలను తరలించినట్లు చూపారు. ఇది 300 కిలోమీటర్లు దూరం ప్రయాణించినట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం, కడప జిల్లాలు రెండు వ్యతిరేక దిశలో ఉన్న ప్రాంతాలు. ఒకే రోజు ఒకే వాహనం ఆ రెండు ప్రాంతాల నుంచి గొర్రెలను రవాణా చేసినట్లు చూపడంపై కాగ్ అధికారులు విస్తుపోయారు. కిలోమీటర్ల రీడింగ్‌లోనూ అనేక అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఇన్వాయిస్ సంఖ్య 1808లో ఏపీ 02టీబీ9522 అనే వాహనం 2018 ఫిబ్రవరి 20న ముగింపు మీటరు రీడింగ్ 2,54,553 కిలోమీటర్లు చూపారు. ఇదే వాహనానికి ఫిబ్రవరి 22న ఆరంభ రీడింగ్ 3,28,917 కి.మీ చూపారు. ఒకే వాహనం కేవలం రెండు రోజుల వ్యవధిలో 74364 కి.మీ ప్రయాణం చేయడం సాధ్యమా? అని కాగ్ అధికారులు ఆశ్చర్యపోయారు. అంతేకాదు.. తమ అక్రమాలకు మూడేళ్ల క్రితం చనిపోయిన వారినీ వదల్లేదు. రైతు బీమా సమాచారం ప్రకారం మరణించి, రైతు బీమా పథకం కింద బీమా పొందిన 860 మంది రైతుల పేర్లను లబ్ధిదారుల జాబితాలో చేర్చారు. (ఇది కేవలం ఏడు జిల్లాల సమాచారం మాత్రమే.) 2018- 2020 మధ్య మరణించిన 20 మంది రైతులకు 2021 డిసెంబరులో అంటే వారు మరణించిన 18 నుంచి 36 నెలల తరువాత గొర్రెల పథకం కింద యూనిట్లు ఇచ్చినట్లు చూపారు. గొర్రెలకు ఇచ్చిన ట్యాగుల్లోనూ అనేక లోపాలను కాగ్ గుర్తించింది. 80.55 లక్షల ట్యాగులకు గాను 17,912 ట్యాగు సంఖ్యల్లో తప్పులు ఉన్నట్లు తేల్చింది. 12 అంకెల ట్యాగులోనూ నకిలీలే ఎక్కువ ఉన్నట్లు కాగ్ పేర్కొంది. దాణా విషయంలోనూ అక్రమాలకు పాల్పడ్డారు. అయిదు జిల్లాల పరిధిలో 96,299 గొర్రెల యూనిట్లకు దాణా సరఫరా చేసినట్లు నివేదికల్లో చూపినా.. వాస్తవానికి 29,616 యూనిట్లకే దాణా పంపిణీ జరిగినట్లు కాగ్ ఆడిట్‌లో వెలుగు చూసింది. ఇది కేవలం 30 శాతానికి సమానమని.. దీని ప్రకారం 70 శాతం గొర్రెల యూనిట్లు పంపిణీ కాలేదనే అనుమానాలను కాగ్ వ్యక్తం చేసింది.

ఇసుక నిర్వహణలో వైఫల్యాలు

ఇసుక నిర్వహణలో తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ(టీఎస్ఎండీసీఎల్) తీవ్రంగా విఫలమైందని కాగ్ వెల్లడించింది. నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్లు ఇసుక తవ్వకాల బాధ్యతను స్థానికేతర సబ్-కాంట్రాక్టర్లకు ఇవ్వడం వల్ల.. గిరిజనేతరులకు రూ.11.61 కోట్ల మేర లబ్ధి చేకూరిందని వెల్లడించింది. నాలుగు వారాల్లో పరిష్కరించాల్సిన డీ-కాస్టింగ్ దరఖాస్తులను.. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా స్థాయి ఇసుక కమిటీ పట్టించుకోలేదని తప్పుబట్టింది. ఆ జిల్లాలో 31 దరఖాస్తులను ఇప్పటికీ పరిష్కరించకపోవడం వల్ల.. రైతులకు నష్టం జరిగేలా పట్టాభూముల్లో ఇసుక తవ్వకాలు జరిగాయని చెప్పింది.



దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గిరిజన కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన ధరపై ప్రభుత్వం నుంచి సకాలంలో వివరణ రాక.. తవ్వకాల్లో జాప్యం జరిగి, ప్రభుత్వం రూ.172.64 కోట్ల మేర ఆదాయాన్ని కోల్పోవాల్సి వచ్చిందని వివరించింది. ఇసుక నిల్వ కేంద్రాల వద్ద సీసీకెమెరాలు, వేబ్రిడ్జిలు లేక.. వాహనాల్లో అధికంగా లోడ్‌ను తరలించారని, వాహనాల్లో ట్రాకింగ్ పరికరాలు లేక.. అనుమతికి మించి తరలింపుపై రూ.7.19 కోట్ల జరిమానాలను విధించలేకపోయారని ఎత్తిచూపింది. ఇసుక పంపేందుకు ఏడీఎంఆర్‌జీ నుంచి అనుమతి పొందకపోవడం వల్ల 2022 మార్చి వరకు సర్కారుకు రూ.108.96 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు వివరించింది.

పారిశ్రామిక రాయితీలు.. వెయ్యికోట్లకు ఇచ్చింది రూ.126 కోట్లే..!

పారిశ్రామిక రాయితీల కేటాయింపులు, నిధుల విడుదలలో లోటుపాట్లను కాగ్ ఎత్తిచూపింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.1,000 కోట్ల రాయితీలిస్తామని ప్రకటించిన సర్కారు.. అందులో కేవలం రూ.126 కోట్లను మాత్రమే విడుదల చేసిందని పేర్కొంది. పరిశ్రమల శాఖలో కేటాయింపులు ఘనంగా ఉన్నా.. విడుదలైన నిధులు అత్యల్పంగా ఉన్నట్లు తెలిపింది. కుటీర పరిశ్రమలను ప్రోత్సమించేలా క్లస్టర్ల అభివృద్ధికి రూ.10 కోట్లను కేటాయిస్తే.. రూ.58 లక్షలను(6.15%) విడుదల చేసింది. చేనేత కార్మికులకు ప్రకటించిన నిధులను విడుదల చేయకపోవడాన్ని కాగ్ తప్పుబట్టింది. కార్మికుల ఆర్థిక చేయూతకు రూ.31.07 కోట్లకు కేవలం రూ.5 కోట్లు విడుదల చేశారని, బీమాకు రూ.50కోట్లలో పైసా కూడా విదిల్చలేదని పేర్కొంది. విద్యుత్తు సబ్సిడీ రాయితీలు కూడా ఏడేళ్లుగా రూ.1,500 కోట్ల మేర పేరుకుపోయాయని.. బడ్జెట్‌లో నామమాత్రంగా రూ.190 కోట్లను ప్రకటించి, రూ.101 కోట్లను విడుదల చేసినట్లు చెప్పింది. పావలా వడ్డీ పథకం రాయితీకి రూ.187 కోట్లను ప్రకటించి, రూ.94 కోట్లను(50.37%) విదిల్చినట్లు.. ఇసుక క్వారీల అన్వేషణ, తవ్వకాలకు టీఎస్ఎండీసీకి రూ.120 కోట్ల రీయింబర్స్‌మెంట్‌కు కేవలం 33%(రూ.39కోట్లు) ఇచ్చినట్లు పేర్కొంది.



పట్టణ స్థానిక సంస్థలకు పైసల్లేవు

రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థ(యూఎల్‌బీ)లు ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నాయని కాగ్ వెల్లడించింది. ఆరేళ్లలో 14వ ఆర్థిక సంఘం గ్రాంట్లలో రాష్ట్రానికి రూ.647 కోట్లు తక్కువగా విడుదలయ్యాయని.. యూఎల్‌బీల పరిధుల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్లపై ప్రత్యేకంగా వసూలు చేసిన రూ.1,822 కోట్ల సర్‌చార్జీలను నిధులను పట్టణ స్థానిక సంస్థలకు కేటాయించలేదని విమర్శించింది. గ్రాంట్ల కోత, సర్‌చార్జీ నిధులు కలిపి బకాయిలు రూ.2,469 కోట్లుగా ఉన్నట్లు తెలిపింది. నిధుల కేటాయింపుపై సిఫారసులు చేసే రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని 2015లో ఏర్పాటు చేశారని, అయినా.. 2018 దాకా సభ్యులను నియమించలేదని పేర్కొంది. రాష్ట్ర ఆర్థిక సంఘం 2020లో చేసిన సిఫార్సులనూ ప్రభుత్వం ఆమోదించలేదని గుర్తుచేసింది. యూఎల్‌బీల్లో ఆరేళ్లుగా 786 కోట్ల మేర ఆస్తిపన్ను బకాయిలున్నా.. వసూలు చేయలేదని, 45% సిబ్బంది కొరత ఇందుక్కారణమనిపేర్కొంది.



'డబుల్' గోల్‌మాల్!

గత ప్రభుత్వం తీరుతో పథకం అమలు, ఆర్థిక నిర్వహణలో అవకతవకలు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకంపై కాగ్ సంచలన నివేదిక

హైదరాబాద్, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకంపై కాగ్ సంచలన నివేదిక ఇచ్చింది. ఈ పథకం అమలు, ఆర్థిక నిర్వహణలో అనేక అవకతవకలు జరిగాయని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ నిధులు దారి మళ్లాయని వెల్లడించింది. అసలు లబ్ధిదారులను గుర్తించడంలోనే గత ప్రభుత్వం విఫలమైందని పేర్కొంది. డిజైన్ల మార్పు, నిర్మాణ పూర్తి అయిన ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకపోవడం వంటి చర్యల వల్ల ప్రాజెక్టు వ్యయం పెరిగిపోయిందని తేల్చింది. కాగ్ నివేదిక ప్రకారం.. రాష్ట్ర వ్యాప్తంగా 2,67,011 ఇళ్లకు పరిపాలనా అనుమతులు ఇచ్చిన ప్రభుత్వం 1,92,818 ఇళ్లకు టెండర్లు ఖరారు చేసింది. ఇందులో 2021 మార్చి నాటికి 92,423 ఇళ్లనే పూర్తి చేశారు. కేవలం 10,541 మంది లబ్ధిదారులకే ఇళ్లు కేటాయించారు. నిజానికి, ఈ పథకం కింద గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే లక్ష డబుల్ ఇళ్లు ఉండగా ఆరేళ్లుగా వీటి నిర్మాణాలు పూర్తి కాలేదు. పూర్తి అయిన కొన్ని ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించలేదు. జీహెచ్ఎంసీ పరిధిలో లక్ష ఇళ్లు మంజూరు చేస్తే వాటిలో 48,178 ఇళ్లు మాత్రమే (48శాతం) పూర్తయ్యాయి. ఇంకా 45,735 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. మరో 6,087 ఇళ్ల పనులు ఆపేశారు. 2016 ఏప్రిల్‌లో పథకం ప్రారంభం కాగా ఆరేళ్ల వ్యవధిలో 2020-21 నాటికి లక్ష ఇళ్లకు గాను 48,178 ఇళ్లు పూర్తి చేశారు. ఇది 50 శాతం కంటే తక్కువ. ఇక, పూర్తయిన ఇళ్లలో 96 శాతం ఇళ్లను (46442) ఆరు నెలల నుంచి 36 నెలల పాటు లబ్ధిదారులకు ఇవ్వలేదు. దీని వల్ల రూ.3,983.68 కోట్లు నిధులు వ్యర్థమయ్యాయి. డబుల్ బెడ్ రూమ్ పథకం ఇళ్ల లబ్ధిదారులను అప్పటి ప్రభుత్వం 2022 మార్చి వరకు గుర్తించలేదు. దీంతో పీఎంఏవై నిబంధనలు పాటించలేకపోయింది. ఫలితంగా ఈ పథకానికి కేంద్రం నుంచి రెండు, మూడు విడతల్లో రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేయకపోవడం, ఆవాస్‌సాఫ్ట్‌లో అప్‌లోడ్ చేయకపోవడం వల్ల తొలి విడతగా కేంద్రం ఇచ్చిన నిధులు నిరర్థకంగా ఉండిపోయాయి. ఆ నిధులను వడ్డీతో సహా వెనక్కి తిరిగి ఇవ్వాలని పీఎంఏవై సాధికార కమిటీ రాష్ట్రాన్ని ఆదేశించింది. దీంతో కేంద్ర నుంచి రాష్ట్రానికి రావాల్సిన రూ.2,230.85 కోట్లకు గాను, రూ.1,110.14 కోట్ల సాయాన్ని కోల్పోవాల్సి వచ్చింది. 2015-16, 2017-18 మధ్య కాలంలో కేంద్రం నుంచి వచ్చిన 1120.71 కోట్ల మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ హెచ్‌సీఎల్‌కు 556.21 కోట్లు మాత్రమే ఇచ్చింది. మిగిలిన 564.50 కోట్లను ఇతర పథకాలకు మళ్లించింది. అంతేకాక నిధులను ఇళ్ల నిర్మాణాలకు ఖర్చు చేయకపోగాకేంద్రానికి తప్పుడు యూసీలు పంపింది.

జీహెచ్ఎంసీపై భారం

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల భవన డిజైన్‌ను ప్రభుత్వం పలుమార్లు మార్చడం వల్ల జీహెచ్ఎంసీపై అదనపు భారం పడింది. జీహెచ్ఎంసీ పరిధిలో గ్రౌండ్ ప్లస్ త్రీ నమూనాతో ఒక్కో ఇంటికి రూ.5.30 లక్షల యూనిట్ ధరగా ప్రాథమికంగా నిర్ణయించారు. ఆ తర్వాత సెల్లార్ ప్లస్ స్టిల్ట్ ప్లస్ 9 అంతస్తులకు డిజైన్ మార్చి ఒక్కో ఇంటి నిర్మాణ వ్యయాన్ని రూ.7.90 లక్షలకు పెంచారు. ఇలా డిజైన్ మార్పుల వల్ల పెరిగిన ఖర్చును జీహెచ్ఎంసీ భరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2015లో పథకం రూపకల్పన అప్పుడు భారమంతా ప్రభుత్వమే భరించేలా ఉత్తర్వులిచ్చినా ఆ తరువాత ఇళ్లభారాన్ని జీహెచ్ఎంసీ మీదకు నెట్టింది. దీని వల్ల రూ.1233.52 కోట్ల అదనపు వ్యయాన్ని, రూ.384.94 కోట్ల మౌలిక వసతుల వ్యయాన్ని జీహెచ్ఎంసీ భరించాల్సి వచ్చింది. ఇక, పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచిన తర్వాత వాటిని ఖరారు చేయడానికి ప్రభుత్వం 133 నుంచి 320రోజుల పాటు సమయం తీసుకుంది. దీంతో ధరల్లో మార్పు రావడం వల్ల కాంట్రాక్టర్లు అనుచిత లబ్ధి పొందారు.

రూ. 10 కోట్ల భవనం నిరుపయోగం

వక్ఫ్‌బోర్డు కోసం అసంబద్ధ ప్రణాళికతో 10.30 కోట్లు వెచ్చించి నిర్మించిన వాణిజ్య భవనం.. ఏడేళ్లుగా నిరుపయోగంగా ఉందని కాగ్ ఎండగట్టింది.
రైతుల సామూహిక బీమా పథకం కింద చెల్లించే ప్రీమియంపై జీఎస్టీ మినహాయింపును ఉపయోగించుకోవడంలో వ్యవసాయ శాఖ విఫలమవ్వడంతో.. రూ.445.03 కోట్ల మేర అదనపు భారం పడ్డట్లు స్పష్టం చేసింది.
మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణంలో జాప్యం జరుగుతోందని, 12 ఏళ్లుగా సూర్యాపేటలో యూజీడీ, మురుగునీటి శుద్ధి వ్యవస్థ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని పేర్కొంది. 52.33 కోట్లు వ్యర్థమైనట్లు వివరించింది.
ఉద్యోగ భవిష్యనిధిని అలస్యంగా జమ చేయడం వల్ల రూ.5.81 కోట్ల మేర అదనపు భారం పడింది. బడుల్లో విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ వ్యవస్థ అమలు వల్ల 28.96 కోట్ల నిధులు నిరర్థక వ్యయంగా మిగిలాయి.
ప్రభుత్వ ప్రకటనల విషయంలో వాస్తవాలను నిర్ధారించుకోవడంలో విఫలమవ్వడంతో 1.84 కోట్ల మేర మోసపూరిత చెల్లింపులు జరిగాయి.

రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ అధికారుల నిర్లక్ష్యంతో.. ఐదేళ్లలో కోల్పోయింది రూ.269 కోట్లు

- విలువ తగ్గించి రిజిస్ట్రేషన్‌లు: కాగ్



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ద్వారా జరిగిన వివిధ లావాదేవీలపై ఆడిట్ శాఖ అనేక అభ్యంతరాలను వ్యక్తం చేసింది. ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వం రూ.269.90 కోట్ల ఆదాయం కోల్పోయినట్లు పేర్కొంది. ప్లాట్లు, ప్లాట్ల మార్కెట్ విలువలను తగ్గించి, ఆమేరకు స్టాంప్స్ డ్యూటీని లెక్కించి రిజిస్ట్రేషన్ చేశారని.. అపార్ట్‌మెంట్లలో ఎస్ఎఫ్‌టీ మార్కెట్ విలువను తక్కువగా చూపి నమోదు చేశారని పేర్కొంది. 2020 నాటికి 12.90 లక్షల ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నట్లు కాగ్ గుర్తించింది. వాటి సర్వేనంబర్లు, విస్తీర్ణం నమోదులో తప్పులున్నాయని.. ఆ జాబితాలో ఆస్తుల వివరాలు అసమగ్రంగా ఉండడంవల్ల వాటిని కూడా రిజిస్ట్రేషన్ చేసే ప్రమాదం ఉందని హెచ్చరించింది. రిజిస్ట్రేషన్‌కు ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్‌లో నిషేధిత జాబితాకు సంబంధించిన డేటాబేస్‌ను సమగ్రంగా పొందుపర్చలేదని ఆందోళన వెలిబుచ్చుతూ కాగ్ రూపొందించిన నివేదికను ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో ప్రవేపెట్టింది. 2020 డిసెంబరు నుంచి 2021 జూలై వరకూ చేపట్టిన అంతర్గత ఆడిట్ వివరాలు అడిగినా ఇవ్వలేదని కాగ్ ఆ నివేదికలోపేర్కొంది. అలాగే.. 2018 ఆగస్టు 1 నుంచి కొన్ని పంచాయతీలు, గ్రామాలను మునిసిపాలిటీల్లో విలీనం చేయడం వల్ల ఒకే పేరుతో రెండు అంతకంటే ఎక్కువ గ్రామాలు 14 చోట్ల ఉన్నట్టు ఆడిట్ అధికారులు గుర్తించారు. అలా ఒకేపేరున్నవాటిలో కొన్ని గ్రామాల పరిధిలో స్థిరాస్తులకు ఎక్కువ మార్కెట్ రేటు.. మరికొన్ని చోట్ల తక్కువ రేటు ఉంది. ఎక్కువ రేటు ఉన్న చోట.. తక్కువ రేటు ఉన్న గ్రామాల పేర్లతో రిజిస్ట్రేషన్లు చేయడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గినట్టు కాగ్ పేర్కొంది. ఇక.. హైదరాబాద్ మహానగర పట్టణాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధిలోకి వచ్చే గ్రామాల్లో నిర్మాణాలు, భవనాల నిర్మాణ రేట్లను సవరించి కొత్త రేట్లు నిర్ణయించారు. కానీ, ఆ రేట్ల ప్రకారం కాకుండా.. గ్రామాలుగా ఉన్నప్పటి రేట్లను లెక్కించి ఫీజులు వసూలు చేశారని ఆక్షేపించింది. ఇలా రకరకాల అక్రమాల వల్ల ప్రభుత్వానికి రావల్సిన రెవెన్యూ తగ్గిందని కాగ్ తన నివేదికలో పేర్కొంది.

అనర్హులకూ 'ఆసరా'!

మూడేళ్లలో 2.02 లక్షల మందికి పింఛన్లు

16% అనర్హులకు.. 1175 కోట్ల అక్రమ చెల్లింపులు

ఆసరా డేటా, ఎస్‌కేఎస్ మధ్య వ్యత్యాసం

2018-21 మధ్యలో రాష్ట్రంలో అక్రమాలు

కాగ్ నివేదికలో వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2018-21 మధ్యకాలంలో ఆసరా పింఛన్ల పంపిణీలో అక్రమాలు జరిగినట్లు కాగ్ వెల్లడించింది. సమగ్ర కుటుంబ సర్వే (ఎస్‌కేఎస్)ను ప్రాతిపదికగా తీసుకుంటే 16% అనర్హులున్నట్లు పేర్కొంది. రైతు బంధు డేటాను ఆసరా సమాచారంతో అనుసంధానం చేయకపోవడంతో పరిమితికి మించి భూమి కలిగిన వ్యక్తులకు రూ.67.41 కోట్లు, రైతుబీమా డేటాతో సీడింగ్ చేయకపోవడంతో 367 మందికి చనిపోయిన తర్వాత కూడా రూ.90 లక్షలు చెల్లించినట్లు తెలిపింది. రవాణా శాఖ డేటాతో ఆసరా సమాచారాన్ని విశ్లేషించి చూస్తే.. 4చక్రాల వాహనాలుండి, పింఛన్‌కు అనర్హులైన వారికీ రూ.51.98 కోట్లు, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల డేటాతో పోల్చి చూస్తే రూ.10 లక్షల కంటే విలువైన ఆస్తి ఉన్న వ్యక్తులకు రూ.31.42 కోట్లు కలిపి మొత్తం మూడేళ్లలో 2.02 లక్షల మంది అనర్హులకు రూ.1,175 కోట్ల అనుచిత లబ్ధి చేకూర్చినట్లు కాగ్ నివేదికలో వెల్లడించింది. 2018 ఏప్రిల్ నుంచి 2021 మార్చి మధ్యకాలంలో సగటున నెలకు 2.30 లక్షల(6%) మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయలేదని గుర్తించింది. ఆసరా లబ్ధిదారుల డేటా, డేటాబేస్‌లోని ఎస్‌కేఎస్ డేటాను పోల్చి చూసినపుడు.. ఎస్‌కేఎస్ డేటాలో 19% కుటుంబాల సమాచారం అందుబాటులో లేదని వెల్లడైంది. వివిధ సాంకేతిక కారణాలతో పింఛను చెల్లించని 2.30లక్షల మందికి సంబంధించిన సొమ్ము బ్యాంకులోనే ఉన్నప్పటికీ.. లబ్ధిదారులకు చెల్లించినట్లు 'యుటిలైజేషన్ సర్టిఫికెట్ (యూసీ)లు' సమర్పించినట్లు కాగ్ తప్పుబట్టింది. పింఛను దరఖాస్తు, ఆమోదం.. ఐటీ అప్లికేషన్‌లో లేదని తెలిపింది. అర్హత ప్రమాణాల పరిశీలనకు ఐటీ వ్యవస్థ ఏర్పాటు చేయలేదని, ఈ రెండు ప్రక్రియలు ఆఫ్‌లైన్‌లో జరిగాయని గుర్తించింది. మరణాల నమోదు, పింఛన్ల చెల్లింపులు చూసే విభాగాల మధ్య సమన్వయలోపంతో మరణించినవారి బ్యాంకు ఖాతాలకు కూడా డబ్బులు వెళ్లాయి. లబ్ధిదారుల మరణం తర్వాత పంచాయతీ కార్యదర్శులు తమ బయోమెట్రిక్‌తో రూ.58.33 కోట్ల పింఛను డ్రా చేసినట్లు కూడా కాగ్ గుర్తించింది. ఆ మూడేళ్లలో సగటున 7% అనర్హులకు పింఛన్లు చెల్లించినట్లు కాగ్ పేర్కొంది.

కాగ్ సిఫారసులివీ..

- ఇతర ప్రభుత్వ శాఖల సమాచారంతో ఆసరా డేటాను అనుసంధానం చేయాలి.
- క్రమం తప్పకుండా సర్వేలు నిర్వహించి అర్హుల లెక్కలుతీయాలి. అక్రమార్కులకు శిక్ష విధించాలి.
- కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ పథకాలను జోడించే క్రమంలో నిబంధనలు పక్కాగా పాటించాలి.
- మ్యానువల్ జోక్యం నివారించాలి. ఐటీఆధారిత పరిష్కారంతో సేవలు అందించేలా ఆసరా ఐటీ అప్లికేషన్‌ను నవీకరించి బలోపేతం చేయాలి.

జూలో సింహం చంపేసింది!

- ఎన్‌క్లోజర్‌లోకి దూకిన రాజస్థాన్ వాసి
- దాడి చేసి లాక్కెళ్లిన క్రూరమృగం, శరీరం ఛిద్రం

తిరుపతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర జూ పార్కులో గురువారం దారుణం చోటుచేసుకుంది. ఎన్‌క్లోజర్‌లోకి దూకిన ఓ వ్యక్తిని సింహం చంపేసింది. మృతుడు రాజస్థాన్‌వాసి కాగా, సింహం కూడా నాలుగేళ్ల క్రితం రాజస్థాన్‌లోని ఓ జూ నుంచి తీసుకువచ్చినది కావడం యాదృచ్ఛికం!. రాజస్థాన్ ఆల్వార్ జిల్లా తురానా గ్రామానికి చెందిన ప్రహ్లాద్ గుజ్జర్ (38) మధ్యాహ్నం జూపార్కును సందర్శించడానికి వచ్చాడు. సింహాల ఎన్‌క్లోజర్ వద్దకు వచ్చి హఠాత్తుగా గేటుపైకెక్కి లోనికి దూకేశాడు. ఏడేళ్ల వయసు కలిగిన మగ సింహం ఒక్కసారిగా దాడి చేసి అతడి గొంతును నోట కరిచి వందమీటర్ల వరకు లాక్కెళ్లింది. సమాచారమందుకున్న జూపార్కు వైద్యుడు, సిబ్బంది కర్రలు పట్టుకుని గట్టిగా అదిలించడంతో ప్రహ్లాద్‌ను విడిచిపెట్టిన సింహం బోనులోకి వెళ్లిపోయింది. వైద్యుడు, సిబ్బంది వెళ్లేసరికి అప్పటికే ప్రహ్లాద్ మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. ప్రహ్లాద్ సింహాల ఎన్‌క్లోజర్‌లో దూకడానికి కారణాలు అంతుపట్టడం లేదు. సందర్శకులు, సిబ్బంది కథనాల మేరకు.. అతడు దూరం నుంచి ఒక్కసారిగా పరుగు తీస్తూ పది అడుగుల ఎత్తున్న ఎన్‌క్లోజర్ తొలి గేటు ఎక్కి లోనికి దూకాడు. అక్కడ 12 అడుగుల ఎత్తున్న రెండో గేటు కూడా ఎక్కి లోనికి దూకేశాడు. సెల్ఫీ ఫొటోలు గానీ, వీడియోలు గానీ తీసుకునే ప్రయత్నం చేయలేదు. దూకినప్పుడు అతడి వద్ద మొబైల్ లేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఎన్‌క్లోజర్‌లో మృతదేహం వద్ద గానీ, పరిసరాల్లో గానీ మొబైల్ ఫోన్ లభించలేదు. దీంతో మద్యం మత్తులో దూకి ఉండొచ్చని, లేదంటే మానసిక స్థిమితం లేక, ఆత్మహత్య చేసుకోవాలన్న ఉద్దేశంతో ఈ చర్యకు పాల్పడి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

27 వసంతాలు పూర్తి చేసుకున్న ఎన్టీఆర్ ట్రస్టు

- పారదర్శకతే ప్రామాణికంగా ట్రస్టు సామాజిక సేవ
- ఎన్టీఆర్ ట్రస్టు సీఈవో రాజేంద్రకుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పారదర్శకతే ప్రామాణికంగా ఎన్టీఆర్ ట్రస్టు సామాజిక సేవలందిస్తోందని ట్రస్టు సీఈవో కే రాజేంద్రకుమార్ తెలిపారు. గురువారం ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు 27 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ట్రస్టు ఫౌండేషన్ వేడుకలు నిర్వహించింది. 27 సంవత్సరాల ట్రస్టు బ్రోచర్‌ను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రకుమార్ మాట్లాడుతూ.. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో ఏర్పాటుచేసిన ట్రస్టు, ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, ప్రకృతి విపత్తుల సందర్భంగా సహాయక చర్యలు, ఎన్టీఆర్ సుజల, రక్తనిధి కేంద్రాలు, సాధికారత, ఉద్యోగ కల్పన, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో సేవలు అందిస్తోందని ఆయన వివరించారు. ఇప్పటివరకు 12,095 ఆరోగ్య శిబిరాల ద్వారా 19.74 లక్షల మందికి ఉచితంగా వైద్య సేవలందించినట్లు తెలిపారు. బాలికల విద్యను ప్రోత్సహించే లక్ష్యంతో ఏటా 50 మంది ప్రతిభావంతులైన విద్యార్థినులను గుర్తించి, వారికి స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు రాజేంద్రకుమార్ వివరించారు.

కింగ్స్ గ్రూప్ సంస్థల్లో ఈడీ సోదాలు

హైదరాబాద్‌లోని కింగ్స్ గ్రూప్ సంస్థల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. కింగ్స్ గ్రూప్ సంస్థలపై ఫెమా చట్టం కింద నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ ప్రత్యేక బృందాలు హైదరాబాద్‌లోని ఏడు వేర్వేరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించాయి. సోదాల్లో కీలక పత్రాలతో పాటు డిజిటల్ పరికరాలు, రూ. 76.5 లక్షల నగదు, రూ. 1.5 లక్షలు విలువైన విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. కింగ్స్ సంస్థలకు చెందిన మహ్మద్ షానవాజ్, మహ్మద్ జుబేరుద్దీన్‌తో పాటు మరికొందరు నిబంధనలకు విరుద్ధంగా విదేశాలకు నిధులు మళ్లించినట్లు వచ్చిన ఆరోపణలపై ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతోంది.

గురుకుల కొలువుల్లో హ్యాట్రిక్

- ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపికైన సిద్దిపేట జిల్లా వాసి

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 15: ఇటీవల కాలంలో ప్రభుత్వ కొలువు పొందడమే గొప్ప అనుకుంటుంటే.. సిద్దిపేట జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపిక అయ్యాడు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌కు చెందిన గాండ్ల రవీంద్ర ఇటీవల గురుకుల బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో డిగ్రీ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్ (రాష్ట్రంలో మొదటి ర్యాంకు), స్కూల్ ఎడ్యుకేషన్ పీడీ(రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు), జేఎల్ పీడీ (మూడో ర్యాంకు) ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఓ రకంగా ఉద్యోగాల హ్యాట్రిక్ కొట్టారు. ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించిన రవీంద్ర హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో గురువారం జరిగిన కార్యక్రమంలో డిగ్రీ కళాశాల పీడీ నియామక పత్రాన్ని తీసుకున్నారు. రైతు కుటుంబానికి చెందిన రవీంద్ర గజ్వేల్‌లోని జీడీఆర్ స్కూల్‌లో ఎస్ఎస్‌సీ, బీపీఈడీ పూర్తి చేసి ఉస్మానియా వర్సిటీలో ఎంఈడీ చదివారు. ప్రస్తుతం ఓయూలో పీహెచ్‌డీ చేస్తున్నారు.

బాధ్యతగా పనిచేయకపోతే తప్పుకోండి

- బీజేపీ జిల్లా అధ్యక్షులకు కిషన్‌రెడ్డి అల్టిమేటం



హైదరాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బాధ్యతలను సరిగా నిర్వర్తించలేకపోతే తప్పుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు, కొంత మంది సీనియర్ నాయకులకు కిషన్‌రెడ్డి అల్టిమేటం జారీ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులు పార్టీ సమావేశాలకు సైతం అవసరం లేదని చెప్పారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విజయ సంకల్ప యాత్ర నిర్వాహకులతో కిషన్‌రెడ్డి సమావేశమయ్యారు. 20 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే రథయాత్రలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని చెప్పారు. వాటి ప్రభావం ఎన్నికలపై ఉంటుందని అన్నారు. కాగా, సంత్ సేవాలాల్ మహారాజ్ గొప్ప సంస్కరణవాది అని కిషన్‌రెడ్డి అన్నారు. సేవాలాల్ జయంతి సందర్భంగా గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రూ.26 వేల కోట్లతో ఆర్ఆర్ఆర్ నిర్మాణం

సిద్దిపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో నిర్మించ తలపెట్టిన రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) కోసం కేంద్ర ప్రభుత్వం రూ.26వేల కోట్లు కేటాయించిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూసేకరణలో నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. భూసేకరణ పూర్తికాగానే యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఆర్ఆర్ఆర్ వెంబడే రింగ్ రైల్వే లైన్ నిర్మిస్తామని తెలిపారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ నిర్మాణానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు.

గురుకుల డీఎల్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లోని డిగ్రీ లెక్చరర్ (డీఎల్) పోస్టుల ఫలితాలు వెల్లడయ్యాయి. తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ట్రిబ్) గురువారం ఫలితాలను విడుదలజేసింది. ఈ మేరకు సబ్జెక్టుల వారీగా 694 పోస్టులకు మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. 1:2 నిష్పత్తిలో 1388 మంది అభ్యర్థులను ఎంపిక చేయగా వీరికి ఈ నెల 19, 20 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను అధికారులు నిర్వహించనున్నారు. వాస్తవానికి సోషల్ వెల్ఫేర్, గిరిజన, బీసీ గురుకులాల్లోని డిగ్రీ కాలేజీల్లో మొత్తం 868 పోస్టులున్నాయి. అయితే వీటిలో ఇప్పటికే పీడీ, లైబ్రేరియన్ పోస్టులను భర్తీ చేశారు. ఇంకా 793 పోస్టులకు మెరిట్ జాబితా ఇవ్వాల్సి ఉండగా.. కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టు పోస్టులకు మినహా మిగతా అన్నింటికి గురువారం బోర్డు జాబితాను విడుదల చేసింది. 99 కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టు పోస్టుల మెరిట్ జాబితాను ట్రిబ్ శుక్రవారం ప్రకటించనుంది.

చదువుతోనే గౌరవం

- తండాల్లో స్కూళ్లను నిర్మిస్తాం
- ప్రతి తండాలో బీటీ రోడ్డు, కరెంటు, తాగునీటి సమస్యలను తీరుస్తాం
- గిరిజన విద్యార్థులు సంత్ సేవాలాల్ మార్గంలో నడవాలి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): "చదువుకున్నప్పుడే సమాజంలో గౌరవం ఉంటుంది. అన్ని తండాల్లో పాఠశాలలను నిర్మిస్తాం. చదువులను తండాలకు తీసుకెళ్లే బాధ్యతను మా ప్రభుత్వం తీసుకుంటుంది" అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. గురువారం బంజారా భవన్‌లో నిర్వహించిన సంత్ శ్రీ సేవాలాల్ 285వ జయంతి ఉత్సవాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంజారా సోదరులను కలుసుకోవడం అంటే కాంగ్రెస్ కుటుంబ సభ్యులను కలుసుకున్నంత ఆనందంగా ఉందన్నారు. 1976లో నాటి ప్రధాని ఇందిరమ్మ బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల ఆ సామాజిక వర్గం నుంచి చదువుకున్న ఎంతో మంది నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. దొరల రాజ్యం పోవాలి.. పేదల రాజ్యం రావాలని గిరిజనులు ఆశీర్వదించడం వల్లనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని చెప్పారు. తండాల్లో బీటీ రోడ్లు, తాగునీరు, విద్యుత్తు వసతులు కల్పిస్తామని, పంచాయతీ భవనాల నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఆరువేల ఏకోపాధ్యాయ పాఠశాలలను మూసివేసిందని.. తమ ప్రభుత్వం ప్రతి తండాలో పాఠశాలను ప్రారంభిస్తుందని చెప్పారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓబీసీ విద్యార్థుల కోసం 20 ఎకరాల్లో విశ్వవిద్యాలయం తరహాలో పాఠశాలల భవనాలు నిర్మిస్తామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉండే ప్రతి విద్యార్థి చదువుల బాట పట్టి సంత్ సేవాలాల్ మార్గంలో నడవాలని సూచించారు. 70 రోజులుగా ఒక్క నాడు కూడా సెలవు తీసుకోకుండా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు.



సంత్ శ్రీ సేవాలాల్ 285వ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న సీఎం

సంత్‌సేవాలాల్ ఉత్సవాల్లో కేటీఆర్

బీఆర్ఎస్ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను గురువారం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. బంజారాల పూజలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు.. ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, పార్టీ ఎస్టీసెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎల్. రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.100 కోట్లతో గురుకులం!

(మొదటి పేజీ తరువాయి)



నియామక పత్రాలను అందజేశారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, సీఎస్ శాంతికుమారి పాల్గొన్న ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఇంటిగ్రేటెడ్ గురుకుల క్యాంపస్‌లలో కలిసి చదువుకుంటే.. వారంతా తాము వేర్వేరు కాదనే వాతావరణంలో.. సోదర భావంతో మెలుగుతారని అభిప్రాయపడ్డారు. అలాంటి సోదర భావంతో రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములవుతారని ఆకాంక్షించారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్మాణానికి స్థలాలను అన్వేషించాలని సీఎస్‌ను ఆదేశించారు. "విద్యకు పెట్టేది ఖర్చు కాదు. అది భవిష్యత్ నిర్మాణానికి పెట్టుబడి. టీచర్ల నియామకం అంటే.. దేశాన్ని బలోపేతం చేసే క్రతువుకు పెట్టుబడి" అని వ్యాఖ్యానించారు. ఉద్యోగ నియామక పత్రాలు పొందిన వారంతా.. బాధ్యతతో విద్యను బోధించాలని సూచించారు.

పదేళ్లుగా ఉద్యోగాలివ్వలేదు

"త్వరలోనే 561 గ్రూప్-1 పోస్టులకు పరీక్షలను నిర్వహిస్తాం. ఫలితాలను వెల్లడిస్తాం. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ.. నియామకాలు చేపడుతున్నాం. అందులో భాగంగానే 1,997 గురుకుల ఉద్యోగాలకు నియామక పత్రాలను అందిస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చిన 70 రోజుల్లోనే.. స్టాఫ్ నర్స్, సింగరేణి, పోలీసు, గురుకుల టీచర్లతో కలిపి.. దాదాపు 25 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం" అని రేవంత్‌రెడ్డి వివరించారు. 3,650 రోజులు అధికారంలో ఉండి కూడా ఉద్యోగ నియామకాలను ఎందుకు జరపలేదని బీఆర్ఎస్‌ను నిలదీశారు.

మూతపడ్డ బడులను తెరిపిస్తాం

"విద్య కోసం గత ప్రభుత్వం 6 శాతమే ఖర్చు చేసింది. మా సర్కారు విద్యకు 10-12% నిధులను పెంచింది. గత ప్రభుత్వం మారుమూల పల్లెలు, తండాల్లో ఉన్న 6,450 ఏకోపాధ్యాయ బడులను రేషనలైజేషన్ పేరుతో మూసివేసింది. బడులను రేషనలైజ్ చేస్తే.. పేదవారు పక్క గ్రామాలకు వెళ్లి ఎలా చదువుకుంటారు? బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకపోవడంతో.. విద్యార్థులు తమ సర్టిఫికెట్లను కూడా తెచ్చుకోలేకపోతున్నారు. ఆ కారణంగానే వనపర్తిలో ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో.. విద్యార్థులకు ఎందుకు వసతులను కల్పించలేదు? కానీ, కేసీఆర్ చేతికి మాత్రం గడిచిన పదేళ్లలో రూ.17.50 లక్షల కోట్లు వెళ్లాయి" అని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు.

కొడుకు కోసమే సచివాలయాన్ని నిర్మించారు

ముఖ్యమంత్రి కుర్చీలో తన కొడుకు కూర్చోలేదన్నదే కేసీఆర్ బాధ అని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. కొడుకు కోసమే సచివాలయాన్ని కూల్చి.. వాస్తు ప్రకారం కొత్త సెక్రటేరియట్‌ను నిర్మించారన్నారు. "కేసీఆర్ వాస్తు ప్రకారం నిర్మించుకున్న సచివాలయం ఇపుడు మాకు, తెలంగాణ ప్రజలకు పనికొస్తోంది. దశ-దిశ అని కొన్ని ఉంటాయి. దశ బాగుంటే.. దిశతో సంబంధం ఉండదు. దిశ బాగోలేదు కాబట్టే కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్లాల్సి వచ్చింది" అని వ్యాఖ్యానించారు.

హరీశ్ మరో ఔరంగజేబు అవ్వాల్సిందే

బీఆర్ఎస్ సర్కారు సృష్టించిన సమస్యలను పరిష్కరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తుంటే.. అది తట్టుకోలేక మామాఅల్లుళ్లు, తండ్రీకొడుకులు వీధుల వెంట తిరుగుతున్నారని రేవంత్ విమర్శించారు. తాము నియామకాలను చేపడుతుంటే.. మరొకాయన మాట్లాడుతూ.. చేతగాకపోతే దిగిపోవాలంటున్నారని.. తనకు పదవి ఇస్తే చేసి చూపిస్తానని సవాల్ చేస్తున్నారని హరీశ్‌రావును ఉద్దేశించి అన్నారు. ఔరంగజేబు వెన్నుపోటు గురించి ప్రస్తావిస్తూ.. హరీశ్ మరో ఔరంగజేబు అవతారం ఎత్తాల్సిందేనన్నారు. పదేళ్లు ఆర్థిక, నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు.. అపుడు ఏం చేశారని నిలదీశారు. "వాళ్లు కట్టిన మేడిగడ్డ పేకమేడలా కూలిపోయింది. లక్ష కోట్లు ఖర్చు చేసి.. లక్ష ఎకరాలకు కూడా నీళ్లివ్వలేదు. అందుకు సంబంధించిన కాగ్ రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశపెట్టాం. దాన్ని అందరూ చదవాలి. ఇంత దుర్మార్గమైన దోపిడీని ప్రపంచంలోనే ఎవరూ చూడలేదు. మేడిగడ్డ కూలిపోయిన విషయాన్ని తెలంగాణ సమాజం చూడకుండా పోలీసు పహారా మధ్య నిర్బంధించారు." అని రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

అమ్మకు ఉద్యోగం వచ్చింది కన్నా..!



గురుకులంలో ఉద్యోగానికి ఎంపికైన ఓ అభ్యర్థి తన చిన్నారిని తీసుకుని ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకునేందుకు ఎల్బీ స్టేడియానికి వచ్చారు. ఉద్యోగినికి తోడుగా వచ్చిన సహాయకురాలు ఆ చిన్నారిని ఆడిస్తూ.. ఉద్యోగినికి చెందిన ఒక సర్టిఫికెట్‌ని విసునుకర్రగా మార్చి.. గాలి కోసం విసురుతూ కనిపించింది.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

మెస్ చార్జీల చెల్లింపులకు గ్రీన్ చానల్ ఏర్పాటు

- సీఎం రేవంత్ ఆధ్వర్యంలో విప్లవాత్మక నిర్ణయాలు: మంత్రి పొన్నం
- విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్న ప్రభుత్వం: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలకు మెస్ చార్జీలను చెల్లించేందుకు గ్రీన్ చానల్ ఏర్పాటు చేస్తామని, అందుకోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురుకులాల్లోని ఉద్యోగాలకు ఎంపికైనా ఉద్యోగులకు నియామక పత్రాలను అందించే కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 70శాతం గురుకుల భవనాలు అద్దెలోనే ఉన్నాయని, వాటన్నింటినీ క్లస్టర్లుగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి కోసం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 70 రోజులే అవుతుందని, ఇప్పటివరకు ఏం చేశామో, ఏం చేయబోతున్నామో వివిధ మాధ్యమాల ద్వారా అందరూ చూస్తునే ఉన్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో తమ ప్రభుత్వం విద్యా వ్యవస్థను, గురుకుల విద్యా సంస్థలను మరింత బలోపేతం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పాటైన 2 నెలల్లోనే దాదాపు 23వేల ఉద్యోగ నియామక పత్రాలను అందించిందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. సీఎం రేవంత్ దమ్మున్న నేత అని, కాంగ్రెస్ ప్రభుత్వం దమ్మున్న ప్రభుత్వమని ఆయన తెలిపారు. కాగా గురుకులాల్లోని వివిధ ఉద్యోగ భర్తీల్లో నియామకమైన వారందరికీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అభినందనలు తెలిపారు. గురుకులాల్లో పీజీటీ-1,276, లైబ్రేరియన్-526, ఫిజికల్ డైరక్టర్ పోస్టులు 348 భర్తీ చేశామని, మరికొన్ని త్వరలో భర్తీ కానున్నాయని ఆమె తెలిపారు.

సాగర్ డ్యాం నిర్వహణ భేష్

- తెలంగాణ ప్రభుత్వానికి ఎన్‌డీఎస్‌ఏ కితాబు

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 15: సాగర్ డ్యాం నిర్వహణను తెలంగాణ ప్రభుత్వం బాగా చూసుకుందని ఎన్‌డీఎస్ఏ సభ్యులు సంతృప్తిని వ్యక్తంచేసినట్లు ప్రాజెక్ట్ ఎస్ఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) బృందం మూడు రోజుల పర్యటన గురువారం ముగిసింది. కేంద్ర జలశక్తి శాఖ ఆదేశాల మేరకు ఈ నెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు సాగర్ ప్రాజెక్టును ఇరు రాష్ట్రాల నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా 13వ తేదీన ప్రధాన డ్యాం క్రస్ట్ గేట్లు, వాక్ వే, స్పిల్‌వే, గ్యాలరీలను, ఈ నెల 14న ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, కుడి, ఎడమ కాల్వల జలవిద్యుత్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల నీటి పారుదల శాఖ అధికారులు, జెన్కో అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. 15వ తేదీన ఇరు రాష్ట్రాల నీటి పారుదల శాఖ అధికారులతో నీటి నిల్వల సామర్థ్యాన్ని, నీటి రాక, విడుదలకు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుపై అసంపూర్తిగా ఉన్న నిర్వహణ పనులను వానాకాలం మొదలయ్యే నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని బృందం సభ్యులకు ఎస్ఈ వివరించారు. తాము గుర్తించిన లోపాలను, ఇరు రాష్ట్రాల నీటి పారుదల శాఖ అధికారుల విన్నపాలను కూడా కేంద్ర జలశక్తి శాఖకు తెలియజేస్తామని బృందం సభ్యులు తెలిపినట్లు నాగేశ్వర రావు వివరించారు.


ధాన్యం టెండర్ల ప్రక్రియ నుంచి 'హాకా' ఔట్!

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం టెండర్ల ప్రక్రియ నుంచి హైదరాబాద్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ అసోసియేషన్ (హాకా)ను తప్పించారు. వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో వార్షిక టర్నోవర్ రూ.200 కోట్లులేదనే కారణంతో హాకా టెండర్లను పరిగణనలోకి తీసుకోవద్దని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నిర్ణయించింది. మొత్తం 12లాట్లలో ఐదింటికి హాకా టెండర్ బిడ్లు దాఖలు చేసింది. ఈ ఐదూ తిరస్కరణకు గురయ్యాయి. పౌర సరఫరాల సంస్థ తొలుత జారీచేసిన మార్గదర్శకాల్లో అగ్రి కమోడిటీ టర్నోవర్ రూ.200 కోట్లుండాలని పేర్కొనలేదు. జనవరి 31న ప్రీ బిడ్డింగ్ సమావేశం నిర్వహించాక నిబంధనలు మార్చినప్పుడు తప్పనిసరిగా వ్యవసాయ ఉత్పత్తుల టర్నోవర్ రూ.200 కోట్లు ఉండాలని పేర్కొన్నారు. దీని ప్రకారం హాకాకు అగ్రి కమోడిటీ టర్నోవర్ లేదు. దీంతో హాకా బిడ్లను తిరస్కరించినట్లు కమిషనర్ డీఎస్ చౌహాన్ ప్రకటించారు. 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేలంపాట ద్వారా విక్రయించేందుకు సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ గత నెలలో టెండర్లు పిలిచింది. గ్లోబల్ టెండర్లు పిలిచినా ఆశించిన స్పందన రాలేదు. మూడు ప్రభుత్వరంగ సంస్థలతో కలిపి కేవలం ఏడు ఏజెన్సీలే టెండర్ల ప్రక్రియలో పాల్గొన్నాయి. హాకా, కేంద్రీయ భండార్, న్యాకాఫ్, మంచుకొండ ఆగ్రోటెక్, శ్రీ లలిత, పట్టాభి ఆగ్రో ఫుడ్స్, హిందుస్థాన్ ఎంటర్‌ప్రైజెస్ మాత్రమే టెండర్ బిడ్లు దాఖలుచేశాయి. 12 లాట్లకు కలిపి 30 బిడ్లు దాఖలయ్యాయి. హాకా వ్యవసాయ ఉత్పత్తుల టర్నోవర్‌పై ఓ ప్రైవేటు ఏజెన్సీ ప్రతినిధులు ఫిర్యాదు చేయడంతో హాకాను తప్పించినట్లు తెలిసింది. మిగిలిన 6 ఏజెన్సీలు పోటీలో ఉన్నాయి. కాగా గురువారం ఫైనాన్షియల్ బిడ్లు తెరిచినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఎవరెంత ధర కోట్ చేశారనేది వెల్లడికాలేదు.

ముంచుకొస్తున్న మంచు యుగం?

భూతాపం కారణంగా దెబ్బతింటున్న గల్ఫ్ స్ట్రీమ్ లయ.. గ్రీన్‌లాండ్ వద్ద భారీగా మంచు కరిగి ఈ ప్రవాహంలోకి

- 2025- 2095 నడుమ జరగొచ్చని గతంలో హెచ్చరిక
- తాజాగా మరోసారి హెచ్చరించిన నెదర్లాండ్స్ శాస్త్రజ్ఞులు



'ద డే ఆఫ్టర్ టుమారో'... 2004లో వచ్చిన హాలీవుడ్ చిత్రమిది! పర్యావరణ మార్పుల కారణంగా అట్లాంటిక్ మహా సముద్రంలోని ప్రవాహాల్లో మార్పులు ఏర్పడి భూమ్మీద మినీ మంచుయుగం ఏర్పడి ప్రపంచమంతా గడకట్టుకుపోయి, పర్యావరణ ఉత్పాతాలతో అల్లకల్లోలమైపోతుంది! అది సినిమా. కల్పితం. కానీ.. ఉత్తరార్ధ గోళానికి ఉష్ణ శక్తిని చేరవేసే అట్లాంటిక్ మహాసముద్రంలోని గల్ఫ్ ప్రవాహం లయ దెబ్బతిని లయమైపోయే ముప్పు ముంచుకొస్తోందని.. నిజ జీవితంలోనూ మరికొన్నేళ్లలో అలాంటి మినీ మంచుయుగాన్ని చూసే ప్రమాదం ఉందని.. శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు!!

ఈ ప్రపంచం ఇంత అందంగా, కులాసాగా కనిపిస్తోందంటే.. ఎండ, వాన, చలి, ఇన్ని రుతువులు వస్తున్నాయి, పోతున్నాయంటే.. మనకు తెలియని, మన కంటికి కనిపించని అద్భుతమైన ప్రక్రియలు వేలాది సంవత్సరాలుగా కొనసాగుతుండడమే అందుకు కారణం! సామాన్య మానవులకు అంతగా తెలియని అలాంటి అద్భుతాల్లో ఒకటి.. 'గల్ఫ్ స్ట్రీమ్'. భూమధ్య రేఖ నుంచి, దక్షిణార్ధ గోళం నుంచి వేడిని ఉత్తరార్ధ గోళానికి, ధ్రువాల వద్దకు తీసుకెళ్లి.. ఆ ఉష్ణ శక్తిని అక్కడ విడుదల చేసే సహజ కన్వేయర్ బెల్ట్ లాంటి ఉష్ణ ప్రవాహమే ఈ గల్ఫ్ స్ట్రీమ్! ప్రవహించినంత మేరా ఆయా ప్రాంతాల్లో చలిని నియంత్రిస్తుంటుంది. పశ్చిమ యూరప్ ప్రాంతాలు చలికాలంలో గడ్డకట్టిపోకుండా ఉండడానికి, అక్కడ ఎండాకాలంలో పంటలు పండడానికి ముఖ్య కారణం ఈ ప్రవాహమే. అయితే.. నానాటికీ పెరుగుతున్న భూతాపం కారణంగా హిమనీ నదాలు కరిగిపోయి ఆ నీరు ఈ ప్రవాహంలో చేరుతుండడం వల్ల ఈ గల్ఫ్ స్ట్రీమ్ దెబ్బతిని ఉష్ణ శక్తిని చేరవేయలేకపోయే ప్రమాదం ఉందని.. శాస్త్రజ్ఞులు 1960ల్లోనే హెచ్చరించారు. 2025 నుంచి 2095 నడుమ ఆ ప్రమాదం ఎప్పుడైనా ముంచుకురావచ్చని గత ఏడాది నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ఒక వ్యాసం ప్రచురితమైంది. తాజాగా.. నెదర్లాండ్స్‌లోని యుట్రెక్ట్ యూనివర్సిటీ పరిశోధకులు కూడా ఈ విషయమై హెచ్చరిక జారీచేశారు. అయితే, గత పరిశోధకులు చెప్పినట్టు 2025.. 2095.. అంటూ టైమ్ మాత్రం చెప్పలేదు.

పైకి వెళ్లి.. కిందికి..

అట్లాంటిక్ మహాసముద్రంలో ఏర్పడే నాలుగు ఉష్ణ ప్రవాహాల్లో ముఖ్యమైనది గల్ఫ్ స్ట్రీమ్. భూమధ్య రేఖ వద్ద సముద్ర ఉపరితలంపై ఎక్కువ ఉప్పగా, వేడిగా ఉండే నీరు ఈ ప్రవాహం గుండా గల్ఫ్ ఆఫ్ మెక్సికో గుండా అమెరికా తీరం వెంట ప్రయాణించి గ్రీన్‌లాండ్ దిశగా ప్రవహిస్తుంది. ఈ ఉష్ణ ప్రవాహం మీదుగా వీచే గాలుల వల్లే పశ్చిమ యూరప్‌కు వెచ్చదనం వస్తుంది. అలా గ్రీన్‌లాండ్ సమీపానికి చేరుకునేసరికి అక్కడి మంచు వాతావరణం కారణంగా ఈ ప్రవాహంలోని నీరు చల్లబడుతుంది. కొంత నీరు గడ్డకట్టగా.. మిగిలిన నీటిలో ఉప్పు శాతం పెరిగిపోతుంది. దానివల్ల నీటి సాంద్రత పెరిగి.. ఆ నీరు మళ్లీ కిందికి.. దక్షిణ దిశగా ప్రవహిస్తుంది. కిందికి వెళ్లిన నీరు మళ్లీ ఉప్పునీటితో కలిసి భూమధ్యరేఖ గుండా గల్ఫ్ ఆఫ్ మెక్సికో, అమెరికా తూర్పు తీరం.. ఇలా ప్రవహించి మళ్లీ గ్రీన్‌లాండ్ వద్దకు చేరుకుంటుంది. ఇలా ఒక కన్వేయర్ బెల్ట్ తిరిగినట్టు గల్ఫ్ స్ట్రీమ్ కొన్ని వేల సంవత్సరాలుగా ప్రవహిస్తోంది. కానీ.. భూతాపం వల్ల గ్రీన్‌ల్యాండ్‌లో ఉన్న మంచు ఫలకాలు పెద్ద ఎత్తున కరిగిపోయి ఈ ప్రవాహంలోకి చల్లటి మంచినీరు వచ్చి కలవడం వల్ల దీని లవణీయత తగ్గిపోతోంది. ఫలితంగా కాలక్రమంలో అక్కడికి చేరిన నీరు కిందికి దిగదు. అంటే సహజ కన్వేయర్ బెల్ట్ ఆగిపోయినట్టే.

ఏమవుతుంది?

గల్ఫ్ స్ట్రీమ్ గతి తప్పితే ఏం జరుగుతుంది? గతి తప్పి చల్లబడ్డ నీరు పైనే ఉండిపోతే.. ఆ నీరు కిందకి దిగక, కింద నుంచి ఉష్ణ ప్రవాహం పైకి రాకపోవడం వల్ల దానివల్ల ఉష్ణ శక్తిని పొందే ఉత్తర అమెరికా, పశ్చిమ యూరప్‌లోని పలు ప్రాంతాల్లో, ఆసియాలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తగ్గిపోతాయి. ఎంతగానంటే.. దశాబ్దానికి 1 డిగ్రీ సెల్సియస్ మేర.. కొన్ని ప్రాంతాల్లోనైతే దశాబ్దానికి 3 డిగ్రీల సెల్సియస్ మేర వాతావరణం చల్లబడిపోతుంది. ప్రస్తుతం భూతాపం కారణంగా దశాబ్దానికి 0.2 డిగ్రీల మేర ఉష్ణోగ్రత పెరుగుతోంది. అంటే.. పెరిగే ఉష్ణోగ్రత కన్నా తగ్గే శాతమే ఎక్కువ. ఇలా కొన్ని దశాబ్దాల వ్యవధిలో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల సెల్సియస్ మేర పడిపోతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. దాని పర్యవసానాలు ప్రపంచం మొత్తంపైనా పడతాయి. కొన్ని ప్రాంతాలను పెను తుఫానులు అల్లాడిస్తాయి. మరికొన్నిచోట్ల కరువుకాటకాలు సంభవిస్తాయి. తినడానికి తిండి దొరకని పరిస్థితులు ఏర్పడే ముప్పుంది. ఉత్తర అమెరికా తూర్పు తీరంలో సముద్ర మట్టాలు ఆందోళనకరస్థాయిలో పెరుగుతాయి.

- సెంట్రల్ డెస్క్

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీపై తీర్పు రిజర్వు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ కోటాలో ఇద్దరు ఎమ్మెల్సీల భర్తీకి సంబంధించిన వివాదంపై సుదీర్ఘంగా విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్ గురువారం తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది. గత బీఆర్ఎస్ మంత్రివర్గం సిఫార్సులకు వ్యతిరేకంగా తమ నామినేషన్‌లను గవర్నర్ తిరస్కరించడాన్ని వ్యతిరేకిస్తూ దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ హైకోర్టులో వేర్వేరు పిటిషన్‌లు దాఖలుచేశారు. కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉండగా కోదండరాం, అమీర్ అలీ ఖాన్‌లను నామినేట్ చేయడాన్ని సైతం సవాల్ చేశారు. నూతన ఎమ్మెల్సీల భర్తీపై హైకోర్టు స్టేటస్ కో ఇవ్వడంతో వారి ప్రమాణస్వీకారాలు నిలిచిపోయాయి. గవర్నర్ రబ్బరు స్టాంపు కాదని.. విచక్షణ ప్రదర్శించే అధికారం రాజ్యాంగం కల్పించిందని ప్రతివాదులు పేర్కొన్నారు. తమనే ఎమ్మెల్సీలుగా నియమించాలని వ్యక్తిగత హోదాలో పిటిషనర్‌లు కోరలేరని.. ప్రభుత్వానికి లేని బాధ వారికి ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పిటిషనర్‌లు వాదనలు వినిపిస్తూ గవర్నర్ తన అధికార పరిధికి మించి నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. తమకు రాజకీయాలతో సంబంధం ఉందని గవర్నర్ నామినేషన్‌లను తిరస్కరించారని.. అదే రాజకీయాలో సంబంధం ఉన్న కోదండరాం, అమీర్‌అలీ నిమినేషన్‌లను ఎలా ఆమోదించారని ప్రశ్నించారు. అందరి వాదనలు విన్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది.

బీజేపీ, ఇండియా కూటమి మధ్యే పోరు: దిగ్విజయ్

హైదరాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో దేశంలోని 90 శాతం లోక్‌సభ నియోజకవర్గాల్లో బీజేపీ, ఇండియా కూటమి అభ్యర్థుల మధ్యే ముఖాముఖి పోరు ఉండబోతోందని సీడబ్ల్యూసీ సభ్యుడు దిగ్విజయ్ సింగ్ పేర్కొన్నారు. ఇండియా కూటమికి సంబంధించి బెంగాల్‌లో చర్చలు జరుగుతున్నాయని, ఢిల్లీలో ఆప్, కాంగ్రెస్ అవగాహనకు రానున్నాయని.. పంజాబ్‌లో మాత్రం విడివిడిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నాయని చెప్పారు. గాంధీభవన్‌లో దిగ్విజయ్ మాట్లాడారు. స్వామినాథన్‌కు భారతరత్న ఇచ్చి గౌరవించిన మోదీ సర్కారు, పంటల మద్దతు ధరకు సంబంధించి ఆయన సిఫార్సులను మాత్రం అమలు చేయట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చాక పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శుక్రవారం 16 ఫిబ్రవరి 2024

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)- నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ) 2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా బీఎస్సీ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశం కల్పిస్తారు. ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్న ఎన్‌సీహెచ్ ఎంసీటీ అనుబంధ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు.

'హోటల్' కోర్సులో ప్రవేశానికి ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ



సీట్లు: దేశవ్యాప్తంగా మొత్తం 11995 సీట్లు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో తిరుపతిలోని స్టేట్ గవర్నమెంట్ ఐహెచ్‌ఎంలో 60, హైదరాబాద్‌లోని సెంట్రల్ గవర్నమెంట్ ఐహెచ్‌ఎంలో 285, స్టేట్ గవర్నమెంట్ ఐహెచ్‌ఎం-డా.వైఎస్సార్ ఎన్ఐటీహెచ్‌ఎంలో 120, శ్రీశక్తి ఐహెచ్‌ఎం(ప్రైవేట్ కళాశాల)లో 120, మెదక్‌లోని స్టేట్ గవర్నమెంట్ ఐహెచ్‌ఎంలో 60 సీట్లు ఉన్నాయి.

ప్రోగ్రామ్‌లోని అంశాలు: బీఎస్సీ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో ఫుడ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్, ఫ్రంట్ ఆఫీస్ ఆపరేషన్, హౌస్ కీపింగ్, హోటల్ అకౌంటెన్సీ, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫెసిలిటీ ప్లానింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, టూరిజం మార్కెటింగ్ అండ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలు బోధిస్తారు. ల్యాబ్ వర్క్‌లు కూడా ఉంటాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్ ఒక సబ్జెక్టుగా ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. 2024 సెప్టెంబరు 30 నాటికి సర్టిఫికెట్లు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అడ్వాన్స్‌డ్ లెవెల్ జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్(జీసీఈ) ఎగ్జామినేషన్(లండన్/కేంబ్రిడ్జ్/శ్రీలంక) ఉత్తీర్ణులు; కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నుంచి హైస్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్)/స్టేట్ బోర్డ్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎస్‌బీఓఎస్) నుంచి సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేష్ ఉత్తీర్ణులు; ఎన్‌సీవీటీ/ఎస్‌సీవీటీ గుర్తింపు పొందిన హెచ్ఎస్‌సీ ఒకేషనల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. మొత్తం 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇందులో న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు; ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 60 ప్రశ్నలు; ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ప్రశ్న పత్రాన్ని హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఇస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1,000; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.700; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.450
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 2 నుంచి 5 వరకు
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, విశాఖపట్నం
- **ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ తేదీ:** మే 11
- **వెబ్‌సైట్:** https://nchm.ntaonline.in/, https://exams.nta.ac.in/

జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీలో ఎంబీఏ


న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ) ఆధ్వర్యంలోని అటల్ బిహారీ వాజపేయి స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్(ఏబీవీఎస్ఎంఈ)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. క్యాట్ 2023 స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 75 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 50 శాతం; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు/పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023 స్కోర్ తప్పనిసరి. విదేశీ విద్యార్థులకు జీమ్యాట్ స్కోర్(కనీసం 500) ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: క్యాట్ 2023 స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. సీట్ల సంఖ్యకు ఏడురెట్ల మందిని ఎంపిక చేసి గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పంపుతారు. క్యాట్ 2023 స్కోర్‌నకు 70 శాతం, గ్రూప్ డిస్కషన్స్ స్కోర్‌నకు 10 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌నకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ మెరిట్ ప్రకారం తుది జాబితా రూపొందిస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** www.jnu.ac.in

టీఎస్ ఈసెట్ నోటిఫికేషన్



తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్ఈ)- స్టేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ఈసెట్)2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షని హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తోంది. దీని ద్వారా బీఈ, బీటెక్, బీఫార్మసీ కోర్సులకు సంబంధించి రెండో సంవత్సరంలో (లేటరల్ ఎంట్రీ) ప్రవేశాలు కల్పిస్తారు. ఈసెట్‌లో సాధించిన ర్యాంక్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, మైనారిటీ, నాన్ మైనారిటీ ప్రొఫెషనల్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష సిలబస్, మాక్ టెస్ట్‌ల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ఈసెట్ 2024 విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్, కెమికల్, మెటలర్జికల్, మైనింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఫార్మసీ.

అర్హత: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(టీఎస్/ఏపీ) నుంచి ఇంజనీరింగ్/ టెక్నాలజీ/ఫార్మసీ విభాగాల్లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. మేథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా మూడేళ్ల బీఎస్సీ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు బీఫార్మసీ కోర్సుకు అనర్హులు. డిప్లొమా/డిగ్రీ స్థాయిలో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు.

ఈసెట్ 2024 వివరాలు: పరీక్ష సమయం మూడు గంటలు. మొత్తం మార్కులు 200.

- డిప్లొమా అభ్యర్థులకు నిర్వహించే పరీక్షలో మేథమెటిక్స్ నుంచి 50, ఫిజిక్స్ నుంచి 25, కెమిస్ట్రీ నుంచి 25, సంబంధిత ఇంజనీరింగ్ విభాగం(సివిల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ కంప్యూటర్ సైన్స్/కెమికల్/మెటలర్జికల్/ మైనింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్)నుంచి 100 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- బీఎస్సీ(మేథమెటిక్స్) అభ్యర్థులకు మేథమెటిక్స్ నుంచి 100, అనలిటికల్ ఎబిలిటీ నుంచి 50, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ నుంచి 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.
- ఫార్మసీ అభ్యర్థులకు ఫార్మకాగ్నసీ, ఫార్మకాలజీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ అంశాలనుంచి ఒక్కోదానిలో 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.
- ఈసెట్ 2024లో అర్హత పొందాలంటే కనీసం 50 మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.

ముఖ్య సమాచారం
- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.900; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 16
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 24 నుంచి 28 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 1 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, నల్లగొండ, కోదాడ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు.
- **టీఎస్ ఈసెట్ 2024 తేదీ:** మే 6
- **వెబ్‌సైట్:** ecet.tsche.ac.in

జాబ్ కార్నర్

ఏపీలో ఎస్ఏ, ఎస్జీటీ ఉద్యోగాలు

ఖాళీలు 4579

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్... వివిధ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్స్ ఖాళీల భర్తీకి టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ/డీఎస్సీ) 2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా 4,579 ఎస్ఏ/ఎస్జీజీ ఉద్యోగాలు భర్తీ చేస్తారు.

ఖాళీలున్న విద్యాసంస్థలు: ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్, ట్రైబల్ వెల్ఫేర్.

పోస్టుల వివరాలు:
1. స్కూల్ అసిస్టెంట్స్(ఎస్ఏ): **2,299 పోస్టులు**
2. సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ): **2,280 పోస్టులు**

ఉమ్మడి జిల్లాల వారీ ఖాళీలు
1. శ్రీకాకుళం: ఎస్జీటీ-104; ఎస్ఏ-130
2. విజయనగరం: ఎస్జీటీ-103; ఎస్ఏ-97
3. విశాఖపట్నం: ఎస్జీటీ-101; ఎస్ఏ-133
4. తూర్పుగోదావరి: ఎస్జీటీ-108; ఎస్ఏ-182
5. పశ్చిమ గోదావరి: ఎస్జీటీ-102; ఎస్ఏ-145
6. కృష్ణా: ఎస్జీటీ-103; ఎస్ఏ-111
7. గుంటూరు: ఎస్జీటీ-109; ఎస్ఏ-170
8. ప్రకాశం: ఎస్జీటీ-111; ఎస్ఏ-299
9. ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు: ఎస్జీటీ-104; ఎస్ఏ-140
10. చిత్తూరు: ఎస్జీటీ-101; ఎస్ఏ-97
11. కడప: ఎస్జీటీ-105; ఎస్ఏ-81
12. అనంతపురం: ఎస్జీటీ-107; ఎస్ఏ-164
13. కర్నూలు: ఎస్జీటీ-1022; ఎస్ఏ-550

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగం/సబ్జెక్టులో ఇంటర్, డీఈడీ/డీఎల్ఈడీ, బ్యాచిలర్ డిగ్రీ, పీజీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్జీటీ పోస్టులకు బీఈడీ వారు అర్హులు.

వయోపరిమితి: ఓసీలకు 2024 జూలై 1 నాటికి 44 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి 49 ఏళ్లు, దివ్యాంగులకు 54 ఏళ్లు గరిష్ఠ వయోపరిమితిగా నిర్ణయించారు.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, రిజర్వేషన్ రూల్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.750

ఫీజు చెల్లింపునకు చివరి తేదీ: ఫిబ్రవరి 21

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 22

రాత పరీక్ష షెడ్యూల్: 2024 మార్చి 15 నుంచి 2024 మార్చి 30 వరకు

వెబ్‌సైట్: apdsc.apcfss.in

ఇస్రోలో టెక్నికల్ పోస్టులు

ఖాళీలు 224

బెంగళూరులోని ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, యూఆర్ రావు శాటిలైట్ సెంటర్(యూఆర్ఎస్సీ), ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. సైంటిస్ట్/ ఇంజనీర్- ఎస్సీ: **5 పోస్టులు**
2. టెక్నికల్ అసిస్టెంట్: **55 పోస్టులు**
3. సైంటిఫిక్ అసిస్టెంట్: **6 పోస్టులు**
4. లైబ్రరీ అసిస్టెంట్: **1 పోస్టు**
5. టెక్నీషియన్-బి/డ్రాఫ్ట్‌మన్-బి: **142 పోస్టులు**
6. ఫైర్‌మన్-ఎ: **3 పోస్టులు**
7. కుక్: **4 పోస్టులు**
8. లైట్ వెహికిల్ డ్రైవర్ 'ఎ' అండ్ హెవీ వెహికిల్ డ్రైవర్ 'ఎ': **8 పోస్టులు**

విభాగాలు: మెకట్రానిక్, మెటీరియల్ సైన్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ప్లంబర్, టర్నర్, కార్పెంటర్, వెల్డర్ తదితరాలు

అర్హత: పోస్టును అనుసరించి 10వ తరగతి, 12వ తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత. డ్రైవింగ్ లైసెన్స్, పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష/కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 1

వెబ్‌సైట్: https://www.isro.gov.in/

కోస్ట్ గార్డ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌లు

ఖాళీలు 70

భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ కోస్ట్ గార్డ్... వివిధ విభాగాలకు సంబంధించి అసిస్టెంట్ కమాండెంట్-2025 బ్యాచ్‌లో ప్రవేశాలకు అర్హులైన పురుష, మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు
1. జనరల్ డ్యూటీ(జీడీ)
2. టెక్నికల్(మెకానికల్)
3. టెక్నికల్(ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్)

అర్హత: విభాగాన్ని అనుసరించి పన్నెండో తరగతి, సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

ప్రారంభ వేతనం: నెలకు రూ.56,100

ఎంపిక విధానం: స్టేజ్-1, స్టేజ్-2, స్టేజ్-3, స్టేజ్-4, స్టేజ్-5 పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

పరీక్ష రుసుము: రూ.300. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మినహాయింపు ఉంటుంది

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 6

వెబ్‌సైట్: joinindiancoastguard.cdac.in/

ఇర్కాన్‌లో ఫైనాన్స్ అసిస్టెంట్‌లు

న్యూఢిల్లీలోని ఇండియన్ రైల్వే కన్‌స్ట్రక్షన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(ఇర్కాన్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 11

అర్హత: బీకాం/ఎంకాం/సీఏ(ఇంటర్)/సీఎంఏ(ఇంటర్) ఉత్తీర్ణతతో పాటు అకౌంటింగ్, ఫైనాన్స్, ట్యాక్సేషన్, ఫైలింగ్ ఆఫ్ రిటర్న్ తదితర విభాగాల్లో నాలుగేళ్ల పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 35 ఏళ్లు మించకూడదు

జీతం: నెలకు రూ.45,000


ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా

దరఖాస్తులు పంపాల్సిన చిరునామా: జేజీఎం/హెచ్ఆర్ఎం, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, సీ-4, డిస్ట్రిక్ట్ సెంటర్, సాకేత్, ఢిల్లీ.

వెబ్‌సైట్: www.ircon.org/

లిటిల్స్



తెలివైన రైతు

ఒక ఊరిలో గుణ అనే రైతు ఉండేవాడు. తెలివితేటలకు కొదువలేదు. పొలంలో కష్టపడుతూ డబ్బులు సంపాదించేవాడు. ఆ రైతు గురించి రాజ్యంలోని రాజు విన్నాడు. అతని గురించి తెలుసుకోవాలని మంత్రి చెప్పాడు. రెండు నెలల తర్వాత ఆ రాజు ఊరిలో వెళ్తుండగా ఆ తెలివైన రైతు ఇల్లొచ్చిందని మంత్రి చెప్పారు. వెంటనే రాజావారు రథం నుంచి దిగి ఆ రైతు ఇంట్లోకి వచ్చాడు. రైతు కుటుంబంతో మాట్లాడిన తర్వాత రైతుతో ఒంటరిగా మాట్లాడాలని చెప్పాడు. రైతు సంతోషించాడు. 'మీరు ఎంత ధనం రోజుకు సంపాదిస్తారు?' అని అడిగారు. 'రూపాయి' అన్నాడు రైతు. ఖర్చు చేస్తావా? అని అడిగాడు రాజు. 'నాలుగోవంతు తింటాను. నాలుగో వంతు బాకీ తీరుస్తా. నాలుగోవంతు అప్పు తీరుస్తా. నాలుగో వంతు విసిరేస్తాను' అన్నాడు రైతు. అరే విచిత్రంగా ఉందే.. ఏదీ వివరించు సరిగ్గా అన్నాడు రాజు.



ఆ రైతు ఇలా అన్నాడు.. 'నాలుగో వంతు నా తిండికోసం, నా భార్యపిల్లల కోసం ఖర్చు చేస్తాను. అంటే వారి భవిష్యత్తుకోసం. దీనర్థం నేను బాకీ ఉన్నట్లే కదా. మిగతా నాలుగో వంతు అప్పు తీర్చటం అంటే నా తల్లిదండ్రులకు ఇస్తా. విసిరేయటం అంటే దానం చేస్తాను' అన్నాడు. 'అయితే ఇవేమీ ఎవరికీ చెప్పకు. నా మొహం వంద సార్లు చూసిన తర్వాతనే ఇతరులకు చెప్పు. అంత వరకు చెప్పొద్దు' అన్నాడు. ధనం ఇచ్చి వాగ్దానం చేయించుకున్నాడు రాజు.


ఆ తర్వాత రాజు ఆ పొడుపు కథను అందరికీ చెప్పాడు. ఎవరూ తన సభలో సమాధానం చెప్పలేకపోయారు. దీంతో రాజు గర్వపడ్డాడు. మంత్రులు, కవులు చెప్పలేకపోయారు. ఈ సమస్య ఏంటీ? ఎవరు చెప్పారనే విషయం మంత్రి తెలుసుకోవాలనుకున్నాడు. ఒక సైనికాధిపతికి చెప్పి ఆరాతీయమన్నాడు. ఓ పల్లెటూరులోని రైతు చెప్పాడని తెలిసింది. వెంటనే మంత్రి అక్కడికి వెళ్లి ఆ ప్రశ్నకు సమాధానం చెప్పమన్నాడు. 'రాజుగారు చెప్పకూడదు. దయచేసి అడగకండి' అన్నాడు. వెంటనే వంద నాణేలను బహుమతిగా ఇచ్చాడు. అన్ని బంగారు నాణేలను చేత్తో జాగ్రత్తగా చూసి ఎంచుకున్నాడు. ఆ తర్వాతనే రాజు సమాధానం చెప్పాడు. మంత్రి సంతోషంతో ఇంటికి వెళ్లిపోయాడు.

మరుసటి రోజు సభ దగ్గరకు వెళ్లిపోయి సమాధనం చెప్పాడు మంత్రి. వెంటనే రాజుకు సందేహం వచ్చింది. వెంటనే మంత్రిని అడిగాడు. 'అయ్యా.. నేను రైతు దగ్గరకు వెళ్లి సమాధానం తెలుసుకున్నా'నని చెప్పాడు. రాజుకు కోపం వచ్చింది. వెంటనే రైతు దగ్గరకు కోపంతో వెళ్లాడు. 'నేను నీ ముఖం చూడలేదు. పొరబాటున కూడా నువ్వు నా దగ్గరకు రాలేవు. నువ్వు చేసిన వాగ్దానం మర్చిపోయావు. అందుకే నీ తల ఖండిస్తాను' అన్నాడు. వెంటనే 'ఒక్క క్షణం మహారాజావారు. నన్ను మాట్లాడనివ్వండి' అన్నాడు. 'ఇదే నీ చివరి కోరిక' అన్నాడు రాజుగారు. 'మంత్రిగారు వచ్చి వంద బంగారు నాణేలు ఇచ్చారు. ప్రతి బంగారు నాణెం మీద మీ బొమ్మ ఉంది. మరి నేను ఇతరులకు చెప్పొచ్చు కదా' అన్నాడు. రైతు తెలివి నచ్చి.. రాజు మరిన్ని బంగారు నాణేలు బహుమతిగా ఇచ్చాడు.


దారి కనుక్కోండి



10 తేడాలను గుర్తించండి



జంతువులు ఎన్ని?



డైలీ సుడోకు - 231

				7	1		4	
			6					
6			4	3		7	8	
	2			8				
5	4						1	8
				1			3	
	5	3		4	8			1
					3			
	6		5	9				

సుడోకు - 230 సమాధానం

1	3	8	5	4	9	6	7	2
7	5	6	3	1	2	4	8	9
4	9	2	7	6	8	3	1	5
5	6	4	8	9	3	7	2	1
2	1	9	4	7	5	8	6	3
3	8	7	6	2	1	5	9	4
9	4	3	1	8	7	2	5	6
8	2	5	9	3	6	1	4	7
6	7	1	2	5	4	9	3	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.